

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 228

శనివారం 9-11-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




సూపర్ సామ్సన్

'శత'క్కొట్టిన టీమిండియా ఓపెనర్. తొలి టి20లో దక్షిణాఫ్రికాపై గెలుపు -15లో



ఏక్ హై తో సేఫ్ హై

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పిలుపు -6లో



'మైనార్టీ హోదా'పై కొత్త బెంచ్

అలీగఢ్ ముస్లిం వర్సిటీకి మైనారిటీ విద్యాసంస్థ హోదా ఉందో లేదో తేల్చే అంశాన్ని నూతన ధర్మాసనానికి సుప్రీంకోర్టు అప్పగించింది.

- వివరాలు 6లో▶



వైట్‌హౌస్ స్టాఫ్ చీఫ్‌గా సూజీ

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ తన ప్రచార మేనేజర్ సూజీ వైల్స్‌ను వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమించారు.

- వివరాలు 6లో▶



ట్రంప్‌తో చర్చలకు సిద్ధం

అమెరికా అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలకు సిద్ధమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు.

- వివరాలు 6లో▶



పురుషులు తీసుకోవద్దు

టైలర్ షాపుల్లో మహిళల కొలతల్ని పురుషులు తీసుకోకుండా చూడాలని జిల్లా మేజిస్ట్రేట్‌లకు యూపీ మహిళా కమిషన్ సూచించింది.

- వివరాలు 6లో▶

అడ్డొస్తే బుల్డోజర్లు ఎక్కిస్తా

'మూసీ' ప్రక్షాళనపై ఆగేదే లేదు.. లేకుంటే పేరు మార్చుకుంటా

మూసీ పునరుజ్జీవ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరిక

ఇది ట్రైలరే.. అసలు సినిమా ముందుంది

అడ్డుపడతామన్న వాళ్లు ధైర్యముంటే తేదీ చెప్పండి..

- మీరు నాతో కలిసి రాకపోతే రాయికట్టి మూసీలో ముంచుడే
- మూసీ నది అణుబాంబుకంటే ప్రమాదకరంగా తయారైంది
- నల్లగొండ బిడ్డల కాళ్లు వంకరపోతే కేసీఆర్‌కు పట్టదం లేదా?
- ఈ పాపం తగలక తప్పదు.. ప్రజలు మూసీలో పాతరేస్తారు
- ప్రధాని మోదీ సబర్మతి, గంగా నదిని ప్రక్షాళన చేస్తే గొప్పదా?
- మేం మూసీ ప్రక్షాళన చేస్తే నకిలీ బీజేపీ లీడర్లకు గిట్టడం లేదా?
- మూసీ ప్రక్షాళన కోసం ఈ రోజు సంకల్పం తీసుకున్నా..
- ఇది తన జన్మ దినం కాదు.. జన్మధన్యమైన రోజు అని వ్యాఖ్య
- 30 రోజుల్లో మూసీ ప్రాజెక్టు డిజైన్లను పూర్తి చేస్తామని వెల్లడి

2లో



శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం సమీపంలో మూసీ నది వద్ద ప్రజలతో కలిసి పాదయాత్ర చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

> మూసీ పునరుజ్జీవాన్ని ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేస్తాం. నాతో కలసి రాకపోతే రాయి కట్టి మూసీలో వేస్తా. బుల్డోజర్లకు అడ్డుపడతామంటున్న వాళ్లు.. వాళ్ల పేర్లు ఇవ్వండి. మా నల్లగొండ ప్రజలతో వచ్చి మీపైకి బుల్డోజర్లు తీసుకెళ్లకపోతే నేను పేరు మార్చుకుంటా. బుల్డోజర్లకు అడ్డుపడతామని మాట్లాడుతున్న బిల్లారంగాలు ధైర్యముంటే తారీఖు చెప్పండి. మా వెంకన్న (కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి)తో బుల్డోజర్ నడిపిస్తా. మా ఎమ్మెల్యే సామెల్‌తో జెండా ఊపిస్తా. ప్రధాని మోదీ సబర్మతి, గంగా నదులను బాగు చేసుకోవచ్చుగానీ మేం మూసీని బాగుచేసుకోవద్దా? నకిలీ బీజేపీ నాయకులు మూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్నారు.
>
> - సీఎం రేవంత్‌రెడ్డి

యాదగిరిగుట్టపై.. రాత్రి నిద్ర

- ఆలయ ప్రాశస్త్యం కొనసాగించాలి.. భక్తుల మనోభావాలను గౌరవించాలి: సీఎం రేవంత్‌రెడ్డి
- టీటీడీ తరహాలో యాదగిరిగుట్టకు బోర్డు ఏర్పాటు
- యాదాద్రి కాదు.. యాదగిరిగుట్టగానే వ్యవహరించాలి
- తన పుట్టినరోజు సందర్భంగా లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న రేవంత్

రేవంత్ వ్యాఖ్యలు అత్యంత హేయం

సీఎం స్థాయి మరిచి దిగజారి మాట్లాడుతున్నారు

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

2లో

సుప్రీంకోర్టు ప్రధాన హాల్‌లో వీడ్కోలు కార్యక్రమంలో కాబోయే సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నాతో ముచ్చటిస్తున్న జస్టిస్ చంద్రచూడ్



బాధపెట్టి ఉంటే క్షమించండి

రేపటి నుంచి నేను ఇలా న్యాయం చేయలేను

సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ భావోద్వేగం

- దేశానికి సేవ చేసే అవకాశం రావడం గర్వకారణం
- నా జీవితం తెరిచిన పుస్తకం.. విమర్శలను వినమ్రంగా స్వీకరించా
- ఘనంగా వీడ్కోలు పలికిన సుప్రీంకోర్టు ధర్మాసనం

6లో

అక్రమ నిర్బంధాలపై ఏపీ హైకోర్టు ఆరా..

ఖాకీలపై ఆగ్రహం

ఈనెల 4 నుంచి సంబంధిత పోలీస్ స్టేషన్లలోని సీసీ ఫుటేజీని స్థానిక మెజిస్ట్రేట్లకు సీల్డ్ కవర్లలో అందజేయండి

సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టులపై ఆదేశం

- బాధిత కుటుంబాల హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ
- పౌరుల స్వేచ్ఛను పోలీసులు తేలికగా తీసుకోవద్దని హెచ్చరిక
- దాన్ని కాపాడాల్సిన బాధ్యత కోర్టుపై ఉందని వ్యాఖ్య
- తాము జోక్యం చేసుకునే పరిస్థితి తేవద్దని హితవు
- విశాఖకు చెందిన లోకేశ్‌ను సోమవారం తమ ఎదుట హాజరు పరచాలని స్పష్టీకరణ
- చట్టాలపై పోలీసులను చైతన్యపరచాలని ప్రభుత్వానికి ఆదేశం

12లో

మెడికల్ పీజీ సీట్ల బ్లాకింగ్ స్కాంలో

ఈడీ దూకుడు

- మల్లారెడ్డి కాలేజీ ఏవో సురేందర్‌రెడ్డి వాంగ్మూలం నమోదు
- తాజాగా ఈడీ ముందుకు 'చల్మెడ ఇన్‌స్టిట్యూట్' ప్రతినిధి
- ఆరోపణలు ఎదుర్కొంటున్న 12 కాలేజీలతో పాటు మరికొన్ని కళాశాలలకూ సమన్లు!

సాక్షి, హైదరాబాద్: మెడికల్ పీజీ సీట్ల కేటాయింపులో గతంలో జరిగిన అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సీట్ల కేటాయింపులో కుంభకోణానికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న కాలేజీల సిబ్బందిని విచారణకు పిలుస్తున్నారు. గురువారం మల్లారెడ్డి మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేందర్ రెడ్డి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకుడు, చల్మెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు విచారణకు హాజరైనట్టు అధికారవర్గాల సమాచారం. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నుంచి 2023లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన లక్ష్మీనర్సింహారావును మెడికల్ సీట్ల బ్లాక్ దందాపై వివిధ కోణాల్లో ప్రశ్నించినట్టు తెలిసింది.

ఏమిటీ కుంభకోణం?

కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కి అనుబంధంగా ఉన్న 12 మెడికల్ కాలేజీల్లో పలు సీట్లను బ్లాక్ చేసి, అధిక ఫీజులకు అమ్ముకున్నారన్న ఆరోపణలపై ఈడీ అధికారులు గతేడాది (2023) జూన్‌లో సోదాలు జరిపారు. నీట్ పీజీ మెరిట్ ఆధారంగా కన్వీనర్ కోటా లేదా ఫ్రీ సీట్ల కింద దాదాపు 45 సీట్లను ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థుల పేర్లతో బ్లాక్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విద్యార్థులు ఎవరూ వర్సిటీలో అడ్మిషన్ కోసం ఎన్నడూ దరఖాస్తు చేసుకోలేదని విశ్వవిద్యాలయ అధికారులు గుర్తించారు. దీనిపై వర్సిటీ రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ 2022 ఏప్రిల్‌లో వరంగల్‌లోని మట్వాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. సీట్లను బ్లాక్ చేసి పెద్దమొత్తంలో ఆర్థిక లావాదేవీలకు పాల్పడినట్టు ఉన్న ఆరోపణలపై మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. కేసు దర్యాప్తులో భాగంగా 2023 జూన్ 22న బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్,

మిగతా 12వ పేజీలో ▶

హైదరాబాద్‌లోనే ఉన్నా

ఏసీబీ లాంటి మీ ఏజెన్సీలను ఎప్పుడు పంపినా స్వాగతిస్తా

చాయ్ బిస్కెట్లు ఇస్తా.. మీ బర్త్‌డేకు కేక్ కట్ చేస్తానంటే ఇప్పిస్తా

సీఎం రేవంత్‌ను ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యలు

మూసీ ప్రాంతంలో పాదయాత్ర చేసే దమ్ముందా అని నిలదీత



సాక్షి, హైదరాబాద్: 'ముఖ్యమంత్రి గారూ.. అరెస్టు భయంతో మలేసియాకు పారిపోయానంటూ మీ అనుకూల మీడియాలో వార్తలొచ్చాయి. నేను హైదరాబాద్‌లోనే ఉన్నా.. ఏసీబీలాంటి మీ ప్రభుత్వ ఏజెన్సీలను ఎప్పుడు పంపినా స్వాగతం పలుకుతా. వారికి చాయ్‌తోపాటు ఉస్మానియా బిస్కెట్లు కూడా ఇస్తా. మీ బర్త్‌డే సందర్భంగా వారు కేక్ కట్ చేస్తానంటే నేను ఇప్పిస్తాను' అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ కేటీఆర్ 'ఎక్స్'లో సీఎం రేవంత్‌పై వ్యాఖ్యలు చేశారు. 'సీఎంకు హ్యాపీ బర్త్‌డే.. నా అరెస్టు కోసం ఆయన ఉవ్విళ్లూరుతున్నారు. సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ కూలిన

మిగతా 12వ పేజీలో ▶

ప్రభుత్వ టీచర్లకు గ్రేడింగ్!

ఫలితాల ఆధారంగా పాయింట్లు

- పదోన్నతులు, బదిలీల్లో పాయింట్లకు వెయిటేజీ.. ఐదేళ్లు మంచి రిజల్ట్ ఇవ్వని ఉపాధ్యాయులపై చర్యలు
- సర్కార్‌కు విద్యా కమిషన్ సిఫారసు?

12లో

స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులు షురూ

- భూమిపూజ చేసిన మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులు..
- నిర్మాణాల మొదటి దశను వచ్చే ఏడాది రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి పూర్తి చేస్తామని ప్రకటన

3లో

న్యూస్‌రీల్

మొక్కవోని మట్టిబిడ్డలు



సినిమాల్లో నటిస్తున్న ముగ్గురు లిటిల్ స్టార్స్... బాలల దినోత్సవం నేపథ్యంలో జీవితంలో సవాళ్లతో పోరాడుతున్న 11 మంది రియల్ స్టార్స్‌ను కలిశారు. 'సాక్షి', 'రైతు స్వరాజ్య వేదిక' సహకారంతో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని కలుసుకున్నారు. గతంలో ఆత్మహత్య చేసుకున్న ఐదుగురు రైతు కుటుంబాలకు చెందిన ఆ పిల్లల కష్టాలను తెలుసుకొని చలించిపోయారు. వారికి ఊరట కల్పించేందుకు సినిమాల్లో తాము చెప్పిన డైలాగులతో అలరించారు. ఆపై ఆడిపాడారు.

- వివరాలు 13లో▶

సాక్షి టీవీలో మధ్యాహ్నం 12.30కి ప్రసారం

ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ పోరుబాట



రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు పోరాటానికి సిద్ధమయ్యారు. శనివారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకోనున్నారు.

- వివరాలు 3లో▶

ఇక డ్రోన్ అంబులెన్స్‌లు!



రాష్ట్రంలో త్వరలోనే డ్రోన్ అంబులెన్సులు అందుబాటులోకి రానున్నాయని హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు. రోగితోపాటు ఆక్సిజన్ సిలిండర్, ఇతర కీలక పరికరాలు, ప్రాథమిక వైద్య సేవలందించే నర్సు.. కలిపి సుమారు 200 కిలోల బరువు మోసుకెళ్లే సామర్థ్యమున్న డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నట్టు వెల్లడించారు.

- వివరాలు 16లో▶



మీరు కూడా పెళ్లి చేసుకొని ఉంటే మనం కూడా అలాంటి హామీలిచ్చేవాళ్లం!

కాజీపేటలోనే ఎంఎంటీఎస్ కోచ్‌లు

ఏడాదిన్నరలో 'ఈఎంయూ'ల ఉత్పత్తి మొదలుపెట్టనున్న రైల్వే

తొలుత నెలకు 24 చొప్పున కోచ్‌ల తయారీ.. భవిష్యత్తులో సామర్థ్యం పెంపు

ముంబై లోకల్ రైళ్లకు కూడా ఇక్కడి నుంచే సరఫరా



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో తిరుగుతున్న ఎంఎంటీఎస్ రైళ్లు ఇకపై మన రాష్ట్రంలోనే తయారుకాబోతున్నాయి. ఇక్కడే కాకుండా, ముంబై లోకల్ రైల్ సర్వీసులకు అవసరమైన కోచ్‌లను కూడా ఇక్కడే తయారు చేసి సరఫరా చేయనున్నారు. ఇందుకు వీలుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రైల్వే కాజీపేటకు మంజూరు చేసిన వ్యాగన్ తయారీ కేంద్రాన్ని ఇటీవలే కోచ్ తయారీ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. 2026 మార్చి నాటికి ఫ్యాక్టరీ ఏర్పాటు పూర్తిచేసి, ఉత్పత్తి ప్రారంభించే లక్ష్యంతో వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఫ్యాక్టరీలో ఎల్‌హెచ్‌బీ, వందేభారత్ కోచ్‌లతో పాటు ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్స్ (ఈఎంయూ)లను కూడా తయారు చేయనున్నారు. ఫ్యాక్టరీ సిద్ధమైన వెంటనే ఈఎంయూల ఉత్పత్తిని ప్రారంభించే అవకాశం ఉంది.

తొలుత నెలకు 24 కోచ్‌ల ఉత్పత్తి..

ప్రస్తుతం దేశవ్యాప్తంగా లోకల్ రైళ్లుగా ఈఎంయూ కోచ్‌లతో కూడిన రేక్స్‌ను వినియోగిస్తున్నారు. ప్రధాన నగరాలకు చేరువగా ఉన్న అన్ని రూట్లను దాదాపు విద్యుదీకరించడంతో వీటి వినియోగం పెరిగింది. హైదరాబాద్‌లోని మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టు సిస్టం (ఎంఎంటీఎస్)లో వాడుతున్న కోచ్‌లు కూడా ఈఎంయూలే. ఈ కోచ్‌లలోనే లోకోమోటివ్ అంతర్భాగంగా ఉంటుంది. ఇవి పుష్-పుల్ తరహాలో పనిచేస్తాయి. వీటిని ఎక్కువగా ముంబైలో లోకల్ రైళ్లుగా, చెన్నై శివారులో సబర్బన్ రైళ్లుగా వినియోగిస్తున్నారు. మరికొన్ని నగరాల్లోనూ వినియోగిస్తున్నారు. ప్రస్తుతం చెన్నైలోని ఇంటగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో ఈఎంయూ కోచ్‌లను ఉత్పత్తి చేసి దేశంలోని వివిధ ప్రాంతాలకు పంపుతున్నారు.

వందే భారత్‌కు డిమాండ్ పెరగటంతో..

దేశవ్యాప్తంగా వందే భారత్ రైళ్ల సంఖ్యను పెంచుతున్నందున ఐసీఎఫ్‌లో వందే భారత్ కోచ్‌ల ఉత్పత్తిని పెంచారు. దీనితో అక్కడ ఈఎంయూల ఉత్పత్తి తగ్గిపోయింది. ఈ మేరకు ఇతర కోచ్ ఫ్యాక్టరీలలో వాటిని ఉత్పత్తి చేయనున్నారు. కాజీపేటలో సిద్ధమవుతున్న కోచ్ తయారీ కేంద్రానికి కూడా ఈ బాధ్యత అప్పగించారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో 16 ఎంఎంటీఎస్ రేక్స్ నడుస్తున్నాయి. 12 కోచ్‌లతో కూడిన రైలును ఒక రేక్ అంటారు. ప్రస్తుతం ఎంఎంటీఎస్ విస్తరణ నేపథ్యంలో మరిన్ని రేక్స్ అవసరం ఏర్పడింది. ఎంఎంటీఎస్ రెండో దశ పూర్తయితే ఇంకా వినియోగం పెరుగుతుంది. అప్పటికల్లా కాజీపేట ఫ్యాక్టరీ సిద్ధంకానుండటంతో.. ఆ కోచ్‌లను ఇక్కడే తయారు చేయనున్నారు. దేశంలో ఎక్కువ ఈఎంయూలను వాడుతున్నది ముంబై లోకల్ రైల్వే వ్యవస్థ. అక్కడ ప్రస్తుతం నిత్యం 191 రేక్స్ 2,500కు పైగా ట్రిప్పులు తిరుగుతున్నాయి. భవిష్యత్తులో ముంబైకి కూడా కాజీపేట నుంచే ఈఎంయూ కోచ్‌లు సరఫరా కానున్నాయి. నెలకు 24 కోచ్‌ల (రెండు రేక్స్) సామర్థ్యంతో యూనిట్ ప్రారంభం కానుంది. తర్వాత క్రమంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచనున్నారు.

సాక్షి టీవీలో పోసాని సెటైరికల్ షో

ప్రతి శని, ఆదివారాల్లో ప్రసారం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ హాస్య నటుడు ధర్మవరపు సుబ్రహ్మణ్యం గతంలో సాక్షి టీవీలో నిర్వహించిన డింగ్ డాంగ్ అనే పొలిటికల్ సెటైర్ ప్రోగ్రాం అందరినీ ఆకట్టుకుంది. తన స్టయిల్‌లో ప్రశ్నలు సంధిస్తూ.. పంచులు విసురుతూ ఆ కార్యక్రమాన్ని ఆయన రక్తి కట్టించారు. ఇప్పుడు అదే కాన్సెప్టుతో డింగ్‌డాంగ్ 2.0 పేరిట ప్రముఖ సినీ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి నిర్వహించబోతున్నారు. డైలాగ్ డెలివరీ, మేనరిజంతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పోసాని.. ఇప్పుడు రాజకీయ నేతలకు చురకలు అంటించడానికి సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమం **సాక్షి టీవీలో ప్రతి శనివారం రాత్రి 8.30 గంటలకు, తిరిగి ఆదివారం ఉదయం 8.30 గంటలకు** ప్రసారం కానుంది.

యాదగిరిగుట్టపై రాత్రి నిద్ర

ఆలయ ప్రాశస్త్యం కొనసాగించాలి.. భక్తుల మనోభావాలను గౌరవించాలి: సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మాదిరిగానే యాదగిరిగుట్ట దేవాలయానికి బోర్డును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆగమశాస్త్రాన్ని అనుసరిస్తూనే, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ప్రతిపాదనలతో సమగ్ర నివేదిక రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా యాదగిరిగుట్టపై ఒకరోజు నిద్ర చేయాలనే భక్తులకు ఆచారానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం యాదగిరిగుట్ట దేవాలయ అభివృద్ధిపై యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ) అధికారులు, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్‌అండ్‌బీ, దేవాదాయ, ఇంజనీరింగ్ శాఖల సీనియర్ అధికారులు, భువనగిరి జిల్లా కలెక్టర్‌తో ప్రెసిడెన్షియల్ సూట్‌లో సమీక్షించారు. ఆలయానికి సంబంధించి చేపట్టిన పనులు, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులు, చెల్లింపులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.



యాదగిరిగుట్ట ఆలయంలో సీఎం రేవంత్, మంత్రులు కొండా సురేఖ, ఉత్తమ్, కోమటిరెడ్డి, పొన్నం, ఎంపీ చామల కిరణ్, ఎమ్మెల్యే వేముల వీరేశం, సీఎస్ శాంతికుమారి తదితరులు

ఆలయ పనుల్లో లోపాలుంటే సరిదిద్దండి..

యాదగిరిగుట్టకు తిరుపతి తరహాలో ఒక బోర్డును ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. యాదగిరిగుట్టకు సంబంధించిన టెంపుల్ కమిటీ, ఇతర కమిటీలను పునర్నిర్మించాలన్నారు. ఈ నెల 15లోగా ఆలయానికి సంబంధించిన మరికొన్ని అంశాలతో సమీక్షకు రావాలని అధికారులకు సూచించారు. ఆలయ మాడ వీధులు తరచూ పగుళ్లు రావడం, కుంగడానికి కారణమేమిటని ఆరా తీశారు. కోతులు ఆయా చోట్ల బండలను తొలగిస్తున్నాయని అధికారులు వివరించారు. దీనితో ఆర్‌అండ్‌బీ, దేవాదాయ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌లు వెంటనే ఆలయాన్ని తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. తాను మరోసారి ఆలయాన్ని తనిఖీ చేస్తానని, ఎక్కడైనా లోపాలు ఉంటే సరిచేయాలని సూచించారు. ఆలయ భూసేకరణకు సంబంధించి అన్ని కేసులను క్లియర్ చేయాలని.. రైతుల నుంచి వైటీడీఏ సేకరించిన భూములను ఎవరికీ తిరిగిచ్చేది లేదని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 101 ఎకరాలకు సంబంధించిన సుమారు రూ.70 కోట్ల పరిహారాన్ని చెల్లించేయాలని ఆర్థిక శాఖ కార్యదర్శిని ఆదేశించారు. గోసంరక్షణకు పాలసీని ప్రత్యేకంగా రూపొందించాలని.. బెస్ట్ మోడల్ గోశాలగా అభివృద్ధి చేయాలని అధికారులకు సీఎం సూచించారు.

యాదాద్రికి బదులు యాదగిరిగుట్టనే..

ఆలయానికి సంబంధించిన అన్ని అంశాల్లో యాదాద్రి స్థానంలో యాదగిరిగుట్ట అని కనిపించాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇక నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఉత్తర ప్రత్యుత్తరాలు, ఆలయానికి సంబంధించిన టికెట్లు, మిగతా అన్నింటిపై యాదగిరిగుట్ట అనే పదాన్ని వాడాలన్నారు. కాటేజీల నిర్మాణానికి దాతల సహకారం తీసుకోవాలని సూచించారు.

పలు అంశాలపై ప్రజెంటేషన్లు..

ఆలయ దివ్యవిమాన గోపురం బంగారు తాపడం పనుల్లో భాగంగా.. చెన్నై స్మార్ట్ క్రియేషన్స్ సంస్థ తయారు చేసిన బంగారు తాపడం శాంపిల్ రేకులను సీఎం రేవంత్ పరిశీలించి బాగున్నాయన్నారు. ఇక వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధికి చేపట్టిన పనులు, పెండింగ్‌లో ఉన్నవి, వ్యయం, భవిష్యత్ ప్రణాళికలు, తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విమాన గోపురానికి బంగారు తాపడం, వేద పాఠశాల నిర్మాణం వంటి అంశాలపై దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇక జిల్లా మెడికల్ కళాశాలకు మరికొంత స్థలం కావాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. ఆ మెడికల్ కాలేజీని దేవాలయ పరిధిలోకి తీసుకొచ్చేలా ప్రణాళిక రూపొందించాలని, దీనిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

సీఎంకు ఘనస్వాగతం.. బ్రేక్ దర్శనాలు రద్దు..

యాదగిరిగుట్టకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. తొలుత విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్పం చేశారు. అనంతరం కాలినడకన కొండపైకి చేరుకున్నారు. ఆయనకు అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రేవంత్ అఖండ దీపం వెలిగించి రాజగోపురం ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామిని, అనంతరం నారసింహుడిని దర్శించుకున్నారు. ప్రధానార్చకులు సీఎం, మంత్రులకు వేదాశీర్వచనం చేసి, స్వామివారి ప్రసాదం అందజేశారు. సీఎం రాక సందర్భంగా ఆలయ అధికారులు శుక్రవారం ఉదయం బ్రేక్ దర్శనాలను, నిత్యకల్యాణ వేడుకను రద్దు చేశారు.

సీఎంకు బంగారు శాలువా

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన సీఎం రేవంత్‌కు సిరిసిల్లకు చెందిన చేనేత కార్మికుడు నల్ల శ్రవణ్ బంగారు శాలువాను బహూకరించారు. రెండు గ్రాముల బంగారంతో, అగ్గిపెట్టెలో ఇమిడేలా రూపొందించిన ఈ శాలువాను రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా అందజేసినట్లు నల్ల శ్రవణ్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రవణ్‌ను సీఎం అభినందించారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అత్యంత హేయం

- సీఎం స్థాయి మరిచి దిగజారి మాట్లాడుతున్నారు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్/సిద్దిపేటజోన్: రేవంత్‌రెడ్డి తన పుట్టినరోజున కూడా తండ్రి వయసున్న కేసీఆర్ మీద, తెలంగాణ కోసం కొట్లాడిన వ్యక్తి మీద చేసిన నీచమైన వ్యాఖ్యలు అత్యంత హేయమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పిచ్చి ప్రగల్భాలు మాని పరిపాలన మీద దృష్టి పెట్టాలని, నిరంకుశత్వం మాని నిర్మాణాత్మక నిర్ణయాలపై శ్రద్ధ వహించాలని హితవు పలికారు. శుక్రవారం విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లో హరీశ్‌రావు సీఎంపై ధ్వజమెత్తారు. కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోని నువ్వు, సీఎం స్థాయి దిగజారి మాట్లాడుతున్నావని, నీలాగా వికృతంగా మాట్లాడే ముఖ్యమంత్రిని ఈ దేశం ఎప్పుడూ చూసి ఉండదని పేర్కొన్నారు. ఇది ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి సరిగ్గా సరిపోతుందన్నారు. తప్పు మీద తప్పు చేసి వదరబోతులా ప్రవర్తిస్తున్న రేవంత్‌రెడ్డి తీరును ప్రజలందరూ గమనిస్తున్నారని చెప్పారు. మూసీ నీళ్ల మురికితో కడిగినా నీ నోరు మురికిపోదని, నీ వంకర బుద్ధి ఇగ మారదన్నారు. బ్యాగులు మోసి, బ్యాగులు పంచి అడ్డ తోవన అధికారంలోకి వచ్చిన నీచ చరిత్ర నీదని ఆరోపించారు. నీ దోపిడిని, నీ దొంగబుద్ధిని నిరూపించి ప్రజాక్షేత్రంలోనే నీకు బుద్ధి చెబుతామని హరీశ్‌రావు హెచ్చరించారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో వరుసగా విషాహార ఘటనలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వ తీరులో మార్పు లేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అలసత్వంతో గురుకుల విద్యార్థుల కష్టాలు తీరడం లేదన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందిస్తున్న హరీశ్‌రావు

విషాహారం తిని మంచిర్యాల గిరిజన గురుకులంలో 12 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలైన ఘటన జరిగి 24 గంటలు కూడా కాకమునుపే మరోసారి వాంతులు, కడుపునొప్పితో విద్యార్థులు ఆస్పత్రిలో చేరారన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గాడితప్పిన పాలనకు వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు నిదర్శనంగా నిలుస్తున్నాయని చెప్పారు.

సీఎం రేవంత్‌వన్నీ కోతలే..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు మాత్రం గడప దాటడం లేదని, ప్రజలంతా గమనిస్తున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో 237మందికి రూ. 55.57 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల గుండెల్లో ఈ భూమి ఉన్నంత కాలం కేసీఆర్ పదిలంగా ఉంటారని అన్నారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా.. తెలంగాణ రాకపోతే రేవంత్ రెడ్డి సీఎం అయ్యేనా అని ప్రశ్నించారు.

పగలు నటిస్తరు.. రాత్రి ఒక్కటైతరు

కేటీఆర్‌తో రేవంత్ రాజీపడ్డారన్న బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి రాజీ పడ్డారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. 'పగలు ఫైట్ చేసుకున్నట్లు నటిస్తరు రాత్రి ఒక్కటైపోతరు..' అని అన్నారు. అందుకే ఈ–ఫార్ములా రేస్, రేవ్ పార్టీ, డ్రగ్స్, కాళేశ్వరం సహా అన్ని స్కాంలలో కేటీఆర్ నిందితుడని తేలినా అరెస్టు చేయకుండా మీన మేషాలు లెక్కిస్తున్నారని విమర్శించారు. చివరకు ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ చెబితేనే చేశామని నిందితుడు చెప్పినా అరెస్టు చేయలేదని ధ్వజమెత్తారు. శుక్రవారం బీజేపీ కార్యాలయానికి వచ్చిన సంజయ్ మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు జవాబిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి సీఎం అయితే, కేసీఆర్ కొడుకు యాక్టింగ్ సీఎంగా వ్యవహరిస్తున్నారని కేంద్రమంత్రి ధ్వజమెత్తారు. 'గతంలో జన్వాడ ఫాంహౌస్‌పై డ్రోన్ ఎగరేశా రనే కారణంతో నీ బిడ్డ పెళ్లిని కూడా చూడనీయ కుండా నిన్ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టిన్రు. అట్లాంటిది ఇయాల బయటపడుతున్న స్కాంలన్నింట్లో కేసీఆర్ కొడుకు ముద్దాయి అని తేలాక కూడా ఎందుకు జైల్లో పెడతలేవ్. ఎందుకీ మీనమేషాలు?..' అని రేవంత్‌రెడ్డిని సంజయ్ నిలదీశారు. సంగెం వద్ద కాదు.. మూసీ ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పాదయాత్ర చేయాలని చెప్పారు. నిజం చెప్పాలంటే కేసీఆర్ కొడుకు పిరికిపంద అని, ట్విట్టర్లో, మీడియాలో తప్ప ప్రజల్లోకి వెళ్లి ఫైట్ చేసే దమ్ములేనోడన్నారు. కేటీఆర్‌తో పోలిస్తే హరీశ్‌రావు క్రెడిబిలిటీ ఉన్నోడని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ పనైపోయిందని, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులు కూడా దొరకడం లేదని ఎద్దేవా చేశారు.

మూసీని బాగుచేయాలా, వద్దా?

మూసీ పునరుజ్జీవ పాదయాత్రలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పలువురితో మాట్లా డారు. భీమలింగం కత్వ నుంచి ధర్మారెడ్డిపల్లి కాలువ వెంట నడుస్తూ వస్తున్న సీఎంకు ఎమ్మె ల్యే వేముల వీరేశం కొందరు గీత కార్మికులను చూపించారు. సీఎం రేవంత్ వారి వద్దకు వెళ్లి వెంకటేశ్ అనే గీత కార్మికుడితో మాట్లాడారు.

వెంకటేశ్: నమస్కారం సార్

సీఎం: నమస్కారం.. బాగున్నారా సోదరా..

వెంకటేశ్: బాగున్నాం సార్..

సీఎం: కల్లు గీత వృత్తి ఎలా ఉంది?

వెంకటేశ్: మూసీ కాలుష్యంతో కల్లుకు డిమాండ్ పడిపోయింది సార్. ఇక్కడి తాటిచెట్ల దగ్గరికి వచ్చి కల్లు అడిగేవారే కరువయ్యారు. చాలా మంది వృత్తిని వదిలి వేరే పనులకు వెళ్తున్నారు సార్.

సీఎం: మూసీని బాగు చేయాలంటారా?

వెంకటేశ్: మూసీని బాగుచేసి పుణ్యం కట్టుకోండి సార్

సీఎం: బాగు చేయడానికే వచ్చా సోదరా.. కలుద్దాం.

సంగెం కుండలను కొంటలేరు

సంగెం ప్రాంతంలోని మట్టితో కుండలు తయారుచేస్తే విచ్చుకుపోతున్నాయి. సంగెంలో తయారు చేసిన కుండలు అంటేనే ఎవరూ కొనడం లేదు. స్థానికంగా ఉపాధి లేకపోవడంతో కుమ్మరి వృత్తిదారులు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. మూసీ కలుషిత నీటి వల్ల మూగజీవాలు చనిపోతున్నాయి. వరి నాట్లు వేయడానికి ఇక్కడి కూలీలు వస్తలేరు. బిహార్, బెంగాల్ నుంచి వచ్చిన కూలీలను పనికి తెచ్చుకుంటున్నాం. మూసీ బాగుకోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నాం.

- **వెంకటేశ్**, కుమ్మరి వృత్తిదారుడు, సంగెం, వలిగొండ మండలం

మూసీ చేపలు తింటలేరు

సంగెం గ్రామంలో సుమారు 200 మంది మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. ఒకప్పుడు మూసీ నదిలో చాలా చేపలు దొరికేవి. కొంత కాలం నుంచి చేపలు దొరకడం లేదు. దొరికినా మూసీలో పట్టిన చేపలు తినడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. కాలుష్యం కావడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. మూసీని శుద్ధి చేస్తేనే మాలాంటి వాళ్లకు జీవనాధారం ఉంటుంది.

- **చెక్క యాదగిరి**, మత్స్యకారుడు, సంగెం, వలిగొండ మండలం

నేడు మహారాష్ట్రకు సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం మహారాష్ట్రకు వెళ్లనున్నారు. త్వరలో అక్కడ జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు ఉదయం 8 గంటలకు శంషాబాద్ విమానాశ్రయం నుండి ఆయన ముంబై వెళ్తారని గాంధీ భవన్ వర్గాలు వెల్లడించాయి. అక్కడ కాంగ్రెస్ ముఖ్యమంత్రులతో కలిసి ఎన్నికల ప్రచారంతోపాటు విలేకరుల సమావేశంలో పాల్గొంటారని తెలిపాయి. అనంతరం శనివారం రాత్రికి రేవంత్ హైదరాబాద్ చేరుకునే అవకాశం ఉంది. శుక్రవారం మధిర నియోజకవర్గంలో పర్యటించిన ఉపముఖ్యమంత్రి భట్టి.. శనివారం ఉదయం జార్ఖండ్ బయలుదేరి వెళ్తారు. శని, ఆదివారాల్లో అక్కడి ఎన్నికల ప్రచారంలో పాల్గొని.. ఆదివారం రాత్రికి హైదరాబాద్ తిరిగి రానున్నారు.



సంగెం వద్ద మూసీ ఒడ్డున భీమలింగాన్ని హత్తుకున్న రేవంత్



మూసీ నదిలోంచి బాటిల్‌లో నీటిని తీసుకుని, దాన్ని మంచి నీటితో పోల్చిచూపిస్తున్న సీఎం. చిత్రంలో కోమటిరెడ్డి, చామల



సంగెం వద్ద మూసీ పరిశీలన కోసం బోటులో వెళ్తున్న సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



మూసీ పునరుజ్జీవ సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న రేవంత్

బుల్డోజర్లు ఎక్కిస్తాం

'మూసీ'ప్రక్షాళనపై ఎవరు అడ్డొచ్చినా ఆగేది లేదు.. లేకుంటే పేరు మార్చుకుంటా..

- మూసీ పునరుజ్జీవ సభలో రేవంత్ హెచ్చరిక

సాక్షి, యాదాద్రి: ''మూసీ పునరుజ్జీవ పాదయాత్ర ట్రైలర్ మాత్రమే. అసలు సినిమా ముందుంది. 2025 జనవరి మొదటి వారంలో వాడపల్లి నుంచి హైదరాబాద్ చార్మినార్ వరకు పాదయాత్ర చేస్తా. బిల్లా రంగాలు, చార్లెస్ శోభారాజ్‌లు కలిసి రావాలి. మిమ్మల్ని ఇక్కడి ప్రజలు రానిస్తారో.. నడుముకు తాడుకట్టి మూసీలో ముంచేస్తారో చూద్దాం. సంగెం శివయ్య సంకల్పంతో మూసీ నదిని ప్రక్షాళన చేసి పునరుజ్జీవింపజేస్తాం''అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సంగెం సమీపంలో మూసీ నది వద్ద పాదయాత్ర నిర్వహించారు. అనంతరం నిర్వహించిన మూసీ పునరుజ్జీవ సభలో ప్రసంగించారు. వివరాలు సీఎం రేవంత్ మాటల్లోనే..

''ఒకనాడు మంచి నీటిని అందించిన మూసీ నది.. ఇప్పుడు మురికికూపంగా మారి విషాన్ని చిమ్ముతోంది. పాలకులు పగబట్టారా? లేక దేవుడు శాపంపెట్టాడా అని మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు బాధపడుతున్నారు. మూసీని పునరుజ్జీవింపజేయాలని కోరుతూ పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. మూసీ పునరుజ్జీవనం కోసం మంచి సంకల్పం తీసుకున్నాను. ఇది నా జన్మదినం కాదు.. ఇక్కడికి రావడంతో నా జన్మధన్యమైంది.

ఇక్కడ బతికే పరిస్థితి లేదు..

సంగెం శివయ్యను దర్శించుకుని సంకల్పం తీసుకున్నా. ఎవరెన్ని అడ్డంకులు కల్పించినా మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం. మూసీ ప్రక్షాళన వద్దంటే చరిత్రహీనులుగా మిగులుతారు. మూసీ కాలుష్యంతో ఈ ప్రాంతంలో కులవృత్తులు చేసుకునే పరిస్థితి లేదు. ఇక్కడి చెరువుల్లో చేపలు బతికే పరిస్థితి లేదు. ఇక్కడ పండిన పంటలను తినే పరిస్థితి లేదు. చివరికి ఇక్కడ పశువుల పాలు తాగాలన్నా ఆలోచించాల్సిన దుస్థితి ఏర్పడింది. 40 ఏళ్ల క్రితం వరకు స్వచ్ఛమైన నీరు పారిన మూసీ నది వెంట పాడిపంటలతో ఎంతో సంతోషంగా బతికిన ఇక్కడి ప్రజలు.. ఇప్పుడు భూములు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రజలకు వరంగా ఉండాల్సిన మూసీ శాపంగా మారుతోంది. అందుకే మూసీ ప్రక్షాళన చేయాలో లేదో ఒక్కసారి ఆలోచించండి. బీఆర్‌ఎస్ నేతలకు దోచుకోవడమే తప్ప ప్రజలకు మేలు చేయడం తెలియదు. అందుకే మూసీ ప్రక్షాళనను అడ్డుకోవాలని చూస్తున్నారు. బిల్లారంగాలు ప్రజలవైపు ఉంటారో, లేదో తేల్చుకోవాలి. మూసీ ప్రక్షాళనకు అండగా ఉంటామని చెప్పిన కమ్యూనిస్టులకు సీఎంగా ధన్యవాదాలు చెప్తున్నాను.

ఆ పాపం తగలక తప్పదు!

కేసీఆర్.. నీ బిడ్డ మూడు నెలలు జైలుకు పోతేనే నీకు దుఃఖం వస్తే.. మూసీ పరీవాహక ప్రాంతాల బిడ్డల కాళ్లు చేతులు వంకర పోతుంటే నీకు పట్టదా? నీకు పాపం తగలక తప్పదు. నువ్వు కుక్కచావు చస్తావ్ కేసీఆర్. నల్లగొండ ప్రజలు నీకు ఓట్లు వేయలేదనా కేసీఆర్.. మూసీ ప్రక్షాళన అడ్డుకోవాలని చూస్తున్నావ్. నల్లగొండ జిల్లా పౌరుషాల గడ్డ. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే మూసీలోనే పాతరేస్తారు. నాకు డబ్బులు కావాలంటే నల్లగొండ జిల్లానే కావాలా? నువ్వు తెచ్చిన ధరణిలో అబ్రకదబ్ర చేస్తే కోట్లాది రూపాయలు రావా? మూసీ పునరుజ్జీవం జరిగి తీరుతుంది. ప్రక్షాళన చేయకపోతే నా జన్మ ఎందుకు?

అణుబాంబు కంటే ప్రమాదం

మూసీ ప్రాంతాల్లో మహిళలు గర్భం దాల్చే పరిస్థితి లేదు. ఒకవేళ గర్భం దాల్చినా అంగవైకల్యంతో పిల్లలు జన్మిస్తున్నారు. జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిలపై వేసిన అణుబాంబు కన్నా అత్యంత ప్రమాదకరంగా మూసీ నది తయారైంది. రాబోయే రోజుల్లో హైదరాబాద్ అతిపెద్ద విస్ఫోటనాన్ని మూసీ రూపంలో ఎదుర్కోబోతోంది. మూసీ కాలుష్యం వల్ల ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటలు పండే పరిస్థితి లేదు. గోదావరిని మూసీతో కలిపి మూసీ, ఈసీ వాగులను కృష్ణాతో అనుసంధానించే కార్యక్రమాన్ని మా ప్రభుత్వం పూర్తి చేస్తుంది. 30 రోజుల్లో మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు డిజైన్లను పూర్తి చేస్తాం..''అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

సీఎం రేవంత్ పర్యటన, యాత్ర ఇలా..

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రోడ్డు మార్గంలో ప్రత్యేక బస్సులో మూసీపై ఉన్న సంగెం–బొల్లెపల్లి బ్రిడ్జి వద్దకు చేరుకున్నారు. తొలుత మూసీ ఒడ్డున ఉన్న భీమలింగేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మూసీ ప్రక్షాళన చేస్తానని సంకల్పం తీసుకున్నారు. మూసీ తీరం వెంట నడుచుకుంటూ వస్తూ నదిలో పారుతున్న నీటిని ఒక బాటిల్‌లోకి తీసుకున్నారు. బోటులో ఎక్కి నదిలో కొద్దిదూరం ప్రయాణం చేసి నీటిని పరిశీలించారు. ఒడ్డుకు చేరుకున్నాక సంగెం గ్రామం వైపు నుంచి బ్రిడ్జి మీదుగా భీమలింగం కత్వ వరకు సుమారు రెండున్నర కిలో మీటర్లు పాదయాత్ర చేశారు. మత్స్యకారులు, రైతులు, వివిధ వర్గాల వారితో మాట్లాడారు. రూ.రెండు కోట్లతో సంగెం వద్ద ఉన్న భీమలింగేశ్వర ఆలయం వద్ద అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తిరిగి సంగెం గ్రామ వద్ద ఏర్పాటు చేసిన సభా వేదిక వద్దకు చేరుకున్నారు. సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, మందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ మోకాళ్ల యాత్ర చేసినా జనం నమ్మరు: మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, యాదాద్రి: తప్పుచేసినవారు ఎంతటి వారైనా జైలుకెళ్లాల్సిందేనని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవన సభలో ఆయన మాట్లాడారు. అమెరికాలో చదువుకున్న కేటీఆర్‌కు కనీసం బుద్ధిలేదని విమర్శించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని.. ఆ పార్టీల నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అర్థంలేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తనను జైలుకు పంపిస్తే యోగా చేసి, పాదయాత్ర చేస్తానని కేటీఆర్ చెప్తున్నారని.. కానీ ఆయన మోకాళ్ల యాత్ర చేసినా ప్రజలు నమ్మబోరని పేర్కొన్నారు. గత ప్రభుత్వానికి పదేళ్ల సమయం ఇచ్చినా మూసీని ప్రక్షాళన చేయలేదని మండిపడ్డారు. మూసీ పునరుజ్జీవనం ఆరేళ్ల ప్రాజెక్టు అని.. మళ్లీ తామే అధికారంలోకి వస్తామని, రేవంత్‌రెడ్డినే తిరిగి సీఎం అవుతారని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ఉద్యోగుల సమస్యలపై కేబినెట్ సబ్ కమిటీ

చైర్మన్‌గా ఉప ముఖ్యమంత్రి భట్టి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వోద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో మంత్రులు డి.శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు సభ్యులుగా ఉంటారు. సాధారణ పరిపాలన విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీని కూడా కమిటీలో భాగస్వామిని చేశారు. ఉద్యోగుల సమస్యలను తెలుసుకునే ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉప సంఘం ఏర్పాటుపై హర్షం: ప్రభుత్వోద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు స్వాగతించారు.

96.7% ఫార్మసీ సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: ఈఏపీ సెట్ అర్హత సాధించిన బైపీసీ విద్యార్థులకు వివిధ కోర్సుల్లో 96.7 శాతం సీట్లు కేటాయించారు. తుది దశ సీట్ల కేటాయింపు వివరాలను సాంకేతిక విద్య విభాగం శుక్రవారం వెల్లడించింది. మొత్తం 11,060 సీట్లు అందుబాటులో ఉంటే, 10,692 సీట్లను భర్తీ చేశారు. ఇంకా 368 సీట్లు మిగిలిపోయాయి. బి ఫార్మసీలో 8,649, ఫాం డిలో 1,684, బయో మెడికల్ ఇంజనీరింగ్‌లో 58, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్ 120, బయో టెక్నాలజీలో 181 సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 12వ తేదీలోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు.

ఎంపీహెచ్‌ఏ(ఎఫ్) పోస్టులకు డిసెంబర్ 29న పరీక్ష

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వాసుపత్రుల్లో ఖాళీల భర్తీని ప్రభుత్వం వేగవంతం చేసింది. దవాఖానాలలో ఖాళీగా ఉన్న 1,520 మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఫీమేల్) పోస్టులకు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల ప్రక్రియ కూడా పూర్తయింది. ఈ పోస్టులకు డిసెంబర్ 29వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తామని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం ప్రకటించింది. సీబీటీ (కంప్యూటర్ బేస్ట్ టెస్ట్) పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తామని బోర్డు సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఎంబీఏ ప్రవేశ పరీక్ష స్పాట్ రిజిస్ట్రేషన్ నేడు

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ ప్రవేశ పరీక్ష స్పాట్ రిజిస్ట్రేషన్‌ను శనివారం నిర్వహించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హైదరాబాద్‌లోని విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయంలో స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకుని.. నేరుగా పరీక్షలో పాల్గొనవచ్చని తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ ఫీజు, ఆధార్‌కార్డుతో పాటు రెండు ఫొటోలు తీసుకురావాలని కోరారు. ప్రవేశ పరీక్ష నవంబర్ 9 మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయంలో మాత్రమే నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ఈ నెల 18 వరకు టెన్త్ పరీక్ష ఫీజు గడువు

సాక్షి, హైదరాబాద్: మార్చి-2025లో జరిగే పదవ తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువును టెన్త్ పరీక్షల విభాగం శుక్రవారం ప్రకటించింది. టెన్త్, ఒకేషనల్, ఓ ఎస్సెస్సీ పరీక్షలు రాసే విద్యార్థులు ఈ నెల 18లోగా ఫీజు చెల్లించాలని తెలిపింది. రూ.50 ఫైన్‌తో డిసెంబర్ 2 వరకు, రూ.200 ఫైన్‌తో డిసెంబర్ 12 వరకు, రూ.500 లేట్ ఫీజుతో డిసెంబర్ 21 వరకూ ఫీజు చెల్లించవచ్చని పేర్కొంది. పరీక్ష ఫీజు, దరఖాస్తుల వివరాలు సంబంధిత స్కూల్ ప్రధానోపాధ్యాయుల వద్ద లభిస్తాయని తెలిపింది. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, మూడు సబ్జెక్టులు రాసే విద్యార్థులు రూ.110, మూడు కన్నా ఎక్కువ సబ్జెక్టులు రాసేవారు రూ.125 ఫీజుగా చెల్లించాలని పరీక్షల విభాగం వెల్లడించింది.

స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులు షురూ

భూమి పూజ చేసిన మేఘా ఇంజనీరింగ్ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) శుక్రవారం శ్రీకారం చుట్టింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని నెట్ జీరో వ్యాలీలో చేపట్టిన పనులకు సంస్థ ఉపాధ్యక్షుడు శివకుమార్, డైరెక్టర్ రవి.పి.రెడ్డి భూమి పూజ చేశారు. యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి అక్టోబర్ 26న ఎంఈఐఎల్ సంస్థతో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎల్‌వీఎస్ సుబ్బారావు, ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణారెడ్డి సంతకాలు చేసిన విషయం తెలిసిందే. యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి మేఘా సంస్థ రూ.200 కోట్లు విరాళంగా ప్రకటించింది. ఒప్పందంలో భాగంగా యూనివర్సిటీలో ప్రపంచస్థాయిలో అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లు, గ్రంథాలయం, ఆడిటోరియం, అత్యాధునిక క్లాస్ రూమ్‌లు, ప్రయోగశాలల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తారు. పర్యావరణహితంగా అంతర్జాతీయ స్థాయిలో నిర్మాణాలు ఉంటాయని ఎంఈఐఎల్ ఉపాధ్యక్షుడు శివకుమార్ వెల్లడించారు. స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణాల మొదటి దశను వచ్చే ఏడాది రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి పూర్తి చేస్తామని మేఘా సంస్థ డైరెక్టర్ రవి.పి.రెడ్డి వెల్లడించారు. భూమి పూజ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ మదన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



భవనాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మేఘా సంస్థ డైరెక్టర్ రవి.పి.రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శివకుమార్

స్థానిక పోరుపై కాంగ్రెస్ ఫోకస్

- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా భేటీలు... ముందుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో మొదలు
- రేపటి నుంచి 14వ తేదీ వరకు సమీక్షలు... పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలతో చర్చలు
- కులగణన జరుగుతున్న తీరుపైనా సమీక్ష



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యాచరణను ప్రారంభించింది. ఇందుకోసం అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శి పి. విశ్వనాథన్ ఈ సమావేశాలకు స్వయంగా హాజరవుతారని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 10న ఆదిలాబాద్, బోథ్, 11న ఆసిఫాబాద్, సిర్పూర్, 12న చెన్నూరు, బెల్లంపల్లి, 13న మంచిర్యాల, ఖానాపూర్, 14న నిర్మల్, ముథోల్‌లో సమావేశాలు జరగనున్నాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రితో పాటు జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఏఐసీసీ, పీసీసీ, డీసీసీ సభ్యులు, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే లు, పీసీసీ ప్రతినిధులు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఈ సమావేశాలకు విధిగా హాజరు కావాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు టి. కుమార్ రావు ఉత్తర్వులు జారీచేశారు.

కులగణన తీరుపై సమీక్ష

ఈ సమావేశాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనే వ్యూహాలను రూపొందించటంతో పాటు ఆయా నియోజకవర్గాల్లో కులగణన జరుగుతున్న తీరును కూడా సమీక్షిస్తారని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి. ఏఐసీసీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కులగణన కార్యక్రమం తెలంగాణలో ప్రారంభమైనందున దీని ఆధారంగానే ముందుకు వెళ్లాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో కులగణన విషయంలో పార్టీ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలనే కోణంలో ఈ సమావేశాల్లో కులగణన అంశాన్ని కూడా చేర్చినట్టు తెలుస్తోంది.

ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ పోరుబాట

నేటి నుంచి 13వ తేదీ వరకు కొనుగోలు కేంద్రాల సందర్శన

సాక్షి, హైదరాబాద్: రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నేతలు పోరాటానికి సిద్ధమయ్యారు. శనివారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకోనున్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి మండల కేంద్రంతో పాటు రేవన్నపల్లి గ్రామంలో కిషన్‌రెడ్డి, పార్టీ నేతలు కాసం వెంకటేశ్వర్లు, బూర నర్సయ్యగౌడ్, గూడూరు నారాయణరెడ్డి తదితరులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో డా. లక్ష్మణ్ , బంగారు శ్రుతి, సంకినేని వెంకటేశ్వరరావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బీజేఎల్పీనేత మహేశ్వర్‌రెడి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు పర్యటించనున్నారు. 11వ తేదీన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బండి సంజయ్, బోడిగె శోభ, జి.మనోహర్‌రెడ్డి, రాణీ రుద్రమ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో డీకే అరుణ, మాజీఎంపీ పి.రాములు, చింతల రామచంద్రారెడ్డి.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఎం.ధర్మారావు.. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎంపీ రఘునందన్‌రావు, మాజీ ఎంపీ బీబీపాటిల్, జె.సంగప్ప, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాటిపల్లి వెంకటరమణారెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి దాన్యం కొనుగోలు కేంద్రాలు సందర్శిస్తారు. 13న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు రాకేష్‌రెడ్డి, సూర్యనారాయణగుప్తా, డి.ప్రదీప్‌కుమార్ ఇతర నేతలు పాల్గొంటారు.

ప్రతిపక్షాలవి మొసలి కన్నీళ్లు

- బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో అందరికీ తెలుసు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శ
- ఖమ్మం జిల్లాలో పలు కార్యక్రమాలకు హాజరు
- విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం

ఖమ్మం రూరల్/నేలకొండపల్లి: ప్రతిపక్షాల మొసలి కన్నీళ్లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రాష్ట్ర రెవె న్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. పదేళ్ల పాల నలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను ఎలా ఆదుకుందో అందరికీ తెలుసునని విమర్శించారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. తమ ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించిందని, ఈ ఏడాది కనీవిని ఎరగని రీతిలో ధాన్యం పండినందున రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవసరాలు తెలుసుకోవడానికే ప్రభుత్వం కుటుంబ సమగ్ర సర్వే చేయిస్తోందని చెప్పారు. ఖమ్మం రూరల్ మండలం కోటనారాయణపురంలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. మరింత అభివృద్ధి, స్పష్టమైన ప్రణాళికల రచనకు చేపడుతున్న సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. నేలకొండపల్లిలో గురుకుల బాలికల పాఠశాలను సందర్శించిన మంత్రి విద్యార్థినులతో మాట్లాడి వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. నాయుడుపేటలో బీవీఎస్ స్పోర్ట్స్ ఎరీనాను ప్రారంభించి కాసేపు క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నేలకొండపల్లిలో గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

18 నుంచి బీసీ కమిషన్ విచారణ

రెండోదశ కింద ఐదు జిల్లాల్లో పర్యటనలు... 25, 26 తేదీల్లో కమిషన్ కార్యాలయంలో కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడిన తరగతుల వారి స్థితిగతులను అధ్యయనం చేసే క్రమంలో తెలంగాణ బీసీ కమిషన్ రెండోదఫా బహిరంగ విచారణ కార్యక్రమాలు నిర్వహించనుంది. గత నెలలో ఐదు రోజుల పాటు ఐదు ఉమ్మడి జిల్లాల్లో కమిషన్ బృందం పర్యటించింది. రెండో విడతగా ఈనెల 18వ తేదీనుంచి 26వతేదీ వరకు మిగిలిన జిల్లాల్లో, అలాగే హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో బహిరంగ విచారణ ప్రక్రియ చేపట్టనుంది. ఈ సందర్భంగా వివిధ వర్గాల నుంచి అభిప్రాయ సేకరణ జరపడంతో పాటు వినతిపత్రాలను కూడా స్వీకరిస్తుంది. 25, 26వ తేదీల్లో రాష్ట్ర కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి బహిరంగ విచారణ చేపట్టనుంది. ఈ మేరకు తెలంగాణ బీసీ కమిషన్ జిల్లాల వారీగా షెడ్యూల్ విడుదల చేసింది.

సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సమగ్ర సర్వే తెలంగాణ బీసీ కమిషన్‌కు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు ఏ రోజు, ఏ ప్రాంతం, ఏయే కుటుంబాల వద్దకు వెళతారో ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు ఖచ్చితమైన సమాచారం ఇస్తేనే వెనుకబాటుకు సంబంధించిన సమాచారం తెలుస్తుందని పేర్కొన్నారు.

బహిరంగ విచారణ షెడ్యూల్

తేదీ	జరిగే ప్రాంతం	కవర్ అయ్యే జిల్లాలు
18.11.2024	నల్లగొండ జిల్లా కలెక్టరేట్	నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి
19.11.2024	ఖమ్మం జిల్లా కలెక్టరేట్	ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
21.11.2024	రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్	రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్
22.11.2024	మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్	మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి
23.11.2024	హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్	హైదరాబాద్
25.11.2024	బీసీ కమిషన్ కార్యాలయం	అన్ని జిల్లాలు
26.11.2024	బీసీ కమిషన్ కార్యాలయం	అన్ని జిల్లాలు

నేటి నుంచి ఇంటింటికీ ఎన్యుమరేటర్లు

సాక్షి, హైదరాబాద్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా శనివారం నుంచి వివరాల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆరోతేదీ నుంచే సర్వే ప్రక్రియను ప్రారంభించిన అధికారులు.. మూడురోజుల పాటు ఇళ్లు గుర్తించి, ప్రాథమిక వివరాలు సేకరించి అందుకు గుర్తుగా స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. శనివారం నుంచి ఎన్యుమరేటర్లు సర్వే చేపట్టనున్నారు. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు వరకు సేకరించిన వివరాలు, ఇతర సమాచారాన్ని మండల, జిల్లా స్థాయిలో కంప్యూటరీకరిస్తారు. జిల్లా నోడల్ అధికారులు, రాష్ట్ర అధికారులు డ్యాష్‌బోర్డు ద్వారా వాస్తవ పురోగతిని పర్యవేక్షిస్తారు. సర్వే కోసం రాష్ట్ర వ్యాప్తంగా 87,092 ఎన్యుమరేషన్ బ్లాక్‌లను గుర్తించారు. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 19,328 బ్లాకులు, ఇతర ప్రాంతాల్లో 67,764 బ్లాకులు ఉన్నాయి. సర్వే చేసేందుకు 94,750 మంది ఎన్యుమరేటర్లు నియమితులయ్యారు. రాష్ట్రంలోని మొత్తం 1,17,44,954 కుటుంబాల నుంచి వివరాలు సేకరించనున్నారు.

3 నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి

- ‘అనర్హత’అంశంపై హైకోర్టులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల వాదనలు
- తదుపరి విచారణ 11కు వాయిదా



సాక్షి, హైదరాబాద్: శాసనసభ్యుల పార్టీ ఫిరాయింపుల అంశంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అప్పీళ్లకు విచారణార్హత లేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ముందు వాదించారు. ‘పదవ షెడ్యూల్‌ను ఉల్లంఘించిన వ్యక్తులను అనర్హులుగా ప్రకటించాలనే రాజ్యాంగ లక్ష్యానికి కట్టుబడి ఉండాలంటే, ఫిర్యాదు చేసిన తేదీ నుంచి మూడు నెలల వ్యవధిలో స్పీకర్ ముందు దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలి. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల జీవితకాలం ఐదేళ్లు మాత్రమే. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచకుండా నిర్దీత సమయంలో తీర్పు వెలువరించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఇక్కడ 8 నెలలైనా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు..’అని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి (స్టేషన్‌ఘన్‌పూర్), తెల్లం వెంకట్రావు (కొత్తగూడెం) దానం నాగేందర్ (ఖైరతాబాద్)లను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్లు దాఖలు వేశారు. అలాగే దానంను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా స్పీకర్ సమయం ఇవ్వడం లేదంటూ బీజేపీ పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై విచారణ షెడ్యూల్‌ను నాలుగు వారాల్లోగా ఖరారు చేయాలని సెప్టెంబర్ 9న సింగిల్ జడ్జి తీర్పునిచ్చారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి గత నెల హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్ రావు ధర్మాసనం శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు విన్పించారు.

గడువులోగా నిర్ణయం తీసుకోవాలి..

‘ఎమ్మెల్యేగా గెలిచిన ఓ నేత పార్టీ మారడమే కాకుండా పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేశారు. ఆయనను ప్రజలు ఓడించారు. మహారాష్ట్ర, మణిపూర్ కేసులలో సుప్రీంకోర్టు వెలువరించిన రెండు తీర్పులను పరిశీలిస్తే.. తమ ముందు పెండింగ్‌లో ఉన్న అనర్హత పిటిషన్లపై నిర్దీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రూల్ 6, 7 ప్రకారం స్పీకర్ నడుచుకోవడం లేదు. వెంటనే నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలి..’అని మోహన్‌రావు కోర్టును కోరారు. కాగా ఏజీటి తరఫున న్యాయవాది జె.ప్రభాకర్ వాదనల కోసం తదుపరి విచారణను ధర్మాసనం సోమవారానికి వాయిదా వేసింది.

‘బీసీలకు రాహుల్ క్షమాపణ చెప్పాలి’

సాక్షి, హైదరాబాద్: బీసీలకు అన్యాయం చేసినందుకు వారికి కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా. కె.లక్ష్మణ్ అన్నారు. బీసీలను రాజకీయంగా ప్రలోభపెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనను తెరమీదకు తెచ్చిందని ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సామాజిక న్యాయంపై రాహుల్ గాంధీ మాటలు దయ్యా లు వేదాలు వల్లించినట్టుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీనిచ్చి ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.

‘సర్వేకు ఆటంకాలు సృష్టిస్తే కఠిన చర్యలు’

సాక్షి, హైదరాబాద్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ఆటంకాలు కల్పించినా, ప్రజల్లో అపోహలు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హెచ్చరించారు. అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం, రాజకీయ ప్రాధాన్యత, ఆర్థిక తోడ్పాటు అందించడానికే ప్రభు త్వం సమగ్ర సర్వే చేపట్టిందని ఓ ప్రకటనలో తెలిపారు. ‘‘గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయించిన కుటుంబ సర్వే వివరాలు ఉండగా ప్రత్యేకంగా మళ్లీ ఎన్యూమరేషన్ అవసరమా అని అంటూ ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఆ వివరాల మదింపు అప్పటి పాలకులు కోరుకున్న విధంగా జరిగింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, సమగ్ర కుల సర్వే అనగానే గులాబీ, కమలం పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. బలహీనవర్గాలకు న్యాయం జరగొద్దని ఆ రెండు పార్టీలు భావిస్తున్నాయి..’’అని విమర్శించారు.

రాజ్‌భవన్‌కు సర్వే స్టిక్కర్



బంజారాహిల్స్ (హైదరాబాద్): సమగ్ర ఇంటింటి కుల సర్వేలో భాగంగా శుక్రవారం ఎన్యుమరేటర్లు.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నివాసమైన రాజ్‌భవన్‌కు సర్వే స్టిక్కర్ అంటించారు. గవర్నర్ కార్యాలయ డిప్యూటీ సెక్రటరీ పల్లవి, సూపర్‌వైజరీ అధికారి కైలాష్, ఎన్యుమరేటర్ రమేశ్ తదితరులు గవర్నర్ నివాసానికి వెళ్లారు. గవర్నర్ పేరు, ఇంటి నంబర్ తదితర వివరాలను నమోదు చేసుకుని స్టిక్కర్ అంటించారు. గవర్నర్ అందుబాటులో ఉండే తేదీల్లో వెళ్లి 75 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని భర్తీ చేస్తామని సంబంధిత అధికారులు వెల్లడించారు.

బాహ్యేంద్రియముల నుండి పుట్టు సుఖములు దుఃఖహేతువులు.
అవి వచ్చుచు పోవుచునుండును. వాటిని జ్ఞానులు లెక్కచేయరు.
వాటి వలన సంతోషించరు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 9 నవంబర్ 2024

సుదీర్ఘ తగువుకు పాక్షిక ఊరట!

షష్టిపూర్తికి చేరువలో ఉన్న ఒక వివాదాస్పద కేసుకు సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం పాక్షికంగా ముగింపు పలికింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పదవి నుంచి వైదొలగుతున్న చివరి రోజున ఆయన ఆధ్వర్యంలోని ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన మెజారిటీ తీర్పు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ)కు మైనారిటీ ప్రతిపత్తి అర్హతలేదన్న 1967 నాటి నిర్ణయాన్ని కొట్టేస్తూనే వేరే ధర్మాసనం దాన్ని నిర్ధారించాలని తెలిపింది. గత తీర్పుకు అనుసరించిన విధానం సరికాదని తేల్చింది. బెంచ్‌లోని ముగ్గురు సభ్యులు అసమ్మతి తీర్పునిచ్చారు. ఒక వివాదాన్ని ఏళ్ల తరబడి అనిశ్చితిలో పడేస్తే నష్టపోయే వర్గాలుంటాయి. ఏళ్లు గడిచేకొద్దీ సమస్య జటిలమవుతుంది కూడా. జేఎన్‌యూ మాదిరే ఏఎంయూ కూడా వివాదాల్లో నానుతూ ఉంటుంది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక ఇవి మరింత పెరిగాయి. చిత్రమేమంటే ఈ రెండు యూనివర్సిటీల నుంచి పట్టభద్రులైనవారిలో చాలామంది సివిల్ సర్వీసులకూ, ఇతర ఉన్నత స్థాయి ఉద్యోగాలకూ ఎంపికవుతుంటారు. పార్టీల్లో, ప్రభుత్వాల్లో, బహుళజాతి సంస్థల్లో ప్రముఖ పాత్ర పోషిస్తుంటారు. ఏఎంయూది ఒక విషాద చరిత్ర. సమస్యలు కూడా భిన్నమైనవి. సర్ సయ్యద్ మహ్మద్ ఖాన్ అనే విద్యావంతుడు మదర్సాల్లో కేవలం ఇస్లామిక్ విలువల విద్య మాత్రమే లభించటంవల్ల ఆ మతస్తులు అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారని భావించి వాటితోపాటు ఆధునిక విద్యాబోధన ఉండేలా 1877లో స్థాపించిన ఓరియంటల్ కళాశాల ఆరంభంలో ఎదుర్కొన్న సమస్యలు అన్నీ ఇన్నీ కాదు. మౌల్వీలనుంచీ, మదర్సాలనుంచీ సర్ సయ్యద్‌కు ప్రతిఘటన తప్పలేదు. ఆధునిక విద్యనందిస్తే పిల్లల మనసులు కలుషితమవుతాయన్న హెచ్చరికలొచ్చాయి. అన్నిటినీ దృఢచిత్తంతో ఎదుర్కొని ఆధునిక దృక్పథంతో ఏర్పాటు చేసిన ఈ ఉన్నత విద్యాసంస్థపై 147 ఏళ్లు గడిచాక మత ముద్ర పడటం, దాన్నొక సాధారణ వర్సిటీగా పరిగణించాలన్న డిమాండు రావటం ఒక వైచిత్రి.

చరిత్ర ఎప్పుడూ వర్తమాన అవసరాలకు అనుగుణంగా కొత్త రూపు తీసుకుంటుంది. అందువల్లే కావొచ్చు... ఏఎంయూ చుట్టూ ఇన్ని వివాదాలు! 1920లో నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఓరియంటల్ కళాశాలనూ, ఆ ప్రాంతంలోనే ఉన్న ముస్లిం యూనివర్సిటీ అసోసియేషన్ సంస్థనూ విలీనం చేసి 1920లో అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీని ఏర్పాటుచేసింది. ఆ చట్టంలోని 23వ నిబంధన యూనివర్సిటీ పాలకమండలిలో కేవలం ముస్లింలకు మాత్రమే చోటీయాలని నిర్దేశిస్తోంది. అయితే ముస్లిం విద్యార్థులను మాత్రమే చేర్చుకోవాలన్న నిబంధన లేదు. స్వాతంత్ర్యానంతరం 1951లో ఆ చట్టానికి తెచ్చిన రెండు సవరణలు మతపరమైన బోధననూ, పాలకమండలిలో ముస్లింలు మాత్రమే ఉండాలన్న నిబంధననూ రద్దుచేశాయి. ఈ చర్య రాజ్యాంగంలోని 30వ అధికరణతోపాటు మత, సాంస్కృతిక, ఆస్తి అంశాల్లో పూచీపడుతున్న ప్రాథమిక హక్కులను ఉల్లంఘించటమేనంటూ పిటిషన్ దాఖలైంది. అయితే ఆ సవరణలు చెల్లుతాయని 1967లో సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యుల బెంచ్ వెలువరించిన తీర్పే ప్రస్తుత వివాదానికి మూలం. వర్సిటీ స్థాపించిందీ, దాన్ని నిర్వహిస్తున్నదీ ముస్లింలు కాదని ఆ తీర్పు అభిప్రాయపడింది. అయితే అలా మారటం వెనక ముస్లిం పెద్దల కృషి ఉన్నదని అంగీకరించింది. ప్రభుత్వం స్థాపించిన వర్సిటీకి మైనారిటీ ప్రతిపత్తి ఎలా వస్తుందని ప్రశ్నించింది. ఈ తీర్పును వమ్ముచేస్తూ 1981లో ప్రభుత్వం ఏఎంయూ చట్టానికి సవరణలు తెచ్చింది. తిరిగి మైనారిటీ ప్రతిపత్తినిచ్చింది. దాంతో మెడికల్ పీజీలో 50 శాతం సీట్లను ముస్లింలకు కేటాయించాలని పాలకమండలి 2005లో నిర్ణయించింది. దాన్ని అలహాబాద్ హైకోర్టు కొట్టేసింది. నాటి యూపీఏ సర్కారు, పాలకమండలి 2006లో దాఖలు చేసిన అప్పీళ్లను సుప్రీంకోర్టు స్వీకరించినా రిజర్వేషన్ల విధానంపై స్టే విధించింది. ఆనాటినుంచీ అనాథగా పడివున్న ఆ కేసు నిరుడు అక్టోబర్‌లో జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయటంతో ముందుకు కదిలింది.

అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 30వ అధికరణను పరిమితార్థంలో చూసిందనీ, యాంత్రికంగా అన్వయించిందనీ తాజా మెజారిటీ తీర్పు అభిప్రాయపడింది. ఏఎంయూ స్థాపన నేపథ్యం, పరిస్థితులు పరిగణనలోకి తీసుకోవాలి తప్ప తర్వాతకాలంలో వచ్చిన చట్టాన్ని కాదని తెలిపింది. ఈ తీర్పుతో విభేదించిన ముగ్గురు న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలు కూడా ప్రాధాన్యత గలవే. ఇద్దరు సభ్యుల డివిజన్ బెంచ్ అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పుపై మరో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుకు ఎలా సిఫార్సు చేస్తుందని వారి ప్రశ్న. కేశవానంద భారతి కేసులో 1973 నాటి 'రాజ్యాంగ మౌలిక స్వరూపం' తీర్పుపై 15 మందితో ధర్మాసనం ఏర్పాటు చేయమని రేపన్నరోజు మరో బెంచ్ ఆదేశిస్తే పరిస్థితేమిటని నిలదీశారు. ఏదేమైనా ఆలస్యమైనకొద్దీ సమస్య ఎంత జటిలమవుతుందో చెప్పటానికి ఏఎంయూ కేసే ఉదాహరణ. ఈ వర్సిటీ స్థలదాత జాట్ రాజా మహేంద్ర ప్రతాప్ సింగ్ అని హిందూ సంస్థలూ... ఆయన నెలకు రూ. 2కు 1929లో లీజుకు మాత్రమే ఇచ్చారని ముస్లింలూ రోడ్డుకెక్కారు. హిందువు ఇచ్చిన స్థలమైనప్పుడు దానికి మైనారిటీ ప్రతిపత్తేమిటన్న ప్రశ్న తలెత్తింది. మైనారిటీ సంస్థలో చదువుకుని ఎదిగినందుకు కృతజ్ఞతగా లీజుకిచ్చారని, అలా ఇచ్చిన వందమందిలో ఆయనొకరని అవతలి పక్షం వాదించింది. మొత్తానికి యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వల్ల మహేంద్ర పేరిట అక్కడే మరో వర్సిటీ ఏర్పాటైంది. రాజ్యాంగ ధర్మాసనం సూచించిన విధంగా ఏఎంయూ ప్రతిపత్తిపై మరో బెంచ్ ఏర్పాటై తీర్పు వస్తే ప్రస్తుత అనిశ్చితికి తెరపడుతుంది.

గ్రామీణ భారత వెన్ను విరుస్తారా?

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

భారతదేశ ఆర్థిక సంక్షోభానికి కారణం వ్యవసాయదారులపైన, వ్యవసాయ సంస్కృతి పైన చూపిన నిర్లక్ష్యం. దానికి విరుగుడుగా దేశంలో కోట్ల మందిగా ఉన్న గ్రామీణ కూలీలకు కనీస బతుకుదెరువు కల్పించడం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వచ్చింది. ఈ పథకం అమలు కావడం వల్ల పేదల కడుపులోకి నాలుగు మెతుకులు పోవడంతో పాటు ఆత్మ గౌరవం పెరిగింది. ఈ పథకం రూపకల్పనలో మానవతా స్ఫూర్తి ఉంది. కరుణాభావం ఉంది. రాజ్యాంగ అధ్యయనం ఉంది. అయితే ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసే ప్రయత్నం చేయడం బాధాకరమైన విషయం. సామాజిక న్యాయంతో కూడిన రాజ్యాధికారమే ఈ యుగ ధర్మం అని గుర్తించాలి.

భారతదేశంలో ఆర్థిక మాంద్యం, ద్రవ్యోల్బణం పెరుగుతున్నాయని అనేక నివేదికలు చెబుతున్నాయి. ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రామిక వర్గానికి, అందునా దళిత బహుజన వర్గాలకు ఆచారణాత్మక విరోధాన్ని ప్రకటిస్తున్నాయి. దానికి రుజువు ఏమిటంటే, పేద ప్రజలకు మేలు కలిగించి వారి పొట్ట నింపుతూ వారికి గ్రామాల్లో నివసించే పరిస్థితిని కల్పించిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ' పథకాన్ని(ఎంజీ–ఎన్‌ఆర్‌ఈజీఎస్) నీరు గార్చడం. ఇది పేదలను గ్రామాల నుంచి తరిమేసి, గ్రామాలను కార్పొరేట్లకు అప్పజెప్పే దుష్ట యత్నం.

దేశంలో కోట్ల మందిగా వున్న గ్రామీణ కూలీలకు ఉపాధి హామీ ఇవ్వడం కోసం స్వాతంత్ర్యానంతరం వచ్చిన ఒకే ఒక్క పథకం – గ్రామీణ ఉపాధి హామీ. మన్మోహన్ సింగ్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వానికి నాడు వామపక్షాల మద్దతు అనివార్యమైంది. దాంతో వామపక్షాలు డిమాండ్ చేసినట్టుగా గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకాన్ని చట్టబద్ధంగా అమలు చేయాల్సి వచ్చింది. 2005 ఆగస్ట్ 23న దేశ పార్లమెంట్ చారిత్రాత్మకమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఆమోదించింది. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాలోని నార్పల మండలం బండమీదపల్లి గ్రామంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ 2006 ఫిబ్రవరి 2న ప్రారంభించారు. ఈ పథకం అమలు కావడం వల్ల పేదల కడుపులోకి నాలుగు మెతుకులు పోవడంతో పాటు ఆత్మ గౌరవం పెరిగింది.

నిజానికి మన్మోహన్ భారతదేశానికి ఉపకరించే అనేక ఉపయోగకరమైన పనులు నిర్వర్తించారు. ఉపాధి హామీ పథకం రూపకల్పనలో ఆంధ్ర క్యాడర్‌కు సంబంధించి ఢిల్లీలో పనిచేసిన కొప్పుల రాజు ప్రభావం ఉంది. ఆయన మీద ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ పోరాటాల ఫలితం ఉంది. ఈ పథకం రూపకల్పనలో మానవతా స్ఫూర్తి ఉంది. కరుణాభావం ఉంది. రాజ్యాంగపు అధ్యయనం ఉంది. అయితే ఈ పథకాన్ని కేంద్ర, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసే ప్రయత్నం చేయడం బాధాకరమైన విషయం.

అంతర్జాతీయస్థాయిలో మానవాభివృద్ధిని గణించినట్లు, భారతదేశంలో కూడా లెక్కించడానికి ప్రణాళికాసంఘం ఆధ్వర్యంలో ప్రయత్నాలు జరిగాయి. ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలు మానవాభివృద్ధిలో మెరుగైన పనితీరును ప్రదర్శించాయి. కానీ ఆర్థికాభివృద్ధికీ, మానవాభివృద్ధికీ మధ్య ఉండే ధనాత్మక సహసంబంధం మధ్యంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు అన్వయించడం లేదు. అయితే కేరళ రాష్ట్రం మానవాభివృద్ధిలోనూ, ఆర్థికాభివృద్ధిలోనూ సమాన మెరుగుదల కనబరుస్తోంది. బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒరిస్సా మొదలైనవాటి పనితీరుతో కేరళ రెండింతల మెరుగుదల కనబరిచింది. పంజాబ్, తమిళనాడు, మహారాష్ట్ర, హరియాణా మొదలైన రాష్ట్రాలు చెప్పుకోతగ్గ పురోగతిని సాధించాయి. క్లుప్తంగా చెప్పాలంటే చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మానవాభివృద్ధిలో మంచి ఫలితాలను సాధించాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మానవాభివృద్ధిలో గణనీయమైన పురోగతి కనిపిస్తున్నప్పటికీ, వాటి మధ్య అంతరాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



నిజానికి భారతదేశ ఆర్థిక సంక్షోభానికి కారణం వ్యవసాయదారులపైన, వ్యవసాయ సంస్కృతిపైన చూపిన నిర్లక్ష్యం. భారతదేశంలో కుల కార్పొరేట్ దోపిడీ వ్యవస్థ రూపొందడానికి కారణాలను అంబేడ్కర్ ఆనాడే పసిగట్టారు. పేద ప్రజలను కులం ద్వారా విభజించి వారికి రాజ్యాధికారం రాకుండా చేయడానికే ప్రయత్నాలు జరిగాయి. అంబేడ్కర్ 1942లోనే మహారాష్ట్ర 'కొలాబా' జిల్లాలో అణగారిన వర్గాల సభలో మాట్లాడుతూ, అగ్రవర్ణ రాజకీయ పార్టీలు, ఆర్థిక పెత్తందారులు, భూస్వాములు కలిసి శ్రామిక వర్గాలను ఏకం కాకుండా చేసి రాజ్యాధికారానికి దూరం చేస్తున్నారన్నారు.

''అణగారిన వర్గాల వారి ఉద్యమం ఇతర శ్రామికజనంతో కలిసి ముందుకు సాగాలని నేను ఆత్రుత పడుతున్నాను. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకునే, బ్రాహ్మణేతర వర్గానికి చెందిన శ్రమజీవులు తమ స్వేచ్ఛకోసం ఎప్పుడో ఒకప్పుడు మహత్తర పోరాటం చేస్తారన్న ఆశతోనే గత పదేళ్ళుగా బ్రాహ్మణేతర పార్టీలో కొనసాగుతున్నారు. మా పార్టీకి తన అంతరాంతరాలలో ప్రజాస్వామ్య బీజాలు ఉన్నాయి. దురదృష్టవశాత్తు ఈ పార్టీ నాయకులు తమ బాధ్యతలను గుర్తించకుండా ఒకవైపున ప్రభుత్వం, మరోవైపున కాంగ్రెస్ ప్రభావం వల్ల ఈ పార్టీ ఛిన్నాభిన్నం కావడానికి దోహదం చేశారు. ఇప్పటికైనా ఈ విషయంలో వారు ఏమైనా చేయగలిగితే నేను ఆహ్వానిస్తాను. బ్రాహ్మణేతరులైన శ్రమజీవులు మా పార్టీలో చేరాలని నేను పట్టుబట్టడం లేదు. కావాలనుకుంటే వారు వేరే పార్టీ పెట్టుకోనివ్వండి. అయినా బ్రాహ్మణులకు, పెట్టుబడిదారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా మనందరం కలిసి ఉమ్మడి పోరాటం చేయవచ్చు.

అణగారిన వర్గాల వారు విడిగా ఒక రాజకీయ పార్టీ నడిపితే శ్రామికజన ప్రయోజనాలు దెబ్బతింటాయని కొందరు అంటున్నారు. దానివల్ల అలాంటిది ఏమీ జరగదు. అట్టడుగున ఉన్న మన పోరాటం నిజానికి ఇతర శ్రామిక వర్గాల వారి కష్టాలను దూరం చేయడానికి ఉపయోగపడుతుంది. భవనంలోని అట్టడుగున ఉన్న పునాదిరాయి కదిలితే, పైన ఉన్నవి పట్టు సడలుతాయి. కేవలం సవర్ణ హిందువులతో మాత్రమే కూడిన కార్మిక సంస్థ ఉంటే హిందువులకు మేలు కలుగుతుందని ఏమీ లేదు. ఒకవేళ ఆ కార్మిక సంస్థకు సరైన మార్గదర్శనం లేకపోతే ఆ అణగారిన వర్గాల హిందువులకు మేలు కలుగుతుందని గ్యారెంటీ కూడా ఏమీ లేదు. పైగా హాని కూడా జరగొచ్చు. అనేక సందర్భాలలో జరిగినట్టు వారి హక్కులను కాలరాయడానికి ఉపయోగపడవచ్చు.''

అంబేడ్కర్ ఆలోచనలు విశాలమైనవి. దీర్ఘ దర్శనంతో కూడుకున్నవి. ఇకపోతే ఉపాధి చట్టం కింద పని చేసిన కూలీలకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రోజూ పని చేస్తే తప్ప పూట గడవని కూలీలకు ఆరేడు నెలలుగా బిల్లులు ఎందుకు బకాయి ఉంటున్నాయి? కూలీలకు సకాలంలో డబ్బులు అందకపోతే అనివార్యంగా ఈ పని నుండి తప్పుకొంటారు. పని దినాలు కల్పించాలనే డిమాండ్ చేయడం తగ్గిపోతుంది. తిరిగి మరలా గ్రామీణ వేతన దోపిడీకి గురికావలసి వస్తుంది. ఎన్నికల ముందు అనేక పథకాలు ప్రకటించి గద్దెనెక్కే పాలకులు చట్టబద్ధంగా అమలు చేయాల్సిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయకపోవడం వెనుక గ్రామీణ ప్రాంతాల నుండి పేదలను తరిమివేసే కుట్రలేదని భావించగలమా? ఈ కూలీలు ఇతర రాష్ట్రాల వ్యవసాయ పనులకు, మహా నగరాలకు పెద్ద ఎత్తున వలస వెళితే తప్ప అక్కడ చౌకగా శ్రమను అమ్ముకునే కార్మికులు దొరకరని సామాజిక విశ్లేషకులు చెబుతున్నారు.

రాజ్యాంగం కార్మిక, శ్రామిక పక్షపాతంతో కూడుకుని ఉన్నదని పాలకులు గుర్తించలేకపోతున్నారు. పేద ప్రజలు తమ గ్రామంలో బతికితే ఆ గ్రామానికి వెలుగు, ఆ గ్రామానికి జీవం. ఈ పథకం వల్ల దళిత స్త్రీలు సూర్యోదయాన్నే కొంత కూలీని సంపాదించుకున్నారు. ఈ పథకం వల్ల గ్రామీణ రోడ్ల పక్కన కాలువలు తీయబడ్డాయి. ఈ పథకం వల్ల గ్రామీణ స్కూళ్లు బలపడ్డాయి. పిల్లలను చదివించుకోగలిగారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడంలో రాజ్యాంగ నిరాకరణ ఉంది. మానవతా స్ఫూర్తికి విరుద్ధమైన ఆచరణ ఉంది. సామాజిక న్యాయంతో కూడిన రాజ్యాధికారమే ఈ యుగ ధర్మం. అంబేడ్కర్ మార్గంలో నడుద్దాం. బలమైన గ్రామీణ భారతదేశాన్ని నిర్మిద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు
మొబైల్: 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎందుకీ వ్యతిరేకత?



ఇజ్రాయెలీ అభిమానుల మీద ఆమ్‌స్టర్‌డామ్‌లో జరిగిన దాడులు భయానకం. కానీ ఇవేమీ ఆశ్చర్యం కలిగించలేదు. ఏళ్లుగా యూదు వ్యతిరేకతను మేళవించిన ఇస్లామిజంను (ఇప్పుడు తీవ్ర వామపక్షంతో కలిసి) సహిస్తూ రావడమే దీనికి కారణం.

– అయాన్ హిర్సీ అలీ, యూఎస్ యాక్టివిస్ట్

ఎందుకీ నింద?



ఆమ్‌స్టర్‌డామ్ (నెదర్లాండ్స్) దృశ్యాలు అసహ్యం కలిగించాయి. కానీ దాడులు చేసినవాళ్లు పాలస్తీనియన్లు కాదు. వాళ్లు పాలస్తీనాను సమర్థించరు. యూదులు, ఇజ్రాయెలీల మీద ఎక్కడ దాడి జరిగినా పాలస్తీనియన్లను నిందించడం అన్యాయం.

– ఇహాబ్ హసన్, పాలస్తీనా యాక్టివిస్ట్

వాళ్ల మీదా నింద?



భారతీయ చరిత్రకారులు ప్రజలకు చేరడంలో విఫలమవుతున్నందువల్లే వాట్సాప్ యూనివర్సిటీ హిస్టరీ పెరుగుతున్నదన్న (చరిత్రకారుడు) విలియం డాల్రింపుల్ వాదనతో విభేదిస్తాను. అశాస్త్రీయ ఆలోచనలను చురుగ్గా ప్రోత్సహిస్తున్న శక్తులు చరిత్రకారుల కంటే చాలా బలమైనవి. ఇది శుభ్రత లేనందుకు వైద్యులను నిందించడంలా ఉంది.

– ఒమర్ రషీద్, జర్నలిస్ట్

ఆపాల్సిన దేశం



రష్యాను మనం ఉక్రెయిన్‌లో ఆపలేకపోతే, దాన్ని మనం ఎక్కడ కూడా ఆపలేం. ఒకవేళ ఉక్రెయిన్ పడిపోతే, రష్యా ఇతర దేశాల మీదికి పోదనేందుకు ఏ కారణమూ కనబడటం లేదు. ఉక్రెయిన్ కంటే అక్కడ దానికి యుద్ధం మరింత సులభతర మవుతుంది. అందుకే, రష్యాను ఆపాలి.

– వ్లాదిమీర్ యెర్మోలెంకో, ఉక్రెయిన్ సంపాదకుడు

మంచి నిర్ణయం



తమిళనాడు ప్రభుత్వం పాముకాట్లను 'నోటిఫయబుల్ డిసీజ్'గా ప్రకటించింది. దీనికి అనుగుణంగా ప్రైవేటుతో సహా అన్ని హాస్పిటళ్లు ఈ కేసుల్ని నివేదించాల్సి ఉంటుంది. దీనివల్ల డేటా సేకరణ, చికిత్స ఏర్పాట్లు మెరుగ వుతాయి. పాముకాట్ల మరణాలను 2030 కల్లా సగానికి తగ్గించాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యానికి అనుగుణంగా ఈ నిర్ణయం జరిగింది.

– సుప్రియా సాహు, ఉన్నతాధికారి

ఇన్ బాక్స్

ప్రతిఘటనోద్యమ సిద్ధాంతకర్త

ప్రముఖ మార్క్సిస్టు – లెనినిస్టు నాయకుడు, ప్రతిఘటనోద్యమ సిద్ధాంతకర్త కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి అమరుడై నవంబర్ 9 నాటికి నలభై ఏళ్లు పూర్తి అవుతున్నాయి. ఆయన కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామంలో 1917 జనవరి 19న మధ్యతరగతి వ్యవసాయ రైతు కుటుంబంలో జన్మించారు. మార్క్సిజం–లెనినిజం–మావో ఆలోచనా విధానాన్ని భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి విప్లవ మార్గాన్ని రూపొందించిన నాయకులలో ఆయన ప్రముఖులు.

తెలంగాణ సాయుధ పోరాటం సాగుతున్న రోజుల్లో ఆ పోరాటానికి ప్రత్యక్ష నాయకత్వం వహించినటువంటి రాష్ట్ర నాయకత్వంలో పుల్లారెడ్డి ఒకరు. ఈ క్రమంలో 1949లో అరెస్టయ్యి 1952 వరకు జైల్లో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు విడుదలై 1952లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో నందికొట్కూరు నియోజకవర్గం నుండి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు.



చంద్ర పుల్లారెడ్డి

మద్రాసు శాసనసభలో రాయలసీమ ప్రజా సమస్యలపై ఆరు గంటల పాటు మాట్లాడి ముఖ్యమంత్రి రాజగోపాలాచారితో సహా అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ చీలికకు గురైనప్పుడు ఆయన సీపీఐ(ఎం) వైపు నిలిచారు. 1967లో సీపీఎం భాగస్వామిగా ఉన్న బెంగాల్ ప్రభుత్వం నక్సల్బరీ ఉద్యమకారులపై కాల్పులు జరపడాన్ని నిరసించారు. సీపీఐ(ఎం) కేంద్ర నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ చంద్ర పుల్లారెడ్డి, కొల్లా వెంకయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి పార్టీలో సిద్ధాంత చర్చను లేవనెత్తి ప్రత్యామ్నాయ డాక్యుమెంటును ప్రవేశపెట్టారు.

1962–1964 మధ్య జైల్లో మానికొండ సుబ్బారావుతో కలిసి 'ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం–దాని పరిణామాలు' అనే గొప్ప గ్రంథాన్ని రచించారు. చారు మజుందారు నాయకత్వం తీసుకున్నటువంటి అతివాద దుస్సాహసిక పంథా (వ్యక్తిగత హింసావాదం)ను తిప్పికొడుతూ 'ప్రతిఘటన' ఉద్యమ పంథాను రూపొందించారు. 1969 నుంచి అజ్ఞాతంవాసంలోనే ఉన్నారు. ఉద్యమ నిర్మాణంలో రైలులో ప్రయాణిస్తూ 1984 నవంబర్ 9వ తేదీన హఠాత్తుగా తీవ్రమైన గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. ప్రజల ఉద్యమ చరిత్రలో ధృవతార అయ్యారు.

– మన్నవ హరిప్రసాద్
పొలిట్ బ్యూరో సభ్యుడు, సీపీఐ (ఎమ్ఎల్) రెడ్ స్టార్
(నేడు కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి)

ఆ ప్రాజెక్టుకు పది లక్షల చెట్ల బలి!

విశ్లేషణ



పంకజ్ సేఖ్‌సరియా


అండమాన్, నికోబార్ దీవులలో 'అండమాన్, నికోబార్ ఐలాండ్స్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' (ఏఎన్ఐఐడీసీఓ) అనే పాక్షిక–ప్రభుత్వ ఏజెన్సీ ఉంది. 'ఈ ప్రాంత సమతుల్య పర్యావరణ అనుకూల అభివృద్ధి కోసం సహజ వనరులను వాణిజ్యపరంగా ఉపయోగించుకోవడానికీ, అభివృద్ధి చేయడానికీ' దీనిని కంపెనీల చట్టం కింద 1988లో స్థాపించారు. దాని ప్రధాన కార్యకలాపాలలో పెట్రోలియం ఉత్పత్తుల వర్తకంతో సహా, భారతదేశంలో తయారయ్యే విదేశీ మద్యం, పాలు, పర్యాటక రిసార్ట్‌ల నిర్వహణ; పర్యాటకం కోసం, మత్స్య సంపద కోసం మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటివీ ఉన్నాయి.

అంతవరకు పెద్దగా తెలియని ఈ సంస్థకు 2020 ఆగస్టులో రాత్రికి రాత్రే గ్రేట్ నికోబార్ ద్వీపంలో 72 వేల కోట్ల భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టును అమలు చేసే బాధ్యతను అప్పగించారు. ఇందులో భారీ ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్, పవర్ ప్లాంట్, విమానాశ్రయం, టౌన్‌షిప్ నిర్మాణంతో పాటు, 130 చదరపు కిలోమీటర్లకు పైగా అటవీ భూమిలో విస్తరించే టూరిజం ప్రాజెక్ట్ కూడా ఈ ప్రాజెక్టులో భాగమై ఉన్నాయి.

రెండు సంవత్సరాల తరువాత, ఏఎన్ఐఐడీసీఓ సంస్థ ఈ ప్రాజెక్ట్ కోసం పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంఓఈఎఫ్‌సీసీ) నుండి రెండు కీలకమైన అనుమతులను పొందింది. మొదటిది, అక్టోబర్ 2022లో చోటు చేసుకుంది. మంత్రిత్వ శాఖకు చెందిన ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీ (ఎఫ్ఏసీ) అటవీ భూమిని ఇతర అవసరాలకోసం మళ్లించేందుకు అనుమతించింది. అత్యంత సహజమైన, జీవవైవిధ్యం కలిగిన ఉష్ణమండల అడవులలో 130 చదరపు కి.మీ. (ముంబైలోని సంజయ్ గాంధీ నేషనల్ పార్క్ కంటే పెద్దది) విస్తీర్ణం కల భూమి మళ్లింపుపై ఈ కమిటీ సంతకం చేసింది. దాదాపు ఒక నెల తర్వాత, నిపుణుల అంచనాల కమిటీ (ఈఏసీ) కీలకమైన పర్యావరణ అనుమతిని మంజూరు చేసింది.

ఈ ఒక్క ప్రాజెక్ట్ కోసం దాదాపు పది లక్షల చెట్లను నరికివేయనున్నారన్న విషయంపై తీవ్రమైన ఆందోళనలు తలెత్తాయి. ప్రభుత్వం పార్లమెంటులో చేసిన ప్రకటనలో ప్రాజెక్ట్ డాక్యుమెంట్‌లలో దాదాపు 8.5 లక్షల నుండి 9.64 లక్షల వరకు చెట్లు నరికివేయడంపై ప్రాథమిక అంచనాలు మారాయి. వాతావరణ సంక్షోభం వేగవంతమైన ఈ యుగంలో బలి ఇవ్వాల్సిన చెట్ల సంఖ్యను చూసి చాలా మంది నివ్వెరపోయారు. ఒక జాతీయ పత్రికలో నివేదించినట్లుగా, నిజానికి మనం కనీసం 30 లక్షల చెట్లను కోల్పోవలసి ఉంటుంది. ఇది చాలా చాలా ఎక్కువ అనే చెప్పాలి.

ఇది వాస్తవమైతే అందుబాటులో ఉన్న డేటాను బట్టి కొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి. ప్రాజెక్ట్, అటవీ భూమి మళ్లింపు కోసం అనుమతి కోరినప్పుడు, ఈ ప్రాజెక్ట్ ప్రతిపాదకుడు మంత్రిత్వ శాఖకు ఏ సమాచారాన్ని అందించారు? ద్వీపంలో రూ. 72 వేల కోట్ల పెట్టుబడి పెట్టాలని ఈ ఏజెన్సీని కోరినప్పుడు, నరికివేయాల్సిన చెట్ల సంఖ్య ఎవరికీ తెలియదా? పాలు, ఆల్కహాల్, పెట్రోలియం అమ్మకంలో ప్రధాన వ్యాపార అనుభవం ఉన్న సంస్థను ఈ వ్యవహారంలో ఎవరైనా క్షమించవచ్చు. కానీ మంత్రిత్వ శాఖలోని శాస్త్రీయ, పర్యావరణ సంస్థల మాట ఏమిటి? పైగా పర్యావరణం, అటవీ అనుమతుల మాట ఏంటి?



అన్ని వనరులూ, అధికారం తమ వద్దే ఉన్నందున, ఈఏసీ, ఎఫ్ఏసీ సరైన ప్రశ్నలను ఎందుకు అడగలేదు? ప్రాజెక్ట్‌కు పర్యావరణ అనుమతిని మంజూరు చేసేటప్పుడు ఈఏసీ స్థానం కేసి అంతర్ దృష్టితో చూస్తే శాస్త్రీయ సామర్థ్యం, భాషలో నైపుణ్యం అనేవి ఈఏసీ నిర్దేశించిన ప్రమాణాల్లోనే కనిపిస్తాయి. ఇక్కడ రెండు ఉదాహరణలు ఉన్నాయి: 'ఏ చెట్లూ ఒకేసారి నరికివేయబడవు. వార్షిక ప్రాతిపదికన పని పురోగతిని బట్టి దశలవారీగా ఈ పని జరుగుతుంది. అసాధారణంగా పొడవుగానూ, వయస్సులో పెద్దగా ఉన్న అన్ని చెట్లను వీలైనంత వరకు రక్షించాలి.' 'అసాధారణంగా పొడవైన చెట్టు' అంటే ఏమిటి అని ఎవరైనా అడిగితే? చెట్టు పాతదిగా పరిగణించబడటానికి సరైన వయస్సును ఎలా నిర్ణయిస్తారు? ప్రారంభించడానికి, మీరు చెట్టు వయస్సును ఎలా అంచనా వేస్తారు? అలాగే 'సాధ్యమైనంత వరకు' వాటిని రక్షించడం అంటే అర్థం ఏమిటి? రెండవ ఉదాహరణ మరింత మెరుగైనది– 'స్థానిక గుడ్లగూబల గూడు రంధ్రాలు ఉన్న చెట్లను ఎస్ఏసీఓఎన్ (సలీం అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ అండ్ నేచర్) సహాయంతో గుర్తించి జియో–ట్యాగ్ చేయాలి. అటువంటి చెట్లను వీలైనంత వరకు రక్షించాలి.'

పక్షి ప్రవర్తన, రాత్రిపూట దాని అలవాట్లను పరిగణనలోకి తీసుకుని, గుడ్లగూబను (ఏదైనా గుడ్లగూబ) చూడటం ఎంత కష్టమో తెలియనిది కాదు. నిజానికి, నికోబార్ వర్షాటవిలోని చెట్లు ఆకాశంలోకి 100 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు పెరుగుతాయి. ఒక్కో చెట్టుకు కేవలం ఐదు నిమిషాలు కేటాయించినట్లయితే, ఒక మిలియన్ చెట్లకు గూడు రంధ్రాలు వెతకడానికి మొత్తం 83,000 గంటల సమయం పడుతుంది. మన ఉత్తమ పక్షి వీక్షకులలో 10 మంది ఏకకాలంలో రోజుకు 8 గంటలు సర్వే చేసినా, అది పూర్తి కావడానికి దాదాపు ఆరేళ్లు పడుతుంది.

ఇప్పుడు ఈ ఆమోదిత షరతును మళ్లీ చదవండి. మీరు దీని గురించి ఏ భావాన్ని పొందగలరో చూడండి. ఈ చెట్లను లెక్కించడానికి, కత్తిరించడానికి, రవాణా చేయడానికి ఇప్పటికే ఏఎన్ఐఐడీసీఓ కాంట్రాక్టర్‌లను ఆహ్వానించింది. గొడ్డళ్లు చెట్లను నేలకూల్చుతుంటే వాటిని రక్షించడం మాని... భూమికి వంద అడుగుల ఎత్తులో ఉన్న గుడ్లగూబల గూడు రంధ్రాల కోసం మన ఎస్ఏసీఓఎన్ మిత్రులు వెతుకుతూ ఉండరని ఆశిద్దాం.

వ్యాసకర్త ఐఐటీ బాంబే అసోసియేట్ ప్రొఫెసర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

శరీర ధర్మం

మానవ ధర్మంగా తగినంత ప్రయత్నం చేయకుండా, ఫలాన్ని గురించి ఆలోచించడం వివేకంతో కూడుకున్న పని కాదు. మానకుండా మానవ ప్రయత్నం కొనసాగిస్తూ ఉంటే, ఆ ప్రయత్నానికి సరైన సమయంలో దైవం అందించే సహకారం తోడవుతుంది. 'దేవుడిస్తాడులే!' అనుకుంటూ ఏరోజు కారోజు, ఏవిధమైన ప్రయత్నమూ చేయకుండా, ఇంట్లో కూర్చుంటే ఎవరికైనా సంపద ఎలా చేకూరుతుంది? పళ్ళెంలో వడ్డించివున్న పంచభక్ష్య పరమాణ్ణాలు, ఎవరికైనా గాని తింటేనే కదా కడుపులోకి వెళ్ళేది! తినే ప్రయత్నం కూడా చేయకపోతే కడుపెలా నిండుతుంది? ఆకలెలా తీరుతుంది? అందువల్ల సారాంశంగా తేలేది ఏమిటంటే మనిషి కోరకుండా దేవుడు ఇవ్వడం కూడా సంభవం కాదు. ఆకలితో ఉన్న బిడ్డడు, ఆ విషయాన్ని తల్లికి చెప్పి అడగనిదే అమ్మయినా పెట్టలేదు. ఇంట్లో అన్ని రకాల దినుసులు పుష్కలంగా ముందు నుండీ ఉంటాయి. కాని, వండి వార్చకుండా భోజనానికి వీలయ్యే పదార్థాలుగా అవి మార్పు చెందవు కదా! ఈ విషయాన్నే గట్టుప్రభువు తన 'కుచేలోపాఖ్యానం' కావ్యం, ప్రథమాశ్వాసంలోని ఈ కింది పద్యం ద్వారా చెప్పాడు.



కం. కావున మనుజుడు సేయక
దేవుండీయంగ లేడు తెగి యేమియు నా
నావిధ ధాన్యము లుండిన
వావిరి వండకయె రిత్త వంటక మగునే.

శ్రమించడం శరీర ధర్మం అని చెప్పడం పై పద్యంలోని మాటల ముఖ్యోద్దేశం. ఆ శరీర ధర్మాన్ని పాటించే వ్యక్తికే దైవ సహాయమైనా, అంతకంటే ముందు ఆ కష్టాన్ని ప్రత్యక్షంగా తన కళ్ళతో చూసి స్పందించే తోటి మనిషి సహాయమైనా అందుతుంది తప్ప ఆ ఉత్తమ ధర్మాన్ని పాటించని వ్యక్తులకు కాదని తెలుసుకోవాలి.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.అష్టమి సా.6.25 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** శ్రవణం ఉ.8.42 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** ప.12.33 నుండి 2.05 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.52 నుండి 7.38 వరకు, **అమృతఘడియలు:** రా.9.46 నుండి 11.20 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.05, **సూర్యాస్తమయం:** 5.23.

గల్ఫ్ కార్మికులకు 'రేషన్' కష్టాలు



ఉపాధి కోసం వెళ్తే రేషన్ కార్డుల నుంచి పేర్లు తొలగింపు

అనారోగ్యంతో తిరిగొస్తే ఆరోగ్యశ్రీ సేవలకు అనర్హత

అధికారుల తప్పిదాలతో కార్మికుల కుటుంబాల అవస్థలు

మోర్తాడ్ (బాల్కొండ): ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకొని గల్ఫ్‌కు వెళ్తున్న కార్మికులు అక్కడ నానా కష్టాలు పడి తిరిగొస్తే.. పుట్టిపెరిగిన ఊరిలోనూ అన్యాయమే జరుగుతున్నది. కొన్నేళ్లపాటు కార్మికులు గల్ఫ్‌లోనే ఉంటుండటంతో స్వగ్రామాల్లో రేషన్ కార్డుల నుండి వారి పేర్లను తొలగిస్తున్నారు. దీంతో ఏదైనా అనారోగ్యం పాలైతే ఆరోగ్య శ్రీ సేవలు కూడా పొందలేని దయనీయ స్థితిలోకి కార్మికులు వెళ్లిపోతున్నారు. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం నాగంపేట్‌కు చెందిన బదనపల్లి సాయన్న ఉపాధి కోసం ఖతర్ వెళ్లాడు. అతను అనారోగ్యానికి గురై అచేతన స్థితిలో ఉండగా వారం రోజుల క్రితం హైదరాబాద్‌కు తరలించారు. సాయన్న పేరును రేషన్‌కార్డు నుంచి తొలగించడంతో ఆరోగ్య శ్రీ పథకం కింద వైద్యం అందించడానికి ఆస్పత్రుల నిర్వాహకులు తిరస్కరించారు. సాయన్న పని చేస్తేనే అతని కుటుంబానికి తిండి. అలాంటిది కుటుంబ పెద్దనే ఆస్పత్రి పాలు కావడంతో అతని వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఖర్చు చేసే పరిస్థితిలో లేరు. సాయన్నపై ఆధారపడిన అతని భార్య ప్రేమలత, కొడుకులు వికాస్, వినీత్‌లు తెలంగాణ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డిని ఆశ్రయించటంతో ఆయన కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సాయన్న సమస్యను తీసుకువెళ్లగా నిమ్స్‌లో ప్రభుత్వ ఖర్చులతో మెరుగైన వైద్యం అందించడానికి ఏర్పాట్లు చేశారు. సాయన్న పేరు రేషన్ కార్డులో ఉండి ఉంటే ఆరోగ్య శ్రీ పథకం కింద ఎలాంటి సిఫార్సులు లేకుండానే వైద్యం అందేది.

లక్షల మందిది ఇదే సమస్య

రేషన్‌కార్డులో పేర్లు తొలగించటం ఒక్క సాయన్నకు ఎదురైన సమస్యనే కాదు. ఉపాధి కోసం గల్ఫ్‌తోపాటు ఇతర దేశాలకు వలస వెళ్లిన లక్షల మంది కార్మికుల పేర్లను రేషన్ కార్డుల నుంచి తొలగిస్తున్నట్లు సమాచారం. దీంతో వారంతాఅనేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికం కావడంతో వలస కార్మికులు తమ పేర్లు కూడా కార్డుల్లో ఉండాలని కోరుకుంటున్నారు. ఉపాధి కోసం వలస వెళ్లిన తమ పేర్లను రేషన్ కార్డులు, ఓటర్ల జాబితాల నుంచి తొలగించవద్దని కొన్నేళ్లుగా కోరుతూనే ఉన్నారు. ప్రభుత్వం మాత్రం వారి విన్నపాలను పరిగణనలోకి తీసుకోకుండా రేషన్ కార్డుల నుంచి పేర్లు తొలగిస్తూనే ఉంది. ఇటీవల ఓటర్ల జాబితా సవరణలో సైతం వలస కార్మికుల పేర్లు తొలగించారు. రాష్ట్రంనుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన కార్మికుల సంఖ్య 15 లక్షలు ఉంటుందని అంచనా. ఇందులో మెజార్టీ సంఖ్యలో రేషన్ కార్డులు, ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగించబడ్డాయి. సమగ్ర సర్వే జరుపుతున్న నేపథ్యంలో వలస కార్మికులను గుర్తించి వారి పేర్లు రేషన్ కార్డులు, ఓటర్ల జాబితాల్లో నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

గత ప్రభుత్వం అన్యాయం చేసింది..



గత బీఆర్ఎస్ ప్రభుత్వం వలస కార్మికుల విషయంలో నిర్లక్ష్యం చేసింది. రేషన్ కోటాను తగ్గించడం కోసం వలస వెళ్లిన వారి పేర్లు తొలగించారు. రేషన్ కార్డుల నుంచి పేర్లు తొలగించడంతో ఆరోగ్య శ్రీ వర్తించకుండా పోయింది. వలస కార్మికులు పంపే విదేశీ మారక ద్రవ్యం అవసరం కానీ వారి సంక్షేమం పట్ల శ్రద్ధ లేకపోయింది. గత ప్రభుత్వం ఎంతో అన్యాయం చేసింది. ఈ ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టాలి.

– గుగ్గిల్ల రవిగౌడ్, గల్ఫ్ జేఏసీ చైర్మన్

● మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపురంలో వెలసిన శ్రీకురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన ఉద్దాలోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. వడ్డెమాన్‌లోని ఉద్దాల మండపంలో ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపుగా కురుమూర్తిగుట్టకు తరలించారు.

కృష్ణా డెల్టాలో 95 శాతం బేసిన్ బయటే వినియోగం

తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది అడిగిన ప్రశ్నకు ఏపీ ప్రభుత్వ తరఫు సాక్షి ఏకే గోయల్ అంగీకారం

- కేడబ్ల్యూడీటీ–1, కేడబ్ల్యూడీటీ–2 కేటాయింపుల ఆధారంగానే ప్రాజెక్టుల ఆపరేషన్ ప్రొటోకాల్స్ రూపొందించామని స్పష్టీకరణ
- విచారణను డిసెంబర్ 5, 6 తేదీలకు వాయిదా వేసిన ట్రిబ్యునల్

సాక్షి, హైదరాబాద్: కృష్ణాడెల్టా కింద వినియోగిస్తున్న జలాల్లో 95 శాతం కృష్ణానది పరీవాహక ప్రాంతం వెలుపలే వినియోగిస్తున్నారని ఏపీ ప్రభుత్వ తరఫు సాక్షి సీడబ్ల్యూసీ మాజీ డైరెక్టర్ (హైడ్రాలజీ) ఏకే.గోయల్ అంగీకరించారు. ఢిల్లీలో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా జలవివాదాల ట్రిబ్యునల్(కేడబ్ల్యూడీటీ)–2లో మూడో రోజు శుక్రవారం నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఆయన పాల్గొని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది వి.రవీందర్‌రావు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కృష్ణా డెల్టా పరిధిలో విస్తరించిన 13.08 లక్షల ఎకరాల ఆయకట్టు కృష్ణా బేసిన్ లోపలే ఉందని ఇన్నాళ్లూ ఏపీ ప్రభుత్వం స్పష్టం చేస్తుండగా..ఇప్పుడు ఏపీ ప్రభుత్వ సాక్షి దానికి భిన్నంగా చెప్పడం గమనార్హం. కేడబ్ల్యూడీటీ–1 75 శాతం ఆధారంగా చేసిన కేటాయింపులు, కేడబ్ల్యూడీటీ–2 మిగులు జలాల్లో చేసిన కేటాయింపుల ఆధారంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల ఆపరేషన్ ప్రొటోకాల్స్ రూపొందించామని ఏకే. గోయల్ పునరుద్ఘాటించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లపై ఆధారపడిన రెండు రాష్ట్రాల ప్రాజెక్టులకు 520.7 టీఎంసీలు అవసరమని, ఇందులో ఏపీకి 385.53, తెలంగాణకు 134. 87 టీఎంసీలు అవసరమని వివరించారు. 75 శాతం లభ్యత ఆధారంగా జూరాల ప్రాజెక్టులో తెలంగాణ వినియో గాన్ని 37.84 టీఎంసీలకు నియంత్రించగలిగితేనే దిగువన ప్రాజెక్టుల హక్కులను పరిరక్షించవచ్చునని తేల్చిచెప్పారు. జూరాల నుంచి 342 టీఎంసీలు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరాక.. మిగులు జలాలను నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా వాడుకోవాలని స్పష్టం చేశారు. శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాలతోపాటు తుంగభద్ర నుంచి కూడా జలాలు వస్తాయి కదా అలాంటప్పుడు కేసీ కెనాల్ కింద ఆ కెనాల్‌ను ఆధునీకరించిన నేపథ్యంలో వినియోగాన్ని 31.90 టీఎంసీలకు పరిమితం చేయాలి కదా అని తెలంగాణ న్యాయవాది అడిగిన ప్రశ్నకు.. అవునని ఏకే గోయల్ సమాధానం చెప్పారు. 1972–73 నుంచి 2007–08 మధ్య కేసీ కెనాల్ కింద సగటున 54.33 టీఎంసీలు వినియోగించారు కదా అని తెలంగాణ న్యాయవాది అడిగిన ప్రశ్నను ఏకే గోయల్ కొట్టిపారేశారు. కృష్ణా బేసిన్ పెద్దదని.. అందులో చిన్న భాగమైన తుంగభద్ర సబ్ బేసిన్‌లో ఒక ఏడాది మిగులు ఉంటే మరో ఏడాది కొరత ఉంటుందని.. దానిని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. గుంటూరు చానల్, వైకుంఠపురం ఎత్తిపోతలకు ఎగువ నుంచి వచ్చే జలాల ఆధారమని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణను వాయిదా వేశారు. డిసెంబరు 5, 6 తేదీల్లో మళ్లీ విచారణ చేపడతామని వెల్లడించారు. విభజన చట్టంలో సెక్షన్–89, కేంద్రం జారీ చేసిన అదనపు మార్గదర్శకాల ప్రకారం మెమోలు, అప్లికేషన్‌లు దాఖలు చేయాలని ఆదేశించారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపును ఆపండి

- శ్రీశైలంలో జలవిద్యుత్ ఉత్పాదన నిలిపివేయండి
- ఏపీని కోరిన తెలంగాణ నీటిపారుదల శాఖ

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం జలాశయంలో నిల్వలు తగ్గిపోతున్న నేపథ్యంలో పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపును నిలిపివేయాలని ఏపీని తెలంగాణ నీటిపారుదల శాఖ కోరింది. ఏపీ జెన్‌కోకు సంబంధించిన కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రంతో పాటు తెలంగాణ జెన్‌కోకు చెందిన ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆపేయాలని కోరింది. శ్రీశైలం రిజర్వాయర్‌కు గత కొద్దిరోజులుగా ఎగువ నుంచి వరద పూర్తిగా తగ్గిపోయింది. శ్రీశైలం పూర్తిస్థాయి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా... ప్రస్తుతం 180.29 టీఎంసీల నిల్వ మాత్రమే ఉంది. పోతిరెడ్డిపాడు నుంచి 20 వేల క్యూసెక్కుల దాకా నీటిని ఏపీ తరలిస్తుండగా... రెండు వైపులా జలవిద్యుత్ కేంద్రాల్లో ఇబ్బడిముబ్బడిగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ దిగువకు నీటిని వదిలేస్తున్నారు. ఇక సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీలు కూడా నిండుగా ఉండటంతో వచ్చిన వరద వచ్చినట్టే దిగువకు వదిలేయాల్సిన పరిస్థితి. దీంతో శ్రీశైలంలో వేగంగా నిల్వలు తగ్గుతుండటంతో ఇప్పటికే కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కూడా స్పందించింది. అవసరం లేకుంటే పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపును అడ్డుకోవాలని, శ్రీశైలం, సాగర్‌లో జలవిద్యుత్ ఉత్పాదనను నిలిపివేయాలని కోరింది. ఈ నేపథ్యంలో తెలంగాణ నీటిపారుదల శాఖ కూడా స్పందించింది. తాగు, సాగునీటి అవసరాల కోసం శ్రీశైలంలో నిల్వలను కాపాడుకోవాల్సిన అవసరముందని గుర్తు చేస్తూ తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ జి.అనిల్ కుమార్ శుక్రవారం తెలంగాణ జెన్‌కోతో పాటు ఏపీ జలవనరుల శాఖ, ఏపీ జెన్‌కోలకు లేఖ రాశారు. తక్షణమే పోతిరెడ్డిపాడు నుంచి నీటి తరలింపుతో పాటు జలవిద్యుత్ ఉత్పాదనను నిలిపివేయాలని కోరారు. మరోవైపు ఈ వాటర్ ఇయర్(గత జూన్ 1వ తేదీ నుంచి) 180 టీఎంసీల దాకా నీటిని పోతిరెడ్డిపాడు నుంచి తరలించినట్టు తెలంగాణ గుర్తు చేసింది.

ప్రాణం మీదికి తెచ్చిన వైద్యుల నిర్లక్ష్యం

- వారం వ్యవధిలో మహిళకు మూడు ఆపరేషన్లు
- ప్రభుత్వ వైద్య బృందం విచారణ



గోడు వెళ్లబోసుకుంటున్న ఆమని కుటుంబ సభ్యులు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జన్మభూమినగర్‌లో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం మహిళ ప్రాణం మీదికి తెచ్చింది. 24 రోజులపాటు వైద్యం అందించి ప్రాణాపాయ స్థితికి చేరిన తర్వాత, బిల్లు చెల్లించి మరో ఆస్పత్రికి తీసుకెళ్లాలని చేతులెత్తేశారు. బాధితుల కథనం ప్రకారం.. బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఆమని (42) కడుపునొప్పితో గత నెల 15న ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. ఆమెకు శస్త్రచికిత్స చేసి కడుపులో ఉన్న గడ్డ తొలగించాలని, దీనికి రూ.లక్ష ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఆమె భర్త రూ.25 వేలు చెల్లించడంతో 17న ఆపరేషన్ చేశారు. పేగులకు రంధ్రాలు పడ్డాయని 19న మరోసారి శస్త్రచికిత్స చేశారు. 4 రోజుల తర్వాత పేగులకు ఇన్‌ఫెక్షన్ వచ్చిందని మళ్లీ ఆపరేషన్ చేశారు. వారం రోజుల వ్యవధిలో మూడు ఆపరేషన్లతో ప్రాణాలమీదికి తెచ్చారు. ప్రస్తుతం ఆమని రెండు కిడ్నీలు పాడయ్యాయని, డయాలసిస్ చేయించాలని, గుండె బలహీనంగా ఉందని చెప్పారు. కాగా, ఇప్పటివరకు మందులు, ఆస్పత్రి బిల్లు కింద రూ.4 లక్షలు చెల్లించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. మరో రూ.5 లక్షలు చెల్లించి వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని ఈ నెల 7న ఆస్పత్రి యాజమాన్యం బెదిరించినట్లు తెలిపారు. దీంతో శుక్రవారం జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆయన ముగ్గురు సీనియర్ ప్రభుత్వ వైద్యుల బృందాన్ని ప్రైవేట్ ఆస్పత్రికి పంపించి విచారణ చేపట్టారు.

విచారణలపై ప్రత్యక్ష ప్రసారం వద్దు

- హైకోర్టు రిజిస్ట్రార్ (ఐటీ) ఆదేశం



సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో జరిగే కేసుల విచారణను మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేయవద్దని రిజిస్ట్రార్ (ఐటీ) ఆదేశించారు. ఇలాంటి వీడియోల ప్రసారం, సోషల్ మీడియాలో పోస్టు చేయడం చట్టవిరుద్ధమని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. న్యాయస్థానాల్లో జరిగే విచారణను ప్రత్యక్ష ప్రసారం చేయడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. వాటి నిలిపివేతకు చర్యలు చేపట్టాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆదేశించారని తెలిపారు. ఇకపై ఇలాంటి ప్రసారాలు, పోస్టులపై లైవ్ స్ట్రీమింగ్ నిబంధనల మేరకు కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటివరకు ఎవరైనా విచారణ వీడియోలను పోస్టు చేసిఉంటే వెంటనే తొలగించాలని సూచించారు. ప్రత్యక్ష ప్రసారాల నిబంధనలను ప్రతి ఒక్కరు విధిగా పాటించాలని, లేదంటే చట్టపరమైన పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుందని హైకోర్టు రిజిస్ట్రార్ హెచ్చరించారు.

శనగ విత్తనాలకు నాడు 33 శాతం.. నేడు 3.3 శాతం సబ్సిడీ


- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నిర్ణయంపై విమర్శల వెల్లువ
- క్వింటాల్ ధర రూ. 9 వేలు.. రాయితీ రూ.300 మాత్రమే
- నేటి నుంచే అమలు చేయాలని సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఒకప్పుడు రైతులకు విక్రయించే శనగ విత్తనాలకు 33 శాతం సబ్సిడీ ఇచ్చే విత్తనాభివృద్ధి సంస్థ.. ఇప్పుడు కేవలం 3.3 శాతమే సబ్సిడీ ప్రకటించింది. అత్యంత తక్కువ సబ్సిడీ ప్రకటించడంపై రైతు సంఘాల నేతలు మండిపడుతున్నారు. శనగ విత్తనాల ధర మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.9 వేలు ఉంటే.. రూ.300 రాయితీ ఇస్తామని... రైతులు రూ.8,700 చెల్లించి తీసుకోవాలని స్వయానా విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, ఆ సంస్థ ఎండీ ఉదయ్‌కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సబ్సిడీ శనివారం నుంచే అమలుల్లోకి వస్తుందని ఆ ప్రకటనలో వారు పేర్కొన్నారు. కేవలం 3.3 శాతం మాత్రమే సబ్సిడీ ఇచ్చి ఇదేదో రైతులకు పెద్దగా మేలు చేసేలా ఉందంటూ చెప్పడం విడ్డూరమని రైతు సంఘాల నేతలు అంటున్నారు. కరోనాకు ముందు అంటే 2020 వరకు శనగ విత్తనాలకు 33 శాతం సబ్సిడీ ఇచ్చేవారు. ఆ తర్వాత దానిని ఎత్తేసిన ప్రభుత్వం.. ఇప్పుడు రైతులను అవమానపరిచేలా 3.3 శాతమే సబ్సిడీ ఇవ్వడంపై ఆరోపణలు వస్తున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో రైతులకు కావాల్సిన జేజీ 11, జాకి రకాల శనగ విత్తనాలను 20 వేల క్వింటాళ్ల వరకు అందుబాటులో ఉంచారు. ఇదిలాఉండగా, ఈ రబీలో రైతులకు కావాల్సిన వరి విత్తనాల్లో కేఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048, జేజీఎల్ 27356, ఎంటీయూ 1010, కేఎన్ఎం 118, జేజీఎల్ 24423 రకాలను 50 వేల క్వింటాళ్లు సకాలంలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా గ్రామాలకు చేర్చాలని వారు ఆ ప్రకటనలో అధికారులను ఆదేశించారు. ఈ సీజన్‌లో 3 లక్షల ఎకరాలకు పైగా తెలంగాణ సీడ్స్ విత్తనాలు ఇవ్వాలని, వచ్చే వానాకాలం సీజన్‌కు 15 లక్షల ఎకరాలకు విత్తనాలు అందించే విధంగా పని చేయాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఆదేశించారు. విత్తనోత్పత్తిలో రైతులను భాగస్వాములను చేస్తూ, సహకార సంఘాల ద్వారా అధిక విత్తనోత్పత్తి చేసే విధంగా ప్రణాళిక రూపొందించాలన్నారు.

క్లుప్తంగా...

జర్నలిస్టుల్లో విశ్వాసం పెంపొందించేందుకు కమిటీలు కృషి చేయాలి

- మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల కమిటీలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ యూనియన్ పట్ల జర్నలిస్టుల్లో విశ్వాసం పెంపొందించేందుకు కృషి చేయాలని మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్‌లోని టీయూడబ్ల్యూజే కార్యాలయంలో జర్నలిస్టుల సబ్ కమిటీ బాధ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఆరోగ్య పథకం రూపకల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ఆ పథకం ప్రవేశపెట్టేంత వరకు నిమ్స్ ఆస్పత్రిలో జర్నలిస్టులు ఆరోగ్య సేవలు పొందాలన్నారు. ఏ సొసైటీల్లో లేకుండా, ఇళ్ల స్థలాలకు నోచుకోని జర్నలిస్టుల సమగ్ర సమాచారం సేకరించేందుకు హౌసింగ్ కమిటీ కృషి చేయాలన్నారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జర్నలిస్టులకు ఇంటి స్థలాలు అందించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని స్పష్టం చేశారు. వృత్తిలో మహిళలు అనుభవిస్తున్న ప్రత్యేక సమస్యలను వెలికి తీసేందుకు మహిళా కమిటీ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.రాంనారా యణ, ఐజేయూ కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డి, ఆరోగ్య కమిటీ సలహాదారు డాక్టర్ ధనుంజయ, కన్వీనర్ ఏ.రాజేష్, హౌసింగ్ కమిటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, మహిళా కమిటీ కన్వీనర్ పి.స్వరూప, గ్రామీణ విలే కరుల కమిటీ కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్ లతోపాటు ఆయా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే జ్యోతక్క మృతి

- ఆదివారం అంత్యక్రియలు



కోరుట్ల/మెట్‌పల్లి: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క (70) అనారోగ్యంతో మృతి చెందారు. గుండె సంబంధిత వ్యాధి తో బాధపడు తున్న ఆమెను కొద్ది రోజుల క్రితం బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. కరీంనగర్ సమీపంలోని శనిగరంకు చెందిన జ్యోతక్కకు మెట్‌పల్లికి చెందిన మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి రాములుతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. భర్త ప్రోత్సాహంతో న్యాయవాద విద్యను అభ్యసించిన ఆమె.. రాజకీయాల్లోకి వచ్చి మొదటిసారి 1995 స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీటీసీగా పోటీ చేసి విజయం సాధించారు. 1998లో మెట్ పల్లి నియోజకవర్గ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఏడాది కాలమే ఎమ్మెల్యేగా కొనసాగారు. శాసనసభకు ఎన్నికైన భార్యాభర్తలుగా రాములు– జ్యోతక్కకు గుర్తింపు ఉంది. జ్యోతక్క భౌతిక కాయానికి అంత్యక్రియలు ఆదివారం మెట్ పల్లిలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం

ములుగు: ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం వాగొడ్డుగూడెం గ్రామ సమీపంలో శుక్రవారం జిల్లా పోలీసులు, బీడీ టీం బృందాలు మావోయిస్టుల డంప్‌ను స్వాధీనం చేసుకున్నాయి. ఎస్పీ డాక్టర్ శబరీశ్ తన కార్యాలయంలో ఈ వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు డంప్ ఉన్నట్లు తెలిసిన ప్రదేశంలో.. బీడీ టీంతో కలిసి ఉదయం 11 గంటలకు సోదాలు చేయగా ఆయుధాల డంప్ బయటపడిందన్నారు. వీటిలో 7.62 ఎంఎం ఎస్ఎల్ఆర్, 7.62 ఎంఎం బెల్జియం మోడల్, 30-06 ఎంఎం స్ప్రింగ్ ఫీల్డ్, 7.62 ఎంఎం లైవ్ రౌండ్స్ 108, 30-06 ఎంఎం లైవ్ రౌండ్స్-30, 8 ఎంఎం లైవ్ రౌండ్స్-25, 12 బోర్ క్యాట్రిడ్జ్-02, ఎస్ఎల్ఆర్ మ్యాగజిన్ -02, 3 తుపాకులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

బాధ పెట్టి ఉంటే క్షమించండి

రేపటి నుంచి నేను ఇలా న్యాయం చేయలేను: సీజేఐ చంద్రచూడ్ భావోద్వేగం

- ఘనంగా వీడ్కోలు పలికిన సుప్రీంకోర్టు
- దేశానికి సేవ చేసే అవకాశం రావడం గర్వకారణం
- నా జీవితం తెరిచిన పుస్తకం.. విమర్శలను వినమ్రంగా స్వీకరించా
- సోషల్ మీడియా ట్రోలర్స్ ఇక నిరుద్యోగులైనట్లే..



వీడ్కోలు కార్యక్రమంలో కాబోయే సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నాతో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నవ్వులు



సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కపిల్ సిబల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధనుంజయ యశ్వంత్ చంద్రచూడ్ పదవీ కాలం ముగిసింది. శుక్రవారమే చివరిరోజు. ఆనవాయితీ ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన హాల్‌లో నలుగురు సభ్యులతో కూడిన సెర్మోనియల్ బెంచ్ ఆయనకు వీడ్కోలు పలికింది. జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు కాబోయే సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ఈ బెంచ్‌లో ఉన్నారు. తన వీడ్కోలు కార్యక్రమంలో జస్టిస్ చంద్రచూడ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కన్నీరు పెట్టుకున్నారు. కొద్దిసేపు అందరినీ నవ్వించారు. జైన పదం 'మిచ్చా మి దుఃఖదాం' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ''రేపటి నుంచి నేను ఇలా న్యాయం చేయలేను, కోర్టులో ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి'' అని కోరారు. ఇతరులను నొప్పించాలన్న ఉద్దేశం తనకు ఏనాడూ లేదన్నారు. న్యాయవాద వృత్తితో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ప్రస్తావించారు. రూపురేఖలను బట్టి తనను చాలామంది యువకుడిగానే భావించేవారని చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పుడు కొందరు తన వద్దకు వచ్చి 'మీ వయసు ఎంత' అని అడిగారని గుర్తుచేశారు. న్యాయవాద వృత్తి తనకు ఎన్నో గొప్ప విషయాలు నేర్పించిందని అన్నారు. యువ లాయర్‌గా కోర్టుల్లో ఎన్నో వాదనలు విన్నానని, న్యాయవాదుల్లో నైపుణ్యాలు గమనించానని, విలువైన కోర్టు రూమ్ టెక్నిక్‌లు నేర్చుకున్నానని తెలిపారు. కోర్టుల్లో పనిచేసే మనమంతా వచ్చి వెళ్లిపోయే యాత్రికులమేనని ఉద్ఘాటించారు. సుప్రీంకోర్టులో ఎంతోమంది గొప్ప న్యాయమూర్తులుగా రాణించారని, వారసత్వాన్ని మరొకరికి అప్పగించి వెళ్లారని పేర్కొన్నారు. తాను వెళ్లిపోయినా పెద్ద తేడా ఏమీ ఉండదని, తన తర్వాత మరొకరు ఈ పదవిలోకి వస్తారని చెప్పారు. సమర్థుడైన జస్టిస్ సంజీవ్ ఖన్నా నూతన సీజేఐగా బాధ్యతలు చేపట్టబోతున్నారని, సుప్రీంకోర్టు ప్రతిష్టను ఆయన మరింత ఇనుమడింపజేస్తారన్న విశ్వాసం తనకు ఉందని వివరించారు. న్యాయమూర్తి అనే పదవి తనను ఇన్నాళ్లూ ఉత్సాహంగా ముందుకు నడిపించిందని పేర్కొన్నారు. చట్టం, న్యాయం, జీవితం గురించి సుప్రీంకోర్టులోని ప్రతి ఒక్కరూ తనకు ఎన్నో విషయాలు నేర్పించారని, వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. సీజేఐగా తాను విచారించిన 45 కేసులు సైతం తనకు జీవితం గురించి ఎన్నో కొత్త సంగతులు నేర్పించాయని చెప్పారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా మాట్లాడుతూ.. అణగారిన యువత, నిరుపేదల బాగు కోసం జస్టిస్ చంద్రచూడ్ ఎంతగానో శ్రమించారని ప్రశంసించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నో కేసుల్లో విజయం సాధించిందని, కొన్ని ఓడిపోయిందని, తమ అభిప్రాయాలను జస్టిస్ చంద్రచూడ్ ఓపిగ్గా విన్నారన్న సంతృప్తి తమకు ఉందని చెప్పారు. అనంతరం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ చంద్రచూడ్‌ను న్యాయమూర్తులు, న్యాయవాదులు, అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగులు సత్కరించారు. ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆయన ఏం చెప్పారంటే...

అంతకంటే గొప్ప అనుభూతి ఉండదు

''అవసరాల్లో ఉన్న ప్రజలకు సేవ చేయగల శక్తి కలిగి ఉండడం కంటే గొప్ప అనుభూతి మరొకటి ఉండదు. మనకు తెలియని, మనం ఎప్పుడూ కలవని వ్యక్తులకు సేవ చేయడం, వారి జీవితాలను ప్రభావితం చేయడం అదృష్టమే. వృత్తిలో విజయాలు సాధించడంతోపాటు దేశానికి సేవ చేసే అవకాశం లభించినందుకు పూర్తిగా సంతృప్తిగా ఉన్నాను. సుప్రీంకోర్టులో ఉన్నంతకాలం కొత్త విషయాలు నేర్చుకోలేదు అని భావించిన రోజు ఒక్కటి కూడా లేదు. న్యాయ విద్యార్థిగా కోర్టులో చివరి వరుసలో కూర్చున్న రోజుల నుంచి సుప్రీంకోర్టు కారిడార్ల దాకా నా ప్రస్థానం సాగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా దేశానికి నా వంతు సేవ చేసే అవకాశం రావడం గర్వకారణంగా భావిస్తున్నా. దాదాపు రెండేళ్లపాటు సీజేఐగా న్యాయ వ్యవస్థలో సంస్కరణలు, పారదర్శకత తీసుకొచ్చేందుకు కృషి చేశా. ఈ విషయంలో తరుచుగా ట్రోలింగ్ ఎదుర్కోవాల్సి వచ్చింది. సోషల్ మీడియాలో నాకు వ్యతిరేకంగా ఎన్నో పోస్టులు పెట్టారు. దూషించారు. నన్ను తప్పుపట్టారు. వాటిని మర్చిపోలేను. నేను ఇక పదవీ విరమణ చేస్తున్నా. ట్రోలర్స్‌కు, విమర్శకులకు సోమవారం నుంచి పని ఉండదు. వారంతా నిరుద్యోగులైపోతారు.

ప్రతి రోజూ ప్రతి అన్యాయాన్నీ ఎదిరించలేం

మా తండ్రి పుణేలో ఒక ఫ్లాట్ కొన్నారు. న్యాయమూర్తిగా చివరి రోజు దాకా దాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని నాకు చెప్పారు. నిజాయతీ, సమగ్రత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. ఆయన చెప్పిందే ఆచరించాను. న్యాయమూర్తిగా మారిన తర్వాత మొదట ఎదుర్కోవాల్సింది మనలోని భయాన్నే. మన పరిమితులు మనం తెలుసుకోవాలి. న్యాయవాద వృత్తి గొప్పతనాన్ని అర్థం చేసుకోవాలి. న్యాయ వ్యవస్థ అధికార పరిధిని కూడా గుర్తుంచుకోవాలి. న్యాయమూర్తిగా ప్రతి రోజూ ప్రతి అన్యాయాన్నీ ఎదిరించలేమని కోర్టులో ఉన్నప్పుడు మీరు గ్రహిస్తారు. కొన్నిసార్లు చట్టబద్ధమైన పాలనలోనే అన్యాయాలు జరుగుతూ ఉండొచ్చు. చట్టబద్ధ పాలనకు అవతల జరిగే అన్యాయాలను మనం సరిదిద్దవచ్చు. బాధితులకు ఉపశమనం కలిగించడం అనేది ఓదార్పు ఇచ్చే మన సామర్థ్యంపై ఆధారపడి ఉండదు. వారి కష్టాలను, సమస్యలను ఓపికతో వినగలిగే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. ఎన్నో ఇన్ఫెక్షన్లు తొలగించే శక్తి సూర్యకాంతికి ఉంది. నా జీవితం తెరిచిన పుస్తకం. నా వ్యక్తిగత జీవితం ప్రజలకు తెలుసు. సోషల్ మీడియాలో ఎన్నో విమర్శలను ఎదుర్కొన్నా. నా బాహువులు విశాలమైనవి కాబట్టి అన్ని రకాల విమర్శలను వినమ్రంగా స్వీకరించా. బార్ అసోసియేషన్ సభ్యులు, నా సహచరులు నాకు మద్దతుగా నిలిచారు. సుప్రీంకోర్టు అంటే ప్రధాన న్యాయమూర్తి కేంద్రీకృత కోర్టు. అందులో ఎలాంటి మార్పు ఉండదు.

పెండింగ్ కేసులు పరిష్కరించా

న్యాయ వ్యవస్థను ప్రజలకు సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి, పారదర్శకత పెంచడానికి కృషి చేశా. పెండింగ్ కేసుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చా. నేను సీజేఐగా బాధ్యతలు తీసుకున్నప్పుడు 1,500 దస్త్రాలు రిజిస్ట్రార్ కప్‌బోర్డులో పడి ఉన్నాయి. అవి పరిష్కారానికి నోచుకోకపోవడం బాధ కలిగించింది. ఈ పరిస్థితి మార్చాలని సంకల్పించా. సుప్రీంకోర్టులో నమోదయ్యే ప్రతి కేసుకు ఒక నెంబర్ కేటాయించి, వరుసగా పరిష్కరించే విధానం ప్రారంభించా. దీనివల్ల వేలాది కేసులు పరిష్కారమయ్యాయి. బ్యాక్‌లాగ్ కేసుల సంఖ్య చాలావరకు తగ్గిపోయింది. కేసుల పెండింగ్ విషయంలో మాపై ఎన్నోవిమర్శలు వస్తున్నాయి. పెండింగ్‌లో ఉన్న 82,000 కేసుల్లో రిజిస్టర్ కాని కేసులు చాలా ఉండేవి. ఆ విషయం చాలామందికి తెలియదు. గత రెండేళ్లలో పెండింగ్ కేసుల సంఖ్య 11,000కు తగ్గిపోయింది'' అని జస్టిస్ చంద్రచూడ్ ఉద్ఘాటించారు.

మానవత్వంతో కూడిన తీర్పులిచ్చారు

సీజేఐగా జస్టిస్ చంద్రచూడ్ అందించిన సేవలను పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు కొనియాడారు. భారత న్యాయ వ్యవస్థపై ఆయన బలమైన ముద్ర వేశారని ప్రశంసించారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ తదితరులు మాట్లాడారు. జస్టిస్ చంద్రచూడ్ వృత్తి నైపుణ్యాలు ప్రదర్శించడంతోపాటు మానవత్వంతో కూడిన తీర్పులు ఇచ్చారని చెప్పారు. ఆయనకు అంతులేని సహనం ఉందని తెలిపారు. ఆరోగ్యకరమైన, చురుకైన జీవన శైలి ఆయన సొంతమని అన్నారు. క్లిష్టమైన తీర్పులు ఇచ్చే సమయంలోనూ ప్రశాంతంగా ఉండేవారని, న్యాయవ్యవస్థలో ఆధునిక సాంకేతిక విధానాలు ప్రవేశపెట్టారని వివరించారు. జస్టిస్ చంద్రచూడ్ నిత్యం యువకుడిలా కనిపిస్తారని, ఆయనను చూసి తాము వృద్ధులమైపోయినట్లు భావిస్తామని అన్నారు. ''జస్టిస్ చంద్రచూడ్ పూర్తిగా శాకాహారి. ఉదయం 4 గంటలకే నిద్రలేస్తారు. ఆయనది క్రమశిక్షణతో కూడిన జీవితం. సమోసాలంటే ఆయనకు ఇష్టం. కానీ, సమావేశాల్లో ఏమీ తీసుకోరు. ఆరోగ్యానికి చాలా ప్రాధాన్యం ఇస్తారు. కోర్టుల్లో టెక్నాలజీ విషయంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. నా పనిని మరింత సులభతరం చేశారు'' అని జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. ఇదిలా ఉండగా, నూతన ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈ నెల 11న ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు.

సీజేఐగా జస్టిస్ చంద్రచూడ్ చివరి తీర్పు

సుప్రీంకోర్టులో తన చివరి రోజు ప్రధాన న్యాయమూర్తి హోదాలో జస్టిస్ చంద్రచూడ్ అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి మైనారిటీ విద్యాసంస్థ హోదా విషయంలో కీలక తీర్పు వెలువరించారు.

ట్రంప్‌తో చర్చలకు సిద్ధం: పుతిన్



మాస్కో: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలకు సిద్ధమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ఎన్నికల్లో విజయానికి ట్రంప్‌ను అభినందించారు. ట్రంప్‌ను ధైర్యశాలిగా అభివర్ణించారు. సోచిలో శుక్రవారం ఆయన ఒక కార్యక్రమంలో మాట్లాడారు. వైట్‌హౌస్‌లో తొలి విడతలో ట్రంప్ అన్నివైపుల నుంచీ ఒత్తిళ్లు ఎదుర్కొన్నారని పుతిన్ అన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధానికి ముగింపు పలకగలనని ట్రంప్ అనడంపై స్పందిస్తూ.. కనీసం దృష్టి పెట్టాల్సిన అంశమిదని రష్యా అధ్యక్షుడు అన్నారు. జూలైలో ట్రంప్‌పై జరిగిన హత్యాయత్నంపై మాట్లాడుతూ.. ఆయనపై ఒక అభిప్రాయానికి రావడానికి ఇది దోహదపడిందని పేర్కొన్నారు. కాల్పులు జరిగి చెవి నుంచి రక్తమోడుతున్నా.. ట్రంప్ వెంటనే తేరుకొని పిడికిలి బిగించి.. ఫైట్, ఫైట్, ఫైట్.. అని నినదించిన విషయం తెలిసిందే. దీనిపై పుతిన్ మాట్లాడుతూ.. 'ట్రంప్ చక్కగా స్పందించారు. ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొన్నారు. ధీశాలి' అని కితాబిచ్చారు. గురువారం ట్రంప్ ఎన్‌బీసీ ఛానల్‌తో మాట్లాడు తూ.. పుతిన్‌తో మాట్లాడాలని భావిస్తున్నా నన్నారు. దీనిపై పుతిన్ స్పందిస్తూ ట్రంప్‌తో చర్చలకు సిద్ధమని విలేకరులతో అన్నారు.

సూపర్ పవర్ దేశాల జాబితాలో భారత్‌ను చేర్చాలి

ప్రపంచంలోని అత్యంత బలీయమైన దేశాల జాబితాలో భారత్‌ను చేర్చాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచదేశాలన్నింటిలోకి భారత ఆర్థికవ్యవస్థ అతి వేగంగా వృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. శుక్రవారం పుతిన్ సోచిలో ఒక కార్యక్రమంలో మాట్లాడారు.

కశ్మీర్ అసెంబ్లీలో ఆఖరి రోజూ ఆగని ఆందోళనలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఆఖరి రోజైన శుక్రవారం కూడా ఆందోళనల మధ్యే కొనసాగింది. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరుగుతున్న చర్చకు బీజేపీ సభ్యులు అడ్డుపడ్డారు. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని పునరుద్ధరించాలంటూ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలంటూ నినాదాలతో హోరెత్తించారు. గొడవకు దిగిన ఎమ్మెల్యేలను స్పీకర్ ఆదేశాలతో మార్షల్స్ బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానమిస్తూ శుక్రవారం సీఎం ఒమర్ అబ్దుల్లా.. జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరణ ప్రక్రియను కేంద్రం త్వరలోనే ప్రారంభిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర పాలిత ప్రాంత హోదాతో పరిమిత అధికారాలతో అభివృద్ధిని, శాంతిభద్రతలను సాధించలేమని చెప్పారు. సమావేశాల సందర్భంగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ శాసనసభా పక్షం నేత సునీల్ శర్మతోపాటు ఆ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలపై ఎన్‌సీ ఎమ్మెల్యే సజ్జాద్ షహీన్, మరొకరు హక్కుల తీర్మానం ప్రవేశపెట్టారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటానని స్పీకర్ రథేర్ చెప్పారు. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

ఏక్ హై తో సేఫ్ హై

- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ పిలుపు
- కాంగ్రెస్ విభజన రాజకీయాలు చేస్తోందని మండిపాటు
- ఆర్టికల్ 370ని మళ్లీ తెచ్చే శక్తి ఎవరికీ లేదని వెల్లడి



ధూలే/నాసిక్: మనమంతా ఒక్కటిగా కలిసికట్టుగా ఉంటేనే ఎప్పటికీ సురక్షితంగా ఉంటామని(ఏక్ హై తో సేఫ్ హై) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఆయన శుక్రవారం మహారాష్ట్రలోని ధూలే, నాసిక్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగించారు. విపక్ష మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)పై విమర్శలు గుప్పించారు. చక్రాలు, బ్రేకులు లేని ఎంవీఏ వాహనంలో డ్రైవర్ సీటును ఆక్రమించుకోవడానికి కూటమి నేతలు పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ కూటమికి ఒక దశ దిశ లేదన్నారు. అభివృద్ధి అజెండాతో ముందుకొచ్చిన మహాయుతి కూటమిని మరోసారి గెలిపించాలని మహారాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రచార సభల్లో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ బంటేంగే తో కటేంగే(విడిపోతే నష్టపోతాం) అని నినదించగా, మోదీ బదులిస్తూ 'ఏక్ హై తో సేఫ్ హై' అని పిలుపునిచ్చారు. వినాయక్ దామోదర్ సావర్కర్, శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరే దేశానికి ఎన్నో సేవలు చేశారని ప్రధానమంత్రి కొనియాడారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని మహారాష్ట్రకు రప్పించి, సావర్కర్, థాకరే గురించి 15 నిమిషాలు ప్రశంసిస్తూ మాట్లాడించగల సత్తా మీకుందా? అని ఎంవీఏ కూటమి నేతలకు సవాలు విసిరారు. విభజన రాజకీయాలకు మారు పేరు కాంగ్రెస్ అని మండిపడ్డారు. స్వార్థం కోసం కులాల మధ్య చిచ్చు పెట్టడం ఆ పార్టీకి అలవాటేనని ధ్వజమెత్తారు. జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుంచి రిజర్వేషన్లను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని చెప్పారు. ఇప్పుడు నాలుగో తరం యువరాజు(రాహుల్ గాంధీ) కూడా కులాల పేరిట సమాజాన్ని విడదీస్తున్నారని ప్రధాని మోదీ నిప్పులు చెరిగారు.

ప్రజలు కలిసి ఉంటే కాంగ్రెస్ ఆటలు సాగవు

ఒక కులంపై మరో కులం పోరాడేలా చేయడమే కాంగ్రెస్ పార్టీ ఏకైక అజెండా. ఎస్సీ, ఎస్టీలు, ఓబీసీలు అభివృద్ధి చెందడం, తగిన గుర్తింపు పొందడం కాంగ్రెస్‌కు ఇష్టం లేదు. మనమంతా కలిసి ఉంటేనే భద్రంగా ఉంటామని అందరూ గుర్తుంచుకోవాలి. ఐక్యంగా ఉండాలి. కాంగ్రెస్ విసురుతున్న వలలో చిక్కుకోవద్దు. అన్ని వర్గాల ప్రజలు కలిసి ఉంటే కాంగ్రెస్ ఆటలు సాగవు. జమ్మూకశ్మీర్‌లో భారత రాజ్యాంగాన్ని వర్తింపజేయకుండా కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి కుట్ర పన్నుతోంది. అక్కడ అంబేడ్కర్ రాజ్యాంగం మాత్రమే అమలవుతుంది. అందులో మరో మాటలేదు. ఆర్టికల్ 370ని పునరుద్ధరించే శక్తి ప్రపంచంలో ఎవరికీ లేదు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు పాకిస్తాన్ అజెండాను ప్రోత్సహిస్తున్నాయి. విభజనవాదుల భాష మాట్లాడుతున్నాయి. ఆర్టికల్ 370ని మళ్లీ తీసుకురావాలంటూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం చేశారు. వ్యతిరేకించిన బీజేపీ ఎమ్మెల్యేలను బయటకు వెళ్లగొట్టారు. కాంగ్రెస్ కుతంత్రాలను దేశం అర్థం చేసుకుంటోంది'' అని నరేంద్ర మోదీ చెప్పారు.

'మైనార్టీ హోదా'పై కొత్త బెంచ్

అలీగఢ్ ముస్లిం వర్సిటీపై సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం స్పష్టీకరణ ● 4–3 మెజార్టీతో తీర్పు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రఖ్యాత అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ(ఏఎంయూ)కి మైనార్టీ విద్యాసంస్థ హోదా ఉందో లేదో తేల్చే అంశంపై ఏడుగురు సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారాన్ని నూతన ధర్మాసనానికి(బెంచ్)కు అప్పగిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం 4–3 మెజార్టీతో శుక్రవారం 118 పేజీల తీర్పు ఇచ్చింది. విద్యా సంస్థ నియంత్రణ, పరిపాలన విషయంలో పార్లమెంట్‌లో చట్టం చేసినప్పటికీ ఆ సంస్థకు ఉన్న మైనార్టీ హోదాను రద్దు చేయరని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వ చట్ట ప్రకారం అలీగఢ్ ముస్లిం వర్సిటీని మైనార్టీ విద్యాసంస్థగా పరిగణించలేమంటూ 1967లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తోసిపుచ్చింది. పరిపాలనా విభాగంలో మైనార్టీలు లేనంత మాత్రాన మైనార్టీ విద్యాసంస్థ కాకుండాపోదని తేల్చిచెప్పింది. మతపరంగా లేదా భాషపరంగా మైనార్టీలైన వ్యక్తులు విద్యాసంస్థలు స్థాపించడం లేదా నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ, వివక్ష చూపుతూ తీసుకొచ్చిన చట్టం లేదా కార్యనిర్వాహక చర్య రాజ్యాంగంలోని ఆర్టికల్ 30(1)కు విరుద్ధమని తేల్చిచెప్పింది. ఈ ఆర్టికల్ ప్రకారం విద్యాసంస్థలను స్థాపించే, నిర్వహించే హక్కు మత, భాషాపరమైన మైనార్టీలకు ఉంది. ''ఏఎంయూను మైనార్టీ విద్యాసంస్థగా పరిగణించలేం.. అది సెంట్రల్ యూనివర్సిటీ అంటూ ఎస్.అజీజ్ బాషా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 1967లోఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును తోసిపుచ్చుతున్నాం. తాము స్థాపించిన విద్యా సంస్థ మైనార్టీల ప్రయోజనాల కోసమేనని దానిని ఏర్పాటు చేసినవారు నిరూపించుకోవాలి. రాజ్యాంగం అమల్లోకి రాకముందు ఏర్పాటైన యూనివర్సిటీలకు సైతం ఆర్టికల్ 30(1) కింద ఇచ్చిన హక్కు వర్తిస్తుంది'' అని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, ఇదే ధర్మాసనంలోని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ మూడు వేర్వేరు భిన్నమైన తీర్పులు ఇచ్చారు. ఏఎంయూ మైనార్టీ విద్యాసంస్థ కాదని జస్టిస్ దీపాంకర్ దత్తా తన తీర్పులో స్పష్టం చేశారు.

ఏమిటీ కేసు?

స్వాతంత్ర్యానికి పూర్వమే 1875లో మహ్మదన్ ఆంగ్లో ఓరియంటల్‌గా కాలేజీగా ప్రారంభమైన ఈ విద్యాసంస్థను 1920లో యూనివర్సిటీగా మార్చారు. ఏఎంయూ అనేది కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తున్న సెంట్రల్ యూనివర్సిటీ అని, దాన్ని మైనార్టీ విద్యాసంస్థగా పరిగణించలేమని 1967లో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో 1981లో పార్లమెంట్‌లో ఏఎంయూ(సవరణ) చట్టాన్ని తీసుకురావడంతో ఏఎంయూకు మళ్లీ మైనార్టీ విద్యాసంస్థ హోదా లభించింది. ఈ చట్ట సవరణను సవాలు చేస్తూ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దాంతో ఏఎంయూ(సవరణ) చట్టం–1981ను కొట్టివేస్తూ హైకోర్టు 2006లో తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ 2006లో అప్పటి యూపీఏ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. మరికొందరు సైతం పిటిషన్లు దాఖలుచేశారు. యూపీఏ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు 2016లో ఎన్డీయే ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. మిగిలిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించింది. ఈ అంశాన్ని 2019 ఫిబ్రవరి 12న ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించింది. పిటిషన్లపై ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఏఎంయూకు మైనార్టీ సంస్థ హోదా ఉందో లేదో నూతన బెంచ్ నిర్ణయిస్తుందని తేల్చిచెప్పింది.

వైట్‌హౌస్ స్టాఫ్ చీఫ్‌గా సూజీ వైల్స్

- వైట్‌హౌస్ తొలి అధికారిని నియమించిన ట్రంప్
- అమెరికా చరిత్రలోనే సూజీ తొలి మహిళా అధికారి
- ప్రచార నిర్వాహకురాలిగా ఎన్నికల్లో గెలిపించారని ట్రంప్ ప్రశంస



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌కు తొలి అధికారి నియామకాన్ని ప్రకటించారు. తన ప్రచార మేనేజర్ సూజీ వైల్స్‌ను వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా నియమిస్తున్నట్లు గురువారం వెల్లడించారు. 67 ఏళ్ల వైల్స్ అమెరికా చరిత్రలో ఈ పదవిని చేపట్టిన తొలి మహిళగా రికార్డు సృష్టించనున్నారు. 'అమెరికా చరిత్రలో గొప్ప రాజకీయ విజయాన్ని సాధించడానికి సూజీ వైల్స్ నాకు సాయపడ్డారు. 2016లో, 2020లో, ఇప్పుడు నా ప్రచారంలో అంతర్భాగంగా ఉన్నారు. ఆమె కఠినమైన, తెలివైన, సృజనాత్మకమైన వ్యక్తి. అమెరికా చరిత్రలో తొలి మహిళా చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా సూజీని నియమించడం గౌరవంగా భావిస్తున్న' అని ట్రంప్ వెల్లడించారు. ఇది గొప్ప వార్తని ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జేడీ వాన్స్ హర్షం వ్యక్తం చేశారు. ప్రచారంలో కీలక పాత్ర పోషించిన సూజీ వైట్‌హౌస్‌లోనూ అంతే కీలకంగా పనిచేస్తారని తెలిపారు.

ఎవరీ సూజీ వైల్స్?

సూజీ వైల్స్.. నేషనల్ ఫుట్‌బాల్ లీగ్ (ఎన్ఎఫ్ఎల్) ఆటగాడు, స్పోర్ట్స్ బ్రాడ్‌కాస్టర్ పాట్ సమ్మరల్ కుమార్తె. 1957 మే 14న జన్మించిన ఆమె.. న్యూయార్క్ రిపబ్లికన్ జాక్ కెంప్ అధ్యక్షుడిగా ఉన్నసమయంలో వైట్‌హౌస్‌లో తన కెరీర్‌ను ప్రారంభించారు. 1980లలో రోనాల్డ్ రీగన్ అధ్యక్ష ప్రచార బృందంలో చేరారు. ఇది జాతీయ రాజకీయాల్లో ప్రత్యక్ష ప్రమేయానికి నాంది పలికింది. రీగన్ అధ్యక్ష ఎన్నికల ప్రచారం తరువాత పొలిటికల్ స్ట్రాటజిస్ట్‌గా ఆమె ఫ్లోరిడాకు వెళ్లారు. అక్కడ ఆమె ఇద్దరు జాక్సన్‌విల్లే మేయర్లకు సలహాదారుగా పనిచేశారు. వ్యాపారవేత్త అయిన రిక్ స్కాట్ గవర్నర్‌గా గెలిచేందుకు తోడ్పడ్డారు. 2012లో ఉటా గవర్నర్ జాన్ హంట్స్‌మన్ గెలుపులో కీలక పాత్ర పోషించారు. అదే ఆమెకు మరోమారి వైట్‌హౌస్‌కు బాటలు వేసింది. 2016లో డోనాల్డ్ ట్రంప్ ప్రచార బృందానికి నాయకత్వం వహించారు. ఆ తరువాత 2018లో ఫ్లోరిడా గవర్నర్‌గా రాన్ డిశాంటిస్ గెలుపులోనూ సూజీ కీలక పాత్ర పోషించారు.

మహిళల దుస్తుల కొలతలు పురుషులు తీసుకోవద్దు

- జిమ్‌లలో మహిళలకు పురుషులు ట్రెయినింగ్ ఇవ్వరాదు
- దుస్తుల షాపులు, కోచింగ్ సెంటర్లు, జిమ్‌లలో సీసీటీవీలు తప్పనిసరి
- యూపీ మహిళా కమిషన్ సిఫారసులు

లక్నో: అసభ్యకరంగా తాకుతూ దురుద్దేశంతో వ్యవహరించే పురుషుల నుంచి మహిళలకు రక్షణ కల్పించడానికంటూ ఉత్తరప్రదేశ్ మహిళా కమిషన్ పలు సంచలనాత్మక సిఫారసులను రూపొందించింది. వీటి ప్రకారం పురుషులు.. టైలరింగ్ షాపుల్లో మహిళల కొలతల్ని తీసుకోరాదు. సెలూన్లలో మహిళల జుత్తు కత్తిరించరాదు. దుస్తుల దుకాణాలు, జిమ్‌లు, కోచింగ్ సెంటర్లలో సీసీటీవీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. స్కూల్ బస్సుల్లో భద్రత కోసం మహిళా సిబ్బందిని నియమించాలి..వంటివి ఉన్నాయి. అక్టోబర్ 28వ తేదీన సమావేశమైన కమిషన్ ఈ మేరకు నిబంధనలను ఆమోదించింది. బహిరంగ ప్రదేశాల్లో పురుషుల నుంచి మహిళలను వేరుగా ఉంచేందుకు, మహిళలకు భద్రతను మెరుగుపరిచేందుకు ఉద్దేశించిన ఈ మార్గదర్శకాలను అమలు చేయాలంటూ అన్ని జిల్లాల మేజిస్ట్రేట్లకు లేఖలు రాసింది. 'చాలా చోట్ల జిమ్‌లలో మగ ట్రెయినర్లు, మహిళల బొటిక్‌లలో మగ దర్జీలు ఉంటున్నారు. వీరు మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లుగా ఇటీవలి కాలంలో ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి'అని యూపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ బబితా చౌహాన్ తెలిపారు. 'టైలర్లుగా మగవాళ్లుండటంపై మాకెలాంటి సమస్యా లేదు. మహిళల కొలతల్ని పురుషులు తీసుకోడంపైనే మా అభ్యంతరమంతా'అని ఆమె వివరించారు. 'ఇలాంటి అన్ని చోట్లా శిక్షణ పొందిన మహిళల్ని నియమించుకోవాలి. ఇందుకు కొంత సమయం పట్టొచ్చు. కానీ, ఈ నిబంధనలను అమలు చేయడం వల్ల మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి'అని ఆమె తెలిపారు.

రామేశ్వరం కేఫే ఘటనలో పాక్ ముష్కరుడి హస్తం

చార్జిషీట్‌లో పేర్కొన్న ఎన్ఐఏ

బనశంకరి: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన బెంగళూరులోని రామేశ్వరం కెఫే బాంబు పేలుడు ఘటన వెనుక పాక్ ఉగ్రవాది హస్తం ఉన్నట్లు ఎన్ఐఏ అధికారులు బెంగళూరులోని ఎన్ఐఏ కోర్టులో శుక్రవారం దాఖలు చేసిన చార్జిషీట్‌లో పేర్కొన్నారు. పాక్‌కు చెందిన అనుమానిత ఉగ్రవాది ఫైజల్ ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్నారని తెలిపింది. కాగా ఈ కేసులో ముస్సావీర్ హుస్సేన్ షాజిబ్, అబ్దుల్ మతీన్ అహ్మద్ తాహా, మాజ్ మునీర్ అహ్మద్, ముజమ్మిల్ షరీఫ్‌లు నిందితులుగా ఎన్ఐఏ గుర్తించిన విషయం తెలిసిందే. ఘటన జరిగిన 42 రోజుల తర్వాత నిందితులను ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. మంగళూరు కుక్కర్ పేలుడు తర్వాత ముస్సావిర్ షాజిబ్, తాహాలు అదృశ్యమయ్యారు. కొన్నేళ్ల అనంతరం మళ్లీ బెంగళూరు చేరుకున్నారు. ఈ సమయంలో ముజమ్మిల్ షరీఫ్‌తో పరిచయమైంది. ముజమ్మిల్ మెజస్టిక్ వద్ద హోటల్‌లో పనిచేసేవాడు. ఇతనే ముస్సావిర్ షాజిబ్, తాహాలను ఐసిస్ ఉగ్రవాదంలోకి చేర్చాడు. మొదటి దశలో కొన్ని దుశ్చర్యలు చేయడానికి ముజమ్మిల్ టాస్క్ ఇచ్చాడు. 2023 డిసెంబర్‌లో బెంగళూరులోని మల్లేశ్వరం బీజేపీ కార్యాలయంలో బాంబు పెట్టడానికి కుట్రపన్నారు. తర్వాత షాజీబ్ బెంగళూరు నుంచి చెన్నైకు మకాం మార్చాడు. ట్రిప్లికేన్‌లో అద్దె ఇంట్లో ఐఈడీ బాంబు తయారుచేసి 2024 జనవరి 22 ఉదయం బెంగళూరుకు చేరుకున్నాడు. మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయంలో బాంబు పెట్టడానికి షాజీబ్ ప్లాన్ రూపొందించాడు. పోలీసు భద్రత ఎక్కువగా ఉండటంతో బీజేపీ కార్యాలయం వెనుక బాంబు పెట్టి 90 నిమిషాలకు టైమర్ సెట్ చేశారు. అయితే బాంబు పేలలేదు. అనంతరం షాజీబ్ చెన్నై పారిపోయాడు. అనంతరం బెంగళూరులో జనసమ్మర్థం అధికంగా ఉండే ప్రాంతంలో బాంబు పెట్టడానికి ప్లాన్ చేశారు. ఫిబ్రవరి నెలలో ఐఈడీ బాంబు తయారుచేసి అదేనెల 29 తేదీన షాజీబ్ చెన్నై నుంచి బెంగళూరు చేరుకున్నాడు. కృష్ణరాజపురం టిన్ ఫ్యాక్టరీ వద్ద దిగి అక్కడ నుంచి కుందలహళ్లికి వెళ్లి మార్చి 1న రామేశ్వరం కెఫేలో బాంబు పెట్టినట్లు ఎన్ఐఏ చార్జిషీట్‌లో పేర్కొంది.

సాక్షి హైదరాబాద్

శనివారం । 9 । నవంబర్ । 2024



పారా హుషార్..

పారా గ్లైడింగ్, పారా మోటారింగ్ నేర్చుకునేందుకు యువతరం ఉవ్విళ్లూరుతోంది. వృత్తిగా కొందరు.. హాబీగా మరికొందరు ఎంచుకుంటున్నారు. - సిటీప్లస్‌లో



వీకెండ్ వండర్స్..

సిటీ లైఫ్ స్టైల్‌లో భాగంగా వారాంతాల్లో మ్యూజిక్ కన్సర్ట్స్, లైవ్ మ్యూజిక్ బ్యాండ్స్, ఔట్ డోర్ క్యాంపింగ్ పాటు స్టాండప్ కామెడీ కూడా మంచి ఆదరణ పొందుతున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/19.0

నగరంలో శనివారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 19 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



రక్తి కట్టించిన రుక్మిణీ కృష్ణ

కూచిపూడి నృత్య రూపకం మనోహరంగా సాగింది. శుక్రవారం రవీంద్ర భారతిలో సౌత్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ (సికా) వార్షికోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ప్రముఖ నాట్య గురువు దీపికారెడ్డి, ఆమె శిష్య బృందం ప్రదర్శించిన 'రుక్మిణీ కృష్ణ' కూచిపూడి నృత్య రూపకం ఆహూతులను సమ్మోహనపర్చింది. - గన్‌ఫౌండ్రీ



వర్క్ ఫ్రమ్ ఝార్ఖండ్



బల్దియా కమిషనర్ వర్చువల్ పాలన

- ఫైళ్ల క్లియరెన్స్ నుంచి కుటుంబ సర్వే వరకూ..
- అధికారుల ఉరుకులు పరుగులు
- అన్ని పనులూ అక్కడి నుంచే..

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న కె.ఇలంబర్తి దాదాపు గత పది రోజులుగా నగరంలో లేరు. కేంద్ర ఎన్నికల సంఘం త్వరలో ఎన్నికలు జరగనున్న ఝార్ఖండ్ రాష్ట్రంలో ఆయనను ఎన్నికల పరిశీలకుడిగా నియమించడంతో అక్కడే ఉన్నారు. అయినా.. ఆయన అక్కడి నుంచే ప్రతిరోజూ జీహెచ్ఎంసీ కార్యక్రమాలు చక్కపెడుతున్నారు. ప్రతిరోజూ అడిషనల్, జోనల్, డిప్యూటీ కమిషనర్లతో టెలీ కాన్ఫరెన్స్‌లు, సందర్భాన్ని బట్టి వెబినార్‌లు నిర్వహిస్తున్నారు.

కుటుంబ సర్వేపైనా ఆరా..

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి కూడా ఇలంబర్తి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, కంటోన్మెంట్ అధికారులతోనూ చర్చిస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు తగిన సూచనలు ఇస్తున్నారు. ఇంటింటికి స్టిక్కరింగ్ కార్యక్రమం ఎంతవరకు వచ్చిందో తెలుసుకుంటూ, పని త్వరితగతిన జరిగేందుకు అధికారులను పురమాయిస్తున్నారు.

ఇన్‌చార్జ్ ఆఫీసర్లు

ఈ నేపథ్యంలోనే గ్రేటర్‌లోని 30 సర్కిళ్లు, కంటోన్మెంట్ బోర్డు ప్రాంతానికి వెరసి.. 12 మంది ఉన్నతాధికారులను ప్రత్యేకంగా ఇన్‌చార్జులుగా నియమించారు. అడిషనల్ కమిషనర్లు ఎస్.సరోజ, ఎస్. యాదగిరిరావు, ఎస్.పంకజ, ఎన్. సామ్రాట్ అశోక్, గీతారాధిక, కె.సత్యనారాయణ, చంద్రకాంత్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సీఎస్.రఘుప్రసాద్, నళినీ పద్మావతి, ఎస్టేట్ ఆఫీసర్ వై.శ్రీనివాస్‌రెడ్డి, ఫైనాన్షియల్ అడ్వైజర్ శరత్‌చంద్రలకు ఆయా సర్కిళ్ల బాధ్యతలు అప్పగించారు.

ఫైళ్ల క్లియరెన్స్ సైతం..

జీహెచ్ఎంసీకి సంబంధించి రోజూ పత్రికల్లో వస్తున్న వార్తలపైనా ఇలంబర్తి స్పందిస్తున్నారు. ముఖ్యంగా, ప్రతికూల వార్తలకు సంబంధించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ పనుల గురించి తెలుసుకుంటున్నారు. బిల్లుల చెల్లింపులపైనా ఆదేశిస్తున్నారు. జీహెచ్ఎంసీ వాహనాల పెట్రోల్, డీజిల్‌ల చెల్లింపులకు సంబంధించిన ఫైళ్ల పరిశీలన సందర్భంగా ప్రైవేటు బంకుల నుంచి కొనాల్సిన అవసరమేముందంటూ ప్రశ్నించినట్లు సమాచారం.

డ్యూయల్ రోల్..

సాధారణంగా జీహెచ్ఎంసీ కమిషనర్ సెలవుపై వెళ్లినా, ఇతరత్రా సందర్భాల్లోనూ విధుల్లో లేకుంటే మరో ఉన్నతాధికారిని జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించడం ఆనవాయితీ. ఇలంబర్తి అదనపు బాధ్యతలతోనే కమిషనర్‌గా ఉన్నందున, వేరెవరినీ ఇన్‌చార్జిగా నియమించలేదని సమాచారం.

సీపీఆర్‌తో ఊపిరి పోశాడు!

- యువకుడి ప్రాణాన్ని కాపాడిన హోంగార్డు



ఖలీలుద్దీన్‌కు సీపీఆర్ చేస్తున్న హోంగార్డు సుబ్బారావు

లంగర్‌హౌస్: గుండెపోటు వచ్చి రోడ్డుపై పడిపోయిన ఓ యువకుడికి ట్రాఫిక్ హోంగార్డు సీపీఆర్ చేసి బతికించిన ఈ ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నానల్‌నగర్ చౌరస్తా వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు.. సాలార్జంగ్ కాలనీలో నివసిస్తున్న మొహమ్మద్ ఖలీలుద్దీన్ (36) వృత్తిరీత్యా క్యాబ్ డ్రైవర్. గురువారం సాయంత్రం విధుల్లో భాగంగా గచ్చిబౌలికి వెళ్లడానికి నానల్‌నగర్ బస్టాప్‌లో వేచి చూస్తున్నాడు. ఆ సమయంలోనే అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అతడు కింద పడిపోయాడు. అక్కడ ఉన్నవారు బాధితుడి వద్దకు వెళ్లడానికి సాహసించలేదు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు సుబ్బారెడ్డి వెంటనే స్పందించాడు. గుండెపోటుతో కిందపడిపోయిన ఖలీలుద్దీన్‌కు సీపీఆర్ చేసి బతికించాడు. అనంతరం దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించాడు. ప్రస్తుతం ఖలీలుద్దీన్ కోలుకున్నాడు. సీపీఆర్‌తో యువకుడి ప్రాణాన్ని కాపాడిన సుబ్బారావును ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ అంజయ్య అభినందించారు.

తప్పులు లేని ఓటరు జాబితాకు సహకరించండి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన అహ్మద్ నదీమ్

లక్డీకాపూల్: తప్పులు లేని ఓటరు జాబితా తయారుకు రాజకీయ పార్టీలు సహకరించాలని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం సూచించారు. శుక్రవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో తప్పులు లేని ఓటరు జాబితా తయారీపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ప్రత్యేక ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేశామని తెలిపారు. జాబితాలో తప్పుల సవరణకు అవకాశం కల్పించిటనట్లు చెప్పారు. జాబితాలో చేర్పులు, మార్పులపై ఈ నెల 28 వరకు అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో ఈ నెల 9, 10 తేదీల్లో ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో సరి చేసుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారి ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చని అహ్మద్ నదీం సూచించారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అడిషనల్ కమిషనర్ అలివేలు మంగతాయారు, నాగర్ కర్నూలు ఎంపీ మల్లు రవి, చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫీకర్ అలీ, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ హోంగార్డుపైకి దూసుకొచ్చిన కారు

- 200 మీటర్ల దూరం లాక్కెళ్లిన వాహనం
- స్వల్ప గాయాలతో బయటపడిన బాధితుడు
- కేసు నమోదు చేసిన పంజగుట్ట పోలీసులు



కారు ముందున్న ట్రాఫిక్ హోంగార్డు.. దూసుకెళ్తున్న డ్రైవర్..

పంజగుట్ట: స్పెషల్ డ్రైవ్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులపైకి వేగంగా వచ్చిన ఓ కారు దూసుకెళ్లింది. దీంతో హోంగార్డుకు స్వల్ప గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఈ నెల 4న పంజగుట్ట కూడలి వద్ద ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహన తనిఖీలు చేపట్టారు. నాగార్జున సర్కిల్ నుంచి వేగంగా వస్తున్న ఓ కారును హోంగార్డు రమేష్ ఆపేందుకు ప్రయత్నించాడు. కారు డ్రైవర్ ఆపకుండా అలాగే కారు నడుపుతూ వెళ్తున్నాడు. కారు ముందు హోంగార్డు ఉన్నప్పటికీ అలాగే సుమారు 200 మీటర్ల దూరం దూసుకుపోవడంతో రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారుతో డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదానికి కారణమైన కారును ఇంజినీరింగ్ విద్యార్థి సయ్యద్ మొజాయుద్దీన్ నజీర్ నడుపుతున్నట్లు గుర్తించినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

వరద రావచ్చేమో..



చుట్టూ ఇళ్లున్నా వరద కాల్వ పేరుతో కొర్రీలు

- టోపో మ్యాప్‌ల పేరిట ఎన్‌ఓసీలకు డిమాండ్
- హైడ్రా నేపథ్యంలో రకరకాల ఆంక్షలు
- గృహ నిర్మాణ అనుమతుల్లో అంతులేని జాప్యం

సాక్షి, సిటీబ్యూరో: జేఎన్‌టీయూ ప్రగతినగర్‌కు చెందిన ఓ నిర్మాణ సంస్థ నెల రోజుల క్రితం అయిదంతస్తుల భవన నిర్మాణానికి అనుమతుల కోసం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ)కు దరఖాస్తు చేసుకుంది. నెల రోజుల పాటు దరఖాస్తు పరిశీలన దశలోనే ఉంది. వివిధ స్థాయిలకు చెందిన అధికారులు పరిశీలించి చివరకు ఆ ప్రాంతంలో వరద నీరు రావచ్చేమోననే సందేహాన్ని చల్లగా వ్యక్తం చేశారు. ఈ సందేహాన్ని నివృత్తి చేసేందుకు ఇరిగేషన్, రెవెన్యూ విభాగాల నుంచి టోపోమ్యాప్‌తో కూడిన నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) కావాలంటూ కొర్రీలు పెట్టారు. నెలరోజుల పాటు ఎటూ తేల్చకుండా చివరకు ఎన్‌ఓసీలు కావాలంటూ షరతులు పెట్టడంతో సదరు నిర్మాణ సంస్థకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. నిజానికి అదే ప్రాంతంలో దశాబ్దాలుగా ఎంతో మంది నివాసం ఉంటున్నారు. దరఖాస్తు చేసుకున్న స్థలానికి చుట్టుపక్కల అపార్ట్‌మెంట్‌లు కూడా ఉన్నాయి. పైగా హెచ్ఎండీఏ గతంలో ఇచ్చిన దరఖాస్తులతోనే ఆ భవనాలను కట్టారు. నిర్మాణానికి అన్ని విధాలా అర్హత ఉన్న ఆ స్థలానికి కొత్తగా టోపో మ్యాప్‌తో పాటు ఎన్‌ఓసీ కావాలని ఆంక్షలు విధించారు. ఒక్క ప్రగతినగర్‌లోనే కాదు. హెచ్ఎండీఏ పరిధిలో ఎక్కడ నిర్మాణాలు చేపట్టాలన్నా బిల్డర్‌లు, మధ్య తరగతి వర్గాలు హడలెత్తుతున్నాయి. టీజీబీపాస్ ద్వారా హెచ్ఎండీఏ నుంచి అనుమతి పొందడమే ఇప్పుడు అతి పెద్ద సవాల్‌గా మారింది.

ఎండమావుల్లా ఎన్‌ఓసీలు...

భవన నిర్మాణాలు, లే అవుట్‌లు, ఎల్ఆర్ఎస్‌లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌లు వంటి వివిధ రకాల పనులపై సాధారణంగానే నెలలు గడిచినా అనుమతులు లభించడం దుర్లభంగా మారింది. కేవలం 15 రోజుల్లో దరఖాస్తులను పరిశీలించి అనుమతులను జారీ చేయాల్సి ఉండగా నెలలు గడిచినా అనుమతులు లభించడం లేదంటూ దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున ఫైళ్లు పెండింగ్ జాబితాలో పేరుకుపోతున్నాయి. ఇదే సమయంలో కొత్తగా రెండంచెల విధానాన్ని ప్రవేశపెట్టారు. హెచ్ఎండీఏ అనుమతుల్లో ఇరిగేషన్, రెవిన్యూ శాఖలను కూడా చేర్చారు. దీంతో ఫైళ్ల కదలికలో మరింత జాప్యం ఏర్పడుతోంది.

ఇదంతా ఒకవైపైతే.. మరోవైపు హెచ్ఎండీఏ ఆంక్షల మేరకు ఇరిగేషన్, రెవిన్యూ విభాగాల నుంచి ఎన్‌ఓసీలు జారీ కావడం లేదు. తుర్కయంజాల్‌కు చెందిన ఓ దరఖాస్తుదారు ఏడాది క్రితం భవన నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దశాబ్దాల క్రితం అక్కడ పంట కాల్వ ఉన్నట్లు పరిగణించి ఎన్‌ఓసీ కోరారు. ఈ మేరకు ఆరు నెలల పాటు ఇరిగేషన్ అధికారుల చుట్టూ తిరిగి ఎన్‌ఓసీ సంపాదించారాయన. కానీ.. అదొక్కటే చాలదు. రెవెన్యూ ఎన్‌ఓసీ కూడా అవసరమన్నారు. ఇప్పటి వరకు రెవెన్యూ నుంచి ఎన్‌ఓసీ లభించలేదు. దీంతో భవన నిర్మాణాన్ని ఆయన వాయిదా వేసుకున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఎన్‌ఓసీలు ఇచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు.

రెవెన్యూ అవసరం లేకపోయినా..

సాధారణంగా వర్షం కురిసినప్పుడు ఎత్తు నుంచి పల్లానికి వరద నీళ్లు ప్రవహిస్తాయి. టోపో మ్యాప్‌ల ఆధారంగా ఇలాంటి వరద కాల్వలను గుర్తిస్తారు. భవన నిర్మాణం చేపట్టనున్న స్థలానికి చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఎలాంటి వరదలు రావని నిర్ధారిస్తూ ఎన్‌ఓసీలు ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ నీటిపారుదల అధికారులు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు నిరాకరిస్తే అది వరద ముప్పు ఉన్న ప్రాంతంగానే పరిగణించాలి. ఇందులో రెవెన్యూ శాఖ భాగస్వామ్యం అవసరం లేదు. వర్షపు నీరు ప్రవహించే ప్రాంతాలుగా అనుమానించి కొర్రీలు విధిస్తున్న హెచ్ఎండీఏ అధికారులు ఇరిగేషన్‌తో పాటు రెవెన్యూ ఎన్‌ఓసీలను కూడా తప్పనిసరి చేయడం గమనార్హం. కాగా.. హైడ్రా రాకతోనే తాము ఇలాంటి ఎన్‌ఓసీలను కోరుతున్నామని హెచ్ఎండీఏ అధికారులు చెబుతున్నారు.

ఫలప్రదమే!



- వారంలో పరిపాలనా అనుమతులు?
- 2040 నాటి అవసరాలకనుగుణంగా నిర్మాణాలు
- త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం

సీఎం పేషీకి కోహెడ పండ్ల మార్కెట్ డీపీఆర్

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఏడాది కాలంగా డీపీఆర్ దశలోనే నిలిచిపోయిన ఫైల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీకి చేరింది. గతంలో గడ్డిఅన్నారంలో ఉన్న పండ్ల మార్కెట్‌ను నగర శివార్లలోని కోహెడకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా భూమిని కూడా కేటాయించింది. గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ స్థలంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలని నిర్ణయించిన గత సర్కారు.. ఆగమేఘాల మీద మార్కెట్‌ను బాట సింగారంలోని హెచ్ఎండీఏ స్థలంలో తాత్కాలిక షెడ్లలో ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో మూడేళ్లుగా ఇక్కడ కొనసాగుతున్న కోహెడకు తరలించాలని కమీషన్ ఏజెంట్లు, వర్తకుల నుంచి ఒత్తిడి వస్తోంది. ఈక్రమంలో వివిధ దేశాల్లోని అత్యాధునిక మార్కెట్లను అధ్యయనం చేసిన మార్కెటింగ్‌శాఖ.. ఆ డిజైన్లకు తగ్గట్టుగా కోహెడ మార్కెట్‌ను నిర్మించాలని సంకల్పించింది. ఈ మేరకు డీపీఆర్‌ను కూడా రూపొందించింది. దీనికి వ్యవసాయశాఖ ఆమోద ముద్ర కూడా వేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో మార్కెట్ ప్రతిపాదనల ఫైల్ ముందుకు కదలలేదు. దీనికి తోడు ప్రతిపాదిత స్థలాన్ని ఐటీ కంపెనీలకు ఇవ్వాలనే ప్రతిపాదన కూడా తెరమీదకు వచ్చింది. ఇటీవల మార్కెట్‌కు కొత్త పాలకవర్గం కొలువు దీరడంతో కోహెడలోనే మార్కెట్‌ను నిర్మించాలనే నిర్ణయానికి వచ్చింది. దానికి తగ్గట్టుగా డీపీఆర్‌కు ఆమోదముద్ర పడినందున. పరిపాలనా అనుమతులు కోరుతూ సీఎంఓకు ఫైల్‌ను పంపింది. దస్త్రానికి ఆమోదం పడగానే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి సాధ్యమైనంత త్వరగా మార్కెట్‌ను అందుబాటులోకి తేవాలని పాలకవర్గం భావిస్తోంది.

కమీషన్ ఏజెంట్ల కోసం 681 దుకాణాలు..

గత ప్రభుత్వం 2016లో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో సర్వే నెం.507/2, 548/2లో 178.09 ఎకరాల స్థలం కేటాయించింది. 2023లో కోహెడ మార్కెట్‌కు సంబంధించిన లేఅవుట్ సిద్ధం చేసింది. ఏడాది క్రితం మార్కెట్ ఫేజ్- 1 నిర్మాణం కోసం రూ.399.96 కోట్ల అంచనాలతో డీపీఆర్ ప్రతిపాదించారు. 2040 నాటి అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు 6 లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణాలు ఉండబోతున్నాయి. కమీషన్ ఏజెంట్ల కోసం 681 దుకాణాలు నిర్మించనున్నారు. కోల్డ్‌స్టోరేజీకి 19.71 ఎకరాలు, వాహన పార్కింగ్ కోసం 24 ఎకరాలు, రహదారుల కోసం మరో 40 ఎకరాలను కేటాయించనున్నారు. సిబ్బంది నివాస గృహ సముదాయం అక్కడే ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వం అంచనాలకు అదనంగా మరో వంద ఎకరాల స్థలాన్ని సేకరించడానికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పండ్లు, పూలు, కూరగాయలు కలిపి సమీకృత మార్కెట్ దిశగా ప్రభుత్వం అడుగులేస్తోందని తెలుస్తోంది. ఫేజ్–1కి సంబంధించి డీపీఆర్‌కు పరిపాలనా ఆమోదం వచ్చిన వెంటనే పనులు ప్రారంభం కానున్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

తాత్కాలిక ఏర్పాట్లతో ఇబ్బందులు

కోహెడ పండ్ల మార్కెట్‌కు తెలంగాణతో పాటు దేశ, విదేశాల నుంచి పండ్లు వస్తాయి. నగరంతో పాటు తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచి పండ్లు ఎగుమతి అవుతాయి. ఇక్కడ తాత్కాలికంగా చేసిన ఏర్పాట్లతో మార్కెట్‌కు వచ్చే రైతులు, వినియోగదారులు, వ్యాపారులు, హమాలీలు ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. శాశ్వత మార్కెట్ భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.



ఏడాదికి రూ.1,550 కోట్ల టర్నోవర్..

కోహెడ మార్కెట్ కోసం రైతులు, వ్యాపారులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ప్రపంచ గుర్తింపు పొందిన మార్కెట్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. పండ్ల మార్కెట్ ప్రస్తుతం ఏడాదికి రూ.1,550 కోట్ల టర్నోవర్ అవుతోంది. సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయితే ఏడాదికి రూ.5 వేల కోట్ల టర్నోవర్ చేరుకుంటుందని అంచనా వేస్తున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల రైతులు, ఏజెంట్లకు అపారమైన నమ్మకం ఉంది. నూతన మార్కెట్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభవుతాయి.

– చిలుక మధుసూదన్ రెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

సహజసిద్ధంగా పునరుజ్జీవం ఎలా?

- చెరువులపై బెంగళూరులో హైడ్రా అధ్యయనం
- లేక్‌మ్యాన్ ఆనంద్ మల్లిగవాడ్‌తో రంగనాథ్ చర్చలు
- దొడ్డతోగూరు చెరువును సందర్శించిన బృందం
- కేటీసీడీఏ అధికారులతోనూ సుదీర్ఘ సమావేశం



ఆనంద్ మల్లిగవాడ్‌తో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: ఎలాంటి రసాయనాలు వాడకుండా.. తక్కువ ఖర్చుతో సహజసిద్ధంగా చెరువులకు పునరుజ్జీవం కల్పించడం ఎలా అనే అంశంపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) బృందం దృష్టి పెట్టింది. బెంగళూరు పర్యటనలో భాగంగా శుక్రవారం దొడ్డతోగూరు చెరువుతో పాటు కర్ణాటక ట్యాంక్ కన్జర్వేషన్ డవలప్‌మెంట్ అథారిటీని (కేటీసీడీఏ) సందర్శించింది. 'లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా' ఆనంద్ మల్లిగవాడ్‌తో పాటు కేటీసీడీఏ సీఈఓతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సమావేశమయ్యారు.

నాలుగైదు దశల్లో మురుగు నీటి శుద్ధి..

- హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ, పునరుజ్జీవం కోసం బెంగళూరుతో పాటు ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న వాటిని హైడ్రా బృందం అధ్యయనం చేస్తోంది. దొడ్డతోగూరు చెరువును సందర్శించిన హైడ్రా అధికారులు నాలుగైదు దశల్లో మురుగు నీటిని సహజ సిద్ధంగా శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అక్కడ నుంచి నీటిని మైన్ చెరువులోకి పంపిస్తున్న తీరును పరిశీలించారు. ఈ అంశాలను ఆనంద్ మల్లిగవాడ్ హైడ్రా బృందానికి వివరించారు. ఏవీ రంగనాథ్ కేటీసీడీఏ కార్యాలయానికి వెళ్లి అక్కడి అధికారులతో భేటీ అయ్యారు. కర్ణాటక ప్రభుత్వం 2014లో అమలులోకి తీసుకువచ్చిన కేటీసీడీఏ యాక్ట్‌ను పరిశీలించారు. అందులో నుంచి నగరంలో అమలు చేయడానికి ఉపయుక్తంగా ఉన్న వివరాలు తెలుసుకున్నారు. అథారిటీ సీఈఓ రాఘవన్‌తో రంగనాథ్ సమావేశమయ్యారు. కర్ణాటకలో చెరువుల పరిరక్షణ కోసం కేటీసీడీఏ చేపడుతున్న చర్యలను అధ్యయనం చేశారు.
- తాము ఆయా చెరువులకు సంబంధించిన ఫుల్ ట్యాంక్ లెవెల్‌తో (ఎఫ్‌టీఎల్) పాటు బఫర్ జోన్లలో ఉన్న భూమి మొత్తం ప్రభుత్వ భూమిగా, బఫర్ జోన్‌ను మాగ్జిమం వాటర్ లెవెల్‌గా పరిగణిస్తామన్న రాఘవన్ హైడ్రా బృందానికి వివరించారు. హైడ్రా అధికారులు చెరువుల్లో ఉన్న ఆక్రమణల తొలగింపు అంశంలో కేటీసీడీఏ అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం రంగనాథ్ నేతృత్వంలోని బృందం అధ్యయనం చేసింది. 'బెంగళూరులోని ఎలక్ట్రానిక్ కారిడార్‌లో ఉన్న 44 ఎకరాల దొడ్డతోగూరు చెరువును ఐటీ కంపెనీల సహకారంతో ఆనంద్ మల్లిగవాడ్ పునరుజ్జీవం కల్పించారు. ఆనంద్ సేవల్ని హైదరాబాద్‌లోనూ వినియోగించుకునేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాం' అని రంగనాథ్ తెలిపారు.

హైడ్రా వంటి వ్యవస్థలు దేశవ్యాప్తంగా ఉండాలి..

బెంగళూరులో చెరువుల్ని సిమెంట్, కాంక్రీట్ తదితరాలు వాడకుండా సహజసిద్ధమైన విధానాల్లో శుద్ధి చేస్తున్నాం. హైడ్రా హైదరాబాద్‌లో జలవనరుల్లో ఆక్రమణలు తొలగించిన చోటి నుంచి వ్యర్థాలు తీసేసి పునరుద్ధరించాలి. హైడ్రా వంటి ఓ వ్యవస్థను దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేశారు. హైడ్రా అంటే కూల్చివేతలనే భయం ఉంది. అది వాస్తవం కాదు మన భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందాలన్నా, వరదలు, ముంపు లేకుండా జీవించాలన్నా ఇలాంటి వ్యవస్థలు అనివార్యం. భవిష్యత్తులో తీవ్రమైన ఇబ్బందులు రాకూడదంటే హైడ్రా వంటివి అవసరం. ఇలాంటివి దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేయాలి.

– ఆనంద్ మల్లిగవాడ్, లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా, బెంగళూరు

మంత్రి శ్రీధర్‌బాబు నివాసంలో సెల్‌ఫోన్ చోరీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఉంటున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నివాసంలో సెల్‌ఫోన్ చోరీకి గురైంది. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో క్వార్టర్ నెంబర్–7లో మంత్రి శ్రీధర్‌బాబు ఉంటున్నారు. గత నెల 31వ తేదీ రాత్రి 9 గంటల ప్రాంతంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి ఇంట్లో ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఏ సతీష్‌కుమార్ లక్ష్మీపూజ నిర్వహించాడు. పూజ అనంతరం రాత్రి 9.30 గంటలకు ఆయన ఫోన్ కోసం చూడగా కనిపించలేదు. అన్ని ప్రాంతాలు వెతికినా ఉపయోగం లేకుండా పోయింది. మంత్రి ఇంట్లో పూజలకు ఎంతోమంది అతిథులు వచ్చారని, ఎలా చోరీకి గురైందో తెలియదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పూజల్లో నిమగ్నమై ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు సెల్‌ఫోన్ చోరీ చేసి ఉంటారని పేర్కొన్నారు. దీపావళి తర్వాత వారం రోజులుగా తాను విధి నిర్వహణలో బిజీగా ఉన్నానని, దీంతో శనివారం ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలంలో వివరాలు సేకరించారు.

జీవన్‌దాన్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ శ్రీభూషణ్ రాజు



నియామక పత్రాన్ని అందుకుంటున్న ప్రొఫెసర్ శ్రీ భూషణ్‌రాజు

లక్డీకాపూల్: నిజామ్ వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్) నెఫ్రాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీ భూషణ్ రాజును జీవన్‌దాన్ నోడల్ అధికారిగా ప్రభుత్వం నియమించింది. శుక్రవారం ఈ మేరకు డీఎంఈ కార్యాలయంలో డీఎంఈ డాక్టర్ ఎస్.వాణి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. జీవన్‌దాన్ నోడల్ అధికారిగా బాధ్యతలు తీసుకున్న శ్రీభూషణ్ రాజు కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. అంతే కాకుండా జీవన్‌దాన్ పథకం కింద అర్హులైన వారికి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కిడ్నీ మార్పిడి ఆపరేషన్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు పారదర్శకంగా ఉండేలాగా తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు శ్రీ భూషణ్ రాజును అభినందించారు.

కార్మికులకు ఆరోగ్య కార్డులు కొనసాగింపు

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్ రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైనదని వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ (బీఆర్‌టీయూ) అధ్యక్షుడు రాంబాబు యాదవ్ వెల్లడించారు. శుక్రవారం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయంలో డైరెక్టర్ (పీఅండ్‌ఏ) సుదర్శన్‌ను కలిసి ప్రతినిధులు బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ ఆరోగ్య కార్డుల కాలపరిమితి ఈనెల 24 తో ముగుస్తుండడంతో గత నెల రోజులుగా రెన్యూవల్ కోసం కృషి చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా పరిమితిని రూ.3 లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని కోరామని, బోర్డు ఆర్థిక పరిస్థితి బాగాలేదని ఎండీ చెప్పినప్పటికి తమ వినతిని మన్నించారన్నారు. దీంతో తాజాగా టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి కోటి దీపోత్సవం

లక్డీకాపూల్: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని భక్తి టీవీ ఆధ్వర్యంలో శనివారం నుంచి కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియం వేదికగా ప్రారంభమయ్యే ఈ దీపోత్సవం ఈ నెల 25 వరకు కొనసాగుతుంది. ప్రతి రోజు సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో భాగంగా ప్రసిద్ధ జగద్గురువులు, పీఠాధిపతులు, ప్రవచనకర్తలు, దేశంలోని పలువురు ముఖ్యులు పాల్గొంటారు. ప్రతిరోజు భక్తులు స్వయంగా విశేష పూజలు నిర్వహించుకునే అవకాశాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎలాంటి రుసుము లేదని, ఎవరైనా రావచ్చని రచన టెలివిజన్ సంస్థ డైరెక్టర్ రఘు ఏలూరి తెలిపారు. దీపారాధన నిమిత్తం వత్తులు, నూనె, ప్రమిదలు వంటి పూజాద్రవ్యాలతో పాటూ ప్రసాదాలను కూడా ఉచితంగా ఏర్పాటు చేశామన్నారు. కుటుంబ సమేతంగా కోటి దీపోత్సవంలో పాల్గొనాలని ఆయన కోరారు.

హెరాయిన్‌తో పట్టుబడ్డ ఉగాండా జాతీయురాలికి 13 ఏళ్లు జైలు

శంషాబాద్: హెరాయిన్‌తో పట్టుబడ్డ ఉగాండా జాతీయురాలికి జిల్లా న్యాయస్థానం పదమూడేళ్ల జైలు శిక్ష విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2021 జూన్ 2 ఉగాండాకు చెందిన మహిళ హరారే నుంచి హైదరాబాద్ విమానాశ్రయానికి వచ్చింది. తన లగేజీ మిస్ అయ్యిందని వెళ్లిన ఆమె అదే నెల 5న శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లి మిస్ అయిన లగేజీని తీసుకుంది. విశ్వసనీయ సమాచారంతో ఉన్న డీఆర్‌ఐ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకుని లగేజీ తనిఖీ చేయగా 3900 గ్రాముల హెరాయిన్ లభ్యమైంది. ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం ఆమెపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు సాక్ష్యాధారాలను పరిశీలించిన రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి ఆమెకు 13 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా చెల్లించాలని తీర్పునిచ్చినట్లు డీఆర్‌ఐ వెల్లడించింది.

స్వచ్ఛభారత్ టాయిలెట్స్ నిర్వహణ బాలేదు

'దిశ' సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అసంతృప్తి, ఆగ్రహం



దిశ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల

సనత్‌నగర్: జీహెచ్‌ఎంసీ పరిధిలో స్వచ్ఛభారత్‌లో భాగంగా నిర్మించిన టాయిలెట్స్ నిర్వహణ తీరుపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛ భారత్‌లో కేంద్రం వాటాతోపాటు రాష్ట్ర వాటా కూడా ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నగరంలో 2,251 టాయిలెట్స్ ఉన్నాయని, వాటి నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం శుక్రవారం బేగంపేట టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగింది. దిశ కమిటీ చైర్మన్ హోదాలో కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎంపీ ఈటల రాజేందర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతోపాటు వివిధ శాఖల అధికారులు, దిశ కమిటీ సభ్యులు హాజరయ్యారు. స్వచ్ఛభారత్ మిషన్, ఎల్‌ఎండీ (లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్) అన్ని బ్యాంకుల్లో ముద్ర, ఎడ్యుకేషన్ లోన్లు, ఎంఎస్‌ఎంఈలపై సమీక్షించారు. నగరంలో రైల్వేస్, ఎలక్ట్రిసిటీ, నేషనల్ హైవేస్, బ్రిడ్జిల నిర్మాణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బస్తీలకు వెళ్లిన సందర్భంలో ప్రజలు తన దృష్టికి అనేక సమస్యలు తీసుకొస్తున్నారని, ప్రధానంగా స్ట్రీట్ లైట్లు వెలగడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

విశ్వకర్మ పథకం లక్ష్యం నీరుగారిపోతోంది

అధికారుల నిర్లక్ష్యం కారణంగా విశ్వకర్మ పథకం లక్ష్యం నీరుగారిపోతుందని కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 వేల దరఖాస్తులు వస్తే కేవలం 620 మంది లబ్ధిదారులకు మాత్రమే అందడం సిగ్గుచేటన్నారు. 45 రోజుల్లో పూర్తిగా ఈ కార్యక్రమాన్ని గ్రౌండింగ్ చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వయం సహాయక గ్రూపులు, సబ్సిడీ రుణాల మంజూరులో తలెత్తుతున్న ఇబ్బందులను ప్రశ్నించి, వచ్చే సమావేశంలోగా ఆయా విషయాలపై పూర్తి ప్రాజెక్టు నివేదికను రూపొందించాలన్నారు. సాంకేతిక సమస్యలనే సాకులు చెబుతున్నారంటూ అధికారులు, బ్యాంకర్లు లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు.

పీఎం విద్యా రుణాలు కేవలం రూ.130 కోట్లేనా?

పీఎం విద్యా రుణాలు గత ఏడాది రూ.1,200 కోట్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంటే కేవలం రూ.130 కోట్లు మాత్రమే అందజేయడంపై కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను ధ్రువపత్రాలు, సొంత ఇళ్లు, ష్యూరిటీ, సిబిల్ స్కోర్‌లని ఇబ్బందులు పెడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు పూర్తి నివేదిక అందజేస్తే విద్యా రుణాలను పెంచే విషయంలో కూడా కేబినెట్‌లో మాట్లాడతానన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 18,02,995 మంది, హైదరాబాద్ నగరంలో 2 లక్షల మంది వృద్ధులు ఆయుష్మాన్ భారత్ కింద ఆరోగ్య బీమా కల్పించేందుకు అర్హులుగా నిర్ణయించామని అధికారులు మంత్రికి వివరించారు.

ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాల ఆగడాలపై దృష్టి పెట్టండి

ప్రైవేట్ ఆస్పత్రుల్లో యాజమాన్యం బిల్లుల చెల్లింపులు, ఇతరత్రా కారణాలతో మృతదేహాలను సంబంధిత కుటుంబానికి ఇవ్వకుండా ఇబ్బందిపెడుతున్న ఘటనలపై కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రాష్ట్ర చరిత్రలో తొలిసారి లీగల్ ఎగ్జిబిషన్

సాక్షి, హైదరాబాద్ : సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సులకు సంబంధించి అనేక ఎగ్జిబిషన్లు నిత్యం ఏదో ఒక కాలేజీలో జరుగుతూనే ఉంటాయి. కానీ లీగల్ కోర్సులకు సంబంధించి రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా లీగల్ ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు నగరంలోని కేశవ మెమోరియల్ లా కాలేజీ యాజమాన్యం ముందుకు వచ్చింది. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు లీగల్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు కేశవ మెమోరియల్ లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి అక్కపెద్ది శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లీగల్ ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి హాజరై ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఈ మూడు రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు లీగల్ ఎగ్జిబిషన్ కొనసాగనుందని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా లీగల్ వ్యవహారాలతోపాటు కొత్త చట్టాలైన బీఎన్‌ఎస్, బీఎన్‌ఎస్‌ఎస్‌పై పూర్తి అవగాహన కలిగించేలా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పీజీ కోర్సుల చివరి విడత సీట్ల కేటాయింపు పూర్తి

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీసీపీజీఈటీ–2024 చివరి విడత, ఎంఈడీ, ఎంపీఈడీ మొదటి కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు పూర్తి అయిన్నట్లు కన్వీనర్ ప్రొ. పాండురంగారెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. మొత్తం 46 వేల సీట్లలో 26 వేలు భర్తీ కాగా 20 వేల సీట్లు మిగిలినట్లు తెలిపారు. చివరి విడతలో 13.348 మంది ఆప్షన్స్ ఇవ్వగా 6 వేల మందికి సీట్లు కేటాయించినట్లు వివరించారు. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల క్యాంపస్ కాలేజీల్లో చేరేందుకు మాత్రమే విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారని, ప్రభుత్వ, ప్రైవేటు పీజీ కాలేజీల్లో విద్యార్థులు చేరడం లేదని ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. మూడు విడతల కౌన్సెలింగ్‌లో 8 వర్సిటీల్లో 23.851 వేల సీట్ల భర్తీకాగా అమ్మాయిలు 17,365 మంది, అబ్బాయిలు కేవలం 6,486 మంది మాత్రమే అడ్మిషన్లు పొందారని వివరించారు. సుమారు 20 వేల సీట్లు మిగిలినట్లు చెప్పారు.

11 మంది ట్రాన్స్‌జెండర్ల అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ట్రాన్స్‌జెండర్ల ఆటకట్టించారు సైబరాబాద్ పోలీసులు. సైబరాబాద్‌లోని ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ సేఫ్టీ వింగ్ ఏసీపీ ప్రసన్న కుమార్ ఆదేశాల మేరకు మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఇన్‌స్పెక్టర్ జేమ్స్ బాబు, ఏఆర్ టీమ్, స్థానిక పోలీసులతో ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా బృందాలు గురువారం అర్ధరాత్రి సమయంలో మాదాపూర్, గచ్చిబౌలి, అల్లాపూర్ పోలీసు స్టేషన్ల పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాలలో వికృత చేష్టలు, అర్ధనగ్న వేషధారణతో ప్రజలకు ఇబ్బందులు గురి చేస్తున్న 11 మంది ట్రాన్స్‌జెండర్లను పట్టుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేశారు.

ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత

కేంద్ర మంత్రి బండి సంజయ్



వివరాలను మంత్రి బండి సంజయ్‌కు అందజేస్తున్న నిర్వాహకురాలు ప్రియదర్శిని

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలతో మనిషికి మానసిక ప్రశాంతత లభిస్తుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. యాంత్రిక జీవనంలో ప్రతిఒక్కరూ మానసిక ఆనందం కోసం యోగాసనాలు, మెడిటేషన్ లాంటి ఆరోగ్య ప్రక్రియలు నిత్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. శుక్రవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో కొనసాగుతున్న 'హెచ్‌ఎస్‌ఎస్ ఫేర్ 2024'ను ఆయన సందర్శించారు. ఈషా ఫౌండేషన్ కేంద్రాన్ని తిలకించి యోగాసనాలు, ఇన్నర్ ఇంజనీరింగ్‌పై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ..ఈశా ఫౌండేషన్ హైదరాబాద్‌లోనే కాక దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో సైతం ఉచితంగా యోగా, మెడిటేషన్‌పై నిరంతరం తరగతులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందిస్తోందన్నారు. ఇన్నర్ ఇంజనీరింగ్ ప్రక్రియ ద్వారా మనిషికి ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. హెచ్‌ఎస్‌ఎస్ ఫెయిర్ ప్రజలకు ఎంతో ప్రయోజకరంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈశా ఫౌండేషన్ నిర్వాహకురాలు ప్రియదర్శిని నవ్య, రాజ్యలక్ష్మి, యజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

పిస్టల్ చూపించి బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

కేపీహెచ్‌బీ: కూకట్‌పల్లి కోర్టు ప్రాంతంలోని పార్కింగ్ యార్డ్‌లో వాహనాన్ని పార్క్ చేయమని కోరిన ఓ వ్యక్తిని కారులో వచ్చిన మరో వ్యక్తి పిస్టల్ చూపించి బెదిరించిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నక్కా నరసింహ అనే వ్యక్తి కూకట్‌పల్లి కోర్టు ప్రాంగణంలో పార్కింగ్ లాట్‌ను నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం కోర్టు ప్రాంగణంలోకి వెళ్తున్న ఓ కియా కారుకు బారికేడ్ అడ్డం పెట్టిన నరసింహ..చేయి చూపుతూ కారును కట్ట మైసమ్మ ఆలయ పార్కింగ్ లాట్‌లో పార్క్ చేయాలని చూపించాడు. దీంతో కియా కారులోని వ్యక్తి తన కారు డిక్కీలో నుంచి పిస్టల్‌ను తీసి ఎవరు నువ్వు ఎందుకు ఆపుతున్నావ్ అంటూ బెదిరించాడు. దీంతో భయపడిన నరసింహ బారికేడ్‌ను అడ్డు తొలగించడంతో కారు కోర్టు సమీపంలోని చర్చి వద్దకు వెళ్లి ఆగిన తరువాత అందులోని వ్యక్తి దిగి కోర్టు లోకి వెళ్లాడు. కారు వెనకాలనే వెళ్లిన నరసింహ విషయాన్ని స్థానికంగా ఉన్న బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడికి తెలుపగా..ఆయన సూచన మేరకు కారు నెంబర్ నమోదు చేసుకొని కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కారులో వచ్చి పిస్టల్ చూపిన వ్యక్తి చిదంబర్ రెడ్డిగా గుర్తించిన నరసింహ గతంలోనూ తనను బెదిరించినట్లుగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమాజాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర కీలకం



జ్ఞాపికలు అందుకున్న అధ్యాపకులతో డాక్టర్ శ్రీకాంత్ తదితరులు

మణికొండ: సమాజాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర కీలకమని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెడికల్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చర్స్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.శ్రీకాంత్ అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాల అధ్యాపకులు ఆర్.మదన్‌మోహన్, డాక్టర్ బి.ఇందిర, డాక్టర్ జి.వనిత, డాక్టర్ అనిలాలు పలు రంగాలలో చేసిన పరిశోధనలను గుర్తించి ఆయన శుక్రవారం జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు అంకిత భావంతో పనిచేసినపుడే సమాజం, విద్యార్థులు ఉన్నతంగా తయారవుతారన్నారు. ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు, విద్యార్థుల అభివృద్ధికి అధ్యాపకుల ప్రయత్నాలు, పరిశోధనలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు.

ఏఐసీటీఈ నిర్ణయం సబబే

- 'సుల్తాన్ ఉల్ ఉలూమ్'కు హైకోర్టులో ఎదురుదెబ్బ
- అనుమతి నిరాకరణ సమర్థనీయమేనన్న న్యాయస్థానం

సాక్షి, హైదరాబాద్: 'సుల్తాన్ ఉల్ ఉలూమ్' కాలేజీలకు సంబంధించి ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) నిర్ణయం సబబేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ కళాశాలల కోర్సులకు అనుమతి పొడిగించకపోవడాన్ని సమర్థించింది. సుల్తాన్ ఉల్ ఉలూమ్ సొసైటీ ఆధ్వర్యంలో నడిచే కళాశాలలు ఉన్న భూమిపై యాజమాన్య హక్కులు లేదా టైటిల్‌ను సమర్పించలేకపోవడం, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు(ఓసీ), భవనాలకు సంబంధించిన ఇతర పత్రాలు సమర్పించకపోవడంతో 2017లో కోర్సుల అనుమతి కొనసాగింపునకు ఏఐసీటీఈ నిరాకరించింది. ఏఐసీటీఈ నిబంధనలు 2016లోని క్లాజ్ 6 ప్రకారం సాంకేతిక విద్యా సంస్థ స్థాపనకు అవసరమైన భూమిని ఉండాలి. దానిపై సంస్థ స్థాపించే వారికి స్పష్టమైన హక్కుతో చట్టబద్ధమైన స్వాధీనం ఉండాలి. కానీ, హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని రోడ్ నెం.3లోని (మౌంట్ ప్లెజెంట్ బిల్డింగ్ అని పిలుస్తారు) 24.10 ఎకరాల స్థలంపై వివాదాలున్నాయి. దీంతో ఏఐసీటీఈకి దీనిపై సుల్తాన్-ఉల్-ఉలూమ్ సొసైటీ యాజమాన్య హక్కులు సమర్పించలేదు. అంతేకాదు ఈ భూమిపై పలు సివిల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏఐసీటీఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సొసైటీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దాదాపు 6 వేల మంది విద్యార్థుల భవిష్యత్‌ను ప్రభావితం చేసే అంశం కావడంతో పెండింగ్‌లోని కేసుల గురించి విద్యార్థులకు తెలియజేయాలనే షరతుతో కోర్సులకు హైకోర్టు తొలుత అనుమతినిచ్చింది. ఈ నేపథ్యంలోనే 24.10 ఎకరాల్లో సుమారు 6 ఎకరాల భూమిని క్లెయిమ్ చేస్తున్న పలు ప్రైవేట్ పార్టీలు 2018లో హైకోర్టును ఆశ్రయించాయి. ఏఐసీటీఈ ఆమోదాన్ని ఉపసంహరించుకోవాలని, అనుమతులను పొడిగించవద్దని ఆదేశించాలని కోరాయి. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి తాజాగా తీర్పు వెలువరించారు. ఏఐసీటీఈ అనుమతి ఇవ్వకపోవడాన్ని సమర్థించారు. నిబంధనలకు లోబడే నిర్ణయం తీసుకుందని చెప్పారు. సొసైటీ పిటిషన్లను కొట్టివేయడంతో విద్యార్థులపై ప్రతికూల ప్రభావం ఉండదన్నారు. ఇప్పటివరకు సొసైటీ కళాశాలల్లో చదివిన విద్యార్థులు సర్టిఫికెట్లు మామూలుగా అందుతాయన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా రిట్ పిటిషన్‌లు దాఖలు చేసినందుకు సొసైటీ నిర్వహిస్తున్న మూడు కళాశాలలతో పాటు కొందరు ప్రైవేట్ వ్యక్తులపై ఒక్కొక్కరికి రూ. 50,000/- చొప్పున జరిమానా విధించారు. ఈ మొత్తాన్ని శ్రీ విద్యాస్ ప్రత్యేక పిల్లల కేంద్రం (అనాథాశ్రమం)లో ఖర్చులకు రెండు వారాల్లో చెల్లించాల్సిందిగా ఆదేశించారు. కాగా, తీర్పుపై స్టే ఇవ్వాలని సొసైటీ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి కోరగా.. అంగీకరించిన న్యాయమూర్తి రెండు వారాలు సమయం ఇచ్చారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డే

బంజారాహిల్స్: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమం నుంచి కమలాపురికాలనీ మార్బుల్ షాపులు, గ్రీన్‌బావర్చి మీదుగా సాయి వైన్స్, పీజేఆర్ విగ్రహం వరకు బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఆపరేషన్ రోప్ కార్యక్రమం చేపట్టారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ సాయిప్రకాష్‌గౌడ్‌తో కలిసి సిబ్బంది ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించారు. రోడ్డుకు రెండువైపులా షాపుల ముందు దుకాణ యజమానులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అద్దెలకు ఇవ్వడమే కాకుండా తమ సొంత సామగ్రిని కూడా ఏర్పాటు చేశారు. దీంతో 35 షాపుల ముందు ఆక్రమణలు తొలగించారు. అలాగే చాలామంది వ్యాపారులు ఫుట్‌పాత్‌లపైనే తమ కార్లు, బైక్‌లు పార్కింగ్‌లు చేస్తుండటంతో వీటిని కూడా తొలగించి ఫుట్‌పాత్‌లు క్లియర్ చేశారు. వీరికి హెచ్చరికలు జారీ చేసి కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల పాదచారులు రోడ్డుపై నడవడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని రాహుల్ హెగ్డే పేర్కొన్నారు. మరోసారి ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పలు చోట్ల వాహన తనిఖీలు



కౌన్సెలింగ్ ఇస్తున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు

బంజారాహిల్స్: ట్రాఫిక్ పోలీసులు గత మూడు రోజుల నుంచి హెల్మెట్, రాంగ్‌సైడ్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వేర్వేరు చోట్ల నిర్వహించిన వాహన తనిఖీల్లో హెల్మెట్ ధరించకుండా బైక్‌లు నడుపుతున్న 75 మందిని ఆపి జరిమానాలు విధించి హెల్మెట్ తెచ్చుకున్న తర్వాతనే బైక్‌లను విడుదల చేశారు. అలాగే మరో 75మంది వాహనదారులు రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేస్తుండగా వారిని కూడా అదుపులోకి తీసుకుని జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 150 మందిపై కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ కూడా ఇచ్చినట్లు బంజారాహిల్స్ ట్రాఫిక్ సీఐ సాయి ప్రకాష్‌గౌడ్ తెలిపారు. ఈ డ్రైవ్ ఇంకా కొన్ని రోజులు కొనసాగుతుందని, ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించిన తర్వాతనే రోడ్డెక్కాలని సూచించారు.

రేడియేషన్ థెరపీలో నగరం ఎప్పుడూ ముందంజ

రేడియో థెరిపీపై మూడురోజులపాటు జాతీయస్థాయి సదస్సు



సదస్సు ప్రారంభోత్సవంలో నోరి దత్తాత్రేయులు తదితరులు

బంజారాహిల్స్: నగరం రేడియేషన్ థెరపీలో ఎప్పుడూ ముందంజలో ఉందని ప్రపంచ ప్రఖ్యాత రేడియేషన్ అంకాలజిస్టు, ట్రస్టు బోర్డు సభ్యులు డాక్టర్ నోరి దత్తాత్రేయులు అన్నారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాత రేడియేషన్ అంకాలజిస్టులతో పాటు రేడియేషన్ పిజిస్టులలో 50శాతం పైగా భారతీయ మూలాలు కలిగిన వారే ఉండడం మనకెంతో గర్వకారణమన్నారు. బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, అసోసియేషన్ ఆఫ్ మెడికల్ ఫిజిసిస్టు ఆఫ్ ఇండియా సంయుక్తంగా మూడు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యంగా రేడియేషన్ థెరపీ సందర్భంలో ఇచ్చే రేడియేషన్ మానవునిని జన్యు నిర్మాణంపై ఎలాంటి ప్రభావం చూపనున్నదనే విషయంపై దేశం నలుమూలల నుంచే కాకుండా పలు దేశాల నుంచి వచ్చిన వైద్య నిపుణులు చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ నోరి దత్తాత్రేయులు మాట్లాడుతూ నగరంలో ఇలాంటి సదస్సు నిర్వహించడం సంతోషకరమన్నారు. అయితే రేడియేషన్ థెరపీకి చెందిన పలు పరిశోధనలకు మూలం హైదరాబాద్ నగరమనే విషయాన్ని అందరూ గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి, ట్రస్టు బోర్డు సభ్యులు జేఎస్‌ఆర్ ప్రసాద్, రేడియేషన్ పిజిసిస్టు విభాగాధిపతి మధుసూదన శ్రేష్ఠి, సీఈఓ కృష్ణయ్య, ఏఎంపీఐ చాప్టర్ అధ్యక్షులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని అంతం చేయడంలో యువత పాత్ర కీలకం



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్

పంజగుట్ట: అవినీతిని అంతం చేయడంలో యువత పాత్ర ఎంతో కీలకమని ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ అన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా సమైఖ్య భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్ర సంఘటన్, కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖల సహకారంతో శుక్రవారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సై నాగరాజు, సమైఖ్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అవినీతిని అంతమొందించడంలో ప్రతీఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. అవినీతి లేని సమాజం రూపొందించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ మార్పు ఎక్కడ నుంచో రావాలని చూడకూడదని, మననుంచే మార్పు రావాలని అవినీతి ఎక్కడ జరిగినా ధైర్యంగా నిలదీయాలన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సమాజంలో అవినీతి, లంచగొండితనం మితిమీరిపోయిందని, దాన్ని అరికట్టేందుకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొనగా డి.రాహుల్ ప్రథమ బహుమతి, బి.రవీందర్ ద్వితీయ బహుమతి, ఈ.శివ తృతీయ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రవీందర్, ఎస్.విజయలక్ష్మి, అధ్యాపకులు వి.వి.సుబ్బారావు, జగన్నాధరావు, గిరిధర్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక వైపు వ్యర్థాలు.. మరో వైపు మురుగు..!



ఆషియానా హాల్ రోడ్డులో మురుగునీరు...



ఫుట్‌పాత్‌పై గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలు

- అధ్వానంగా మారిన ఆషియానా బంకెట్‌హాల్ రోడ్డు
- పట్టించుకోని అధికారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని తాజ్‌కృష్ణా ఎదురుగా ఉన్న ఆషియానా బంకెట్ హాల్ రోడ్డు రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఎవరూ దీనిని పట్టించుకోకపోవడంతో ఈ దారిగుండా వెళ్ళేవారు నరకాన్ని చవిచూస్తున్నారు. గడిచిన ఏడాది కాలంగా ఈ రోడ్డులో నిత్యం మురుగు పారుతూ పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. దీనికితోడు స్థానికులతో పాటు జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పెద్దఎత్తున చెత్తను ఇక్కడ పడేస్తుండటంతో సమస్య ఇంకా జటికంగా మారింది. దీంతో జలమండలి అధికారులకు మురుగు సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సాఫీగా సాగుతున్న సమగ్ర సర్వే..!

- ఖైరతాబాద్ నియోజకవర్గంలో మొత్తం 55 వేల గృహాలు
- 95 శాతం ఇళ్లకు స్టిక్కర్లు అంటివేత
- నేటి నుంచి 75 ప్రశ్నలతో సర్వే చేయనున్న ఎన్యుమరేటర్లు



సమగ్ర సర్వేలో భాగంగా ఇంటింటికి స్టిక్కర్లు అంటిస్తున్న ఎన్యుమరేటర్లు..

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, ఆదాయ, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సాఫీగా సాగుతున్నది. ఈ నెల 6న ప్రారంభమయ్యే సమగ్ర సర్వే మూడు రోజులపాటు మొదటి దశలో భాగంగా శుక్రవారం రాత్రి వరకు ఇళ్ల గుర్తింపు, యజమానుల పేర్ల నమోదు, స్టిక్కర్లు అంటించే కార్యక్రమం పూర్తి చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 95 శాతం ఇళ్లకు స్టిక్కర్లు అంటించే ప్రక్రియ పూర్తయ్యింది. మిగిలిన ఇళ్లకు కూడా శనివారం స్టిక్కర్లు అంటించనున్నారు. కొన్ని ఇళ్ల తాళాలు వేసి ఉండడం, ఇంటి యజమాని అందుబాటులో లేకపోవడంతో స్టిక్కర్లు అంటించే కార్యక్రమంలో కొంత వెనుకబాటు కనిపించింది. కీలకమైన రెండో దశ శనివారం నుంచి మొదలుకానుంది. కుటుంబాల వారీగా సమగ్ర వివరాలు సేకరించేందుకు ఎన్యుమరేటర్లు సమాయత్తమవుతున్నారు. నియోజకవర్గంలోని ఆరు డివిజన్ల పరిధిలో సుమారుగా 55 వేల గృహాలు ఉన్నట్లుగా అధికారులు భావిస్తున్నారు. శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 45వేల గృహాలకు స్టిక్కర్లు అతికించారు. నియోజకవర్గంలో 800 ఎన్యుమరేటర్ బ్లాక్ (ఈబీ)లుగా ఉన్నతాధికారులు విభజించారు. బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్లలో ఈ బ్లాక్‌లు ఏర్పాటు చేసి ఎన్యుమరేటర్లు స్టిక్కరింగ్ అతికించారు. కేటాయించిన ఈబీల వారీగా మ్యాప్ ఆధారంగా ప్రతి ఇంటికీ తిరుగుతూ స్టిక్కర్లు అతికించారు. ఇంటి నెంబర్, యజమాని పేరు, నమోదు చేసిన ప్రక్రియ దాదాపుగా పూర్తయ్యింది. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ ప్రక్రియ కొంతమేర మిగిలి ఉండగా శనివారం మధ్యాహ్నానికి పూర్తి చేయాలని నిర్ణయించారు. ఎన్యుమరేషన్ బ్లాక్‌ల వారీగా ఇళ్లు, యజమానుల జాబితాను ఎన్యుమరేటర్లు రూపొందిస్తున్నారు.

అద్దె ఇళ్లల్లో ఉంటే..

అద్దె గృహాల్లో నివసిస్తున్న వారికి ప్రస్తుతం ఉంటున్న ఇళ్లల్లోనే మరో కుటుంబంగా గుర్తించి స్టిక్కర్ అంటించారు. వివిధ కారణాలతో బయట నివసిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. ఇలాంటి వాళ్లు సర్వేలో తమ వివరాలు వెల్లడించాలా? ఆధార్ కార్డు ఉన్నచోట నమోదు చేయించాలా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం నుంచి ప్రారంభం కానున్న కీలక సర్వేలో ఇలాంటి సందేహాలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

75 ప్రశ్నలతో..

శనివారం నుంచి ప్రారంభం కానున్న రెండో దశలో 75 ప్రశ్నలతో సమాచారం రాబట్టనున్నారు. ఇంటి యజమాని పేరు, ఇంటి నెంబర్ ఇప్పటికే నమోదు చేశారు. మరోవైపు తమ ఇంటికి సర్వే స్టిక్కర్ అతికించారో లేదో ఖచ్చితంగా చూసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. 75 ప్రశ్నలతో కూడిన సమగ్ర కుటుంబ వివరాల్లో భాగంగా కుటుంబంలో ఉన్న అందరి పేర్లు, వారి ఆధార్ నెంబర్లు, వ్యవసాయ భూమి ఉంటే పట్టా పాస్‌బుక్ నెంబర్, వార్షిక ఆదాయం, చదువు వంటి వివరాలను సూచించిన మేరకే నమోదు చేస్తారు. కుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేస్తారు. కులం, ఉపకులం అనే వివరాలను చాలా స్పష్టంగా చెప్పాల్సి ఉంటుంది. దీని ఆధారంగానే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, మైనారిటీ..ఇలా అన్ని కు లాల వారి శాతాన్ని లెక్కించడం జరుగుతుంది. విదేశాల్లో ఉన్నవారు సైతం తమ వివరాలు తమ బంధువుల ద్వారా నమోదయ్యేలా చూసుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు.

మూసీ యాత్రలో కార్పొరేటర్లు

రహమత్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన మూసీ పునర్జీవ కార్యక్రమంలో రహమత్‌నగర్, బోరబండ కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, బాబా ఫసియుద్దీన్‌లు నగరమేయర్ విజయలక్ష్మితోపాటు పాల్గొన్నారు. వీరితో డీసీసీ అధ్యక్షులు డా. రోహిత్‌రెడ్డి, నగర కాంగ్రెస్ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొని మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న దుర్గంధాన్ని పరిశీలించారు.

ఆహ్వానం

శ్రీనగర్‌కాలనీ: మలేషియా తెలంగాణా అసోషియేషన్ గ్లోబర్ ఆర్గనైజేషన్ ఆఫ్ పీపుల్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9న మలేషియా కౌలాంపూర్‌లోని మా ట్రేడ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో దశాబ్ది ఉత్సావాలు (మైతా) ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ప్రముఖ న్యాయవాది, సామాజిక కార్యకర్త సుంకర నరేష్‌ను శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకర్గంలో మైతా కార్యవర్గ సభ్యులు కలిసి ఆహ్వానాన్ని అందించారు. ఉత్సవాలకు హాజరై విలువైన సందేశాన్ని అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు సైతం తిరుపతి, మాదాసు రమేష్, అగ్ని శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి

లిబర్టీ: కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల పక్షపాతి అని, కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పేదల అభివృద్ధి సాధ్యమవుతుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమార స్వామి అన్నారు. శుక్రవారం దళ్ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంతో ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అధినేత, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నాయకులు రాహుల్‌గాంధీ చొరవతోనే కులగణనకు శ్రీకారం చుట్టారన్నారు. అనేకేళ్ల తరువాత తెలంగాణ రాష్ట్రంలో కులగణనకు శ్రీకారం చుట్టడం గొప్ప పరిణామమన్నారు. రాహుల్‌గాంధీ ఎన్నికల ముందు కులగణన చేస్తామని హామీ ఇచ్చారని, ఆయన హామీ మేరకు ఇప్పుడు చేపట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కులగణన వల్ల ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఏ వర్గాలకు ఫలాలు అందాలో ఆ వర్గాలకు అందుతాయని ఆయన స్పష్టం చేశారు.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి

కాచిగూడ: ఆత్మరక్షణ కోసం విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీ రామన్‌గౌడ్ అన్నారు. జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 19వ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో భాగంగా మహిళా విభాగంలో గ్రాండ్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్న విద్యార్థిని యోగినిని ఆమె ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మహిళలకు ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతగానో ఉపయోగపడతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జిఎస్ గోపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, కరీమ్, శ్యాంకుమార్, హంస, అమృత రెడ్డి, గణ సంతోషిణి, రంజిత్ సింగ్, కరాటే విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్‌లో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న మాదిగ, చర్మకార సంఘాల జేఏసీ ప్రతినిధులు

పంజగుట్ట: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా తెలంగాణ మాదిగ చర్మకార సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ అధికార ప్రతినిధి దేవని సతీష్ మాదిగ, జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ఈ.మురళీ దర్శన్, చీఫ్ అడ్వైజర్ చింతస్వామి మాదిగలు మాట్లాడుతూ చెప్పులు, బూట్లు వేసుకున్న కాళ్ళు ప్రపంచంలో ముందడుగు వేస్తున్నాయని కానీ అవి కుట్టే మాదిగలు ఆర్థికంగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా జిల్లాల్లో లెడ్ క్యాబ్ కంపెనీలు మూతపడ్డాయని, మిషనరీ కూడా జంగు పట్టిందన్నారు. ముఖ్యమంత్రి జన్మదినాన మూసీ నదీకి పునర్జీవనం కల్పించడానికి పాదయాత్ర చేస్తున్నారని, మూసీని శుద్ధి చేయటానికి సిద్ధపడ్డ ముఖ్యమంత్రి మాదిగల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే లెదర్ డవలప్‌మెంట్ కోర్సుపెట్టి అందులో మాదిగలకే సీట్లు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న తెలంగాణ లెదర్ ఇండస్ట్రీయల్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థను పునరుద్ధరణ చేయాలని గతంలో అనేకసార్లు ప్రభుత్వాలను కోరామని వారు స్పందించలేదని కనీసం ప్రజా ప్రభుత్వంలో అయినా దాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చీఫ్ ప్యాట్రన్ మెంటర్ విజయ్ ఆర్య, సీ.హెచ్. రాజమౌళి, కె. రామకృష్ణ, మూలుగు రాజు, మేరీ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెంగళరావునగర్: ఆదిత్యా ఎన్‌క్లేవ్, జయశంకర్‌నగర్ 11కెవీ ఫీడర్లు, మైత్రీవనం, బోరబండ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆదిత్య బ్లాక్, వింధ్య బ్లాక్, కుమ్మరి బస్తీ, ఇమ్రోజ్‌హోటల్ లైన్, ఆనంద్‌బజార్, జీన్స్ కార్నర్, కాకతీయమెస్, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు, పద్మావతినగర్, ఎస్‌ఆర్‌ఆర్‌పురం సైట్-3 ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ శుక్రవారం తెలిపారు. అదేవిధంగా మైత్రీవనం, పెద్దమ్మనగర్ 11కెవీ ఫీడర్లు, మైత్రీవనం, ఎస్‌పిఆర్‌హిల్స్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు గాయత్రీనగర్, ఎస్‌పిఆర్‌హిల్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దీనిని వినియోగదారులు గమనించాలని తెలిపారు.

శ్రీరాంనగర్‌లో ఘనంగా గ్యార్మీ ఉత్సవాలు

రహమత్‌నగర్: శ్రీరాంనగర్ చిల్లా వద్ద గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు గురువారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవానిశంకర్, ముస్లిం నాయకులు సుల్తాన్, ముల్తాని, షేక్ సాబేర్, సులేమాన్, ముఖీమ్, ఒమర్ తదితరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే విధంగా శుక్రవారం ఉదయం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

నచ్చిన రంగాల్లో ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు

ఘనంగా విజ్ఞానజ్యోతి స్పోర్ట్స్ డే వేడుకలు



మాట్లాడుతున్న రాజీవ్ త్రివేది

వెంగళరావునగర్: విద్యార్థులకు నచ్చిన రంగాల్లో వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని మాజీ ఐపీఎస్ అధికారి రాజీవ్ త్రివేది, ప్రముఖ సినీ నిర్మాత, విజ్ఞానజ్యోతి స్కూల్ అధ్యక్షులు డి.సురేష్‌బాబులు అన్నారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని విజ్ఞానజ్యోతి పబ్లిక్ స్కూల్ యాన్యువల్ స్పోర్ట్స్ డే వేడుకలు శుక్రవారం యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది క్రీడాకారులు చదువులో కాకుండా క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పేరు ప్రఖ్యాతలు సంపాదించొచ్చని నిరూపించారన్నారు. నేటి సమాజంలో చదువుతో పాటుగా అనేక రంగాల్లో రాణిస్తూ తమ ప్రతిభను నిరూపించుకున్న వారు ఎందరో ఉన్నారని, వారిని నేటితరం విద్యార్థినీ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అయితే తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువు మాత్రమే చాలంటూ వారిపై అనవసరమైన ఒత్తిడిని తీసుకువస్తున్నారని, దానిని తట్టుకోలేక విద్యార్థులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తమ పిల్లలకు ఏ రంగంలో ఇష్టమో ఆ రంగంలో ప్రోత్సహించాలని సూచించారు. విజ్ఞానాన్ని నేర్పించే చదువుతో పాటుగా పిల్లలు ఆటపాటల్లో దృష్టి సారించాలని సూచించారు. తొలుత విద్యార్థులు వివిధ క్రీడల్లో తమకున్న ప్రావీణ్యతను వ్యక్త పరిచారు. అనంతరం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతి ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ జి.కృష్ణప్రసాద్, మాజీ ఐపీఎస్ అధికారి దుర్గాప్రసాద్, సీనియర్ ప్రిన్సిపాల్ జె.అరుణకుమారి, పెద్ద సంఖ్యలో టీచర్లు, విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



కరాటేలో ప్రతిభ చూపుతున్న విద్యార్థిని

నల్లబ్యాడ్జీలు ధరించి అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు నిరసనను కొనసాగించారు. అధ్యాపక, అధ్యాపకేతర, ఉద్యోగ సంఘాల నేతలు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, జేఏసీ నేతలు ఎల్వీకే రెడ్డి, శ్రీనివాస్, వేణుగోపాల్, రజనీకాంత్, రాములు, రుషేంద్రమణి, అవినాష్, కిషోర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి

సెంచరీ మ్యాట్రిసెస్ స్లీప్ స్పెషలిస్ట్ స్టోర్‌ను ప్రారంభించిన మేయర్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లో నూతనంగా ఏర్పాటు చేసిన సెంచరీ మ్యాట్రిసెస్ స్లీప్ స్పెషలిస్ట్ స్టోర్‌ను జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించినప్పుడే వారి మన్ననలను పొందుతారని చెప్పారు. సెంచరీ ఫైబర్ ప్లేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఉత్తమ్ మలానీ మాట్లాడుతూ కస్టమర్ల వారి వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మ్యాట్రిసెస్‌ను ఆకర్షణీయమైన డిజైన్లతో రూపొందించడం జరుగుతుందన్నారు. సెంచరీ మ్యాట్రిసెస్ దేశంలో 4,500లకు పైగా అవుట్‌లెట్లు, 450కి పైగా ప్రత్యేక బ్రాండ్ స్టోర్ల నుంచి మల్టీబ్రాండ్ డీలర్లతో బలమైన వ్యాపార సామ్రాజ్యాన్ని కలిగి ఉందన్నారు.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు



వేడుకల్లో రహమత్‌నగర్‌లో సీఎన్‌రెడ్డి

రహమత్‌నగర్ (బోరబండ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో శుక్రవారం ఘనంగా జరిగాయి. బోరబండలో కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, రహమత్‌నగర్‌లో కార్పొరేటర్ సీఎన్ రెడ్డిల నేతృత్వంలో కేక్‌లు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎస్పీఆర్‌హిల్స్ పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత సంఘం అధ్యక్షుడు వేముల యాదయ్య సారథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కేక్‌కట్ చేశారు. నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భవాని శంకర్ నేతృత్వంలో సీఎం పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు.

సత్కారం



షబ్బీర్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న పోలీస్ అధికారులు

రహమత్‌నగర్: ప్రముఖ సంఘ సేవకుడు, ఎస్పీఆర్‌హిల్స్ హెచ్‌ఎఫ్‌నగర్‌కు చెందిన పీస్ కమిటీ నాయకుడు మహ్మద్ షబ్బీర్‌ను సెంట్రల్ పీస్ వెల్ఫేర్ కమిటీ సౌత్, వెస్ట్‌జోన్ వారు ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఇటీవల జరిగిన బోనాలు, దసరా, మీలాద్ ఉన్‌నబీ, వినాయక చవితి, మొహర్రం తదితర వేడుకల్లో పోలీసులకు సహకరించినందుకు షబ్బీర్‌కు సౌత్, వెస్ట్‌జోన్ డీసీపీలు, అడిషనల్ డీసీపీ వెస్ట్ జోన్‌లతో పాటు పీస్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ మోజమ్ అలీ, బోరబండ కమిటీ అధ్యక్షుడు నయామొద్దీన్ తదితరులు సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడటంలో ప్రతిపౌరుడు పోలీసులకు సహకరించాలని కోరారు.

జూపార్కును సందర్శించిన విద్యార్థులు



జూపార్క్‌ను సందర్శిస్తున్న సంస్కార్ స్కూల్ విద్యార్థులు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్ విద్యార్థులు జూపార్కును సందర్శించి పలు విషయాలను తెలుసుకున్నారు. శుక్రవారం ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా విద్యార్థులను నగరంలోని జూపార్క్‌కు తీసుకెళ్లిన ఉపాధ్యాయులు జంతువులు, మొక్కల గురించి వివరించారు. అలాగే జూపార్కును సందర్శించిన విద్యార్థులు ఎంతో సందడిగా పార్కులో గడిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్ మధుమతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు సహకరిస్తాం

పరిశ్రమలు, సమాచార సాంకేతిక శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు



సాక్షి, సిటీబ్యూరో: జమాతే ఇస్లామీ హింద్ జాతీయ మహాసభలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని పరిశ్రమలు, సమాచార సాంకేతిక శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సచివాలయంలో శుక్రవారం తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌తో పాటు సదస్సు నిర్వాహకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఐక్యతను పెంపొందించే కార్యక్రమాల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. సదస్సు విజయవంతం చేయడానికి పోలీస్, ఫైర్ సేఫ్టీ, మున్సిపల్, తెలంగాణ స్టేట్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అంతకుముందు ఈ నెల 15 నుంచి 17 వరకు హైదరాబాద్‌లోని పహాడీ షరీఫ్ రోడ్‌లోని వాడి-ఎ-హుదాలో సదస్సు నిర్వహించనున్నామని, ప్రభుత్వపరంగా సహకరించాలని నిర్వాహకులు అబ్దుల్ జబ్బార్ సిద్ధిఖీ వినతి పత్రం అందించారు. 12 వేల నుంచి 15 వేల మంది ప్రతినిధులు పాల్గొంటారని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా ఓబుల్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ క్రీడాదినోత్సవం



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పతకాలు అందజేస్తున్న పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ

చందానగర్: డీడీఎంఎస్ పి.ఓబుల్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలు శుక్రవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి అథ్లెటిక్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. క్రీడాదినోత్సవానికి ముఖ్య అతిథులుగా సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ (ఐఎఫ్ఎస్), ఓబుల్‌రెడ్డి ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ ఎస్‌వీ.రావు, సెక్రటరీ ఇ.నరసింహారావు, ప్రిన్సిపాల్ కె.వినీత హాజరై టార్చ్ రిలేను ప్రారంభించారు. ఈ టార్చ్ రిలేను ఓబుల్‌రెడ్డి స్కూల్ నుంచి రాష్ట్రం, జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీలకు అర్హత సాధించి పాల్గొన్న విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజ మాట్లాడుతూ.. విద్యార్థులు నిత్యం చదువుతో పాటు క్రీడలు ఆడాలని, వాటి వల్ల మానసిక ప్రశాంతతో పాటు ఉల్లాసంగా ఉంటారన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ఆ మార్గంలో నడవాలన్నారు. తాను మూడుసార్లు సివిల్స్ రాశానని, ఎప్పుడూ కుంగిపోలేదని, మళ్లీమళ్లీ కష్టపడి చదివి ఐఎఫ్ఎస్‌లో ర్యాంకు సాధించానన్నారు. అనంతరం 12వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినందన్ కుమార్ సావలీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంకా పూర్తి కాని.. ఇంటింటి స్టిక్కర్లు!

- 85 శాతం ఇళ్లకే స్టిక్కర్లు
- పూర్తయిన ప్రాంతాల్లోనే నేటి నుంచి సర్వే

సాక్షి, సిటీబ్యూరో: సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఇంటింటికీ స్టిక్కర్లు అంటించే కార్యక్రమం జీహెచ్ఎంసీలో ఇంకా పూర్తి కాలేదు. ఈ నెల 6వ తేదీ నుంచి స్టిక్కర్ల కార్యక్రమం ప్రారంభమైనప్పటికీ, శుక్రవారం వరకు అన్ని ఇళ్లకూ స్టిక్కర్లు అంటించే కార్యక్రమాలు పూర్తికాలేదు. 8వ తేదీ వరకు స్టిక్కర్లు అంటించే కార్యక్రమం పూర్తిచేసి.. 9వ తేదీ నుంచి సర్వే ప్రారంభిస్తారని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా పేర్కొన్నారు. కానీ.. శుక్రవారం వరకు స్టిక్కర్లు అంటించే కార్యక్రమం పూర్తికాలేదు.

85 శాతం పూర్తి..

జీహెచ్ఎంసీ పరిధిలో ఇప్పటి వరకు దాదాపు 85 శాతం మాత్రమే స్టిక్కర్లు అంటించే కార్యక్రమం పూర్తయింది. మిగతా ఇళ్లకు శనివారం మధ్యాహ్నం వరకు పూర్తికాగలదని అధికారులు భావిస్తున్నారు. ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి, సర్వేకు సంబంధించి ఏయే పత్రాలు రెడీగా ఉంచాలో వారికి వివరించాకే సర్వే ప్రారంభించాల్సి ఉండటంతో స్టిక్కర్ల కార్యక్రమం పూర్తయిన సర్కిళ్లలో మాత్రమే శనివారం నుంచి సర్వే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

పరిహారంపై తేల్చాకే విస్తరించాలి

ఎలివేటెడ్ కారిడార్‌లపై ఎంపీ ఈటల రాజేందర్



కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్: రోడ్డు విస్తరణ బాధితులకు ఇచ్చే పరిహారంపై స్పష్టత ఇచ్చాకే పనులు చేపట్టాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం జరిగిన కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో పాల్గొన్న ఆయన ఎలివేటెడ్ కారిడార్‌లకు సంబంధించిన అంశంపై పలు సూచనలు చేశారు. జాతీయ రహదారి-44, రాష్ట్ర రహదారి-01 మార్గాల్లో చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం 60 మీటర్లకు బదులుగా 40 మీటర్లు విస్తరిస్తే సరిపోతుందని, గత బోర్డు సమావేశంలో ఎంపీ ఈటల సూచించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించకపోవడంతో మరోసారి ఈ అంశంపై బోర్డులో చర్చించారు. ఈ నేపథ్యంలో తాజా బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన పూర్తిస్థాయి రోడ్‌మ్యాప్ ను వివరించాకే, పనులు చేపట్టాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్న తరుణంలో, 60 మీటర్ల మేరకు రోడ్డు విస్తరించాల్సిన అవసరం లేకుండానే నిర్మాణం చేపట్టే వెసులుబాటు కలుగుతుందన్నారు.

- 60 మీటర్లకు విస్తరిస్తే రాజీవ్ రహదారి మార్గంలో పెద్ద సంఖ్యలో నివాసితులు పూర్తిగా ఆస్తులు కోల్పోయి జీవనోపాధి కరువయ్యే ప్రమాదం ఉందన్నారు.
- ప్రభుత్వం నిర్ణయించిన విలువకు, మార్కెట్ విలువకు వ్యత్యాసం భారీగా ఉంటుందన్నారు. రూ.కోట్ల విలువైన ఆస్తులకు, రూ.లక్షల్లో మాత్రమే పరిహారం ఇవ్వడం సరికాదన్నారు.
- ఇక కంటోన్మెంట్‌లో టీడీఆర్ వర్తించదని, ఆస్తులతో పాటు ప్రజలు కోల్పోయే జీవనోపాధికి సైతం పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు.
- హెచ్ఎండీఏ అధికారులు రోడ్డు విస్తరణ రూట్‌మ్యాప్‌ను ప్రత్యక్షంగా వివరించాకే ముందుకెళ్లాలన్న ఎంపీ సూచనకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ మేరకు రోడ్డు విస్తరణపై పునరాలోచించాల్సిందిగా హెచ్ఎండీఏకు మరోసారి లేఖ రాయాలని బోర్డు తీర్మానించింది.

నగరంలో నేడు

- రాష్ట్ర భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శివచంద్ర లాహరీ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ రవీంద్రభారతిలో ఉదయం 11.30గంటలకు నవ వసంత కింకిణి నద రసమయం 9వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటుంది.
- ఎన్టీఆర్ స్టేడియం వేదికగా భక్తి టీవీ ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుంది.
- తారామతి, బారాదరి కల్చరల్ కాంప్లెక్స్‌లో రాత్రి 7 గంటలకు ఖదీర్ అలీ బేగ్ థియేటర్ ఫెస్టివల్ జరుగుతుంది.
- భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో డైమండ్ జూబ్లీ వేడుకలు దోమలగూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతాయి. వేడుకల్లో గవర్నర్ విష్ణుదేవ్ వర్మ పాల్గొననున్నారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే.. హిందూ దేవాలయాలపై దాడులు

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



ధ్వంసమైన విగ్రహాలను పరిశీలిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

శంషాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడుల పరంపర కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 10 నెలల కాలంలో రాష్ట్రంలో వందకుపైగా హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయన్నారు. ఇటీవల పట్టణంలోని ఎయిర్ పోర్టు కాలనీ హనుమాన్ దేవాలయంలో గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన నవగ్రహాల విగ్రహాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటు రాజకీయాల కోసమే కాంగ్రెస్ సర్కారు ఇలాంటి దారుణ ఘటనలపై కూడా చర్యలు తీసుకోవడానికి వెనకాడుతోందన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ జరుగుతున్న వరుస దాడులపై ప్రభుత్వం చర్యలకు వెనుకంజ వేయడం మంచి పద్ధతి కాదన్నారు. దేవాలయాలపై జరిగిన దాడులను పిచ్చోళ్ల నెపంతో వదిలేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ముత్యాలమ్మ గుడి ఘటనలో కూడా ఇలాగే చేసేందుకు ప్రయత్నించిన ప్రభుత్వం ప్రజల తిరుగు బాటుతో దిగివచ్చిన నిందితుడిని పట్టుకుందన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రాష్ట్రంలోని దేవాలయాలను హిందువులే పరిరక్షించుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఓటు రాజకీయాల కోసం ఓ వర్గాన్ని ప్రోత్సహించిందన్నారు. ఎయిర్‌పోర్టు కాలనీ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితులను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు నేడు పనిదినం

సాక్షి, సిటీబ్యూరో: రెండో శనివారం కావడంతో నేడు సెలవుదినమే అని అందరూ భావిస్తారు. కానీ, గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు శనివారం పనిచేయనున్నాయి. గణేశ్ నిమజ్జనం సందర్భంగా సెప్టెంబర్ 17వ తేదీన ఈ జిల్లాల్లో వాటికి సెలవు దినంగా ప్రకటించిన ప్రభుత్వం.. దాని బదులు నవంబర్ 9 రెండో శనివారం పనిచేయాలని స్పష్టం చేసింది. దీంతో.. నేడు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు పని చేస్తాయని జీహెచ్ఎంసీ పేర్కొంది.

ఆర్టీఏలో సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



సాక్షి, సిటీబ్యూరో: రవాణాశాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖైరతాబాద్ రవాణా కమిషనర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్‌కుమార్ నేతృత్వంలో అసోసియేషన్ ప్రతినిధులు కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, జీఎస్‌కె శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

కీసరగుట్టలో వైభవంగా దీపోత్సవం



కీసర: కీసరగుట్ట రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం పురస్కరించుకొని శుక్రవారం విశేష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు విశేష దీపోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు ఉచితంగా మట్టి ప్రమిదలు, నూనె, వత్తులు, పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్టు ముక్క, ప్రసాదం అందజేశారు.

కథా రచయితలకు సత్కారం 12న

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై వంశీ ఇంటర్నేషనల్ ఇండియా నిర్వహణలో ఈ నెల 12వ తేదీన 52మంది కథా రచయితలకు సత్కారం చేయనున్నట్లు వంశీ రామరాజు, డాక్టర్ తెన్నేటి సుధ, శైలజ తెలిపారు. చిక్కడపల్లిలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. 52మంది రాసిన కొత్త కథలు 6వ భాగం ఆవిష్కరణ సభలో రచయితలకు సత్కారం చేస్తామన్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ పాల్గొని సంపుటిని ఆవిష్కరించగా, సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అధ్యక్షత వహిస్తారని అన్నారు. అతిథులుగా చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య సూర్యధనుంజయ్, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య నిత్యానందరావు, నాట్య గురువు ప్రసన్నరాణి, జర్నలిస్ట్ మా శర్మ, దర్శకుడు రేలంగి నరసింహారావు తదితరులు పాల్గొంటారు. కొత్త కథలు సంపుటిని లాంఛనంగా డాక్టర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి(అమెరికా)కి అంకితం ఇస్తామని వారు తెలిపారు. కార్యక్రమానికి తొలుత అలనాటి నటి జమున సంస్మరణలో ఆకునూరి శారద(అమెరికా) సహ గాయకురాలు రామకృష్ణ, సాయి మేఘన, తుషార నిలయ తదితరులచే జమున నటించిన సినిమా పాటల విభావరి ఉంటుందని తెలిపారు.

నాంపల్లిలో మెగా రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

నాంపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్‌నగర్ సిద్దిఖ్ ఫంక్షన్ హాల్‌లో తలసీమియా వ్యాధిగ్రస్తుల సహాయార్థం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని నాంపల్లి కాంటెస్టెడ్ కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ ఫిరోజ్ ఖాన్ నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ హాజరై ఉదయం 11 గంటలకు మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. వందలాది మంది యువకులు, నేతలు, కాంగ్రెస్ కార్యకర్తలు రక్తదానం చేశారు. హైదరాబాద్ నుంచే కాకుండా రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాల నుంచి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నట్లు వివరించారు. హైడ్రాను అమలులోకి తీసుకువచ్చి మూసీ నదిని ప్రక్షాళన చేస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని కాంగ్రెస్ నేత మహ్మద్ ఫిరోజ్ ఖాన్ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి రషీద్‌ఖాన్, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, నేతలు ఉస్మాన్ ఉల్ హజ్రీ, బి.రమేష్, జి.వెంకటేష్, ఉస్మాన్ మహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

'ఏఆర్'తో ఆర్థోపెడిక్ సంరక్షణలో ముందున్నాం

అరెటే ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల



సమావేశంలో వైద్యాధికారులు

గచ్చిబౌలి: అగ్మెంటెడ్ రియాలిటీ సాంకేతికతను స్వీకరించడం ద్వారా ఆర్థోపెడిక్ సంరక్షణలో తాము ముందున్నామని అరెటే ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని అరెటే ఆస్పత్రి ఆధ్వర్యంలో మోచిప్పల మార్పిడిపై విలేకరుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్ సాంకేతికత మా రోగులకు సరైన ఇంప్లాంట్ అలైన్‌మెంట్, వేగవంతమైన రికవరీ సమయాలను నిర్ధారిస్తూ తిరుగులేని ఖచ్చితత్వంతో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను నిర్వహించడానికి వీలు కల్పిస్తుందన్నారు. అత్యంత నైపుణ్యం కలిగిన శస్త్రచికిత్స బృందం అత్యంత సంక్లిష్టమైన మోకాలి పరిస్థితులను కూడా నిర్వహించడానికి పూర్తిగా సన్నద్ధమైందన్నారు. ఈ అధునాతన వ్యవస్థ మా శస్త్రచికిత్స ఖచ్చితత్వం, సరళత్వాన్ని మరింత మెరుగు పరుస్తుందన్నారు. మోకాలి సంబంధిత వ్యాధులకు చికిత్స చేయడంలో మా నైపుణ్యంతో అత్యాధునిక సాంకేతికతను మిళితం చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలను అందించడానికి తాము కట్టుబడి ఉన్నామన్నారు. అరెటే ఆస్పత్రులు ఆర్థోపెడిక్ కేర్‌లో అగ్రగామిగా కొనసాగుతోందన్నారు. తక్కువ వ్యయం, సాంకేతికంగా అధునాతనమైన ఎంపికను అందిస్తోందన్నారు. ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్, క్రిటికల్ కేర్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్థోపెడిక్స్, ఆర్థ్రోస్కోపీ, స్పోర్ట్స్ ఇంజూరీస్, రోబోటిక్ అండ్ జాయింట్ రిప్లేస్‌మెంట్ సర్జన్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాత్‌రెడ్డి లక్కిరెడ్డి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కులగణనకు బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకమా?

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అనుకూలమా? వ్యతిరేకమా? స్పష్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం నేతలు సూర్యనారాయణ యాదవ్, ఆర్.ఎల్లయ్య, వై.జానితో కలిసి ఆయన మాట్లాడారు. 76 సంవత్సరాల దేశ స్వాతంత్ర్యానంతరం మొదటిసారిగా తెలంగాణలో కులగణన సర్వే జరుగుతున్నా ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ స్పందించకపోవడం దారుణమన్నారు. కులగణన అనేది చారిత్రాత్మక ఘట్టమని, ఈ విషయంలో బీజేపీ తరఫున కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీఆర్ఎస్ తరఫున కేసీఆర్, కేటీఆర్‌లు ఎందుకు మౌనం వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కులగణనకు వ్యతిరేకంగా ఉండే పార్టీలు, వ్యవస్థలు, వ్యక్తులకు తగిన గుణపాఠం చెబుతామని ఆయన హెచ్చరించారు. తెలంగాణలో జరుగుతున్న కులగణన దేశానికి ఒక రోల్‌మోడల్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారని అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేసి తీరుతామని, 50శాతం రిజర్వేషన్ల శాతాన్ని ఎత్తివేస్తామని రాహుల్ గాంధీ చెబుతుంటే బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

సీఎం జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు



రసూల్‌పురా: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కార్ఖానలోని మహంకాళి ఆలయంలో కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో కార్యసిద్ధి లక్ష్మి గణపతి హోమం, మృత్యుంజయ హోమం, నవచండీ యాగం, శతరుద్రయాగం నిర్వహించారు. మూడు వందల మంది పురోహితుల నేతృత్వంలో శుక్రవారం యాగాలు నిర్వహించిన అనంతరం రెండు వేల మందికి అన్నదాన చేశారు. యాగాల్లో పాల్గొన్న అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ఇంటి పెద్ద ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆనందంగా ఉంటుందని, అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆరోగ్యంగా ఉంటే రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉంటారన్నారు. యాగంలో పాల్గొన్న అర్చకులకు ఎమ్మెల్యే నిత్యావసర వస్తువులు, దుస్తులు, దక్షిణ అందజేశారు. పురోహితులకు ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పిడి మధుకర్, బద్రీనాథ్ యాదవ్, సదానంద్, సంతోష్‌యాదవ్, బల్వంత్ రెడ్డి, సరిత తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై ప్రతిపక్షాల రాద్ధాంతం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

గన్‌ఫౌండ్రీ: సమగ్ర కులగణన సర్వేకు సంక్షేమ పథకాలతో సంబంధం లేదని, బీసీ రిజర్వేషన్లు పెంచడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కె.శ్రీను రచించిన బీసీ కులగణన చైతన్య గీతం సీడీ ఆవిష్కరణ సభ రవీంద్రభారతిలో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని చైతన్య గీతం సీడీని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతిపక్షాలు అనవసరంగా కులగణనపై రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు కులగణన సర్వేను యజ్ఞంలా, ఉద్యమస్ఫూర్తితో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. భయపడొద్దని ధైర్యంగా మన కులమేమో తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ సర్వేలో ఆర్థిక, ఉద్యోగ, విద్యా తదితర 56 ప్రశ్నలు అనుబంధం ప్రశ్నలు ఉంటాయని తెలిపారు. ప్రజలు ప్రతిపక్ష పార్టీ ఉచ్చులో పడొద్దని విజ్ఞప్తి చేశారు. బీసీల జోలికి వస్తే నిప్పుల కొలిమి అవుతుందని హెచ్చరించారు. కేసీఆర్ కులగణనపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ కులగణనపై స్పందించడం లేదని, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సామాజిక బాధ్యత లేదని, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ డీకే అరుణ, బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డిలు బీసీల మీద విషం కక్కుతున్నారని ఆరోపించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ కులం పేరు చెప్పొద్దని మాట్లాడటం సరికాదని సూచించారు. సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాల్‌రాజ్‌గౌడ్, బీసీ నాయకులు కె.శ్రీనివాస్, శ్యామ్‌కురుమ తదితరులు పాల్గొన్నారు.



సమాజ శ్రేయస్సులో.. మహిళల పాత్ర అధికం

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శతాధిక కవి సమ్మేళన పుస్తకావిష్కరణ సభలో కవులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సమాజ శ్రేయస్సుకు మహిళా కవులు ప్రత్యేక రచనలు చేయడం అభినందనీయమని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హృదయ భారతి సేవా సంస్థ స్వర్ణపుష్పం సామాజిక మాసపత్రిక చైర్‌పర్సన్, ఎడిటర్ మక్కపాటి మంగళ ఆధ్వర్యంలో శుక్రవారం శతాధిక కవి సమ్మేళనం, ప్రముఖ రచయితలు వెంకటకృష్ణ రచించిన తాపత్రయం, లేఖ నవోదయం తదితర పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సులో మహిళల పాత్ర పురుషులకంటే అధికంగా ఉంటుందన్నారు. వారి రచనలు ప్రతి ఒక్కరినీ కదిలిస్తాయని, ఆధ్యాత్మికం వైపు ప్రయాణించేలా చేస్తాయన్నారు. ముఖ్య అతిథులుగా వర్ణమాల సినీ గేయ రచయిత మలిక్, సూర్య ధనుంజయ, కసిరెడ్డి వెంకటరెడ్డి, మంగళ నరసింహారావు అక్షరాయం సంస్థ అధ్యక్షురాలు లక్ష్మీ, ప్రముఖ రచయిత మనోహర్‌రెడ్డి, సాహితీవేత్త వెంకటస్వామి, ప్రముఖ రచయిత వీణరెడ్డి, ప్రముఖ దర్శకులు రాజ్ కందుకూరు, శంకర్రావు మల్లీశ్వరి తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో నేటి భారతి స్త్రీ పురస్కార గ్రహీతలకు అవార్డులను అందజేయడంతో పాటు పలువురికి హృదయ భారతి గౌరవ పురస్కారం అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అర్చకులు

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు శుక్రవారం రూ.లక్ష విరాళం సమర్పించారు. హైదరాబాద్ రాయదుర్గం ప్రాంతానికి చెందిన కె.రామకృష్ణ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్ । శనివారం ।
9 । నవంబర్ । 2024

ప్రతి ఒక్కరికీ గాల్లో ఎగరాలనే కోరిక ఉంటుంది. అది అందరికీ సాధ్యం కాకపోవచ్చు. కానీ నేటి తరం యువత తమ కలలను సాకారం చేసుకుంటోంది. అందుకు పారాగ్లైడింగ్ సాధనంగా ఎంచుకుంటున్నారు. రెక్కలు తొడుక్కునేందుకు అవకాశంగా మార్చుకుంటున్నారు. పారాగ్లైడింగ్, పారామోటారింగ్ నేర్చుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. వృత్తిగా కొందరు.. హాబీగా మరి కొందరు మలుచుకుంటుండగా.. పోటీల్లో పాల్గొనేందుకు ఈ క్రీడను ఎంచుకుంటున్నారు. అసలు పారాగ్లైడింగ్ అనేది మన నగరంలో ఉన్న విషయం చాలా మందికి తెలియదు. ఏదో విదేశాలు, గోవాలాంటి పర్యాటక ప్రాంతాల్లో మాత్రమే ఉంటుందని అనుకుంటారు. కానీ మన నగర నడిబొడ్డున హుస్సేన్‌సాగర్ పరీవాహక ప్రాంతాల్లో కూడా మనం పారాగ్లైడింగ్ నేర్చుకోవచ్చనే విషయం తెలుసా..? ఇప్పుడిప్పుడే నగరంలో కొత్త పుంతలు తొక్కుతున్న పారాగ్లైడింగ్, పారామోటారింగ్ స్పోర్ట్స్‌పై యువత ఆసక్తి చూపుతోంది. ఈ నేపథ్యంలో నగరంలో పారాగ్లైడింగ్ ప్రస్థానం ఎలా ప్రారంభమైందో తెలుసుకుందాం.. - సాక్షి, సిటీబ్యూరో





‘ట్రయల్ ఆఫ్ మిస్‌ఫార్చున్’

- 7వ తరగతిలోనే పుస్తకాన్ని రాసిన అక్షయనీరెడ్డి
- సబితమ్మ మనుమరాలుకు కేటీఆర్ అభినందనలు

సాక్షి, సిటీబ్యూరో: ‘ట్రయల్ ఆఫ్ మిస్‌ఫార్చున్’ అనే పుస్తకాన్ని రాసి అందరి మన్ననలూ పొందుతోంది. ఏడో తరగతి చదువుతున్న అక్షయనీ రెడ్డి పటోళ్ల అతి చిన్న ప్రాయంలోనే ఒక బాలిక చుట్టూ కొనసాగే ఆకర్షణీయమైన కథాంశంతో రాసిన ఈ బుక్ అందరి దృష్టినీ ఆకర్షించింది. ‘ట్రయల్ ఆఫ్ మిస్‌ఫార్చున్’ అనే ఇంగ్లీష్ రచనా సాహిత్యంతో అందరి గుర్తింపు పొందుతున్న అక్షయనీ రెడ్డి.. మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి మనుమరాలు కావడం విశేషం. ఈ పుస్తకం ఆన్‌లైన్ వేదికగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో అందుబాటులో ఉంది. అయితే ఈ పుస్తకానికి సంబంధించిన ఫొటోలను మాజీ మంత్రి కేటీఆర్ ఆయన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి.. అక్షయనీకి అభినందనలు తెలిపారు.








విద్యాభివృద్ధితోనే ప్రపంచాన్ని శాసించగలం..

సాక్షి, సిటీబ్యూరో: మన దేశం ప్రపంచ నాలెడ్జ్ లీడర్‌గా మారాలంటే విద్యారంగంలో మౌలిక సదుపాయాలకు మరింత పెట్టుబడి పెట్టాలని పలువురు విద్యారంగ ప్రముఖులు స్పష్టం చేశారు. విద్యాసంస్థలకు ఆర్థిక చేయూతనిచ్చే ఆక్సిలో ఫిన్‌సర్వ్ ఆధ్వర్యంలో ‘ఎడ్యువిజన్’ సదస్సు నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు మాట్లాడుతూ ప్రపంచ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా మన విద్యా సంస్థలు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్కే మహమూద్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో స్కిల్లింగ్ కేపీఎంజీ ఇన్ ఇండియా ఎడ్యుకేషన్ డైరెక్టర్ సౌమ్య వేలాయుధం, ఆపర్చునిటీ ఇంటర్నేషనల్ ఇండియా అడ్వైజర్ సాక్షి సోధి తదితర ప్రముఖులతో పాటు పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.





ప్రకృతి అమూల్యం

సాక్షి, సిటీబ్యూరో: చిత్రకారులు పచ్చదనానికి ప్రాధాన్యత ఇస్తూ చిత్రాలు గీయడం అభినందనీయమని ప్రముఖ శిల్పి హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు ఎంవి రమణారెడ్డి అన్నారు. లక్డీకాపూల్ లోని పులి ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటైన వృక్ష చిత్ర ప్రదర్శన ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కాంక్రీట్ జంగిల్ లో ప్రకృతి అమూల్యమైనదనే సందేశాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రదర్శనలో నగరానికి చెందిన పలువురు ప్రముఖ చిత్రకారులు గీసిన చిత్రాలు కొలువుదీరాయి. ప్రదర్శన ఈ నెల 15 వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పారా హుషార్..



పక్షిలా గాల్లో తేలిపోదామా!

- నగరంలో పారాగ్లైడింగ్‌లో పెరుగుతున్న ఆసక్తి
- పారామోటారింగ్, గ్లైడింగ్ నేర్చుకుంటున్న యువత
- హాబీతో పాటు కెరీర్‌గా ఎంచుకుంటున్న పలువురు
- పారాగ్లైడింగ్‌లో చుక్కానిగా నిలుస్తున్న హైదరాబాదీ
- ఈజిప్టు పిరమిడ్స్‌పై ఎగిరిన తొలి భారతీయుడిగా రికార్డు
- రియో విగ్రహం, అమెజాన్, నైల్ నదులపై పారాగ్లైడింగ్

సాధారణంగా పారాగ్లైడింగ్ అనేది పర్యాటక ప్రాంతాల్లో మాత్రమే ఉంటుందనే అపోహ చాలా మందిలో ఉంది. పైగా అది నేర్చుకుంటే ఏం వస్తుందిలే అన్న భావన కూడా ఉంది. అయితే మనకు పారాగ్లైడింగ్ గురించి కనీసం అవగాహన లేని సమయం నుంచే ఇందులో మెళకువలు నేర్చుకుని నగర యువతకు చుక్కానిగా నిలుస్తున్నారు హైదరాబాదీ ప్రభు సుకుమార్ దాస్. చిన్నతనం నుంచే గ్లాలో ఎగరాలనే తన కోరికను పారాగ్లైడింగ్‌తో సాకారం చేసుకున్నాడు.

రెక్కలు తొడిగి...

ప్రయాణాలు అంటే ఇష్టంతో ముందుగా బుల్లెట్ బైక్‌పై ఐదు దేశాలు తిరిగాడు. అదే సమయంలో పారాగ్లైడింగ్ గురించి తెలుసుకుని, నేర్చుకున్నాడు. అప్పటి నుంచి దేశ విదేశాల్లో పారాగ్లైడింగ్‌లో అద్భుతాలు సృష్టించాడు. పారాగ్లైడింగ్ చేస్తూ ఈజిప్టులోని గ్రేట్ పిరమిడ్స్, బ్రెజిల్‌లోని రియో క్రీస్ట్ విగ్రహం, అట్లాంటిక్ సముద్రంతో పాటు అమెజాన్ నది, నైలు నది, ఎర్ర సముద్రంపై ఎగిరిన తొలి భారతీయుడిగా రికార్డులకెక్కారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా కర్ణాటక నుంచి రాజస్థాన్ వరకూ పాదయాత్రను ఎగురుకుంటూ ఫాలో అయ్యారు. దీంతో రాహుల్ గాంధీ తనను ప్రత్యేకంగా అభినందించారని సుకుమార్ సంతోషం వ్యక్తం చేశారు.



పారాగ్లైడింగ్ చేస్తే వచ్చే అనుభూతి వేరని చెబుతున్న సుకుమార్.. వందలాది మందికి ఇందులో శిక్షణ ఇచ్చాడు. పారాగ్లైడింగ్‌లో కూడా మంచి భవిష్యత్తు ఉందని, ఎంతోమంది పారాగ్లైడింగ్‌లో శిక్షణ తీసుకుని విదేశాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నాడు. అందుకే ఇప్పుడు చాలా మంది పారాగ్లైడింగ్ నేర్చుకునేందుకు ముందుకు వస్తున్నారని చెబుతున్నాడు.

ఎంతో మందికి శిక్షణ..

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కొందరు ఆదివాసీ పిల్లలకు పారాగ్లైడింగ్‌లో ఉచితంగా తర్ఫీదునిచ్చాడు. వారంతా నేషనల్ పారా మోటార్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్నారని, అప్పుడు వారి కళ్లల్లో చూసిన ఆనందం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని సుకుమార్ చెబుతున్నాడు. ఎంతోమంది కలలను నిజం చేయడంలో ఉన్న ఆనందం మరెక్కడా దొరకదని పేర్కొంటున్నాడు.

విపత్తుల వేళ పారాగ్లైడింగ్ చేసే వారికి ఎంతో డిమాండ్ ఉంటుందని సుకుమార్ చెబుతున్నాడు. భవిష్యత్తులో ఎగిరే పోలీసులు కూడా వస్తారని అంటున్నాడు. ఇప్పటికే తాము నేవీ, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ బలగాలకు శిక్షణ ఇచ్చామని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూడా పలువురు పోలీసులకు శిక్షణ ఇచ్చానని వివరించాడు. ఇక, తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక తదితర రాష్ట్రాలో ప్రత్యేక పండుగల సందర్భంగా పారాగ్లైడింగ్ చేస్తూ వాటి ప్రత్యేకతను ప్రజలకు తెలియజేసేలా సుకుమార్ ఎన్నో కార్యక్రమాలు చేశాడు. ముఖ్యంగా తెలంగాణ అవతరణ దినోత్సవం, బతుకమ్మ, సంక్రాంతి పండుగల వేళ పారాగ్లైడింగ్‌తో వాటి ప్రాముఖ్యత తెలిసేలా చేశాడు. ఇక, మైసూరులో జరిగే దసరా ఉత్సవాల సందర్భంగా చేసే పారాగ్లైడింగ్‌లో ఏటా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటాడు.

భవిష్యత్తులో ఎగిరే పోలీసులు..



హై లైఫ్‌లో నిఖితా..

టాప్ మోడల్స్ ఫ్యాషన్ వాక్..

సిటీలో హై లైఫ్ ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ..

నగరంలోని హెచ్ఐసీసీ నోవోటెల్ హోటల్ వేదికగా ఈ నెల 8, 9, 10 తేదీల్లో హై లైఫ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిస్ ఇండియా వరల్డ్ 2024 నిఖితా పార్వల్‌తో పాటు పలువురు ఫ్యాషన్ ఔత్సాహికులు పాల్గొని సందడి చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో క్రియేటివ్ ఫ్యాషన్ వేర్, లైఫ్‌స్టైల్ వేర్, బ్రైడల్ వేర్, డిజైనింగ్ వేర్, జ్యువెలరీ తదితరాలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన ఫ్యాషన్ వాక్‌లో టాప్ మోడల్స్ తళుక్కున మెరిశారు.









వీకెండ్ వండర్స్..



నగరంలో అలరిస్తున్న ఈవెంట్లు..

సాక్షి, సిటీబ్యూరో: అధునాతన సిటీ లైఫ్ స్టైల్‌లో భాగంగా వారాంతాల్లో మ్యూజిక్ కన్సర్ట్స్, లైవ్ మ్యూజిక్ బ్యాండ్స్, ఔట్ డోర్ క్యాంపింగ్, వంటి విభిన్న కార్యక్రమాలతో పాటు స్టాండప్ కామెడీ కూడా మంచి ఆదరణ పొందుతోంది. ఇందులో భాగంగా నగరంలోని స్టాండప్ కమెడియన్స్ కాకుండా, ముంబయి, ఢిల్లీ వంటి నగరాలకు చెందిన స్టాండప్ కమెడియన్స్ హైదరాబాద్‌కు వస్తున్నారు. న్యూ ఇయర్ వేడుకలకు సందడి అప్పుడే మొదలైంది. ఇందులో భాగంగా గ్రాండ్ కేక్ మిక్సింగ్ వంటి ఈవెంట్లు జోరందుకున్నాయి.

డార్క్ జోక్స్ ఆధ్వర్యంలో..

డార్క్ జోక్స్ ఆధ్వర్యంలో తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో స్టాండప్ కామెడీ షోను ఈ నెల 8 నుంచి 2025 ఫిబ్రవరి 20వ తేదీ వరకూ ప్రతి గురు, శుక్రవారాల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫోర్నై కేఫ్ హైదరాబాద్‌లో రాత్రి 8 గంటల నుంచి 9.15 గంటల వరకూ షో ఉంటుంది.



నేటి నుంచి మూన్‌లైట్ లేక్ వ్యూ క్యాంపింగ్..

వారాంతంలో ప్రకృతి ఒడిలో సేద తీరేందుకు ప్లాన్ చేసుకునే వారి కోసం వికారాబాద్‌లో మూన్‌లైట్ లేక్ వ్యూ క్యాంపింగ్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 9 నుంచి 2025 జనవరి 11 వరకూ ప్రతి శనివారం 5.30 గంటల నుంచి మరుసటి రోజు (ఆదివారం) ఉదయం 10 గంటల వరకూ ప్రోగ్రాం ప్లాన్ చేశారు. ఔట్ డోర్ గేమ్స్, బోన్‌ఫైర్, అడ్వెంచర్ గేమ్స్ ఉంటాయని తెలిపారు.

తెలుగు స్టాండప్ కామెడీ షో..

నగరంలో ఈ నెల 8 నుంచి 13 వరకూ సాయంత్రం 7 గంటల నుంచి 8.30 గంటల వరకూ తెలుగు స్టాండప్ కామెడీ షోలను నిర్వహించనున్నారు. సిల్లీ సౌత్ కామెడీ ఆధ్వర్యంలో తొలి తెలుగు స్టాండప్ కామెడీ షో హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. హైదరాబాద్ ఆడియన్స్‌ను ఎంతగానో ఆకట్టుకుంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. 18 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. 8 నుంచి 10 వరకూ ది స్ట్రీట్ కామెడీ క్లబ్, మాదాపూర్‌లో, 11 నుంచి 13 వరకూ ది హ్యాస్టాగ్ కేఫ్ కేపీహెచ్‌బీలోనూ ఈవెంట్ ఉంటుంది.





ఫ్లై జోన్‌లో ఇండోర్ గేమ్స్..

ఫ్లై జోన్ ప్రముఖ ప్రీమియర్ ఇండోర్ ట్రామ్పొలిన్ పార్క్. ఇక్కడ ఫ్లై జంప్, సాఫ్ట్ జోన్, స్లామ్ డన్క్, నిచ్చెన, డాడ్జ్‌బాల్, ఫ్లై లైన్ తదితర క్రీడలు అందుబాటులో ఉంచారు. 5 ఏళ్లు పైబడిన ఎవరైనా వెళ్లవచ్చు. ఈ నెల 9 నుంచి 30 వరకూ ప్రతి రోజు ఉంటుంది.



ఇన్ఫినిటీ క్లబ్ కమ్యూనిటీ రన్..

ఇన్ఫినిటీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 30 వరకూ కమ్యూనిటీ రన్ నిర్వహిస్తున్నారు. నగర ప్రజల ఆరోగ్యకరమైన జీవితాన్ని బ్యాలెన్స్ చేయడం కోసమే ఇటువంటి ఈవెంట్స్ ఏర్పాటు చేశామని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు కార్యక్రమం మొదలవుతుంది. మరుసటి రోజు ఉదయం 11.30 గంటలతో ముగుస్తుంది.

క్లుప్తంగా...

డీజీపీని కలిసిన ఈడీ అధికారులు



సాక్షి, హైదరాబాద్: డీజీపీ జితేందర్‌ను శుక్రవారం సాయంత్రం కొందరు ఈడీ అధికారులు కలిసినట్టు సమాచారం. రంగారెడ్డి జిల్లా మహే శ్వరం మండలం నాగారం లోని భూదాన్ భూముల కుంభకోణానికి సంబంధించి ఇప్ప టికే ఐఏఎస్ అధికారి, రంగారెడ్డిజిల్లా మాజీ కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను ఈడీ అధికారులు గత నెలలో 3 రోజులపాటు ప్రశ్నించిన విషయం తెలిసిందే. అంతకుముందు మహేశ్వరం తహసీల్దార్ జ్యోతి స్టేట్‌మెంట్లను ఈడీ అధికారులు నమోదు చేశారు. ఈ ఇద్దరు అధికారుల విచారణ సందర్భంగా సేకరించిన సమాచారం ఆధారంగా మాజీ ఆర్డీఓ వెంకటా చారినీ ఈడీ అధికారులు రెండు రోజుల క్రితం సుదీ ర్ఘంగా ప్రశ్నించారు. ఈ కేసులో కీలక సమాచా రం సేకరిస్తున్న నేపథ్యంలో ఈడీ అధికారులు డీజీ పీని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అమోయ్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై డీజీ పీని కలిసి ఈడీ అధికారులు చర్చించారు. మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసేందుకు స్థానిక పోలీసుల సహకారం కావాలని డీజీపీని ఈడీ అధికారులు కోరారు. భూదాన్ భూముల వ్యవహారంలో పోలీసులకు లేఖ రాసినా, ఇప్పటి వరకు ఎలాంటి వివరాలివ్వ లేదని డీజీపీకి ఈడీ అధికారులు తెలిపా రు. శంకరాహిల్స్ సొసైటీ, బాలసాయిబాబా ట్రస్ట్ భూములు, రాయదుర్గంలోని కొన్ని భూముల వ్యవహారంలో ఇన్వెస్టిగేషన్ జరిపించాలని డీజీపీని ఈడీ అధికారులు కోరినట్టు సమాచారం.

మెడికల్ పీజీ సీట్ల బ్లాకింగ్ స్కాంలో ఈడీ దూకుడు

▶ మొదటి పేజీ తరువాయి



కరీంనగర్ జిల్లా నగునూర్‌లోని ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లిలోని కామినేని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీ, సంగారెడ్డిలోని ఎంఎన్ఆర్ మెడికల్ కాలేజీ, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కాలేజీ, మేడ్చల్‌లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజీ, సూరారంలోని మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పటాన్‌చెరులోని మహేశ్వర మెడికల్ కాలేజీ, చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ, డెక్కన్ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రాంగణాల్లో ఈడీ సోదాలు జరిపింది. అందులో భాగంగా దర్యాప్తు కొనసాగిస్తున్న అధికారులు.. 12 కాలేజీలతో పాటు మరికొన్ని కాలేజీల యాజమాన్యాలకు కూడా సమన్లు జారీ చేసినట్టు తెలిసింది. అన్ని కాలేజీల ప్రతినిధుల నుంచి వివరాలు సేకరించడంతో పాటు పలు కీలక డాక్యు మెంట్లను స్వాధీనం చేసుకుంటున్నారు. మొత్తం కాలేజీల నుంచి వివరాలు సేకరించిన తర్వాత కేసులో మరికొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది.



ప్రభుత్వ టీచర్లకు గ్రేడింగ్!

విద్యార్థుల ఫలితాల ఆధారంగా పాయింట్లు

పదోన్నతులు, బదిలీల్లో పాయింట్లకు వెయిటేజీ

ఐదేళ్లు మంచి రిజల్ట్ ఇవ్వని ఉపాధ్యాయులపై చర్యలు

సర్కార్‌కు విద్యా కమిషన్ సిఫారసు?

టీచర్లలో జవాబుదారీతనం, విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను గ్రేడింగ్ విధానంలోకి తీసుకువచ్చే సూచనలు కన్పిస్తున్నాయి. టీచర్ సాధించిన వార్షిక ఫలితాలు, బోధనలో ఉన్నతి, మార్పులు.. ఇలా అనేక అంశాలను పరిగణలోనికి తీసుకుని గ్రేడ్లు నిర్ధారించే అవకాశం ఉంది. ఇచ్చే గ్రేడ్‌ను బట్టి పాయింట్లు ఇస్తారు. ఉదాహరణకు ఒక టీచర్‌కు 'ఎ' గ్రేడ్ ఇచ్చారనుకుంటే ఆయనకు ఎక్కువ పాయింట్లు లభిస్తాయన్న మాట. అయా పాయింట్లను వారి సర్వీస్ రిజిస్టర్‌లో పొందుపరుస్తారని భావిస్తున్నారు. బదిలీలు, పదోన్నతులు, ప్రత్యేక ఇంక్రిమెంట్లకు వీటిని కొలమానంగా తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

విద్యా కమిషన్ అభిప్రాయ సేకరణ

ప్రభుత్వ టీచర్లలో అంకిత భావం పెంచడం ద్వారా విద్యా ప్రమాణాల పెంపు దిశగా తీసుకోవాల్సిన చర్యలపై విద్యా కమిషన్ ఇటీవల వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది. ఈ సందర్భంగా టీచర్ల పనితీరుపై ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమైనట్టు కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చినట్టు తెలుస్తోంది. అయా అంశాలన్నీ దృష్టిలో ఉంచుకుని, విద్యా కమిషన్ సూచనల ఆధారంగా ఉపాధ్యాయుల్లో జవాబుదారీతనం పెంచేలా తీసుకోవాల్సిన చర్యలపై విద్యాశాఖ దృష్టి సారించే అవకాశాలు కన్పిస్తున్నాయి. పలు ప్రభుత్వ స్కూళ్ళల్లో ఫలితాలు దిగదుడుపుగా ఉంటున్నాయి. దీంతో ఏయే సబ్జెక్టులో ఎంతమంది ఉత్తీర్ణులవుతున్నారు? ఏ స్కూల్‌లో ఫలితాలు ఎలా ఉన్నాయో పరిశీలించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఏ సబ్జెక్టులో మంచి ఫలితాలు వస్తే, ఆ సబ్జెక్టును బోధించే టీచర్‌కు ప్రోత్సాహకంగా కొన్ని గ్రేడింగ్ పాయింట్లు ఇచ్చే ఆలోచనలో ఉంది. అదే సమయంలో స్కూల్‌లో చదివే మొత్తం విద్యార్థుల్లో ఎక్కువ మంది ఒక సబ్జెక్టులో వెనుకబడినట్టైతే అందుకు ఆ టీచర్‌ను బాధ్యుడిని చేయాలని భావిస్తున్నారు. ఒక టీచర్ చెప్పే సబ్జెక్టులో వరుసగా ఐదేళ్ళ పాటు అతి తక్కువ ఫలితాలు వస్తే కొన్ని చర్యలు తీసుకునే అంశాన్ని కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసినట్టు సమాచారం. కాగా గ్రేడింగ్ విధానంపై అన్ని వర్గాలతో చర్చించి, అవసరమైన విధివిధానాలను రూపొందించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు..ఇలా మొత్తం 1,26,518 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కలిపి 30,178 స్కూళ్ళుంటే, ఇందులో 28,80,809 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

టీచర్లకు గ్రేడింగ్ సరికాదు

రకరకాల పరీక్షల్లో ప్రతిభ చూపిన తర్వాతే ప్రభుత్వ టీచర్‌గా ఎంపిక చేస్తున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత ఆధారంగా ర్యాంకింగ్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదు. ప్రభుత్వ స్కూళ్ళకు వచ్చే పేద విద్యార్థుల నేపథ్యాన్ని ప్రభుత్వం తెలుసుకోవాలి. స్కూల్‌లో ఉండే సమయంలో తప్ప, ఇంటికెళ్ళితే చదివించే పరిస్థితి ఉండదు. ఈ విషయంలో తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. అంతే తప్ప టీచర్లనే బాధ్యులను చేయడం సరికాదు.

– సయ్యద్ షౌకత్ అలీ (టీఎస్టీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు)

ముందు మౌలిక వసతులు కల్పించాలి

ప్రభుత్వ స్కూళ్ళలో చాలీ చాలని వసతులున్నాయి. పైగా ఈ స్కూళ్లలో పేద వర్గాల నుంచి వచ్చే విద్యార్థులే అత్యధిక సంఖ్యలో చదువుతున్నారు. వారికి నాణ్యమైన విద్య అందించాలని ప్రతి టీచర్‌కూ ఉంటుంది. మంచి ఫలితాలు రావాలంటే అందుకు తగిన వాతావరణం, వసతులు కల్పించాలి. మంచి ఫలితాలకు వీలుగా తగిన మార్పులు, చేర్పులు చేయాలి. ప్రైవేటు స్కూళ్ళతో పోటీ పెట్టడం సరికాదు. ర్యాంకింగ్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదు.

– పింగిలి శ్రీపాల్ రెడ్డి (పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు)

ఖాకీలపై ఆగ్రహం..

ఈనెల 4 నుంచి సంబంధిత పోలీస్ స్టేషన్లలోని సీసీ ఫుటేజీని స్థానిక మెజిస్ట్రేట్లకు సీల్డ్ కవర్లలో అందజేయండి

సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టులపై ఏపీ హైకోర్టు ఆదేశం

సాక్షి అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా కొద్ది రోజులుగా యథేచ్ఛగా జరుగుతున్న సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులు, అక్రమ నిర్బంధాలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. అక్రమ నిర్బంధాల విషయంలో పోలీసుల తీరుపై పలు సందేహాలు వ్యక్తం చేసింది. ఇద్దరు సోషల్ మీడియా కార్యకర్తల అక్ర మ నిర్బంధానికి సంబంధించి రెండు పోలీస్ స్టేష న్లలో సీసీ టీవీ ఫుటేజీలను సంబంధిత మేజి స్ట్రేట్ల ఎదుట సీల్డ్ కవర్లలో అందచేయాలని పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తుల అరెస్ట్ విష యంలో చట్ట నిబంధనలు పాటించి తీరాల్సిందేనని పోలీసులకు తేల్చి చెప్పింది. లేని పక్షంలో తాము జోక్యం చేసుకో వాల్సి ఉంటుందని, ఆ పరిస్థితి తేవద్దని హెచ్చరించింది. ఇది వ్యక్తుల స్వేచ్ఛతో ముడిపడి ఉందని, కాబట్టి ఈ విషయాన్ని తేలికగా తీసుకోవద్దని తేల్చి చెప్పింది. చట్ట నిబంధనలు పాటించేలా పోలీసు లను చైతన్య పరచాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. విశాఖకు చెందిన సోషల్ మీడియా కార్య కర్త తిరుపతి లోకేష్‌ను సోమవారం తమ ముందు హాజరు పరచాలని పోలీసులను ఆదేశించింది. వ్యక్తులను పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు కావడం ఎక్కువ అయిందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. దీనిపై తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్టును ఆశ్రయించిన బాధిత కుటుంబాలు

టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారంటూ పలువురిని పోలీసులు అక్రమంగా నిర్బంధంలోకి తీసుకుంటున్న విషయం తెలిసిందే. గత వారం రోజుల్లో 101 మందిని అక్రమంగా అరెస్టులు చేశారు. తమవారిని పోలీసులు కోర్టు ముందు హాజరు పర్చకుండా అక్రమ నిర్బంధంలో ఉంచడంపై బాధిత కుటుంబాలకు చెందిన పలువురు హైకోర్టును ఆశ్రయించారు. అక్రమంగా నిర్బంధించిన తమ కుటుంబ సభ్యులను న్యాయస్థానం ఎదుట హాజరు పరిచేలా ఆదేశించాలంటూ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం తాజాగా విచారణ జరిపింది.

పౌరుల స్వేచ్ఛను కాపాడతాం..

విచారణ సందర్భంగా తిరుపతి లోకేష్ తరపు న్యాయవాది చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. వైఎస్సార్ కుటుంబం పేరుతో వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న 411 మందికి నోటీసులు ఇచ్చారని నివేదించారు. వారిలో 120 మంది విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో హాజరయ్యారని తెలిపారు. తిరుపతి లోకేష్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు ఈ నెల 5న విశాఖ నుంచి విజయవాడ తరలించారన్నారు. లోకేష్ సోదరుడిని పిలిపించి తెల్ల కాగి తాలపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ధర్మాసనానికి నివేదించారు. ప్రస్తుతం లోకేష్ జాడ తెలియడం లేదన్నారు. ఈ సమయంలో కోర్టులో ఉన్న విజయవాడ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జానకి రామయ్యతో ధర్మాసనం నేరుగా మాట్లాడింది. తిరుపతి లోకేష్ సోషల్ మీడియా ద్వారా ఓ గ్రూప్ నిర్వహిస్తూ అసభ్యకర పోస్టులు పెడుతున్నారని ఆయన కోర్టుకు చెప్పారు. దీనిపై ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. ఫోన్ చేయడంతో తన బావతో కలిసి లోకేష్ పోలీస్ స్టేష న్‌కు వచ్చారన్నారు. లోకేష్‌ని విచారించిన అనంతరం నోటీసులు ఇచ్చి పంపామన్నారు. నేరానికి సంబంధించిన ఎల్రక్టానిక్ పరికరాలతో ఈ నెల 10న హాజరు కావాలని ఆయనకు సూచించినట్లు చెప్పారు. జానకి రామయ్య చెప్పిన వివరాలను రికార్డు చేసిన ధర్మాసనం.. సోమవారం ఉదయం 10:30 గంటలకు లోకేష్‌ను తమ ముందు హాజరుపరచాలని పోలీసులను ఆదేశించింది . ఈ నెల 4వతేదీ నుంచి 8వ తేదీ వరకు సీసీ టీవీ ఫుటేజీని భద్రపరచి సీల్డ్ కవర్‌లో విజయవాడ మెజిస్ట్రేట్‌కు సమర్పించాలని ఆదేశించింది. అరెస్ట్ చేసిన 24 గంటలలోపు నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని స్పష్టం చేసింది. చట్ట నిబంధనలను పాటించి తీరాలని లేదంటే తమ జోక్యం తప్పదని తేల్చి చెప్పింది. పౌరుల స్వేచ్ఛను కాపాడటం ఈ కోర్టు బాధ్యత అని స్పష్టం చేసింది. అంతకు ముందు పోలీసుల తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు విని పిస్తూ సోషల్ మీడియా ద్వారా కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం, అసభ్య వ్యాఖ్యలు చేస్తున్నారని నివేదించారు. ఇలాంటి వారికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొనగా, దీనిపై ధర్మాసనం స్పందిస్తూ చట్ట నిబంధనలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది.

టేకులపల్లి స్టేషన్ ఫుటేజీ కూడా..

అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలం ఆత్మకూరుకు చెందిన జింకల నాగరాజు అక్రమ నిర్బంధంపై దాఖలైన పిటిషన్లపై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. పూర్తి వివరా లతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. టేకులపల్లి స్టేషన్‌లోని సీసీ టీవీ ఫుటేజీని భద్రపరచి సంబంధిత మేజిస్ట్రేట్ ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది.

సోషల్ మీడియా యాక్టివిస్టులకు అండగా నిలుస్తా

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్య సూత్రాలను, మానవ హక్కులను కాలరాసి మరీ సోషల్‌మీడియా యాక్టివిస్టులను భయ కంపితులను చేస్తున్న, దారుణంగా హింసిస్తున్న అత్యంత క్రూరమైన ప్రభుత్వంతో పోరాడుతున్నామని, ఈ యుద్ధంలో కచ్చితంగా న్యాయమే గెలుస్తుందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ఈ అనైతిక యుద్ధంలో సోషల్ మీడియా యాక్టివిస్టులపై నిత్యం అక్రమ కేసులు, వేధింపులు, నిర్బంధాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ సమయంలో నిజం పక్షాన నిలబడిన మా ప్రతి సైనికుడికి అండగా నిలుస్తా. కచ్చితంగా న్యాయం గెలుస్తుంది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగ పాలన దుర్యోధన, దుశ్శాసన దుర్నీతి లోకాన్ని తలపిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజల్ని చైతన్య పరుస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్ట్‌లను కూటమి ప్రభుత్వం అడ్డూ, అదుపు లేకుండా వేధింపులకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో బాధితులందరికీ అండగా ఉంటానని వైఎస్ జగన్ ధైర్యం నూరిపోశారు.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

హైదరాబాద్‌లోనే ఉన్నా

▶ మొదటి పేజీ తరువాయి

ఘటనలో మీరు 'ఈస్ట్ ఇండియా కంపెనీ'అంటూ సంబోధించిన సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టగలరా. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల నుంచి ఆంధ్రా కాంట్రాక్టర్‌ను తొలగించే దమ్ముందా. సీఎం హోదాలో ఒక కాంట్రాక్టు సంస్థకు గులాంగిరి చేస్తున్నావా'అని కేటీఆర్ మండిపడ్డారు.

పుండు ఒక చోట.. మందు మరోచోట

'మూసీ ప్రాజెక్టు బాధితులను పట్టించుకోకుండా మరోచోట సీఎం పాదయాత్ర చేస్తూ పుండు ఒక చోట అయితే మందు మరోచోట అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. వేల ఇళ్లను కూల్చివేసేందుకు ప్రణాళికలు వేసి..లక్షలాది మందిని నిరాశ్రయులను చేసే ప్రణాళిక వేసిన సీఎం దొడ్డిదారిన మరోచోట పాదయాత్ర డ్రామా చేస్తున్నారు. లక్షలాది మంది ఆక్రందనలకు కేరాఫ్‌గా మారిన హైదరాబాద్ మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేసే ధైర్యం, చిత్తశుద్ధి సీఎంకు లేదు. దశాబ్దాలపాటు వ్యర్థాలు కలుస్తుంటే అరవై ఏళ్లు కళ్లుండీ చూడలేని కబోదుల్లా కాంగ్రెస్ వ్యవహరించింది. మూసీ దోపిడీ ప్రాజెక్టు కన్సల్టెంట్లతో మూడురోజుల పాటు చర్చించే సమయం సీఎంకు ఉంది. కానీ ఆరు గ్యారంటీల అమలుపై సమీక్షించేందుకు సమయం లేదా. మోసపూరిత హామీలను పక్కన పెట్టి కమీషన్ల కోసం మూసీ ప్రాజెక్టును నెత్తిన పెట్టుకు న్నారు. పాదయాత్ర చేసినా పొర్లుదండాలు పెట్టినా మూసీ పరీవాహక ప్రాంత ప్రజల వేదన మీకు శాపంగా మారుతుంది'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

నల్లగొండ నేతల అరెస్టు అక్రమం

ముఖ్యమంత్రి మూసీ పాదయాత్ర నేపథ్యంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేస్తున్నారు. ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం , ముఖ్యమంత్రి, మంత్రులు పర్యటనలు చేసిన ప్రతీ సందర్భంలో బీఆర్‌ఎస్ నేతలను ముందస్తు, హౌస్ అరెస్టుల పేరుతో నిర్బంధానికి గురి చేస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే మా నేతల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది. ఎన్ని నిర్బంధాలకు గురిచేసినా కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, హామీల అమలులో వైఫల్యంపై ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటాం'అని కేటీఆర్ పేర్కొన్నారు.

సెంచరీ మ్యాట్రెస్ స్పెషలిస్ట్ స్టోర్ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: సెంచరీ మ్యాట్రెస్ సంస్థ స్పెషలిస్ట్ స్టోర్‌ను బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 12లో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంచరీ మ్యాట్రెస్‌ల డైరెక్టర్ ఉత్తమ్‌మలాని మాట్లాడుతూ ఈ కొత్త స్టోర్ వినియోగదారులకు మంచి షాపింగ్ అనుభవాన్ని కలిగిస్తుందని తెలిపారు. మెరుగైన నిద్రకు అధిక నాణ్యతతో సెంచరీ మ్యాట్రెస్‌లను రూపొందించినట్టు వివరించారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవితానికి నాణ్యమైన నిద్ర అవసరమని అభిప్రాయపడ్డారు.

హ్యాపీ బర్త్ డే సీఎం రేవంత్

ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, రాష్ట్ర గవర్నర్ తదితరుల శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎక్స్ వేదికగా భారత ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కర్ణాటక, ఏపీ సీఎంలు సిద్ధరామయ్య, ఎస్.చంద్రబాబునాయుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సినీనటుడు చిరంజీవి, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, యూకే కాన్సులేట్ జనరల్ గరేత్ విన్ ఓవెన్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు. శుక్రవారం ఉదయం నుంచే కాంగ్రెస్‌నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి క్యూ కట్టారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్‌బాబులు కలిసి రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్, ప్రియాంకలతో కలిసి సెల్ఫీ దిగుతున్న ఫొటోను మంత్రి కొండా సురేఖ రేవంత్‌కు బహూకరించారు. గాంధీభవన్‌లో సీఎం రేవంత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఫిషర్‌మెన్ సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుసాయికుమార్ నేతృత్వంలో టపాసులు కాల్చి మిఠాయిలు పంచారు. టీ-శాట్ కార్యాలయంలో సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్, తెలంగాణ మాస పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ శ్రీనివాసరావు, సాదిక్ పాల్గొన్నారు. టీజీటీఎస్, టీపీసీసీ సోషల్‌మీడియా టీమ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శులు హెల్త్ ఇన్సూరెన్స్, స్మార్ట్ కార్డులను సోషల్‌మీడియా చైర్మన్ మన్నె సతీశ్ నేతృత్వంలో అందజేశారు.

ధాన్యం తరలించకుంటే ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టు రద్దు

పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

రామాయంపేట (మెదక్): కొనుగోలు కేంద్రాల నుంచి సకాలంలో ధాన్యాన్ని తరలించకపోతే ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టు రద్దు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చే ధాన్యాన్ని మిల్లింగ్ చేయని రైస్ మిల్లులకు ప్రైవేట్ వ్యాపారం చేసే హక్కు ఉండదని స్పష్టంచేశారు. శుక్రవారం రాత్రి మెదక్ జిల్లా రామాయంపేట మార్కెట్ కమిటీ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అంతకుముందు రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. రైస్‌మిల్లులు అలాట్ కాకపోయినా కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని గోదాంలకు తరలిస్తున్నామని తెలిపారు. సాఫీగా కొనుగోళ్లు సాగేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నామని, వర్షాలతో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వివరించారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

- మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టీకరణ
- రికార్డు స్థాయిలో ఈసారి పంట దిగుబడి అంచనా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ధాన్యం సేకరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్. చౌహాన్ హాజరైన ఈ సమావేశంలో ధాన్యం కొనుగోళ్ల తీరును పూర్తిస్థాయిలో సమీక్షించారు. జిల్లాల వారీగా కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యం, మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీలతో ధాన్యం కేటాయింపు వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు కొన్ని జిల్లాల్లో ఏర్పాట్లు వేగవంతం చేయాల్సి ఉందన్నారు. బ్యాంకు గ్యారంటీల విషయంలో మిల్లర్లు సహకరించని చోట్ల రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోడౌన్లకు తరలించాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్‌తో కలిసి 30 లక్షల మెట్రిక్ టన్నుల గోడౌన్‌స్థలాన్ని అందుబాటులో ఉంచినట్టు మంత్రి తెలిపారు. ఇంటర్మీడియట్ గోడౌన్లలో నిల్వ చేయడానికి, నిల్వ చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేయడానికి అయ్యే అదనపు ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో శ్రీధర్‌బాబు, తుమ్మల తదితరులు

రెండు సీజన్లలో 150 ఎల్ఎంటీ ధాన్యం సేకరణ

రాష్ట్రంలో ధాన్యం దిగుబడి ఈయేడు పెరుగుతుందని అంచనా వేసినట్టు తెలిపారు. ఈ ఖరీఫ్, వచ్చే రబీలో కలిసి రెండు సీజన్లలో దాదాపు 150 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. తెలంగాణలో మిల్లింగ్ పరిశ్రమను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని, ధాన్యం సేకరణ ప్రక్రియలో మిల్లర్లు పూర్తిగా సహకరించాలని మంత్రి కోరారు. పొరుగు రాష్ట్రంలో 100 శాతం బ్యాంక్ గ్యారంటీ ఉండగా, తెలంగాణలో మాత్రం డిఫాల్ట్ కాని మిల్లర్లకు కేవలం 10 శాతం బ్యాంకు గ్యారంటీని నిర్ణయించినట్టు తెలిపారు. మిల్లింగ్ చార్జీలను కూడా పెంచిన విషయాన్ని గుర్తు చేశారు.

ధాన్యం కొనుగోళ్లకు రాబోయే 15 రోజులు కీలకం

ధాన్యం కొనుగోళ్లకు రానున్న 10–15 రోజులు కీలకమైనవని, రైతులు ఇబ్బందులు పడొద్దని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. సజావుగా కొనుగోళ్లు జరిగేలా చూడాలని, అవసరమైతే అదనపు ఖర్చులు భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులకు సూచించారు. కొనుగోలులో జాప్యం జరగకుండా మిల్లర్లతో సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ మిల్లింగ్ సామర్థ్యానికి మించి కొనుగోళ్లు జరిగితే, కర్ణాటక, తమిళనాడు వంటి పొరుగు రాష్ట్రాలకు మిగులు ధాన్యాన్ని పంపించడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉత్తమ్ పేర్కొన్నారు.

లిటిల్ స్టార్స్



'రైతు స్వరాజ్య వేదిక' కార్యాలయంలో రైతు కుటుంబాలతో బాల తారలు భాను ప్రకాశ్, హనీష, శ్రేష్ఠ



మొక్కవోని మట్టిబిడ్డలు

**మట్టి ఎవరికీ అపకారం చేయదు.
నాగలితో దున్నినప్పుడల్లా
రైతుకు పంట ఇవ్వాలనే అనుకుంటుంది.
కాని ఒక్కోసారి రుతువులు
మోసం చేస్తాయి.
మరోసారి మార్కెట్ మోసం చేస్తుంది.
ఇంకోసారి అకాల వర్షం.
అప్పుడు ఏమవుతుంది?
ప్రతిరోజూ పొలానికి వెళ్ల
తిరిగొచ్చే నాన్న ఆ రోజు రాడు.
'నా పంటను ఎందుకు నాకు
దక్కకుండా చేశావ్' అని
దేవుడితో పోట్లాడటానికి వెళ్లిపోతాడు.
అప్పుడు అమ్మ ఉంటుంది.
ధైర్యం నింపుకో అని చెప్పే
మట్టి ఉంటుంది.
ఆ పిల్లలు నిలబడతారు. నిలబడాలి.
అందరూ తోడైతే వారి
ముఖాలలో ఇంద్రధనువులు సాధ్యమే.
ఆత్మహత్యలు చేసుకుని మరణించిన
రైతుల పిల్లలను
రానున్న 'బాలల దినోత్సవం'
సందర్భంగా ప్రత్యేకంగా కలిసింది
సాక్షి. ఇక సందడి మొదలైంది.**

'మీరు ఫ్రెండ్స్‌తో కలిసి నిద్రపోతారా?'
'సెలవుల్లో పొలానికి వెళ్లి వ్యవసాయం చేస్తారా?'
'నైట్‌టైమ్ స్కై అంతా క్లియర్‌గా ఉండి స్టార్స్ కనపడతాయా?
'మీకు లోన్లీగా అనిపించినప్పుడు ఏం చేస్తారు'
'విలేజస్‌లో ఏమేమి ఇంటెరెస్టింగ్‌గా ఉంటాయి'...

సినిమాల్లో అందరూ మెచ్చేలా నటించిన లిటిల్ స్టార్స్ జీవితంలో సవాళ్లతో పోరాడుతున్న రియల్ స్టార్స్‌ను 'సాక్షి', 'రైతు స్వరాజ్యవేదిక' ఉమ్మడి ప్రయత్నం వల్ల కలిశారు. 'బాలల దినోత్సవం' సందర్భంగా హైదరాబాద్‌లోని తార్నాకలో రానున్న ప్రత్యేకంగా జరిగిన కార్యక్రమంలో జయ శంకర్ భూపాలపల్లి, నల్గొండ, మెదక్ జిల్లాలకు చెందిన ఐదు రైతు కుటుంబాలకు చెందిన 11 మంది పిల్లలు ముగ్గురు లిటిల్ స్టార్స్‌ను కలిశారు. 'వాల్తేరు వీరయ్య'లో నటించిన శ్రేష్ఠ, 'కేజీఎఫ్'లో నటించిన భాను ప్రకాశ్, స్పైడర్, స్వాగ్ వంటి మూవీస్‌లో చేసిన హనీషాలు ఈ చిన్నారులతో కలిసి కబుర్లు చెప్పారు. ఆ పిల్లలు ఈ పిల్లలు పరస్పరం మాట్లాడుకున్నారు. లిటిల్ స్టార్స్ తమ సినిమాల్లో తాము చెప్పిన డైలాగులు చెప్పారు. డాన్సులు చేశారు. షూటింగ్‌కు తీసుకెళతామన్నారు. అలా ఆ పిల్లల మనసు తేలిక చేశారు. కారణం? వారి నాన్నలు వారితో లేరు. వారి నాన్నలంతా రైతులు. వ్యవసాయంలో వచ్చిన కష్టాలు ఆ నాన్నలను హఠాత్తుగా లేకుండా చేశాయి. ఆ క్షణం నుంచి ఆ పిల్లలకు ఆమ్మే నాన్నయినా అమ్మయినా. అయితే పిల్లలు కూడా ధైర్యం తెచ్చుకున్నారు. ఇలాంటి పిల్లలకు సాయం అందించడానికి 'రైతు స్వరాజ్యవేదిక' అనే సంస్థ పని చేస్తోంది. ఆ సంస్థ, సాక్షి కలిసి ఈ పిల్లల సందడిని ఏర్పాటు చేశాయి. ఈ సందర్భంగా ఆ రైతుబిడ్డలు ఏమన్నారు?

- హనుమాద్రి శ్రీకాంత్
- డి.జి. భవాని
ఫొటోలు: పి. మోహనాచారి

జీవితం అంటే ఏమిటో తెలిసింది

రైతు బిడ్డలను చూసిన స్టార్ సెలబ్రిటీలు ఎంతో ఉద్వేగానికి గురయ్యారు. వారి పట్ల స్నేహహస్తం సాచారు. వారి స్పందన తెలియచేశారు. 'చిన్న చిన్న కష్టాలకే ఎంతో బాధ పడతాం, కానీ వీరి జీవితకాలవేదన చూశాక మేమెంత మంచి జీవితంలో ఉన్నామో తెలుస్తుంది. ఈ ఒక్కరోజు నాకు జీవితాన్ని పరిచయం చేసింది. భవిష్యత్‌లో కూడా వీరి సమస్యలపై దృష్టి సారిస్తాను. సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని నిర్ణయించుకున్నాను' అని భాను ప్రకాశ్ అంటే 'నాన్న లేకుంటే జీవితం ఎంత చీకటిమయమో తెలిసింది. నాలాంటి పిల్లలే వారు. కానీ నాకున్న సౌకర్యాల్లో ఒక్కశాతం కూడా వారికి లేవు. వారితో ఫ్రెండ్షిప్ చేస్తూ ఉండిపోవాలనుంది' అన్నది హనీషా రెస్పాన్స్. 'నా కన్నా పెద్దగా ఉన్న ఆ అక్కలు, అన్నలు ఏడుస్తుంటే నాకు చాలా బాధేసింది. వారి కోసం నేను డ్యాన్స్ చేశాను. 'నా సినిమా షూటింగ్‌లకు తీసుకెళతానని చెప్పాను. వారి ఊరికి కూడా వెళతాను తొందరలో' అంది శ్రేష్ఠ.

వారి కాళ్ల మీద వాళ్లే నిలబడాలి

'మాది కౌలు వ్యవసాయం., పంట పండకపోవడంతో అప్పుల్లో కూరుకుపోయాం. అవి కట్టలేక అదే పత్తి చేనులో పత్తి మందు తాగి చనిపోయడు నా భర్త. అప్పటి నుంచి మా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నా కూలీ, ఈ ఆవు పాలతో జీవితాన్ని నెట్టుకొస్తున్నాను' అని దేవరకొండకు చెందిన సరోజ చెప్పే, 'గుంట భూమి లేదు. 8 లక్షల అప్పు మిగిలింది. అప్పులోళ్ల బాధ భరించలేక ఆయన తనువు చాలించాడు. ఇద్దరూ పాపలే.. వారి కాళ్ల మీద వారు నిలబడి బతకగలగాలనే లక్ష్యంతో చదివిస్తున్నాను' అని మరో తల్లి అంది. 'మాది కౌలు వ్యవసాయం. మిర్చి పంటలో వచ్చిన నష్టాలకు అప్పుల్లో కూరుకు



పోయి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుడు నా కొడుక్కు 2 నెలలు. ఎన్ని ఆఫీసులు తిరిగినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయమూ అందలేదు. వ్యవసాయం పై మక్కువ ఉన్నా నా బిడ్డను మాత్రం రైతుగా మారనివ్వను' జయశంకర్ భూపాల పల్లి జిల్లాకు చెందిన మానస అన్నారు.

'ఒక్కసారన్నా లాభం రాకపోతుందా అని ఎనిమిదేళ్లు కౌలు చేశాం. ఒక్కసారి మిర్చి పంట పండినా ధర లేదు. దాంతో నా భర్త 2019 ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు. ఇల్లు కూడా లేక నాన్న వాళ్లింట్లో ఉంటున్నాను' జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన సుమలత అంటే '7,8 ఏళ్ల కౌలు చేశాం. రేటు ఉన్నప్పుడు పంట పండలేదు, పండినప్పుడు ధర లేదు. రెండూ ఉంటే వర్షాలు లేవు. ఆయన ఆత్మహత్య చేసుకున్నప్పుడు నా గుండె కూడా ఆగినంత పనైంది. కానీ రెండేళ్ల బాబు, నాలుగేళ్ల పాప. వారి కోసం బతికి ఉన్నాను'.యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన మమత అన్నారు.

చదువుకుని ఎంతో ఎదుగుతున్నారు



'రైతు స్వరాజ్య వేదిక' రైతుల సంక్షేమం కోసం 2011లో ఏర్పడింది. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు అత్యంత సంక్షోభంలో ఉన్నాయని మా అధ్యయనంలో తెలుసుకుని వారి కుటుంబాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం. తెలంగాణ వచ్చాక ఈ పదేళ్లలో 7600 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో 80 శాతం కౌలు రైతులే. కౌలు రేట్లు పెరగడం, ప్రభుత్వ సహకారం పట్టాదారులకే ఉండటం వంటి కారణాలతో ఈ ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. ఈ 7600 మందిలో 1600 మందిని మాత్రమే ప్రభుత్వం గుర్తించింది. మిగతా వారివి రైతు ఆత్మహత్య కాదంటారు. దీనికి కౌలు డాక్యుమెంట్లు, అప్పుల కాగితాలు అడుగుతారు. ఇది భార్యభర్తల గొడవ, బిడ్డ పెళ్లి ఖర్చువల్లే, కొడుకు చదువు, ఇల్లు కట్టుకున్నారు.. ఇలాంటి కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నారంటూ వ్యవసాయ సంబంధ అంశాన్ని దూరం చేస్తున్నారు. కానీ వారి ఆదాయ వనరు మాత్రం వ్యవసాయం అని పరిగణించట్లేదు. వివిధ సంస్థల సహకారంతో ఈ కుటుంబాలకు ఉపాధి కోసం బర్రెలు, మేకలు కొనిస్తున్నాం. పిండి గిర్నీ, షాప్‌లు పెట్టిస్తున్నాం. పిల్లల చదువులకూ సహకారం అందిస్తున్నాం. ఇలా సహకారం అందుకుని ఇంజనీర్లుగా, సాఫ్ట్‌వేర్లుగా, ఉత్తమ క్రీడా కారులుగా ఎదిగిన రైతు బిడ్డలు ఉన్నారు.

- కొండల్ రెడ్డి,
రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కన్వీనర్

లాయర్ అవుతాను

8వ తరగతి చదువుతున్నాను. అందరూ వారి నాన్నలతో హాయిగా ఆడుకుంటుంటే నేను మాత్రం హాస్టల్లో ఆహారం, నీరు పడక ఎలర్జీలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. మా నాన్న ఉంటే నన్ను కూడా మంచి ప్రైవేటు స్కూల్‌లో చదివించేవారు అని బాధగా ఉంటుంది. అయినప్పటికీ అమ్మ కష్టాలను దూరం చేయడానికి లాయర్ అవ్వాలనే ఆశయంతో ఉన్నాను. సినిమాల్లో చూసే సెలబ్రిటీలతో ఆడుకోవడం చాలా ఆనందంగా ఉంది. **- మింటూ**

* * *

అమ్మను బాగా చూసుకుంటా

నాన్న మరణం నన్నెంతగానో కుంగదీసింది. కానీ ఆ ఆవేదనను చదువులపై చూపించలేదు. బాగా చదువుకుంటున్నాను. అమ్మను బాగా చూసుకోవాలి అనేది నా కోరిక. నాన్న ఉండగా ఎప్పుడూ పనికెళ్లని అమ్మ నా కోసం కూలి పనికి వెళుతోంది. పైగా తనకు కిడ్నీ ఆపరేషన్ అయ్యింది. మా కష్టాలను తట్టుకునే శక్తి మాకుంది. మీరంతా మాతో ఉన్నారనే భరోసా ఇస్తే చాలు. **- తేజస్విని**

* * *

మేమే తయారవుతాం

ఉదయాన్నే నాన్న గుర్తుకొస్తాడు. అందరు నాన్నలు వారి పిల్లల్ని స్కూలుకు తీసుకెళుతుంటే చూసి. అమ్మ పొలం పనికి తొందరగా వెళ్లాలని మేమే త్వరగా తయారయ్యి మా స్కూల్‌కు వెళతాం. నాన్నలా కావొద్దని బాగా సంపాదించాలని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవ్వాలనుకుంటున్నాను. నాన్న చేసిన అప్పుల కష్టాల్లో అమ్మ ఉంది. అందుకే ఎలాంటి అతి ఖర్చులు చేయం. పెద్దయ్యాక అమ్మను బాగా చూసుకోవాలి.

- చింటూ

* * *

అమ్మ కోసం నవ్వుతా

హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాను. డాక్టర్ అవ్వాలి, నాన్న చేసిన అప్పులు తీర్చి అమ్మకు భారం తగ్గించాలి. మా హాస్టల్‌లో ఫ్రెండ్స్ దగ్గరికి అమ్మానాన్నలు వస్తే.. మా దగ్గరికి అమ్మ మాత్రమే వస్తుంది. అప్పుడు ఏడుపొస్తుంది. కాని అమ్మ బాధపడుతుందని నవ్వుతా.

- అక్షిత

పర్యావరణ హిత

పత్తి మనదే ప్రతిఫలం మనదే

హైదరాబాద్‌కు చెందిన దండోతికర్ అంబిక చిన్నప్పటి నుంచి మూసీ నది కాలుష్యాన్ని చూస్తూ పెరిగింది. ప్లాస్టిక్ వ్యర్థాలు మూసి నీళ్లలో నింపుతున్న విషాన్ని గురించి తెలుసుకుంది. అప్పటి నుంచే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు వెదకడం మొదలుపెట్టింది. ప్రత్యామ్నాయంగా కాటన్ బ్యాగులను తయారుచేయడమే కాదు వాటి గురించి విస్తృత ప్రచారం చేస్తోంది. ఎలాంటి లాభాపేక్ష లేకుండా చేస్తున్న ఆమె కృషికి గుర్తింపుగా ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చాయి. తాజాగా ఎంఎస్ స్వామినాథన్ అవార్డు అందుకుంది.

ఉస్మానియా యూనివర్సిటీలో 'సోషల్ సర్వీసెస్'లో పీజీ చేసింది అంబిక. ఇది కేవలం చదువు కాదు. సామాజిక సేవ దిశగా వేసిన తొలి అడుగు. రైతుల ఆత్మహత్యలతో కలత చెందిన అంబిక ఎన్నో గ్రామాల్లోకి వెళ్లి ఎంతోమంది పత్తి రైతులతో మాట్లాడింది. వారి సమస్యలను తెలుసుకుంది.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా కాటన్ బ్యాగులను వినియోగంలోకి తీసుకువస్తే పర్యావరణానికే కాదు పత్తి రైతుకూ మేలు జరుగుతుందని ఆలోచించింది. మచ్చలు వచ్చిన పత్తిని కూడా సేకరించి వస్త్రాన్ని తయారుచేసి, బ్యాగులు తయారు చేయాలని నిర్ణయించుకుని ముందడుగు వేసింది. పర్యావరణ స్పృహ, ఉపాధి కల్పన, కాటన్ దుస్తుల గురించి ప్రచారం... అనే మూడు లక్ష్యాలను నిర్దేశించుకుంది. మూసీ ప్రక్షాళన చేసే దిశగా విద్యార్థులతో కలిసి ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. 2016లో జరిగిన హిల్లరీ వెబర్ బూట్ క్యాంప్‌లో పాల్గొని కమ్యూనికేషన్స్ స్కిల్స్ నేర్చుకుంది. ఎన్ఐఆర్‌డీ ఏర్పాటు చేసిన రిస్క్ కాంక్లేవ్‌లో అంబిక ఇచ్చిన ప్రెజెంటేషన్‌కు 'బెస్ట్ స్టార్టప్ ఇన్ సస్టెయినబుల్ లైవ్‌లీహుడ్' 'బెస్ట్ ఇన్నొవేటివ్ ఆస్పైరింగ్ ఎంటర్‌ప్రెన్యూర్' అవార్డులు వచ్చాయి. సామాజిక సేవ పునాదిపై సొంతంగా స్టార్టప్‌ను నిర్మించిన అంబిక రూపాయి లాభంతో మాత్రమే సేవలు అందించింది. రైతుల నుంచి పత్తిని సేకరించడం నుంచి బ్యాగులు తయారు చేయడం వరకు ఎంతో మందికి శిక్షణ ఇచ్చింది. సంప్రదాయంగా వస్తున్న డైయింగ్, ప్రింటింగ్ కళలను ప్రోత్సహించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

'పర్యావరణ స్పృహతో ఒక్క అడుగు పడినా....ఒక్క అడుగేనా అని నిరాశపడాల్సిన పనిలేదు. ఆ అడుగును అనుసరిస్తూ వందల అడుగులు పడతాయి' అంటుంది దండోతికర్ అంబిక.

– ఎస్.సుధీర్‌రెడ్డి, సాక్షి, హైదరాబాద్



● అంబిక



కాలుష్య సమస్యకు కలత చెందడం కంటే 'నా వంతుగా ఒక పరిష్కారం' అనుకుంటే ఎంతో కొంత పరిష్కారం దొరుకుతుంది. ఎటు చూస్తే అటు ప్లాస్టిక్ వ్యర్థాల వరద భయపెడుతున్న వేళ, వాటి దుష్పరిణామాల గురించి తెలిసినా....అవి మన దైనందిన జీవితంలో భాగమైన దురదృష్ట కాలాన.....అంబికలాంటి పర్యావరణ ప్రేమికులు పరిష్కార మార్గాలు ఆలోచిస్తున్నారు.

తన వంతు పరిష్కారంగా ప్లాస్టిక్ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా కాటన్ బ్యాగులు తయారుచేస్తూ వాటి ప్రాముఖ్యత గురించి ప్రచారం చేస్తోంది దండోతికర్ అంబిక.

'పత్తి మనదే ప్రతి ఫలం మనదే' అనే నినాదంతో రైతుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అంబికకు 'యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీ' ఎంఎస్ స్వామినాథన్ అవార్డ్‌ను ప్రధానం చేసింది.

శుభ్రత

గంగానదిపై మహిళా జవాన్లు

శుభ్రత ఎక్కడుంటే మహిళలు అక్కడుంటారు. లేదా, మహిళలు ఎక్కడుంటే శుభ్రత అక్కడ ఉంటుంది. శుభ్రంగా ఉంచటం అన్నది మహిళల సహజ నైజం. మహిళలే కాదు, దైవత్వం కూడా శుభ్రత ఉన్న చోట కొలువై ఉంటుంది. 'క్లీన్‌లీనెస్ ఈజ్ నెక్స్ట్ టు గాడ్‌లీనెస్' అనే మాట వినే ఉంటారు.

ఇంటిని, సమాజాన్ని శుభ్రంగా ఉంచటంలో కీలక బాధ్యతను వహిస్తున్న మహిళలే ఇప్పుడు తాజాగా దైవకార్యం వంటి 'స్వచ్ఛ గంగా' ఉద్యమ ప్రచారాన్ని చేపట్టారు. గంగానదిని ప్రక్షాళన చేయవలసిన అవసరం గురించి, గంగా ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించటం గురించి ప్రజల్లో అవగాహన కలిగించటం కోసం మొత్తం 20 మంది మహిళలు గంగానదిపై నవంబర్ 4న రెండు తెప్పల్లో





ర్యాలీగా బయల్దేరారు! ఉత్తరాఖండ్, తెహ్రీ ఘరేవాల్ జిల్లాలోని దేవప్రయాగ పట్టణం నుంచి మొదలైన ఈ 'ఆల్ ఉమెన్ రివర్ ర్యాఫ్టింగ్'... మొత్తం 2,500 కి.మీ. దూరాన్ని 53 రోజుల పాటు ప్రయాణించి డిసెంబర్ 26న పశ్చిమబెంగాల్‌లోని గంగా సాగర్ వద్ద ముగుస్తుంది.

అందరూ మహిళలే ఉన్న ఇలాంటి ఒక సుదీర్ఘమైన రివర్ ర్యాఫ్టింగ్ దేశంలో జరగడం ఇదే మొదటిసారి. మరొక విశేషం కూడా ఉంది. వీళ్లంతా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బి.ఎస్.ఎఫ్) దళానికి చెందిన మహిళలు. బి.ఎస్.ఎఫ్. మహిళా విభాగం, 'నమామి గంగే' ప్రాజెక్టు కలిసి ఉమ్మడిగా ఈ రివర్ ర్యాఫ్టింగ్‌ను నిర్వహిస్తున్నాయి. ర్యాఫ్టింగ్ ప్రారంభానికి ముందు మహిళా శక్తికి, సాధికారతకు సంకేతంగా 11 మంది బాలికల పాదాలకు నమస్కరించి పూజలు జరిపారు. ఆ తర్వాత 'తెప్పలు' కదిలాయి. ఈ ప్రచారానికి బి.ఎస్.ఎఫ్. సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రియా మీనా నాయకత్వం వహిస్తున్నారు. దేశ సరిహద్దుల్లో విధి నిర్వహణలో ఉన్న మహిళా జవాన్‌లలో 20 మందిని కఠిన ర్యాఫ్టింగ్ శిక్షణ తర్వాత ఇందుకోసం ఎంపిక చేశామని మీనా అన్నారు. ''రెండు తెప్పలుగా సాగే ఈ బోటింగ్ యాత్రలో భాగంగా గంగా తీరం వెంబడి 43 పట్టణాలలో ఈ తరం యువతీ యువకులకు 'పరిశుభ్రతకు, నిరంతరాయ ప్రవాహానికి' అనువుగా గంగానదిని ప్రక్షాళన చేయాలన్న సందేశాన్ని అందిస్తాం'' అని ఆమె తెలిపారు. మరొక విశేషం.. వీరితో జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగ' చేతులు కలపటం.

శుభ్రత దైవంతో సమానం అన్నప్పుడు, దైవ సమానంగా భారతీయులు కొలిచే గంగానదిని శుభ్రంగా ఉంచాలన్న సందేశంతో ప్రచారోద్యమం చేపట్టిన మహిళాశక్తి కూడా కొలవదగినదే. స్తుతించతగినదే. వారి మాట ఆలకించతగినదే.

వంటిల్లు

**రోజూ ఏదో ఓ ఆకు కూర తినాలని తెలుసు.
తోటకూర, గోంగూర, పాలకూర, మెంతికూర...
ఆకుకూరల జాబితా పెద్దదిగానే ఉంటుంది.
వీటిలో బచ్చలి ఆకుకు స్థానమెక్కడ?
మిగతా ఆకుల్లా మార్కెట్‌లో పెద్దగా దొరకదు.
అందుకే మన ఇంటి కుండీలో ఓ తీగ నాటుదాం.
ఐరన్ క్యాల్షియం విటమిన్‌లను పండిద్దాం.
మన వంటింట్లో వండి వడ్డించుకుందాం.**



బచ్చలి ఆరోగ్య నెచ్చెలి

సొర బచ్చలి



కావలసినవి: బచ్చలి ఆకు – చిన్న కట్ట; సొర కాయ – 100 గ్రాములు; చింతపండు పులుసు– 2 టేబుల్ స్పూన్‌లు.

గ్రేవీ కోసం: నువ్వులు – టేబుల్ స్పూన్‌లు; కొబ్బరి తురుము – 3 టేబుల్ స్పూన్‌లు; ఎండు మిర్చి– 3; పసుపు – అర టీ స్పూన్; నీరు– 200 ఎం.ఎల్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

పోపు కోసం: నూనె – 2 టీ స్పూన్‌లు; ఆవాలు– టీ స్పూన్; ఎండుమిర్చి– 2.

తయారీ: ● బచ్చలి ఆకును ఒలిచి శుభ్రంగా కడగాలి. సొరకాయను చెక్కు తీసి చిన్న ముక్కలు చేయాలి. ఈ రెండింటినీ కలిపి నీటిని పోసి ప్రెషర్ కుకర్‌లో మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి ● ఈ లోపు గ్రేవీ కోసం తీసుకున్న దినుసులన్నింటినీ కలిపి మిక్సీలో మెత్తగా గ్రైండ్ చేయాలి ● మందపాటి పాత్రను స్టవ్ మీద పెట్టి నూనె వేడి చేయాలి. అందులో ఆవాలు వేసి వేగిన తర్వాత ఎండుమిర్చి వేయాలి. మిరపకాయ వేగిన తర్వాత చింతపండు పులుసు, గ్రేవీ కోసం గ్రైండ్ చేసిన మిశ్రమం వేసి బాగా కలపాలి. ● ఇందులో ముందుగా ఉడికించి పెట్టిన బచ్చలి, సొరకాయ ముక్కలను వేసి కలపాలి. ఉప్పు సరి చూసుకుని అవసరమైతే మరికొంత కలిపి మూత పెట్టాలి. పది నిమిషాల సేపు ఉడికిన తర్వాత స్టవ్ ఆపేయాలి. వేడి అన్నంలో తర్వాత వడ్డించాలి.

కంద బచ్చలి

కావలసినవి: కంద గడ్డ– అరకేజీ (చెక్కు తీసి ముక్కలుగా తరగాలి); బచ్చలి ఆకులు – 50; చింతపండు గుజ్జు – టేబుల్ స్పూన్; పచ్చిమిర్చి – 2 (తరగాలి); పసుపు – పావు టీ స్పూన్; చక్కెర – అర టీ స్పూన్; మిరప్పొడి– అర టీ స్పూన్; జీలకర్ర పొడి – అర టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – టేబుల్ స్పూన్.

పోపు కోసం: మినప్పప్పు – టీ స్పూన్; జీలకర్ర – టీ స్పూన్; ఆవాలు – టీ స్పూన్; పచ్చిశనగపప్పు – 2 టీ స్పూన్‌లు; ఎండుమిర్చి–3; ఇంగువ– చిటికెడు; కరివేపాకు – 2 రెమ్మలు.

తయారీ: ● కంద గడ్డ ముక్కలను వేడి నీటిలో 20 నిమిషాల సేపు ఉడికించిన తర్వాత పాత్ర మీద మూత పెట్టి మరో పది నిమిషాల సేపు ఉంచాలి ● ఈ లోపు బచ్చలి ఆకులు కడిగి పక్కన పెట్టుకోవాలి ● మందపాటి పాత్ర పెట్టి నూనె వేసి వేడి చేయాలి. అందులో పోపు కోసం తీసుకున్న దినుసులన్నింటినీ ఒక్కొక్కటిగా వేసి కలపాలి. అవి వేగుతుండగానే పచ్చిమిర్చి, బచ్చలి ఆకులు వేసి కలిపి కొంచెం మగ్గనివ్వాలి. ఆ తర్వాత చింతపండు గుజ్జు, ఉప్పు, మిరప్పొడి, చక్కెర, పసుపు వేసి కలిపి అందులో ముందుగా ఉడికించి పెట్టుకున్న కందగడ్డ ముక్కలను వేయాలి. కందగడ్డ ముక్కలు, బచ్చలి ఆకు, పోపు దినుసులు సమంగా కలిసేవరకు కలిపి మూత పెట్టి పది నిమిషాల సేపు చిన్న మంట మీద మగ్గనివ్వాలి. చివరగా జీలకర్ర పొడి చల్లి మరోసారి కలిపి దించేయాలి. వేడి అన్నంలో నెయ్యి వేసుకుని ఈ కూర కలుపుకుంటే రుచి అద్భుతంగా ఉంటుంది.

దానిమ్మతో దీర్ఘాయుష్షు



చాలా మంది మనసులో మెదిలే ఆలోచన 'దీర్ఘకాలం జీవించాలి. ఆ జీవనం కూడా వీలైనంతవరకు ఆరోగ్యంగా, వృద్ధాప్యం దరిచేకుండా ఉండాలని కోరుకుంటున్నారు. ఈ ఆలోచన మీద కూడా అయితే మన శరీర కణాల ఆరోగ్యానికి మేలు చేసే మంచి అలవాట్లతో ఆయుష్షను పెంచుకోవచ్చు.

ఎలా అంటే... కాలానుగుణంగా లభించే పండ్లను తినడం వల్ల వాటిలోని పోషకాలు వాతావరణ మార్పులను తట్టుకునేలా శరీరానికి సహజంగా అవసరమైన వాటిని సరఫరా చేస్తాయి. ఈ సీజన్‌లో దానిమ్మపండ్లు (సెప్టెంబర్ నుండి డిసెంబర్ వరకు) విరివిగా లభిస్తాయి. దానిమ్మ పండ్లను తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయో తెలిస్తే ప్రతిరోజూ ఆహారంలో వీటిని తప్పక చేరుస్తారు.

చర్మానికి మేలు..

దానిమ్మపండ్లలో యాంటీఆక్సిడెంట్ లక్షణాలు అధికం. ఇవి మెదడు నుండి చర్మ ఆరోగ్యం వరకు ప్రతిదానికీ మద్దతు ఇస్తాయని పరిశోధనలలో తేలింది. డాక్టర్ విసెంటె మేరా తన 'యంగ్ ఎట్ ఏ ఏజ్' అనే పుస్తకంలో 'దానిమ్మపండు దాని యాంటీఆక్సిడెంట్ శక్తి కారణంగా చర్మానికి మేలు చేసే సూపర్‌ఫుడ్' అని పేర్కొన్నారు. దానిమ్మపండులో విటమిన్– సి పుష్కలంగా ఉంటుంది, ఇది కొల్లాజెన్ ఏర్పడటానికి సహాయపడుతుంది. 'శరీరానికి విటమిన్– సి అందినప్పుడు, కొల్లాజెన్ ఎనిమిది రెట్లు ఎక్కువగా ఉత్తేజితమవుతుంది.

అంతర్గత సన్‌స్క్రీన్

దానిమ్మ జ్యూస్ తాగితే యూవీ కిరణాల వల్ల కలిగే ఆక్సీకరణ నుండి చర్మాన్ని రక్షించవచ్చు. ఇది దాదాపు 'అంతర్గత సన్‌స్క్రీన్' లా పనిచేస్తుంది.

మెదడుకు దానిమ్మ

దానిమ్మలోని విటమిన్ బి5 నాడీ వ్యవస్థకు మద్దతు ఇస్తుంది. దానిమ్మ రసం నుండి వచ్చే ఫైటోన్యూట్రియెంట్లు మెదడుపై ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించగలవు. మెదడు ఆరోగ్యాన్ని కాపాడతాయి. జ్ఞాపకశక్తి నిలుపుదలకి సహాయపడతాయి' అని యుసిఎల్ఎ హెల్త్ నోట్ పరిశోధకులు పేర్కొన్నారు.

చెడు కొలెస్ట్రాల్‌కు చెక్

'చెడు' కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. టిజి, ఎల్‌డిఎల్ అండ్ సి, హెచ్‌డిఎల్, సి స్థాయిలను మెరుగుపరచడంలో దానిమ్మ వినియోగం ప్రయోజనకరమైన ప్రభావాన్ని చూపుతుంది.

నిరంతర ఒత్తిడి వల్ల వృద్ధాప్యం త్వరగా ప్రవేశిస్తుంది. ఒత్తిడి తగ్గించడంలోనూ, నాడీ వ్యవస్థకు మద్దతు ఇవ్వడంలోనూ కాలానుగుణంగా లభించే దానిమ్మ సరైనది.

ఎలా తినాలంటే...

- దానిమ్మ గింజలు కొన్ని రకాల వంటకాలకు, సలాడ్స్‌కు మంచి రుచిని తీసుకువస్తాయి. ఉదయం టిఫిన్‌తో పాటుగా దానిమ్మ గింజలను తినవచ్చు. అవకాడో, పిస్తాతో కలిపి చేసిన సలాడ్స్‌లోనూ చేర్చవచ్చు.
- అవిసె గింజలు, పెరుగుతోనూ కలిపి తినవచ్చు.
- ఉడికించిన కూరగాయలపైన పెరుగు, దానిమ్మ గింజలు వేసుకొని తినవచ్చు.
- దానిమ్మ పండును కడగాల్సిన అవసరం లేదు. గింజలను వేరు చేసి, తినవచ్చు.

సెలబ్ రెసిపీ

ఆలియాభట్ ఆరోగ్య వంటకాలు



ఆలియా భట్ కేవలం నటి మాత్రమే కాదు. ఫిట్‌నెస్, పోషకాహారానికి సంబంధించిన వెల్‌నెస్ ఐకాన్ కూడా. ఆమె ఆరోగ్యకరమైన జీవనశైలితో మిలియన్ల మందికి స్ఫూర్తినిస్తుంది. 2020లో సోషల్‌మీడియా ద్వారా అలియా తన వంటగదిలోకి అభిమానులను తీసుకువెళ్లింది. శరీరానికి ఇంధనంగా, ఫిట్‌గా ఉండేలా సులభమైన, పోషకాహార వంటకాలను ఎంచుకుంటుంది. వాటిలో బీట్‌రూట్ సలాడ్, సొరకాయ సబ్జీ, చియా పుడ్డింగ్.. పరిచయం చేస్తోంది.

బీట్‌రూట్ సలాడ్



కావలసినవి: తురిమిన బీట్‌రూట్, పెరుగు, నల్ల మిరియాలు, చాట్ మసాలా, కొత్తిమీర, నల్ల ఆవాలు, ఇంగువ, కరివేపాకు, జీలకర్ర. **తయారీ:** ఒక గిన్నెలో పై పదార్థాలన్నీ వేసి కలపాలి. మూకుడులో టీ స్పూన్ నూనె వేడి చేసి, జీలకర్ర, ఇంగువ, ఆవాలు, కరివేపాకు వేసి పోపు పెట్టాలి. దీనిని బీట్‌రూట్ మిశ్రమంలో వేసి కలిపి, సర్వ్ చేయాలి.

ఆరోగ్య ప్రయోజనాలు: బీట్‌రూట్‌లో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కణాలు దెబ్బతినకుండా కాపాడతాయి. రక్తపోటును నియంత్రిస్తాయి. జీర్ణక్రియను, మెదడు, ఎముక, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి, అలాగే బరువు నిర్వహణలో కూడా సహాయపడతాయి.

సొరకాయ సబ్జీ



కావలసినవి: సొరకాయ, నూనె, నల్ల ఆవాలు, ఇంగువ, కరివేపాకు, పచ్చిమిర్చి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, సోపు పొడి, ఆమ్చూర్ పొడి, ధనియాలు, తురిమిన కొబ్బరి.

తయారీ: మూకుడులో టేబుల్‌స్పూన్ నూనె వేడి చేసి ఇంగువ, కరివేపాకు, కారం వేసి పోపు సిద్ధం చేయాలి. అందులో తురిమిన సొరకాయ, ఉప్పు వేసి కలపాలి. ● 2–3 నిమిషాలు అలాగే ఉంచి ధనియాల పొడి, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్ పొడి, సోపు పొడి వేసి కలపాలి. ● చివరిగా కొబ్బరి తురుము, తాజా కొత్తిమీర ఆకులు చల్లాలి. వేడి వేడిగా వడ్డించాలి.

ఆరోగ్య ప్రయోజనాలు: జీర్ణక్రియ పనితీరు బాగుంటుంది. గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర నియంత్రణ, పటిష్టమైన రోగనిరోధక వ్యవస్థ, బరువు నిర్వహణకు మద్దతు వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.

చియా పుడ్డింగ్



కావలసినవి: చియా గింజలు, పాలు, ప్రోటీన్ పౌడర్, రుచికి స్టెవియా. **తయారీ:** ఒక గిన్నెలో చియా గింజలు, పాలు, ప్రోటీన్ పౌడర్, కొన్ని చుక్కల స్టెవియా వేసి బాగా కలపాలి. ఫ్రిజ్‌లో ఉంచి చల్లగా సర్వ్ చేయాలి. **ఆరోగ్య ప్రయోజనాలు:** చియా పుడ్డింగ్ పోషకాలు సమృద్ధిగా గల అల్పాహారం. ఫైబర్, ప్రోటీన్, ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.

డెస్క్ జాబ్

కుర్చీ వ్యాయామాలతో ఫిట్‌గా!

డెస్క్ జాబ్ చేసేవాళ్లు ఎక్కువ పని గంటలు కూర్చునే ఉండాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు నడుము, పొట్ట దగ్గర కొవ్వు పేరుకుపోతుంటుంది. చెయిర్‌లో కూర్చుని చేసే అనుకూలమైన వ్యాయామాలను సాధన చేయడం వల్ల పొట్ట భాగం ఫిట్‌గా అవుతుంది. దీంతో పాటు వెన్నుకు, కండరాలకు బలం చేకూర్చే వ్యాయామాలు ఇవి...



సీటెడ్ లెగ్ లిఫ్ట్స్: కుర్చీలో నిటారుగా కూర్చోవాలి. కుర్చీ సీటు భాగాన్ని రెండు చేతులతో పట్టుకోవాలి. పాదాలను నేలకు ఆనించి, మోకాళ్లను వంచకుండా నిటారుగా ఉంచాలి. ఒక కాలిని నేలకు అలాగే ఉంచి, మరొక కాలును పైకి ఎత్తాలి. కుర్చీ సీటుకు సమంగా ఉండేలా కాలిని ఎత్తి, కొన్ని సెకన్లు ఉంచి, తిరిగి నేల మీద ఉంచాలి. ఆ తర్వాత మరో కాలును కూడా అదే విధంగా చేయాలి. ఈ వ్యాయామం వల్ల తొడల భాగం బలంగా అవుతుంది. చెయిర్‌కు ఉన్న హ్యాండిల్స్‌ను చేతులతో పట్టుకొని, దానిపైన కూర్చోవాలి. మోకాళ్లను మడిచి, ఛాతీ వరకు తీసుకొని, పాదాలను కుర్చీకి సమాంతరంగా ఉండేలా చూసుకోవాలి. వెన్నును నిటారుగా ఉంచాలి. మోకాళ్లను కొన్ని సెకన్ల పాటు అదే పొజిషన్‌లో ఉంచాలి. దీని వల్ల పొట్ట కింది భాగం కండరాలు ఫిట్‌గా అవుతాయి. అదనపు కొవ్వు తగ్గుతుంది.

ఆబ్లిక్యూ ట్విస్ట్: చెయిర్‌లో నిటారుగా కూర్చొని, రెండు చేతులతో తలకు రెండువైపులా సమాంతరంగా, భుజాలను నిటారుగా ఉంచాలి. అదే భంగిమలో ఉండి, ఒకసారి కుడి వైపుకి తిరిగి, కొన్ని సెకన్లు అలాగే ఉండాలి. మరోసారి ఎడమ వైపుకు తిరిగి కొన్ని సెకన్లు ఉండాలి. నడుము భాగంలో ఉన్న కండరాలకు తగినంత శక్తి లభిస్తుంది.


సీటెడ్ క్రంచెస్: చెయిర్ పైన కూర్చొని, దాని హ్యాండిల్స్‌ను బలంగా పట్టుకోవాలి. కాళ్లను, వెన్నును నిటారుగా ఉంచి, చెయిర్ మీద నుంచి కొద్దిగా అదే భంగిమలో పైకి లేవాలి. కొన్ని సెకన్లలో తిరిగి యథా స్థితికి రావాలి. ఈ వ్యాయామం వల్ల పొత్తికడుపు, పై భాగం కండరాల పనితీరులో వేగం పెరుగుతుంది.

టో టచెస్: చెయిర్ మీద కూర్చొని పాదాలను నిటారుగా నేలకు ఉంచాలి. నడుము భాగాన్ని వంచుతూ తలను మోకాళ్లవైపుగా తీసుకువచ్చి, చేతులను పాదాలకు ఆనించాలి. కొన్ని సెకన్లు అలాగే ఉండి, తిరిగి యథా స్థితికి రావాలి. ఈ వ్యాయామం ద్వారా శరీరానికి స్ట్రెచింగ్, ఫ్లెక్సిబిలిటీ ఏర్పడుతుంది.

సీటెడ్ బైస్కిల్ పెడల్స్: చెయిర్‌లో ముందుకు వచ్చి కూర్చోవాలి. పూర్తి బ్యాలెన్స్ చూసుకొని, కాళ్లను సైకిల్ పెడల్ తొక్కినట్టుగా కదలికలు చేయాలి. ఈ వ్యాయామ లక్ష్యం కాలి కండరాలకు బలం చేకూర్చడం అని దృష్టిలో పెట్టుకోవాలి. వీలైనన్ని సార్లు ఈ వ్యాయామం చేయచ్చు.

బ్రెయిన్ ట్రెయిన్

జ్ఞాపకశక్తి తగ్గుతుందా?!



శరీరానికి వ్యాయామం గురించి ఆలోచిస్తాం. అలాగే, జ్ఞాపకశక్తి బాగుండాలంటే మెదడుకూ వ్యాయామం అవసరం అని గ్రహించాలి. కండరాల కణాలు చురుగ్గా ఉండాలంటే మైండ్‌కూ వ్యాయామం తప్పనిసరి. మైండ్‌కు బూస్ట్‌లా పనిచేసే సులువైన, సమర్థవంతమైన వ్యాయామాలు ఇవి...

ధ్యానంతో స్పష్టత: రోజూ ప్రశాంత వాతావరణంలో కూర్చొని పది నిమిషాలసేపు శ్వాస మీద ధ్యాస ఉంచుతూ ధ్యానం చేయాలి. దీని వల్ల మన ఆలోచనల్లో స్పష్టత లభిస్తుంది. ఫలితంగా మైండ్ చురుగ్గా పనిచేస్తుంది.

పజిల్స్ నింపడం: క్రాస్‌వర్డ్స్, సుడోకో వంటి బ్రెయిన్ టీజర్స్ జ్ఞాపకశక్తికి పదునుపెడతాయి. ఎక్కడైనా జ్ఞాపకశక్తిలో సమస్యలు ఏర్పడినా త్వరగా పరిష్కారం లభిస్తుంది.

పుస్తకపఠనం: ఆసక్తిని పెంచే రచనలు, వ్యాసాలు, మైండ్‌కి ఛాలెంజింగ్‌గా అనిపించే పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానానికి సంబంధించిన సామర్థ్యం పెరుగుతుంది.

సాధన: ప్రస్తుత మీ మానసిక స్థితి ఎలా ఉందో గ్రహించడంలో నిర్లక్ష్యంగా ఉండకూడదు. భావోద్వేగాలు, చుట్టూ ఉండే వాతావరణం మన మైండ్‌కు మరింత పదును పెట్టేలా ఉండాలి.

శారీరక వ్యాయామం మైండ్‌కు బూస్ట్: రోజూ వ్యాయామం చేయడం వల్ల రక్తప్రసరణ పెరిగి మెదడు పనితీరు బాగుంటుంది. జ్ఞానసంబంధమైన సామర్థ్యం పెరుగుతుంది. యోగా వంటి సాధనలు కూడా మనోవికాసాన్ని పెంచుతాయి.

నలుగురిలో కలవడం: సామాజిక కార్యకలాపాల్లో పాల్గొంటూ ఉండాలి. దీని వల్ల ఎదుటివారితో సంభాషణ, చర్చలు, ఆలోచనల విస్తృతి పెరుగుతుంది. భావోద్వేగాల పరంగా, మానసిక ఆరోగ్యం కూడా బాగుంటుంది. మెదడును ఎప్పుడూ చురుకుగా ఉండటానికి ప్రయత్నించాలి. బ్రెయిన్ ఎక్సర్‌సైజులతో, అవగాహనతో జ్ఞాపకశక్తికి ఎప్పుడూ పదునుపెడుతూ ఉండాలి. అది ఈ సమయం నుంచే మొదలుపెట్టండి.

సినిమా

విభిన్నంగా...

'విరూపాక్ష', 'బ్రో' వంటి హిట్ సినిమాల తర్వాత సాయి దుర్గా తేజ్ నటిస్తున్న చిత్రం 'ఎస్‌డీటీ 18' (వర్కింగ్ టైటిల్). రోహిత్ కేపీ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్. 'హను–మాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ నిర్మించిన ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి 'ఎస్‌డీటీ 18' నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో జగపతిబాబు, శ్రీకాంత్, సాయికుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీకాంత్ లుక్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. 'పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'ఎస్‌డీటీ 18'. ఈ సినిమాలో గతంలో ఎన్నడూ చేయని పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నారు సాయి దుర్గా తేజ్. అలాగే శ్రీకాంత్ పాత్ర విభిన్నంగా ఉంటుంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియన్ మూవీగా విడుదల కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్.



● శ్రీకాంత్

ముచ్చటగా మూడు



● ప్రభాస్


'కేజీఎఫ్ చాప్టర్ 1, కేజీఎఫ్ చాప్టర్ 2, కాంతార, సలార్: పార్ట్ 1– సీజ్‌ఫైర్' వంటి పాన్ ఇండియా చిత్రాలు నిర్మించి, భారతీయ చిత్ర పరిశ్రమలో ప్రముఖ ప్రొడక్షన్‌గా పేరొందిన కన్నడ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ ప్రభాస్ హీరోగా ముచ్చటగా మూడు సినిమాలు నిర్మించనుంది. ఈ మేరకు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన పాన్ ఇండియన్ మూవీ 'సలార్: పార్ట్ 1– సీజ్‌ఫైర్' 2023 డిసెంబరు 22న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకి కొనసాగింపుగా 'సలార్: పార్ట్ 2– శౌర్యాంగ పర్వం' రూపొందనుంది. అయితే 'సలార్ 2'తో పాటు మరో రెండు కొత్త సినిమాలతో కలిపి మూడు సినిమాలు ప్రభాస్ హీరోగా నిర్మించనుంది హోంబలే ఫిల్మ్స్. ఈ సందర్భంగా విజయ్ కిరగందూర్ మాట్లాడుతూ– 'భారతీయ సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేలా మూడు చిత్రాల భాగస్వామ్యంతో ప్రభాస్‌తో కలిసి పని చేయనుండటం ఆనందంగా ఉంది. ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమాటిక్ అనుభూతిని సృష్టించడానికి వేదిక సిద్ధమైంది. 'సలార్ 2' తో ఈ ప్రయాణం ప్రారంభం అవుతుంది.. సిద్ధంగా ఉండండి'' అని పేర్కొన్నారు. అలాగే.. ఈ మూడు సినిమాలు 2026, 2027, 2028లో విడుదలవుతాయని స్పష్టం చేశారు.



● ఏఎన్ఆర్



● రాజ్ కపూర్



● మహమ్మద్ రఫీ



● తపన్ సిన్హా

ఇఫీలో శతాబ్ది వేడుకలు

● ఏఎన్నార్, రాజ్ కపూర్, మహమ్మద్ రఫీ, తపన్ సిన్హాలకు నివాళి

అక్కినేని నాగేశ్వరరావు, రాజ్ కపూర్, మహమ్మద్ రఫీ, తపన్ సిన్హా... భారతీయ చిత్రసీమలో ఒక్కొక్కరిది ఒక్కో చరిత్ర. నటులుగా ఏఎన్నార్, రాజ్ కపూర్, గాయకుడిగా మహమ్మద్ రఫీ, దర్శకుడిగా తపన్ సిన్హా చిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు గాను 'ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా' (ఇఫీ) ఘనంగా నివాళులర్పించనుంది. 55వ ఇఫీ వేడుకలు గోవాలో ఈ నెల 20న ఆరంభమై 28 వరకూ జరుగుతాయి. 22న అక్కినేని నాగేశ్వర రావు, 24న రాజ్ కపూర్, 26న మహమ్మద్ రఫీ, 27న తపన్ సిన్హాలకు చెందిన శతాబ్ది వేడుకలను జరపడానికి 'ఇఫీ' నిర్వాహకులు ప్లాన్ చేశారు. గోవా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కేంద్ర సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ఈ చిత్రోత్సవాలను నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఇక నలుగురు లెజెండ్స్ నివాళి కార్యక్రమానికి సంబంధించిన విశేషాలు తెలుసుకుందాం.

- నలుగురు లెజెండ్స్ కెరీర్‌లో చెరగని ముద్ర వేసిన చిత్రాలను, పాటలను ప్రదర్శించనున్నారు. ఏఎన్నార్ క్లాసిక్ మూవీ 'దేవదాసు', రాజ్ కపూర్ కెరీర్‌లో మైలురాయి అయిన 'ఆవారా', తపన్ సిన్హా దర్శకత్వంలో రూపొందిన చిత్రాల్లో అద్భుత చిత్రం 'హార్మోనియమ్' చిత్రాలను ప్రదర్శించడంతో పాటు 'హమ్ దోనో'లో మహమ్మద్ రఫీ పాడిన పాటలను వినిపించనున్నారు. కాగా, వీక్షకులకు నాణ్యతతో చూపించడానికి ఈ చిత్రాలను పునరుద్ధరించే బాధ్యతను నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ ఫిల్మ్ ఆర్కైవ్ ఆఫ్ ఇండియా తీసుకుంది. అలాగే ఈ ప్రముఖుల సినిమా కెరీర్‌కి సంబంధించిన ఏవీ (ఆడియో విజువల్) చూపించనున్నారు.
- నలుగురు కళాకారుల ప్రత్యేక నివాళిలో భాగంగా వారి విజయాలను గౌరవిస్తూ పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ గోవాలోని కళా అకాడమీలో సృష్టించే 'శాండ్ ఆర్ట్' ఇల్లస్ట్రేషన్‌ని ప్రదర్శించనున్నారు.
- సినిమా రంగంలో, భారతీయ సంస్కృతిపై వీరు వేసిన ముద్రకు ప్రతీకగా ఈ నలుగురు దిగ్గజాలకు అంకితం చేస్తూ ప్రత్యేక స్టాంపును ఆవిష్కరించనున్నారు.
- ఈ నలుగురి కెరీర్‌లో తీపి గుర్తులుగా నిలిచిపోయిన చిత్రాలకు సంబంధించిన ఫొటోలు, అలాగే వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ప్రత్యేకమైన ఫొటోలతో ఓ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడానికి 'ఇఫీ' ప్లాన్ చేస్తోంది.
- రాజ్ కపూర్, మహమ్మద్ రఫీ కెరీర్‌లోని చిత్రాల్లోని 150 పాటలు, ఏఎన్నార్, తపన్ సిన్హా చిత్రాల్లోని 75 పాటలు... మొత్తంగా 225 పాటలతో ఓ సంగీత విభావరి జరగనుంది.

భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా ఈ నలుగురు కళాకారుల శతాబ్ది వేడుకల్లో భాగంగా ఇంకా పలు కార్యక్రమాలను ప్లాన్ చేశారు.



● సందీప్, సుజీత్, సందీప్ కిషన్, కిరణ్, 'దిల్' రాజు, గోపాలకృష్ణా రెడ్డి, 'బన్నీ' వాసు

మన ప్రతిభే మనల్ని కాపాడుతుంది

\- 'దిల్' రాజు

'చిత్ర పరిశ్రమలో ఎలాంటి నేపథ్యం లేని కిరణ్ అబ్బవరం ఇండస్ట్రీకి వచ్చి తన కష్టంతో, ప్రతిభతో నిలదొక్కుకున్నాడు. ఇండస్ట్రీలో ఎవరూ ఎవరికి సపోర్ట్ చేయరు, అతిథిలుగా రారు. మన సినిమా, మన ప్రతిభే మనల్ని కాపాడుతుంది. ఈ దీపావళికి బాక్సాఫీస్ దగ్గర భారీ పోటీ నెలకొంది. ఆ పోటీలో 'క' సినిమా ఘన విజయాన్ని అందుకోవడం మామూలు విషయం కాదు. ఈ టీమ్‌కి నా అభినందనలు'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా, తన్వీ రామ్, నయన్ సారిక హీరోయిన్లుగా నటించిన చిత్రం 'క'. సుజీత్, సందీప్ దర్శకత్వం వహించారు. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ సినిమాని ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి తెలుగులో అక్టోబరు 31న రిలీజ్ చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'క' గ్రాండ్ సక్సెస్ మీట్‌లో నిర్మాత 'బన్నీ' వాసు మాట్లాడుతూ– 'క' సినిమా క్లైమాక్స్ ఊహించలేకపోయాను. ఇటీవల కాలంలో నేను చూసిన ది బెస్ట్ స్క్రీన్ ప్లే ఇదే'' అని పేర్కొన్నారు. హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ–'కిరణ్ 'రాజావారు రాణిగారు' సినిమా తర్వాత మళ్లీ 'క' మూవీ ఫంక్షన్‌కు వచ్చాను. తనని చూస్తుంటే గర్వంగా ఉంది. ఎంతోమందికి తను స్ఫూర్తి'' అని తెలిపారు. 'క'కి ఇంత పెద్ద విజయం ఇచ్చిన ప్రేక్షక దేవుళ్లకు కృతజ్ఞతలు'' అని చెప్పారు కిరణ్ అబ్బవరం. 'ఈ సినిమా విజయంలో నటీనటులు, సాంకేతిక నిపుణులకు క్రెడిట్ ఇవ్వాలి'' అన్నారు సుజీత్. ''మంచి సినిమాను ఆదరిస్తామని తెలుగు ప్రేక్షకులు మరోసారి 'క'తో రుజువు చేశారు'' అని సందీప్ తెలిపారు. ''మంచి సినిమా చేశామనే సంతృప్తిని 'క' మిగిల్చింది'' అన్నారు చింతా గోపాలకృష్ణా రెడ్డి. ఈ సక్సెస్‌మీట్‌లో వంశీ నందిపాటి, దర్శకులు వశిష్ఠ, అనిల్ విశ్వనాథ్, నటి శరణ్య ప్రదీప్ తదితరులు మాట్లాడారు.

వాకిలి పద్మ




● ఉదయ భాను

సత్యరాజ్, వశిష్ఠ ఎన్. సింహా, సాంచి రాయ్, 'సత్యం' రాజేష్, ఉదయ భాను నటించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. మారుతీ టీమ్ ప్రొడక్ట్ సమర్పణలో వానర సెల్యూలాయిడ్‌పై విజయపాల్ రెడ్డి అడిదల నిర్మించారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ మూవీ నుంచి యాంకర్, నటి ఉదయ భాను పోషించిన వాకిలి పద్మ పాత్ర ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. 'భీముడి మనవడు, ఘటోత్కచుడి కుమారుడు బార్బరిక్ (బార్బరికుడు) పాత్రను ఆధారంగా తీసుకుని 'త్రిబాణధారి బార్బరిక్' రూపొందించాం. చాలా ఏళ్ల తర్వాత వాకిలి పద్మ అనే మంచి పాత్రలో ఉదయ భాను నటించారు. నిర్మాణానంతర పనులు జరుపుకుంటున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటించనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కుశేందర్ రమేష్ రెడ్డి, సంగీతం: ఇన్ఫ్యూషన్ బ్యాండ్.

కొత్తవాళ్లు రావాలి

\- తమ్మారెడ్డి భరద్వాజ

'చిత్ర పరిశ్రమకు కొత్తవాళ్లు రావాలి. అప్పుడే కొత్త ప్రతిభ మనకు దొరుకుతుంది. హారర్, దేవుడు వంటి నేపథ్యంలో రూపొందిన 'ఎర్రచీర' సినిమా విజయం సాధించాలి'' అని దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ కోరారు. సుమన్ బాబు ముఖ్య పాత్ర పోషించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఎర్రచీర–ది బిగినింగ్'. కారుణ్య చౌదరి హీరోయిన్‌గా, నటుడు రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని కీలక పాత్రలో నటించారు. బేబి ఢమరి సమర్పణలో శ్రీ పద్మాలయ ఎంటర్‌టైన్మెంట్స్–శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్‌పై నిర్మించిన 'ఎర్రచీర–ది బిగినింగ్' డిసెంబరు 20న తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ వేడుకలో సుమన్ బాబు మాట్లాడుతూ– 'యాక్షన్, మదర్ సెంటిమెంట్‌తో ఈ సినిమా రూపొందించాను'' అన్నారు. ''ఈ కథలో మదర్ సెంటిమెంట్ ఆకట్టుకునేలా ఉంటుంది'' అని కారుణ్య చౌదరి చెప్పారు. ''మదర్ సెంటిమెంట్‌ను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు'' అన్నారు నిర్మాత అంబికా కృష్ణ. మ్యూజిక్ డైరెక్టర్ ప్రమోద్ పులిగార్ల, నిర్మాత ఎత్తరి గురురాజ్, నిర్మాత, నటుడు సురేష్ కొండేటి మాట్లాడారు.



● సురేష్, తమ్మారెడ్డి భరద్వాజ

వివాహం నేపథ్యంలో...



● రాజేష్, నవ్య

రాజేష్ మేరు, నవ్య చిత్యాల జంటగా ప్రజోత్ కె.వెన్నం దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లగ్గం టైమ్'. 20వ సెంచరీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై కె.హిమ బిందు నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ ఫస్ట్‌లుక్‌ని 'భీమ్లా నాయక్' మూవీ ఫేమ్ డైరెక్టర్ సాగర్ కె. చంద్ర విడుదల చేసి, ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. కె.హిమ బిందు మాట్లాడుతూ– ''మా బ్యానర్‌పై తెరకెక్కుతున్న మొదటి చిత్రానికి 'లగ్గం టైమ్' టైటిల్‌ని ఫిక్స్ చేశాం. వివాహం నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సరి కొత్త కథ, నూతన నటీనటులతో రూపొందుతున్న ఈ మూవీ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం, కెమెరా: పవన్ గుంటుకు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
55	51
79,486	24,148

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,250	▽	19
డోజోన్స్	43,967	△	237
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,072	▽	68
డాక్స్	19,205	▽	158
షాంఘై	3,452	▽	18
నికాయ్	39,500	△	119

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

	విలువ		మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	77,382	△	602
బంగారం (99.5 స్వచ్ఛత)	77,072	△	599
వెండి (కేజీ)	91,130	△	761

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.68	84.70
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	107.61	110.46
€	యూరో	ఒకటి	89.62	92.32
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.27	55.71
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.22	56.41
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.55	66.32
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.51	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	22.04	23.81
¥	చైనా యువాన్	ఒకటి	10.89	12.65

ఎస్‌బీఐ లాభం రయ్

- క్యూ2లో రూ. 19,782 కోట్లు
- తగ్గిన మొండిబకాయిలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 19,782 కోట్లను తాకింది. వడ్డీయేతర ఆదాయం, ట్రెజరీ లాభాలు పుంజుకోవడం ఇందుకు తోడ్పాటునిచ్చాయి. స్టాండెలోన్ లాభం సైతం రూ. 18,331 కోట్లకు ఎగసింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 14,330 కోట్లు మాత్రమే ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం 5 శాతంపైగా పుంజుకుని రూ. 41,620 కోట్లకు చేరింది. రుణాల్లో 15 శాతం వృద్ధి ఇందుకు సహకరించినప్పటికీ నికర వడ్డీ మార్జిన్లు 0.15% నీరసించి 3.14 శాతానికి పరిమితమయ్యాయి. ఫారెక్స్, ట్రెజరీ మద్దతుతో వడ్డీయేతర ఆదాయం 42% జంప్‌చేసి రూ. 15,721 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం రూ. 1.29 లక్షల కోట్లకు చేరింది. రుణాల్లో 14–16% వృద్ధిని అంచనా వేస్తున్నట్లు బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి పేర్కొన్నారు. అయితే డిపాజిట్లలో వృద్ధి 10 శాతానికి పరిమితంకావచ్చని అభిప్రాయపడ్డారు. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో(ఏప్రిల్–సెప్టెంబర్) రూ. 63,895 కోట్ల నిర్వహణ లాభం సాధించినట్లు తెలియజేశారు. ఈ బాటలో నికర లాభాల్లోనూ రూ. లక్ష కోట్ల మార్క్‌ను చేరుకునే లక్ష్యంతో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎన్‌పీఏలు తగ్గాయ్...

ప్రస్తుత సమీక్షా కాలంలో ఎస్‌బీఐ తాజా స్లిప్పేజీలు రూ. 3,831 కోట్లకు పరిమితంకాగా.. రూ. 2,300 కోట్ల రికవరీలు అందుకుంది. త్రైమాసికవారీగా స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 2.21 శాతం నుంచి 2.13 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి 13.76 శాతంగా నమోదైంది. అనుబంధ సంస్థల విషయానికొస్తే జీవిత బీమా విభాగం నికర లాభం ఆరు నెలల్లో రూ. 761 కోట్ల నుంచి రూ. 1,049 కోట్లకు జంప్‌చేసింది. క్రెడిట్ కార్డుల విభాగం లాభం మాత్రం రూ. 1,196 కోట్ల నుంచి రూ. 999 కోట్లకు తగ్గింది. ఏఎంసీ నికర లాభం రూ. 940 కోట్ల నుంచి రూ. 1,374 కోట్లకు పెరిగింది. ఇక సాధారణ బీమా సంస్థ లాభం రూ. 60 కోట్ల నుంచి రూ.414 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో ఎస్‌బీఐ షేరు ధర 2 శాతం నష్టంతో రూ.843 వద్ద ముగిసింది.

ఎల్‌ఐసీ లాభం 7,621 కోట్లు

క్యూ2లో 4 శాతం తగ్గుదల • ఆదాయం 2,29,620 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం ఎల్‌ఐసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు వెలువరించింది. జులై–సెప్టెంబర్ (క్యూ2)లో నికర లాభం 4% క్షీణించి రూ. 7,621 కోట్లకు పరిమితమైంది. ఇతర ఆదాయం తగ్గడం, కుటుంబ పెన్షన్‌లో రూ. 464 కోట్ల పెరుగుదల ప్రభావం చూపాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 7,925 కోట్లు ఆర్జించింది. నికర ప్రీమియం ఆదాయం రూ. 1,07,397 కోట్ల నుంచి రూ. 1,19,901 కోట్లకు ఎగసింది. అయితే ఇతర ఆదాయం రూ. 248 కోట్ల నుంచి దాదాపు సగానికి తగ్గి రూ. 145 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,01,587 కోట్ల నుంచి రూ. 2,29,620 కోట్లకు జంప్ చేసింది. కాగా.. మొత్తం వ్యయాలు రూ. 1,94,335 కోట్ల నుంచి రూ. 2,22,366 కోట్లకు పెరిగాయి. స్థూల మొండిబకాయిలు 2.43 శాతం నుంచి 1.72 శాతానికి దిగివచ్చాయి.

హెల్త్ ఇన్సూరెన్స్‌పై కన్ను

ఈ ఆర్థిక సంవత్సరంలోగా స్టాండెలోన్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలో వాటా కొనుగోలు చేయనున్నట్లు ఎల్‌ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మొహంతీ పేర్కొన్నారు. ఇప్పటికే పనులు మొదలుకాగా.. సరైన సంస్థ కోసం చూస్తున్నట్లు తెలియజేశారు. మార్చిలోగా వాటా కొనుగోలుకు తుది రూపునివ్వనున్నట్లు వెల్లడించారు. టార్గెట్ సంస్థ విలువనుబట్టి ఎంత వాటా కొనుగోలు చేసేదీ ఆధారపడి ఉంటుందని ఆయన వివరించారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌ఐసీ షేరు బీఎస్‌ఈలో 1.6% నష్టంతో రూ. 915 వద్ద ముగిసింది.

స్విగ్గీ ఐపీవో 'డెలివరీ' ఓకే

చివరి రోజుకల్లా 3.6 రెట్లు బిడ్స్ • అదే బాటలో ఆక్మే సోలార్



న్యూఢిల్లీ: ఫుడ్ డెలివరీ, క్విక్‌కామర్స్ దిగ్గజం స్విగ్గీ పబ్లిక్ ఇష్యూకి మెరుగైన స్పందన లభించింది. చివరి రోజు శుక్రవారానికల్లా 3.6 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. కంపెనీ 16.01 కోట్ల షేర్లను ఆఫర్ చేయగా.. 57.53 కోట్ల షేర్ల కోసం దరఖాస్తులు అందాయి. క్విబ్ విభాగంలో 6 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 0.41 రెట్లు చొప్పున బిడ్స్ లభించాయి. అయితే రిటైల్ ఇన్వెస్టర్లు 1.14 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. రూ. 371–390 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 11,327 కోట్లు సమకూర్చుకుంది. మంగళవారం (5న) యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ. 5,085 కోట్లు సమీకరించిన విషయం విదితమే. రూ. 95,000 కోట్ల విలువలో కంపెనీ ఐపీవోకు రావడం గమనార్హం!

ఆక్మే సోలార్... 2.75 రెట్లు స్పందన

పునరుత్పాదక ఇంధన రంగ కంపెనీ ఏసీఎంఈ (ఆక్మే) సోలార్ పబ్లిక్ ఇష్యూకి బాగానే ఆదరణ దక్కింది. చివరి రోజు శుక్రవారానికల్లా 2.75 రెట్లు అధికంగా దరఖాస్తులు లభించాయి. కంపెనీ 5.82 కోట్ల షేర్లను ఆఫర్ చేయగా.. 16 కోట్ల షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. క్విబ్ విభాగంలో 3.54 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 0.97 రెట్లు చొప్పున బిడ్స్ నమోదయ్యాయి. అయితే రిటైల్ ఇన్వెస్టర్లు 3.1 రెట్లు అధికంగా దరఖాస్తు చేయడం గమనార్హం! రూ. 275–289 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 2,900 కోట్లు సమకూర్చుకుంది. యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.1,300 కోట్లు లభించాయి.

రిలయన్స్, ఐసీఐసీఐ షేర్లు
పడేశాయ్

- కొనసాగిన ఎఫ్‌ఐఐల అమ్మకాలు
- స్టాక్ సూచీలకు స్వల్ప నష్టాలు



ముంబై: రిలయన్స్ ఇండస్ట్రీస్ (–1.50%), ఐసీఐసీఐ బ్యాంక్(–1.50%), ఎస్‌బీఐ (–2%) వంటి పెద్ద షేర్లలో అమ్మకాలతో శుక్రవారం స్టాక్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు ఇందుకు తోడయ్యాయి. సెన్సెక్స్ 55 పాయింట్లు నష్టపోయి 79,486 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 51 పాయింట్లు కోల్పోయి 24,148 వద్ద నిలిచింది. సూచీలకు ఇది వరుసగా రెండోరోజూ నష్టాల ముగింపు. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 424 పాయింట్లు నష్టపోయి 79,117 వద్ద, నిఫ్టీ 134 పాయింట్లు క్షీణించి 24,065 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. అయితే సంస్థాగత ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతు, ఐటీ, కన్జూమర్ షేర్లు రాణించడంతో నష్టాలు కొంతమేర తగ్గాయి. రంగాల వారీగా రియల్టీ ఇండెక్స్ 3% పతనమైంది. బెంచ్‌మార్క్ సూచీలు స్వల్ప నష్టాలు చవిచూసినా.. చిన్న, మధ్య తరహా షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 1.5%, 1% క్షీణించాయి.

- డాలర్ మారకంలో రూపాయి విలువ 5 పైసలు బలహీనపడి తాజా జీవితకాల కనిష్ట స్థాయి 84.37 వద్ద స్థిరపడింది.
- మహారాష్ట్రలో నవంబర్ 20న (శుక్రవారం) అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ ఎక్స్ఛేంజీలు సెలవు ప్రకటించాయి.

చైనా ఉద్దీపన - ఫెడ్ వడ్డీరేట్ల కోత

స్థానిక ప్రభుత్వాలకు సంబంధించి 839 బిలియన్ డాలర్ల (6 ట్రిలియన్ యువాన్లు) ఉద్దీపన ప్యాకేజీకి చైనా కాంగ్రెస్ ఆమోదం తెలిపింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికతో భవిష్యత్తులో ఎదురయ్యే ఆర్థిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ఉద్దీపన చర్యలు చేపట్టింది. మరోవైపు అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాదిలో రెండోసారి వడ్డీరేట్ల కోత విధించింది. తాజాగా మరో 0.25% తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత కోతతో ఫెడ్ ఫండ్ రేట్ల శ్రేణి 4.50–4.75 శాతానికి పరిమితమైంది.

27 నుంచి పౌల్ట్రీ ఎక్స్‌పో



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పదహారో విడత పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో 2024ను నవంబర్ 27 నుంచి 29 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నారు. అంతకన్నా ఒక రోజు ముందు 26న నాలెడ్జ్ డే టెక్నికల్ సెమినార్ నిర్వహించనున్నట్లు భారతీయ పౌల్ట్రీ పరికరాల తయారీ సంస్థల అసోసియేషన్ (ఐపీఈఎంఏ)/ పౌల్ట్రీ ఇండియా వెల్లడించాయి. ఎక్స్‌పోలో 50 పైచిలుకు దేశాల నుంచి 400 మంది పైగా ఎగ్జిబిటర్లు పాల్గొనున్నట్లు ఐపీఈఎంఏ/పౌల్ట్రీ ఇండియా ప్రెసిడెంట్ ఉదయ్ సింగ్ బయాస్ తెలిపారు. ఇందులో కొత్త సాంకేతికతలు, పరికరాలు, ఫీడ్ మొదలైనవి ఉంటాయని, 40 వేల మంది పౌల్ట్రీ రైతులు, ప్రభుత్వాధికారులు, పరిశ్రమ ప్రతినిధులు దీన్ని సందర్శిస్తారనే అంచనాలు ఉన్నాయని వివరించారు. పౌల్ట్రీ పరిశ్రమ పౌష్టికాహారంతో పాటు ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోందని ఈ సందర్భంగా వక్తలు తెలిపారు.

టాటా మోటార్స్
లాభం డౌన్

క్యూ2లో రూ. 3,450 కోట్లు • జేఎల్‌ఆర్ ప్రభావం



న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 10 శాతం క్షీణించి రూ. 3,450 కోట్లకు పరిమితమైంది. అమ్మకాలు తగ్గడం ప్రభావం చూపింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 3,832 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 1,04,444 కోట్ల నుంచి రూ. 1,00,534 కోట్లకు వెనకడుగు వేసింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 1,00,649 కోట్ల నుంచి రూ. 97,330 కోట్లకు తగ్గాయి. ప్యాసింజర్ వాహన విభాగం నుంచి 4 శాతం తక్కువగా రూ. 11,700 కోట్ల ఆదాయం లభించగా.. అమ్మకాలు 6% నీరసించి 1,30,500 యూనిట్లకు పరిమితమైనట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. వాణిజ్య వాహన(సీవీ) అమ్మకాలు 20 శాతం క్షీణించి 79,800 యూనిట్లను తాకాయి. ఎగుమతులు 11% తగ్గి 4,400 యూనిట్లకు చేరాయి. సీవీ బిజినెస్ ఆదాయం 14% తక్కువగా రూ. 17,300 కోట్లకు పరిమితమైంది.

జేఎల్‌ఆర్ డీలా

లగ్జరీ కార్ల బ్రిటిష్ అనుబంధ సంస్థ జేఎల్‌ఆర్ ఆదాయం 6 శాతం నీరసించి 6.5 బిలియన్ పౌండ్లకు పరిమితమైనట్లు టాటా మోటార్స్ పేర్కొంది. అల్యూమినియం సరఫరాల తాత్కాలిక సమస్యలతో లాభాలు ప్రభావితమైనట్లు తెలియజేసింది. వీటికి తోడు 6,029 వాహనాలను అదనపు నాణ్యతా సంబంధ పరిశీలనలకోసం నిలిపిఉంచినట్లు వెల్లడించింది. దీంతో డిమాండుకు అనుగుణంగా వాహన డెలివరీలను చేపట్టలేకపోయినట్లు తెలియజేసింది. ఎలక్ట్రిక్ వాహన ఉత్పత్తి కోసం యూకే హేల్‌ఉడ్ ప్లాంట్‌పై 25 కోట్ల పౌండ్లను ఇన్వెస్ట్ చేసినట్లు జేఎల్‌ఆర్ సీఈవో అడ్రియన్ మార్డెల్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు బీఎస్‌ఈలో 1.7 శాతం నష్టంతో రూ. 806 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మళ్లీ లాభాల్లోకి వేదాంత | టాటాల బాటలో 'లోధా'!



అర్జున్‌కు మూడో విజయం

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నమెంట్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మూడో విజయం నమోదు చేశాడు. అమీన్ తబాయి (ఇరాన్)తో చెన్నైలో శుక్రవారం జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో అర్జున్ 52 ఎత్తుల్లో గెలిచాడు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. నాలుగో రౌండ్ తర్వాత అర్జున్ 3.5 పాయింట్లతో ఒంటరిగా ఆధిక్యంలో ఉన్నాడు.

28వ ప్రపంచ టైటిల్‌కు గెలుపు దూరంలో పంకజ్

భారత దిగ్గజం పంకజ్ అద్వానీ 28వ ప్రపంచ టైటిల్‌కు విజయం దూరంలో నిలిచాడు. దోహాలో జరుగుతున్న 150 పాయింట్ల ఫార్మాట్ ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో పంకజ్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. భారత్‌కే చెందిన సౌరవ్ కొఠారితో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో పంకజ్ 4–2 ఫ్రేమ్‌ల తేడాతో గెలుపొందాడు. నేడు జరిగే ఫైనల్లో రాబర్ట్ హాల్ (ఇంగ్లండ్)తో పంకజ్ తలపడతాడు.

సూపర్ సామ్సన్

సెంచరీతో చెలరేగిన భారత ఓపెనర్


సామ్సన్

తొలి టి20లో భారత్ ఘన విజయం	61 పరుగులతో దక్షిణాఫ్రికా చిత్తు	ఆదివారం రెండో టి20 మ్యాచ్

దాదాపు నెల రోజుల క్రితం హైదరాబాద్ టి20 మ్యాచ్‌లో అద్భుత సెంచరీతో అలరించిన సంజు సామ్సన్ అదే ఫామ్‌ను కేప్‌టౌన్ వరకు తీసుకెళ్లాడు. వేదిక మారినా, ప్రత్యర్థి మారినా అదే దూకుడుతో సిక్సర్ల వర్షం కురిపించిన అతను వరుసగా రెండో శతకంతో మెరిసి ఈ ఘనత సాధించిన అరుదైన జాబితాలో చోటు దక్కించుకున్నాడు. సామ్సన్ మెరుపు బ్యాటింగ్ కారణంగా భారీ స్కోరుతో ప్రత్యర్థికి భారత్ సవాల్ విసిరింది. ఆపై చక్కటి బౌలింగ్‌తో ప్రత్యర్థిని కుప్పకూల్చి సిరీస్‌లో శుభారంభం చేసింది. సొంతగడ్డపై కూడా అన్ని రంగాల్లో సమష్టిగా విఫలమైన సఫారీ టీమ్ ఏమాత్రం ప్రభావం చూపలేక పరాజయాన్ని మూటగట్టుకుంది.

కేప్‌టౌన్: టి20 క్రికెట్ ప్రపంచ చాంపియన్ భారత్ తమ స్థాయికి తగ్గ ప్రదర్శనతో మరోసారి దక్షిణాఫ్రికాపై పైచేయి సాధించింది. శుక్రవారం కింగ్స్‌మీడ్ మైదానంలో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సంజు సామ్సన్ (50 బంతుల్లో 107; 7 ఫోర్లు, 10 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... హైదరాబాద్ బ్యాటర్ ఠాకూర్ తిలక్‌వర్మ (18 బంతుల్లో 33; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కూడా రాణించాడు. అనంతరం దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. క్లాసెన్ (25)దే అత్యధిక స్కోరు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ చెరో 3 వికెట్లు తీశారు. సిరీస్‌లో భారత్ 1–0తో ముందంజ వేయగా, రెండో టి20 మ్యాచ్ ఆదివారం జరుగుతుంది.

4 అంతర్జాతీయ టి20ల్లో వరుసగా రెండు మ్యాచ్‌లలో సెంచరీ చేసిన నాలుగో ఆటగాడిగా సామ్సన్ నిలిచాడు. గతంలో గుస్తావ్ మెక్‌కియాన్ (ఫ్రాన్స్), ఫిల్ సాల్ట్ (ఇంగ్లండ్), రిలీ రోసో (దక్షిణాఫ్రికా) ఈ ఘనత సాధించారు.

మెరుపు భాగస్వామ్యాలు...

జాన్సెన్ వేసిన తొలి ఓవర్లో 2 పరుగులే వచ్చినా... ఆ తర్వాతి రెండు ఓవర్లలో భారత్ 22 పరుగులు రాబట్టింది. అభిషేక్ శర్మ (7) విఫలం కాగా, సామ్సన్ తన దూకుడుతో వేగంగా పరుగులు రాబట్టాడు. అతనికి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (17 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్) జత కలవడంతో స్కోరు దూసుకుపోయింది. పవర్‌ప్లేలో జట్టు 56 పరుగులు సాధించింది. జాన్సెన్ ఓవర్లో వరుసగా 4, 6 కొట్టిన సామ్సన్... పీటర్ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లతో 27 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. సామ్సన్, సూర్య రెండో వికెట్‌కు 37 బంతుల్లో 66 పరుగులు జోడించారు. ఆ తర్వాత సామ్సన్, తిలక్ కలిసి ధాటిని కొనసాగిస్తూ సఫారీ బౌలర్లపై చెలరేగారు. క్రూగర్ ఓవర్లో తిలక్ వరుసగా ఫోర్, సిక్స్ బాదాడు. మరోవైపు మహరాజ్ బౌలింగ్‌లో లాంగాఫ్ దిశగా సింగిల్ తీయడంతో సామ్సన్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. మూడో వికెట్‌కు 77 పరుగులు (34 బంతుల్లో) జత చేసిన అనంతరం తిలక్ వెనుదిరిగాడు. ఆ తర్వాత ఒక్కసారిగా భారత బ్యాటింగ్ నెమ్మదించింది. 16 పరుగుల వ్యవధిలో సామ్సన్, హార్దిక్ పాండ్యా (2), రింకూ సింగ్ (11) అవుట్ కావడం జట్టు స్కోరు వేగానికి బ్రేక్ వేసింది. చివరి 5 ఓవర్లలో భారత్ 35 పరుగులే చేసింది.

టపటపా...

భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా ఏ దశలోనూ కనీసస్థాయి ఆటను ప్రదర్శించలేదు. టీమ్‌లో ఒక్క బ్యాటర్ కూడా పట్టుదలగా నిలబడలేకపోయాడు. భారత బౌలర్ల జోరుతో పవర్‌ప్లే ముగిసేలోపే సఫారీ స్కోరు 44/3 వద్ద నిలిచింది. ఈ స్థితిలో క్లాసెన్, మిల్లర్ (18) జోడీ ఆదుకుంటుందని జట్టు ఆశలు పెట్టుకుంది. అయితే వరుణ్ చక్రవర్తి ఒకే ఓవర్లో వీరిద్దరిని అవుట్ చేయడంతో సఫారీ గెలుపు దారులు దాదాపుగా మూసుకుపోయాయి. ఆ తర్వాత ఇతర బ్యాటర్లు కొద్దిసేపు పోరాడటం మినహా విజయానికి ఏమాత్రం అవకాశం లేకుండా పోయింది.


సూర్య, వరుణ్ చక్రవర్తి

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: సామ్సన్ (సి) స్టబ్స్ (బి) పీటర్ 107; అభిషేక్ (సి) మార్క్‌రమ్ (బి) కొయెట్జీ 7; సూర్యకుమార్ (సి) సిమ్‌లేన్ (బి) క్రూగర్ 21; తిలక్ వర్మ (సి) జాన్సెన్ (బి) మహరాజ్ 33; పాండ్యా (సి) జాన్సెన్ (బి) కొయెట్జీ 2; రింకూ సింగ్ (సి) క్లాసెన్ (బి) కొయెట్జీ 11; అక్షర్ పటేల్ (సి) స్టబ్స్ (బి) జాన్సెన్ 7; అర్ష్‌దీప్ (నాటౌట్) 5; బిష్ణోయ్ (రనౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు)** 202. **వికెట్ల పతనం:** 1–24, 2–90, 3–167, 4–175, 5–181, 6–194, 7–199, 8–202. **బౌలింగ్:** జాన్సెన్ 4–0–24–1, మార్క్‌రమ్ 1–0–10–0, కేశవ్ మహరాజ్ 4–0–34–1, కొయెట్జీ 4–0–37–3, పీటర్ 3–0–35–1, క్రూగర్ 2–0–35–1, సిమ్‌లేన్ 2–0–27–0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: రికెల్టన్ (సి) తిలక్ (బి) వరుణ్ 21; మార్క్‌రమ్ (సి) సామ్సన్ (బి) అర్ష్‌దీప్ 8; స్టబ్స్ (సి) సూర్యకుమార్ (బి) అవేశ్ 11; క్లాసెన్ (సి) అక్షర్ (బి) వరుణ్ 25; మిల్లర్ (సి) అవేశ్ (బి) వరుణ్ 18; క్రూగర్ (సి) పాండ్యా (బి) బిష్ణోయ్ 1; జాన్సెన్ (సి) పాండ్యా (బి) బిష్ణోయ్ 12; సిమ్‌లేన్ (ఎల్బీ) (బి) బిష్ణోయ్ 6; కొయెట్జీ (రనౌట్) 23; మహరాజ్ (బి) అవేశ్ 5; పీటర్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (17.5 ఓవర్లలో ఆలౌట్)** 141. **వికెట్ల పతనం:** 1–8, 2–30, 3–44, 4–86, 5–87, 6–87, 7–93, 8–114, 9–135, 10–141. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3–0–25–1, అవేశ్ ఖాన్ 2.5–0–28–2, పాండ్యా 3–0–27–0, వరుణ్ చక్రవర్తి 4–0–25–3, రవి బిష్ణోయ్ 4–0–28–3, అక్షర్ 1–0–8–0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఓటమి దిశగా భారత్ 'ఎ'

- రెండో ఇన్నింగ్స్‌లో 73/5
- మళ్లీ విఫలమైన రాహుల్, ఈశ్వరన్
- ఆస్ట్రేలియా 'ఎ'తో రెండో అనధికారిక టెస్టు


రాహుల్ బౌల్డ్

మెల్‌బోర్న్: భారత 'ఎ' జట్టు బౌలర్లు బాధ్యతగా శ్రమించగా... బ్యాటర్లు మాత్రం మరోసారి నిరాశపరిచారు. ఫలితంగా ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులోనూ భారత్ 'ఎ' జట్టు ఓటమి దిశగా సాగుతోంది. 62 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత 'ఎ' జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 31 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది. ప్రస్తుతం భారత్ 11 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉంది. టాపార్డర్ బ్యాటర్లు అభిమన్యు ఈశ్వరన్ (17), కేఎల్ రాహుల్ (10), సాయి సుదర్శన్ (3) చెత్తగా ఆడి పెవిలియన్‌కు వెళ్లిపోయారు. తర్వాత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (11), దేవదత్ పడిక్కల్ (1) కూడా చేతులెత్తేశారు. దీంతో 56 పరుగులకే భారత్ సగం (5) వికెట్లను కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ధ్రువ్ జురేల్ (19 బ్యాటింగ్; 1 ఫోర్), నితీశ్ కుమార్ రెడ్డి (9 బ్యాటింగ్; 1 ఫోర్) క్రీజులో ఉన్నారు. ఆసీస్ 'ఎ' బౌలర్లలో మెక్ ఆండ్రూ, వెబ్‌స్టర్ చెరో 2 వికెట్లు తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 53/2తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా 62.1 ఓవర్లలో 223 పరుగుల వద్ద ఆలౌటై 62 పరుగుల ఆధిక్యం దక్కించుకుంది. ఓపెనర్ మార్కస్ హారిస్ (138 బంతుల్లో 74; 5 ఫోర్లు) ఒంటరి పోరాటం చేశాడు. భారత పేసర్లు ప్రసిధ్ కృష్ణ (4/50), ముకేశ్ కుమార్ (3/41), ఖలీల్ అహ్మద్ (2/56) ఆతిథ్య జట్టుకు భారీ ఆధిక్యం దక్కకుండా శ్రమించారు. ఆట ఆరంభం కాగానే ఓవర్‌నైట్ బ్యాటర్ సామ్ కొన్‌స్టాస్ (3)ను ఖలీల్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. తర్వాత స్వల్ప వ్యవధిలో ఒలీవర్ డేవీస్ (13)ను ప్రసిధ్, బ్యూ వెబ్‌స్టర్ (5)ను ముకేశ్ అవుట్ చేయడంతో తొలిసెషన్‌లో ఆసీస్ 84 పరుగులకే 5 వికెట్లను కోల్పోయింది. అయితే క్రీజులో పాతుకుపోయిన క్రితం రోజు బ్యాటర్ హారిస్... జిమ్మీ పీర్సన్ (30; 5 ఫోర్లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఈ క్రమంలో హారిస్ అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు కలిసి ఆరో వికెట్‌కు 68 పరుగులు జోడించడంతో ఆస్ట్రేలియా ఆధిక్యం వైపు నడిచింది. జట్టు స్కోరు 152 పరుగుల వద్ద మొదట జిమ్మీని కాసేపటి తర్వాత హారిస్, బోలండ్ (0)లను వరుస బంతుల్లో ప్రసిధ్ అవుట్ చేసి భారత శిబిరానికి ఊరటనిచ్చాడు. కానీ నాథన్ మెక్‌ఆండ్రూ (26 నాటౌట్; 2 ఫోర్లు), రొచిసివోలి (35; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారత బౌలర్లను ఎదుర్కోవడంతో చేతిలో ఉన్న ఒక్క వికెట్‌తో ఆసీస్ 200 పైచిలుకు స్కోరు చేసింది. ఎట్టకేలకు ముకేశ్... రొచిసివోలిని అవుట్ చేయడంతో ఆసీస్ ఇన్నింగ్స్ 223 వద్ద ముగిసింది. గాయపడిన నెసర్ బ్యాటింగ్‌కు దిగలేదు.

స్కోరు వివరాలు

భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్: 161; **ఆస్ట్రేలియా 'ఎ' తొలి ఇన్నింగ్స్:** మెక్‌స్వీనీ (సి) రాహుల్ (బి) ముకేశ్ 14; హారిస్ (సి) జురేల్ (బి) ప్రసిధ్ 74; బాన్‌క్రాఫ్ట్ (సి) తనుశ్ (బి) ఖలీల్ 3; కొన్‌స్టాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఖలీల్ 3; డేవీస్ (సి) ముకేశ్ (బి) ప్రసిధ్ 13; వెబ్‌స్టర్ (సి) రాహుల్ (బి) ముకేశ్ 5; పీర్సన్ (సి) జురేల్ (బి) ప్రసిధ్ 30; మెక్ ఆండ్రూ (నాటౌట్) 26; బోలండ్ (సి) అభిమన్యు (బి) ప్రసిధ్ 0; రొచిసివోలి (సి) జురేల్ (బి) ముకేశ్ 35; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం (62.1 ఓవర్లలో ఆలౌట్)** 223. **వికెట్ల పతనం:** 1–31, 2–43, 3–58, 4–75, 5–84, 6–152, 7–167, 8–167, 9–223. **బౌలింగ్:** ముకేశ్ 16.1–3–41–3, ఖలీల్ 15–2–56–2, ప్రసిధ్ కృష్ణ 16–6–50–4, నితీశ్ కుమార్ 7–0–28–0, తనుశ్ 8–0–34–0. **భారత్ 'ఎ' రెండో ఇన్నింగ్స్:** అభిమన్యు ఈశ్వరన్ (సి)రొచిసివోలి (బి) మెక్ ఆండ్రూ 17; రాహుల్ (బి) రొచిసివోలి 10; సాయి సుదర్శన్ (సి) బాన్‌క్రాఫ్ట్ (బి) వెబ్‌స్టర్ 3; రుతురాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మెక్ ఆండ్రూ 11; పడిక్కల్ (సి) మెక్‌స్వీనీ (బి) వెబ్‌స్టర్ 1; జురేల్ (బ్యాటింగ్) 19; నితీశ్ (బ్యాటింగ్) 9; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (31 ఓవర్లలో 5 వికెట్లకు)** 73. **వికెట్ల పతనం:** 1–25, 2–31, 3–44, 4–44, 5–56. **బౌలింగ్:** బోలండ్ 9–3–18–0, మెక్ ఆండ్రూ 8–2–22–2, వెబ్‌స్టర్ 7–3–14–2, రొచిసివోలి 7–1–18–1.

విద్యుత్ సమాచారం ఇక తెలుగులోనే..

ఉత్తర్వులు జారీ చేసిన ఎన్పీడీసీఎల్ సీఎండీ

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రైతులు, ఇతర వినియోగదారులకు అందించే విద్యుత్ సేవల సమాచారం సులభంగా అర్థమయ్యేందుకు ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులో నిర్వహించాలని ఎన్పీడీసీఎల్ నిర్ణయించింది. ఆయా పనులకు సంబంధించిన అంచనాల వివరాలు సహా అన్నిరకాల సమాచారాన్ని తెలుగులో అందించనున్నారు. ఈ మేరకు ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్న సందర్భంలో ఆయా పనులకు సంబంధించి రూపొందించే అంచనాలు, అలాగే ఇతర విద్యుత్ వినియోగదారుల కనెక్షన్లకు సంబంధించిన సమాచారం ఇంగ్లిషులో ఉండడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి ఇకపై తెలుగులోనే వివరాలు ఇవ్వాలని ఎన్పీడీసీఎల్ అధికారులు నిర్ణయించారు. వినియోగదారులకు వచ్చే ఫోన్ సందేశాలు కూడా తెలుగులోనే ఉంటాయని చెబుతున్నారు. సీఎండీ ఆదేశాల మేరకు ప్రతి సమాచారాన్ని వినియోగదారులకు తెలుగులోనే అందించనున్నామని కామారెడ్డి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు.



పర్యావరణానికి, జీవజాతులకు ప్లాస్టిక్ చేస్తున్న చేటు అందరికీ తెలిసిందే. దానికి నిదర్శనంగా నిలిచే చిత్రమిది.
ఓ ప్లాస్టిక్ తాడు.. ఈ పక్షి పాలిట ఉరి తాడుగా మారింది. అనుకోకుండా అందులో ఇరుక్కుని.. బయటపడే మార్గం లేక.. నిస్సహాయంగా ఈ పక్షి ప్రాణాలొదిలింది.
'నాకు ఈ చిత్రంలో మన భూమి భవిష్యత్తు కనిపిస్తోంది. ఇప్పటికైనా మేల్కొని తగు పరిరక్షణ చర్యలు చేపట్టకపోతే.. మన గతి ఇదే'అని ఈ ఫొటోను తీసిన ఖుర్రం ఖాన్ అన్నారు. ఈ చిత్రం నేచర్స్ బెస్ట్ ఫొటోగ్రఫీ పోటీలో 'కన్జర్వేషన్'(పరిరక్షణ) కేటగిరీలో మొదటి బహుమతిని గెలుచుకుంది.

20 అడుగుల ఎత్తుతో తెలంగాణ తల్లి!

- సచివాలయంలో విగ్రహం ఏర్పాటుకు వేగంగా పనులు
- అందరికీ కనిపించేలా ఎత్తయిన పీఠంపై నిర్మాణం
- ఎదురుగా భారీ ఫౌంటేన్, ఆకట్టుకునేలా లైటింగ్ కూడా..
- వచ్చే నెల 9న ఆవిష్కరించనున్న ప్రభుత్వం
- సెక్రటేరియట్‌లో ప్రధాన రహదారి మార్పు



సచివాలయం ప్రాంగణంలో జరుగుతున్న నిర్మాణ పనులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. సచివాలయానికి వచ్చే ప్రతీ ఒక్కరికి కనిపించేలా విగ్రహం ఉండాలని భావిస్తున్నారు. దీనికోసం ఎత్తయిన పీఠం నిర్మించి.. దానిపై 20 అడుగుల ఎత్తయిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.1.16 కోట్లు వెచ్చిస్తున్నారు. విగ్రహం ముందు గ్రీనరీ, భారీ ఫౌంటేన్, ఆకట్టుకునేలా లైటింగ్ కూడా సిద్ధం చేస్తున్నారు. వచ్చే నెల 9న విగ్రహావిష్కరణ ఉండటంతో అంతకుముందే పనులన్నీ పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విగ్రహం ఏర్పాటు, పరిసరాల సుందరీకరణలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలన్న ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. విగ్రహంలో పలు మార్పుచేర్పులను సూచిస్తూ శిల్పికి సమాచారం అందించినట్టు తెలిసింది.

ప్రధాన దారి మార్పు..

సచివాలయ ఆవరణలో ప్రధాన ద్వారం నుంచి ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి వచ్చి వెళ్లేవారు. ప్రస్తుతం ఆ ద్వారానికి ముందే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో.. దారిని పూర్తిగా మూసేశారు. దీని వల్ల సచివాలయానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా గేట్-2, గేట్-4లు రెండింటినీ కలిపేలా రోడ్డు వేస్తున్నారు. సచివాలయానికి వచ్చే అధికారులు, సందర్శకులు చుట్టూ తిరిగి వెళ్లాల్సి రాకుండా దీన్ని నిర్మిస్తున్నారు. అంటే తెలంగాణ తల్లి విగ్రహం ముందు నుంచి, వెనక నుంచి రెండు దారులు ఉంటాయని అధికారులు చెప్తున్నారు.

హైదరాబాద్‌లో నేడు సర్కారీ ఆఫీసులు ఓపెన్

- రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కూడా

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాలన్నీ శనివారం పనిచేస్తాయి. వాస్తవానికి నేడు రెండో శనివారం సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉండాలి. కానీ, సెప్టెంబర్ 17న గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఈ 3 జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు ఇచ్చింది. ఈ క్రమంలో నవంబర్ 9న రెండో శనివారం సెలవును రద్దు చేస్తూ సెప్టెంబర్ 13నే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

అమ్రాబాద్ చెంచులకు అంబులెన్స్ సర్వీస్

- అపోలో ఫౌండేషన్ సహకారంతో త్వరలో ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో నివసిస్తున్న చెంచులు, స్థానికులకు సత్వర వైద్యసహాయం అందించేందుకు అపోలో ఫౌండేషన్ సహకారంతో అంబులెన్స్ సర్వీస్‌ను ప్రారంభించనున్నట్టు అటవీశాఖ వర్గాల తెలిపాయి. ఈ అంబులెన్స్‌లో డ్రైవర్, వైద్య సహాయకుడు ఉంటారని వెల్లడించాయి. శుక్రవారం దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో అటవీశాఖ రెండురోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా అటవీశాఖ పరిధిలో వివిధ జిల్లాల్లో చేపట్టిన పనుల పురోగతి, నిర్దేశిత లక్ష్యాలు తదితర అంశాలపై అన్ని జిల్లాల సర్కిల్ హెడ్‌లు, డీఎఫ్‌వోలు, ఎఫ్‌డీవోలతో పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల్లో అటవీ భూముల రికార్డుల అప్‌డేషన్, రెవెన్యూశాఖతో అటవీశాఖకు ఉన్న సమస్యలు తదితర అంశాలపై చర్చించినట్టు సమాచారం. ఈ నెల 14న నిర్మల్‌జిల్లాలోని దుర్గంచెరువులో బర్డ్ వాచ్, ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.



విజయవాడ వద్ద కృష్ణా నదిలో డీ హవిల్లాండ్ ఎయిర్ క్రాఫ్ట్ సంస్థ విజయవాడ - శ్రీశైలం మధ్య శుక్రవారం నిర్వహించిన సీ ప్లేన్ ట్రయల్ రన్ విజయవంతమైంది. ప్రకాశం బ్యారేజీ సమీపంలోని భవానీపురం వద్ద సీప్లేన్ పలు పర్యాయాలు చక్కర్లు కొడుతూ ట్రయల్ రన్ వేసింది.

'గ్రామ కంఠం' భూములకు రక్షకులెవరు?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: 'గ్రామ కంఠం భూములు ఎవరి అధీనంలో ఉంటాయి.. వాటిని రక్షించేది ఎవరు?'అని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఆ భూములు పంచాయతీల అధీనంలోనే ఉంటాయని, గ్రామ అవసరాల కోసం వాటిని వినియోగించుకుంటారని, రక్షణ కూడా పంచాయతీల బాధ్యతేనని ప్రభుత్వ న్యాయవాది బదులిచ్చారు. దీనిపై పూర్తి వివరాలతో రెండు నెలల్లో కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు, ఓ కేసులో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇతర ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరికి వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం బాబుపల్లిలోని అత్యంత విలువైన 6.15 ఎకరాల గ్రామ కంఠం భూమిని పరిరక్షించడంలో అధికారులు విఫలమయ్యారంటూ హైకోర్టులో కె.శ్రీనివాస్ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. గ్రామ కంఠం భూములు ఎవరి అధీనంలో ఉంటాయనేది వివరాలు అందజేయాలని ఏఏజీని ఆదేశించింది. అలాగే పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల ముఖ్య కార్యదర్శులు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, కందుకూర్ ఆర్డీవో, ఎంపీడీవో, తహసీల్దార్ తదితరులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేసింది.

నోటి దుర్వాసనా? కేన్సర్ కావచ్చు!

హెచ్.పైలోరీ ఇన్‌ఫెక్షన్‌తో గ్యాస్ట్రిక్ క్యాన్సర్ ముప్పు

- ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి
- దేశంలో 50- 60% మందిలో ఈ బ్యాక్టీరియా ఆనవాళ్లు
- నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ బ్యారీ మార్షల్



బ్యారీ మార్షల్ సెంటర్ ఫర్ హెచ్ పైలోరీ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న బ్యారీ మార్షల్. చిత్రంలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: నోటి దుర్వాసన దీర్ఘకాలంపాటు ఉంటే గ్యాస్ట్రిక్ కేన్సర్ సోకిందేమోనని అనుమానించాలని ఏఐజీ ఆస్పత్రులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. హెలికోబ్యాక్టర్ పైలోరి (హెచ్.పైలోరి) ఇన్‌ఫెక్షన్ వల్ల ఈ ప్రమాదం ఉన్నదని చెప్పారు. ఏఐజీ ఆస్పత్రిలో నూతనంగా స్థాపించిన బ్యారీ మార్షల్ సెంటర్ ఫర్ హెచ్ పైలోరీని నోబెల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ బ్యారీ మార్షల్‌తో కలిసి నాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని హెచ్.పైలోరీ స్ట్రెయిన్స్‌కు ప్రత్యేకమైన జన్యు లక్షణాలు ఉన్నాయని, దీంతో ఇన్‌ఫెక్షన్లపై ప్రత్యేక పరిశోధనలు అవసరమని అన్నారు. హెచ్.పైలోరీ ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడమే కాకుండా, అది సోకకుండా నిరోధించడమే లక్ష్యంగా బ్యారీ మార్షల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ పరిశోధనల్లో ప్రొఫెసర్ మార్షల్ పాల్గొనడం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. దేశంలో హెచ్.పైలోరీ విషయంలో కొత్త ప్రమాణాలు తీసుకురావడమే తమ ఉద్దేశమని తెలిపారు. హెచ్.పైలోరీ సోకిన వారిలో ఎలాంటి లక్షణాలు వెంటనే బయటపడవని, ఎండోస్కోపీతో మాత్రమే దీనిని గుర్తించొచ్చని వివరించారు. దీర్ఘకాలంపాటు నోటి దుర్వాసన వస్తే ఈ బ్యాక్టీరియా సోకిందని అనుమానించవచ్చని, అలాంటి వారు ఎండోస్కోపీ చేయించుకుంటే దీన్ని గుర్తించే అవకాశం ఉంటుందని తెలిపారు.

60% మందిలో హెచ్ పైలోరీ

భారత్‌లో హెచ్.పైలోరీ ఇన్‌ఫెక్షన్లు 50% నుంచి 60% మందిలో ఉన్నాయని ప్రొఫెసర్ బ్యారీ మార్షల్ చెప్పారు. ఈ బ్యాక్టీరియా కారణంగా దేశంలో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. మధుమేహంతో వచ్చే సమస్యల కన్నా దాదాపు 10 రెట్లు హెచ్. పైలోరీ వల్ల వస్తాయని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ బ్యాక్టీరియాను కేన్సర్ కారకంగా వర్గీకరించిందని, దీన్నిబట్టే దీని తీవ్రత తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ బ్యాక్టీరియా కారణంగానే దేశంలో ఉదర సంబంధ కేన్సర్ శాతం పెరిగిందని, దీన్ని లక్ష్యంగా చేసుకుని పరిశోధనలు జరగడం చాలా ముఖ్యమని సూచించారు.

బిల్లులు రాక.. పంచాయతీ భవనం తాకట్టు!

పంచాయతీ పత్రాలు చూపుతున్న తాజా మాజీ సర్పంచ్ భర్త



జగిత్యాల జిల్లాలో ఓ మాజీ సర్పంచ్ చర్య

- 18 లక్షలతో పంచాయతీ భవనం నిర్మించా.. సర్కారు బిల్లులు ఇవ్వకపోవటంతో అప్పులపాలయ్యా
- తొంబరావుపేట మాజీ సర్పంచ్ సత్తమ్మ ధర్మారెడ్డి

మేడిపల్లి (వేములవాడ): చేసిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం బిల్లులు విడుదల చేయకపోవటంతో ఓ మాజీ సర్పంచ్ గ్రామ పంచాయతీ భవనాన్ని తాకట్టు పెట్టిన ఘటన జగిత్యాల జిల్లాలో జరిగింది. మేడిపల్లి మండలం తొంబరావుపేట తాజా మాజీ సర్పంచ్ మామిడి సత్తమ్మ ధర్మారెడ్డి శుక్రవారం కట్లకుంట తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో పంచాయతీకి సంబంధించి దస్త్రాలను తాకట్టు పెట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సుమారు రూ.18 లక్షలకు పైగా అప్పు చేసి తొంబరావుపేట పంచాయతీ భవనం నిర్మించామని, ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవటంతో అప్పుల ఊబిలో కూరుకుపోయామని వాపోయారు. అప్పు ఇచ్చినవారు రోజూ ఇంటికి వచ్చి వేధిస్తున్నారని తెలిపారు. దీంతో అప్పులు తీర్చేందుకు లోన్ కోసం పంచాయతీ భవనాన్ని తాకట్టు పెట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేసిన వెంటనే వడ్డీతో సహా బ్యాంకులో చెల్లిస్తానని సిబ్బందికి వివరించారు. తాకట్టు పెట్టేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. తమకు వెంటనే ప్రభుత్వం బకాయిలు చెల్లించాలని లేకుంటే చావే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై బ్యాంకు అధికారిని సంప్రదించటానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఏటా లక్ష మందికి నైపుణ్య శిక్షణ: శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ఉత్పాదక రంగాన్ని ప్రోత్సహించేందుకు కృతనిశ్చయంతో ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. పారిశ్రామికంగా ఉత్పాదక రంగం పురోగతి సాధిస్తుంటేనే ఉద్యోగ అవకాశాలు ఎక్కువ వస్తాయన్నారు. పరిశ్రమలకు నిపుణులైన యువతను అందించాలన్న ఉద్దేశంతోనే తమ ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతీ సంవత్సరం దాదాపు లక్ష మందికి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా 65 ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తున్నామని, ఇందుకోసం టాటా టెక్నాలజీస్ సంస్థ నుంచి రూ. 2,324 కోట్ల ఆర్థిక సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. భారత పరిశ్రమల సమాఖ్య 'పరిశ్రమ 4.0 నుంచి పరిశ్రమ 5.0కు ఉత్పాదక రూపాంతర పరిణామం' అంశంపై శుక్రవారంనాడిక్కడ నిర్వహించిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మినీ-పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, డీఆర్‌డీవో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బీకే దాస్, మహీంద్ర అండ్ మహీంద్రలో చీఫ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫీసర్ రుచా నానావతి, తెలంగాణ సీఐఐ చైర్మన్, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి డి. ప్రసాద్, కన్వీనర్ వీఎస్ రామ్, గ్లోబల్ లింకర్ డైరెక్టర్ మాళవిక జగ్గీ మాట్లాడారు. అనంతరం ఆయా రంగాల్లో ఉత్తమ ప్రదర్శన కనపరిచిన పరిశ్రమలకు అవార్డులను అందించారు.



'చలి'ంచం!

అసలే చలికాలం. ఆపై మంచు కురిసి గజగజ వణికిస్తోంది. మరోవైపు ఉష్ణోగ్రతలు సైతం రోజురోజుకు పడిపోతున్నాయి. ఇంతటి చలిలోనూ సిద్దిపేట జిల్లా కోహెడ మండల గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులు శుక్రవారం ఉదయం ఆరుబయటే స్నానం చేస్తున్న దృశ్యమిది.

కోహెడ రూరల్ (హుస్నాబాద్)


కాంబోడియా సైబర్ ముఠాలో కీలక నిందితుడి అరెస్ట్

- సదాకత్ ఖాన్‌ను ఢిల్లీలో అరెస్టు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- ఉద్యోగాల పేరిట ఇక్కడి యువతను కాంబోడియాకు తరలింపు
- అక్కడ వీరితో సైబర్ నేరాలు చేయిస్తున్న సదాకత్ ఖాన్ ముఠా

సాక్షి, హైదరాబాద్: విదేశాల్లో ఉద్యోగాల పేరిట కంబోడియాకు అమాయకులను తరలించి సైబర్ నేరాలు చేయిస్తున్న ముఠాలో కీలక సభ్యుడిని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. బాధితులను కంబోడియాకు పంపడంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన సదాకత్ ఖాన్‌ను ఈ నెల 2న ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేసినట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సదాకత్ ఖాన్ మాల్దీవుల నుంచి తిరిగి వస్తుండగా అరెస్టు చేసినట్టు చెప్పారు. విదేశాల్లో ఉద్యోగాల పేరిట అమాయకులను కాంబోడియాకు తరలించి అక్కడ వారితో సైబర్‌నేరాలు చేయిస్తున్న ముఠాపై టీజీసీఎస్‌బీ హెడ్‌క్వార్టర్స్ అధికారులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముఠాకు చెందిన ఏజెంట్లు కె. సాయి ప్రసాద్ (జగిత్యాల), పుణేలో ఉంటున్న బీహార్ వాసి మహ్మద్ అబిద్ హుస్సేన్ అన్సారీ, బీహార్‌కు చెందిన మహ్మద్ షాదాబ్ ఆలంలను గతంలోనే అరెస్టు చేశారు. తాజాగా లభించిన ఆధారాల మేరకు సదాకత్ ఖాన్‌ను అరెస్టు చేశారు. సైబర్ క్రైం ఎస్పీ దేవేందర్‌సింగ్, డీఎస్పీ కేవీఎం ప్రసాద్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు భద్రంరాజు రమేష్, జి. రాజు, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు నాయక్, కానిస్టేబుల్ శ్రీకాంత్ నిందితుడి అరెస్టు చేయడంలో కీలకంగా పనిచేశారు. వీరిని సైబర్‌సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ అభినందించారు. విదేశాల్లో ఉద్యోగాల పేరిట ఆఫర్లు ఇచ్చే ఏజెన్సీల విషయంలో జాగ్రత్త వహించాలని, రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజుల పేరిట డబ్బులు ముందస్తుగా పంపవద్దని ఆమె సూచించారు.

టుడేస్ గ్రాఫిక్

ప్రముఖ లాంగ్వేజ్ డేటాబేస్ వెబ్‌సైట్ ఎత్నోలాగ్ గణాంకాల ప్రకారం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రజలు 7 వేలకుపైగా భాషలు మాట్లాడుతున్నారు. అందులో అత్యధిక భాషలు మాట్లాడే టాప్-10 దేశాలు ఇవే.



సాక్షి సెంట్రల్‌డెస్క్

ఇక డ్రోన్ అంబులెన్స్‌లు!

- 200 కిలోల బరువు మోసుకెళ్లే డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి..
- హైదరాబాద్ ఐఐటీలోని థిహాన్ విభాగంలో పరిశోధన: డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడి
- 9, 10 తేదీల్లో నేషనల్ వెల్‌బీయింగ్ సదస్సు నిర్వహిస్తున్నట్టు ప్రకటన



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్రంలో త్వరలోనే డ్రోన్ అంబులెన్సులు అందుబాటులోకి రానున్నాయని హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు. రోగితోపాటు ఆక్సిజన్ సిలిండర్, ఇతర కీలక పరికరాలు, ప్రాథమిక వైద్య సేవలందించే నర్సు.. కలిపి సుమారు 200 కిలోల బరువు మోసుకెళ్లే సామర్థ్యమున్న డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ పరిశోధనలు కొలిక్కివచ్చినట్టేనని వివరించారు. శుక్రవారం ఐఐటీహెచ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఐటీలోని థిహాన్ అనే ప్రత్యేక విభాగంలో ఈ డ్రోన్ టెక్నాలజీపై పరిశోధనలు కొనసాగుతున్నాయని తెలిపారు.

తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారాలి..

సాఫ్ట్‌వేర్ కొలువులను దృష్టిలో ఉంచుకుని చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సులు చదివించేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారని బీఎస్ మూర్తి చెప్పారు. తల్లిదండ్రుల ఆలోచనా విధానం మారాలన్నారు. పిల్లలకు ఆసక్తి ఉన్న సబ్జెక్టులు చదివేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. తల్లిదండ్రుల ధోరణితో దేశంలో చాలా ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ కోర్సులను ఎత్తివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో దేశంలో రోడ్లు నిర్మించాలంటే చైనా వంటి దేశాల నుంచి సివిల్ ఇంజనీర్లను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వ్యాఖ్యానించారు. ఉత్పత్తి రంగం కూడా వృద్ధి చెందినప్పుడే ఏ దేశానికైనా సర్వతోముఖాభివృద్ధి సాధ్యమన్నారు.

9, 10 తేదీల్లో నేషనల్ వెల్‌బీయింగ్ సదస్సు

సంగారెడ్డి జిల్లా కందిలోని హైదరాబాద్ ఐఐటీ వేదికగా ఈ నెల 9, 10 తేదీల్లో నేషనల్ వెల్‌బీయింగ్ సదస్సు నిర్వహిస్తున్నామని ప్రొఫెసర్ బీఎస్ మూర్తి వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న 100కుపైగా ఉన్నత విద్యాసంస్థల నుంచి 500 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారని, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మానసిక ఒత్తిడి జయించేందుకు చేపట్టాల్సిన చర్యలు, ఈ సమస్యను అధిగమించేందుకు తోడ్పడే మెరుగైన పద్ధతులపై సదస్సులో చర్చిస్తామన్నారు.

లైసెన్స్ లేకుండా నార్కోటిక్ డ్రగ్స్ విక్రయం

- రెండు ఆస్పత్రులపై అధికారుల కేసులు
- అనుమతి ఉంటేనే అమ్మాలి: డీసీఏ డీజీ



సాక్షి, హైదరాబాద్: లైసెన్స్‌లు లేకుండా నార్కోటిక్స్, సైకోట్రోఫిక్ డ్రగ్స్‌ను విక్రయిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ కమలాసన్ రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలో రెండు ఆస్పత్రులపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, ఎక్సైజ్ అధికారులు గురు, శుక్రవారాల్లో జాయింట్ ఆపరేషన్ నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో చాంద్రాయణగుట్ట ప్రాంతంలోని బకోబన్ ఆస్పత్రి, సికింద్రాబాద్ పరిధిలోని వారాసిగూడలో బీవీకేరెడ్డి ఆస్పత్రిలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న ఫెంటానైల్, కెటామైన్, మిడాజోలం ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ రెండు ఆస్పత్రులపై చార్మినార్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, ముషీరాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. దర్యాప్తు కొనసాగుతోందని, చట్టప్రకారం నిందితులపై చర్యలు తీసుకుంటామని కమలాసన్‌రెడ్డి తెలిపారు. ఈ సోదాల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు బి. లక్ష్మి, బి. గోవింద్ సింగ్, ఎక్సైజ్‌శాఖ నుంచి చార్మినార్ ఎక్సైజ్ సీఐ జి. శ్రీనివాసరావు, ముషీరాబాద్ సీఐ డి.రామకృష్ణ, ఎస్సైలు కె.శ్వేత కుమారి, కె. ప్రసన్నరెడ్డి నాగలక్ష్మి పాల్గొన్నట్టు తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



ఆరోగ్య కిరణాలు

మానవ దేహంలో ఎముకలు దృఢంగా మారడానికి.. రోగ నిరోధక శక్తి పెరగడానికి, ఎదు గుదలకు విటమిన్–డి ఎంతగానో దోహదపడుతుంది. ఉదయం, సాయంత్రం వేళ సూర్య కిరణాలు పిల్లల శరీరంపై పడితే విటమిన్ డి చేరుతుందని వైద్యులు సూచిస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నవజాత శిశువులను వారి కుటుంబసభ్యులు ఒడిలో పెట్టుకొని లాలిస్తున్న దృశ్యమిది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట



లొంగిపోయిన మిలీషియా సభ్యులతో పోలీసు అధికారులు

మావోయిస్టు మిలీషియా సభ్యుల లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా పోలీసుల ఎదుట ఇద్దరు మావోయిస్టు మిలీషియా సభ్యులు శుక్రవారం లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో పనిచేస్తున్న మిలీషియా సభ్యులు వంజం రమ, దిద్దో పొజ్జాలు అక్కడి ప్రభుత్వం చేపట్టిన నక్సలిజం నిర్మూలన – పునరావాస విధానానికి ఆకర్షితులై లొంగిపోయారని అధికారులు తెలిపారు. ఈసందర్భంగా సీఆర్పీఎఫ్ బెటాలియన్ల అధికారులు రెహాన్ అలీఖాన్, సురేశ్‌కుమార్, అవిలాష్ టాండన్ మాట్లాడుతూ లొంగిపోయిన వీరిద్దరూ పలు విధ్వంసకర సంఘటనల్లో పాల్గొన్నారని వెల్లడించారు.

హ్యాపీ బర్త్‌డే.. సీఎం..



సీఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న శ్రీధర్‌బాబు, పొన్నం, మహేశ్‌కుమార్ గౌడ్



సీఎంకు పుష్పగుచ్ఛమిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి



శుభాకాంక్షలు తెలియజేస్తున్న వీ హనుమంతరావు



మొక్కను బహుకరిస్తున్న కాంగ్రెస్ నేత శివనాగిరెడ్డి..



బోధన్‌లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీ

చెరకు రైతులకు తీపి కబురు

చురుగ్గా షుగర్స్ ఫ్యాక్టరీలను తెరిపించే ప్రకియ

- వన్‌టైం సెటిల్‌మెంట్ కింద బ్యాంకర్లకు రూ.190 కోట్లు చెల్లించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే బోధన్, మెదక్, మెట్‌పల్లిల్లో రైతులు, అధికారులతో కమిటీ సమావేశాలు
- ఈ నెలలో ఇంజనీర్లతో సమావేశం.. తరువాత కమిటీ నివేదిక: ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉత్తర తెలంగాణలో కీలకమైన నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలను తెరిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత జనవరి 12న ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో ప్రక్రియ కొనసాగుతోంది. కమిటీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్, ఆర్థిక, పరిశ్రమలు, వాణిజ్య, వ్యవసాయ, సహకార శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, కార్యదర్శులు ఉన్నారు. ఈ కమిటీ ఇప్పటికే బోధన్, మెదక్, మెట్‌పల్లిలో రైతులతో విడతల వారీగా సమావేశాలు నిర్వహించింది. తరువాత బ్యాంకర్లకు రూ.190 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించింది. మొత్తం రూ.400 కోట్ల బకాయిలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మూడు విడతల్లో వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రూ.190 కోట్లు చెల్లించింది. ఈ క్రమంలో ఫ్యాక్టరీలను తెరిపించడంపై కమిటీ భారీ కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ నెలలో ఇంజనీర్లతో సమావేశం నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. అనంతరం ఈ కమిటీ ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.



ఎన్నికల్లో ప్రచారాస్త్రం



2015 డిసెంబర్ 23న నిజాం షుగర్స్‌కు లేఆఫ్ ప్రకటించారు. గత ఎన్నికల్లో జాతీయ పార్టీలకు నిజాం షుగర్స్ అంశం ప్రధాన ప్రచారాస్త్రమైంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా రైతులకు హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. దీన్ని తెరిపించేందుకు రంగం సిద్ధం చేస్తూ కమిటీ వేసి ముందుకు నడిపిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలను తిరిగి తెరిపించే విషయంలో కమిటీ సభ్యుడు, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని ప్రక్రియను ముందుకు నడిపిస్తున్నారు. కానీ ఫ్యాక్టరీ ఆస్తులు, వాటి విలువ, సాగు భూములు, ఇతర ఖాళీ స్థలాలు, వాటి విలువ తదితర అంశాలను సైతం మదింపు చేసి స్పష్టతకు రావలసి ఉంది. ప్రస్తుతం ఫ్యాక్టరీలో ప్రైవేటు వాటా 51 శాతం, ప్రభుత్వ వాటా 49 శాతం ఉంది. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీలను సహకార విధానంలో నడుపుతారా?, ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నడుపుతారా? అనే విషయమై కమిటీ నివేదిక తరువాత స్పష్టత రానుంది.

చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం

బోధన్, ముత్యంపేట, మంబోజిపల్లిలలోని నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలను తెరిపించాలని రైతులు డిమాండ్ చేస్తే గత కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు. నిజాం రాజు పాలనాకాలంలో 2.75 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. ఇంజనీర్ల సూచన మేరకు నిజాం రాజు చెరుకు సాగు ప్రోత్సహించేందుకు నిజాం షుగర్స్‌ను నెలకొల్పారు. ఈ ఫ్యాక్టరీ కోసం బోధన్ వద్ద 16,975 ఎకరాలు కేటాయించారు. వేలాదిమంది వ్యవసాయ కార్మికులు, ఫ్యాక్టరీ కార్మికులకు ఉపాధి లభించింది. వీరి పిల్లల కోసం మధుమలంచ కళాశాల, ఆసుపత్రి నిర్మించారు. ఆసియాలోనే చక్కెర ఉత్పత్తిలో పేరుగాంచిన ఎన్‌ఎస్‌ఎఫ్‌ను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో 51శాతం ప్రైవేటు, 49శాతం ప్రభుత్వ భాగస్వామ్యానికి మార్చారు. 2014 ఎన్నికల సమయంలో ఎన్‌ఎస్‌ఎఫ్‌ను పూర్తిగా ప్రభుత్వం నడుపుతుందని చెప్పిన కేసీఆర్.. అధికారం దక్కాక పట్టించుకోలేదు. దీంతో 2015లో ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ఉన్న సమయంలో రూ.92 కోట్ల వ్యయంతో 20 మెగావాట్ల పవర్ ప్లాంట్ నిర్మించారు. ఇంత ప్రాధాన్యం ఉన్న ఎన్‌ఎస్‌ఎఫ్‌ను తెరిపించేందుకు గత ఏడాది పాదయాత్ర సమయంలో మెట్‌పల్లి వద్ద రైతులకు హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి తిరిగి తెరిపించేందుకు కమిటీ వేశారు. వరి పంట సాగు చేస్తున్న రైతులను ప్రత్యామ్నాయంగా చెరుకు పంట సాగు చేసే దిశగా తీసుకెళ్తున్నాం. దీంతో పాటు రుద్రూర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కొత్త చెరుకు వంగడాలు తయారు చేయించి.. ఎకరానికి 50 నుంచి 60 టన్నుల దిగుబడి వచ్చేలా చేయనున్నాం. బెల్లం ఎగుమతులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆయా దిశగా ప్రణాళికలు తయారు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన చెరుకు విధానం తీసుకొచ్చి గిట్టుబాటు ధర ఇస్తే చక్కెర పరిశ్రమలు నిలదొక్కుకుంటాయి.

– ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కేటీఆర్‌ను కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారు

బీఆర్‌ఎస్ నాయకుడు రావుల శ్రీధర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ పటంలో నిలిపేలా కృషి చేసిన మాజీ మంత్రి కేటీ రామారావు ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని బీఆర్‌ఎస్ నాయకుడు రావుల శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. కేటీఆర్‌ను బదనాం చేయడం ద్వారా లబ్ధి పొందాలని కాంగ్రెస్ అనుకుంటోందన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఫార్ములా ఈ రేస్ నిర్వహణలో అవినీతి జరిగిందని, బాంబులు పేలుతాయని మంత్రులు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. రేవంత్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.20 కోట్లతో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారని, దానికి కేబినెట్ అనుమతి ఉందా అని ప్రశ్నించారు. కేటీఆర్‌ను ఉద్దేశపూర్వకంగా కేసుల్లో ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారని, రాజకీయ కక్షలకు బీఆర్‌ఎస్ భయపడేది లేదని శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు.



సెపక్‌తక్రను ఖేలో ఇండియాలో చేర్చండి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి క్రీడాకారుల వినతి

సాక్షి, హైదరాబాద్: సెపక్‌తక్రను ఖేలో ఇండియాలో చేర్చాలని క్రీడాకారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పెరిక సురేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన శుక్రవారం పలువురు క్రీడాకారులతో హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సెపక్‌తక్రను ఖేలో ఇండియాలో చేర్చితే గ్రామీణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఏర్పడుతుందని వివరించారు. రాష్ట్రంలో ఖేలో ఇండియా అక్రిడేటెడ్ అకాడమీలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని కోరారు.

సాదిక్ మృతికి సీతక్క సంతాపం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఆధునిక గ్రంథాలయ ఉద్యమానికి, ఆదివాసీల విద్యా వికాసానికి సేవలందించిన సీనియర్ జర్నలిస్ట్ సాదిక్ అలీ మృతిపై మంత్రి సీతక్క సంతాపం ప్రకటించారు. పడిపోతున్న పఠన సంస్కృతి పునరుజ్జీవానికి సాదిక్ విశేష కృషి చేశారని కొనియాడారు. కరోనా కాలంలో ఆయన ములుగు, ఖమ్మం ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్య సామగ్రి పంపిణీ, విద్యావసరాలు తీర్చడాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. వందలాది గ్రామాలలో తోపుడి బండి పేరుతో నిర్వహించిన పాద యాత్రతో గ్రంథాలయాలు స్థాపించి.. జ్ఞాన విప్లవానికి దోహదం చేశారని కొనియాడారు. విలువలతో కూడిన ప్రజానుకూల, ప్రజా పరిపాలన విశ్లేషణలతో ఆదర్శ పాత్రికేయ వృత్తిని కొనసాగించారని నివాళులర్పించారు.

ఒక్క మంచి పనీ చేయని ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలల్లో ఒక్క మంచి పని చేయలేదని, రోజురోజుకూ కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు దిగజారుతోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద ధ్వజమెత్తారు. ఆయన శుక్రవారం తెలంగాణ భవన్‌లో మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, మేడె రాజీవ్‌సాగర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. హరియాణా ఎన్నికలకు తెలంగాణ నుండి డబ్బులు పంపించారని, మహారాష్ట్రలో జరిగే ఎన్నికలకు తెలంగాణ నుండి డబ్బులు వెళ్తున్నాయన్నారు. హైడ్రా పేరుతో బిల్డర్ల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని, డబ్బులు వచ్చే వాటిపైనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించారని ఆరోపించారు. మెగా కృష్ణారెడ్డి కంపెనీని బ్లాక్ లిస్ట్ చేసే వరకు రాజకీయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కులగణన సర్వేపై ఎలాంటి చర్చ లేదన్నారు. కులగణనలో అవసరం లేని సమాచారం అడుగుతున్నారని చెప్పారు. బండి సంజయ్ తాను కేంద్ర మంత్రి అనే సోయి మర్చిపోయారని విమర్శించారు.



ఒత్తిడిని జయించడం ఎలా?

దేశంలోనే తొలి నేషనల్ వెల్‌బీయింగ్ కాంక్లేవ్.

ఐఐటీ హెచ్‌లో రెండు రోజులపాటు ఉన్నత స్థాయి సదస్సు

పాల్గొంటున్న దేశంలోని అన్ని ఐఐటీలు, ఎన్ఐటీల ప్రతినిధులు

ట్రిపుల్ ఐటీలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలు కూడా..

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : ఐఐటీ హైదరాబాద్‌లో ఎంటెక్ (స్మార్ట్ మొబిలిటీ) చదువుతున్న ఓ విద్యార్థి హాస్టల్ గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. చదువులతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఆ విద్యార్థి.. 'థీసిస్ పర్పస్‌లెస్.. ఇంపార్టెంట్ టిక్స్.. ప్లీజ్ సీ ల్యాప్‌టాప్' అంటూ ఆయన రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రెండేళ్ల క్రితం జరిగిన ఈ ఘటన అందరినీ కలిచివేసింది. చదువుల ఒత్తిడిని తట్టుకోలేక ఇలాంటి ఘటనలు ఒక్క హైదరాబాద్ ఐఐటీలోనే కాదు..ఇతర ప్రతిష్టాత్మక ఉన్నత విద్యాసంస్థల్లోనూ తరచు చోటు చేసుకుంటున్నాయి. ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థులు ఇలా అర్థంతరంగా తనువు చాలిస్తుండటంతో కన్నవారికి కడుపుకోత మిగులుతోంది.

ఇక్కడే తొలి సదస్సు

ఒక్క విద్యార్థుల్లోనే కాదు, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రంగాల్లోనే పనిచేస్తున్నవారు కూడా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీంతో డిప్రెషన్‌లోకి వెళ్లడం.. ఈ సమస్య మరింత ముదరడంతో ఆత్మహత్యలకు దారితీస్తోంది. దీనిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ ఐఐటీతో కలిసి ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'ఫస్ట్ నేషనల్ వెల్‌బీయింగ్ కాంక్లేవ్' పేరుతో ఐఐటీహెచ్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో రెండురోజుల ఉన్నతస్థాయి సదస్సు నిర్వహించనుంది. ఒత్తిడిని జయించి మెరుగైన మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం ఎలా అనే అంశంపై జరగనున్న ఈ ఉన్నత స్థాయి సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీలు, ఐఐఎం వంటి ప్రతిష్టాత్మక ఉన్నత, సాంకేతిక విద్యా సంస్థల ప్రతినిధులు, ఆయా సంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొంటారని ఐఐటీ వర్గాలు తెలిపారు.



'సన్‌షైన్' పేరుతో ఐఐటీలో ప్రత్యేక విభాగం

మానసిక ఒత్తిడితో బాధపడుతున్న విద్యార్థులను ఆ సమస్య నుంచి బయటకు తెచ్చేందుకు హైదరాబాద్ ఐఐటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. సన్‌షైన్ పేరుతో ప్రత్యేక కౌన్సిలింగ్ సెల్‌ను ఏర్పాటు చేసింది. 2012 జనవరిలో ప్రారంభమైన ఈ విభాగంలో ముగ్గురు సైకలాజికల్ కౌన్సిలర్లు, ఆయా విభాగాల ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు ఉంటారు. స్టూడెంట్ బడ్డీల పేరుతో ఉండే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతూ.. డిప్రెషన్‌లోని వెళుతున్న విద్యార్థులను ముందుగానే గుర్తిస్తారు. ఆపై వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆ విద్యార్థికి అవసరం మేరకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిలో మానసిక స్థైర్యం నింపుతారు. మొత్తం మీద డిప్రెషన్‌లోంచి బయటకు తెచ్చేందుకు ప్రత్యేక చొరవ చూపుతారు.



ఎదురుచూపులు..

కాళ్లు చేతులు చక్కగా ఉన్నవారే ఈ పోటీ ప్రపంచంలో బతుకుబండి లాగడం కష్టం. అలాంటిది తమ వ్యక్తిగత పనులు కూడా తాము చేసుకోలేని దివ్యాంగుల పరిస్థితి మరీ దారుణం. కాస్త ఆర్థిక ఆసరా ఉంటేనే ముద్ద నోటికందేది. ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందేందుకు వైకల్యాన్ని నిర్ధారించే సర్టిఫికెట్ కోసం అనంతపురంలో సదరం క్యాంపు వద్ద వేచిచూస్తున్న దివ్యాంగులు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ అనంతపురం



ఆయువుపోసే బండికి సుస్తీ

ఆపద వస్తే కుయ్‌కుయ్ మని అరుస్తూ నిమిషాల్లో చేరుకునే 108 వాహనానికి సుస్తీ చేసింది. నిర్వహణ గాలికొదిలేస్తుండటంతో అనేక వాహనాలు ఇలా మూలన పడుతున్నాయి. తిరుపతి 108 జిల్లా కార్యాలయంలో మూలన పడేసిన 108 వాహనాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి



తథాగతునికి నీడ కరువు

శాంతికి ప్రతిరూపమైన బుద్ధునికి నీడకరువైంది. విశాఖలో ఎన్‌ఏడీ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే దారిలో కొన్నాళ్ల కిందట బుద్ధుని విగ్రహం ఏర్పాటుచేశారు. ఆ ప్రాంతంలో నిర్మాణ పనులు చేపడుతుండటంతో విగ్రహాన్ని అక్కడి నుంచి తీసి జాతీయ రహదారి పక్కన ఉన్న ఒక చెట్టు కింద పెట్టేశారు. కనీస జాగ్రత్తలు కూడా తీసుకోకుండా అలా పెట్టేసిన అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్లుప్తంగా...

విజయ్‌పాల్ ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో సీఐడీ విశ్రాంత అదనపు ఎస్పీ విజయ్‌పాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. శుక్రవారం ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈనెల 25న ఈ కేసు విచారణ చేపడతామని తెలిపింది. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా.. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. ఆ కౌంటర్ తమకు గురువారమే అందిందని.. రిజాయిండర్ దాఖలుకు సమయం ఇవ్వాలని విజయ్‌పాల్ తరపు న్యాయవాదులు కోర్టును కోరారు. రెండు వారాల గడువు ఇస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణలో అన్ని విషయాలపై నిర్ణయం తీసుకుంటామని జస్టిస్ విక్రమ్‌నాథ్ చెప్పారు.

నిర్మాణాలు ప్రణాళికాబద్ధంగా ఉండాలి

ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవంలో డీటీసీపీ ఆర్‌జే విద్యుల్లత

సాక్షి, అమరావతి: నిర్మాణాలు ప్రణాళికాబద్ధంగా ఉంటే భవిష్యత్ తరాలకు బంగారు బాట వేసినట్లేనని రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంచాలకులు(డీటీసీపీ) ఆర్‌జే విద్యుల్లత అన్నారు. ప్రపంచ పట్టణ ప్రణాళిక దిన వేడుకలను శుక్రవారం మంగళగిరిలోని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం దేశ, రాష్ట్ర అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక శాఖ ప్రముఖ పాత్ర పోషిస్తోందని తెలిపారు. రాష్ట్ర పట్టణ ప్రణాళిక సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, కార్యదర్శి మోహన్‌బాబు, అదనపు సంచాలకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ ఖైదు

విశాఖ లీగల్: ఒక వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేసిన ముగ్గురికి యావజ్జీవ జైలు శిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.60 వేలు చొప్పున జరిమానా విధిస్తూ విశాఖ నగరంలోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ శుక్రవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఏడాది పాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తన తీర్పులో పేర్కొన్నారు. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు అందించిన వివరాలు.. నిందితులు అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం మంప పోలీస్ స్టేషన్ పరిధిలోని బోదరాపల్లికి చెందిన గిడుతూరి సింహాచలం, కొర్ల బజ్జయ్య, అలాగే సుద్దుల గడ్డ ప్రాంతానికి చెందిన గేమిలి రాంబాబు, కొర్ల బుజ్జి, గమ్మిలి శ్రీను మధ్య భూతగాదాలున్నాయి. ఈ నేపథ్యంలో 2010 మార్చి 13న రాంబాబు మరో ఇద్దరు కలిసి గునపాలు, కత్తులు, పారలు, కర్రలు తదితర మారణాయుధాలతో సింహాచలం, బొజ్జయ్యలపై దాడి చేసి చంపేశారు. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు మంప పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు. రెండవ నిందితుడు గమిలి శ్రీనుకి అదనంగా రూ.30 వేలు జరిమానా విధించారు.

‘పచ్చ ముఠా’ మట్టి మాఫియా

పోలవరం కాలువ గట్టుపై అక్రమాలు

- కాలువ గట్టును కొల్లగొట్టి జోరుగా విక్రయాలు
- వివిధ ప్రాంతాలకు టిప్పర్లలో తరలిపోతున్న గ్రావెల్ మట్టి



మట్టి తవ్వకాలు జరిగే ప్రాంతంలో లోడింగ్‌కు సిద్ధంగా ఉంచిన టిప్పర్

ద్వారకాతిరుమల: పోలవరం కాలువ గట్టుపై పచ్చ ముఠా పేట్రేగిపోతోంది. విలువైన గ్రావెల్ మట్టిని అక్రమంగా తవ్వి తెలుగు తమ్ముళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఏలూరు జిల్లా గోపాలపురం నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అండదండలతో కొందరు సాగిస్తున్న ఈ దందా రోజురోజుకు ఉధృతమవుతోంది. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి, లైన్ గోపాలపురం, పరిసర ప్రాంతాల్లోని పోలవరం కుడి కాలువ గట్టుపై గ్రావెల్ మట్టి అక్రమ తవ్వకాలు గత కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రస్తుతం కాలువకు రెండు పక్కల గట్లపై పొక్లెయిన్లు పెట్టి, రాత్రీ పగలు తేడా లేకుండా యథేచ్ఛగా ఈ తవ్వకాలు జరుపుతున్నారు. టిప్పర్ల రాకపోకలు జరిగే సమయంలో గట్టుపై మట్టి పైకి లేచి, టిప్పర్ డ్రైవర్లకు ఇబ్బంది కలుగుతుండటంతో, ఒక వాటర్ ట్యాంకర్ ద్వారా గట్టును తడుపుతున్నారు. నిత్యం ఇక్కడి నుంచి సుమారు 100 టిప్పర్లకు పైగా మట్టి బయటకు తరలిపోతోంది. ఒక్కో టిప్పర్ మట్టిని దూరాన్ని బట్టి రూ.5 వేల నుంచి రూ.11 వేలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఈ కాలువ మట్టి పోలసానిపల్లి, ఏలూరు, భీమవరం పరిసర ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిపోతోంది.

అనుమతులు ఉన్నాయంటూ దందా..

తవ్విన మట్టిని మరో ప్రాంతానికి తరలించాలంటే కచ్చితంగా ఇరిగేషన్, మైనింగ్ శాఖల అనుమతులు తప్పనిసరి. ఎం.నాగులపల్లి, లైన్ గోపాలపురంలో తవ్వకాలు జరుపుతున్న పచ్చ నేతల్లో ఒకరు సుమారు 5 వేల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలకు ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు పొందారు. మైనింగ్ శాఖ నుంచి అనుమతులు పొందకుండానే తవ్వకాలు జరుపుతున్నారు. ఇదేంటని స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే మాకు అనుమతులు ఉన్నాయంటూ తమ దందాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. నియోజకవర్గ స్థాయి ముఖ్య ప్రజాప్రతినిధి అండదండలతో ఎం.నాగులపల్లి, లైన్ గోపాలపురంకు చెందిన ఆయన అనుచరులు ఈ దందాకు పాల్పడుతున్నట్టు చెబుతున్నారు.

తవ్వకాల వైపు కన్నెత్తి చూడని అధికారులు..

పట్టపగలు అక్రమ తవ్వకాలు సాగుతున్నా ఆ వైపు అధికారులెవరూ కన్నెత్తి చూడటం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. అనుమతులు ఉన్నాయి మీకెందుకు రిస్క్.. మీ పని మీరు చూసుకోండి అని అధికారులు చెబుతున్నారట. అక్రమార్కులకు అధికారులు ఇలా కొమ్ముకాయడం దారుణమని పలువురు అంటున్నారు. ఇరిగేషన్ అధికారులు అనుమతులు ఇచ్చిన ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో, అది కూడా మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్నారని ధ్వజమెత్తుతున్నారు.

ఉప ముఖ్యమంత్రికి ఇవి కనబడవా..

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల ఐఎస్ జగన్నాథపురంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొని, అక్కడ జరిగిన గ్రావెల్ తవ్వకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రావెల్ తవ్వకాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుల పాత్ర ఏమైనా ఉందేమో విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పోలవరం కాలువ గట్టుపై జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలు ఆయనకు కనబడటం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.




గోపాలపురం పరిధిలో పోలవరం కుడి కాలువ గట్టును తవ్వుతున్న దృశ్యం

పేర్లమార్పుపైనే ‘చంద్రన్న’ఉత్సాహం!

జూన్ నెలాఖరుతో ముగిసిన వైఎస్సార్ బీమా పథకం

- 10,500 మందికి రూ.210 కోట్ల క్లెయిమ్‌లు పెండింగ్‌లోనే
- మార్చి నెలాఖరు వరకు క్లియర్ చేసిన జగన్ ప్రభుత్వం
- నాలుగు నెలలుగా రాష్ట్రంలో పేదలకు బీమా లేదు





సాక్షి, అమరావతి: సంక్షేమ పథకాలను నీరుగార్చేసి పేదల పొట్టగొట్టిన కూటమి సర్కారు చివరకు బీమా పథకాల విషయంలోనూ నిర్దయగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటివరకు అమలులో ఉన్న వైఎస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమా పథకంగా పేరు మార్చేసింది. అయితే పేదలకు ఇంతవరకు బీమా మాత్రం కల్పించలేదు. రాష్ట్రంలో పేద కుటుంబాల్లో దురదృష్టవశాత్తూ కుటుంబ పెద్ద మరణిస్తే ప్రభుత్వమే ఆదుకుని ఆర్థిక సహాయం అందించేలా గత ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఏటా పాలసీని రెన్యువల్ చేయాల్సి ఉండగా ఈ గడువు గత జూన్ నెలాఖరుతో ముగిసింది. కూటమి ప్రభుత్వం బీమా పాలసీని రెన్యువల్ / పునరుద్ధరణ చేయకపోవడంతో పేద కుటుంబాలకు గత నాలుగు నెలలుగా బీమా భరోసాకు దూరమయ్యాయి.

విధివిధానాలెక్కడ?

చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేసి సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణానికి రూ.10 లక్షల చొప్పున బీమా పరిహారం పెంచుతామంటూ ఎన్నికల ముందు ప్రకటించిన సీఎం చంద్రబాబు ఈ హామీని టీడీపీ – జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోనూ పొందుపరిచారు. బీమా పరిహారం పెంపు సహా పథకం కొత్త విధివిధానాలను కార్మిక శాఖ రూపొందించాల్సి ఉండగా.. ఈ కార్యక్రమం సచివాలయాల పరిధిలో కొనసాగించాలా? లేదంటే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా అమలు చేయాలా? అనేది ఇంతవరకు తేలలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

81,568 కుటుంబాలకు రూ.876.72 కోట్లు..

కుటుంబ పెద్ద సహజంగా మరణించినా, ప్రమాదవశాత్తు చనిపోయినా బీమా పరిహారం నేరుగా ఖాతాల్లో జమ అయ్యేలా వైఎస్సార్ బీమా పథకాన్ని గత ప్రభుత్వం రూపొందించింది. పేదల తరఫున ప్రభుత్వమే పాలసీ డబ్బులు చెల్లించింది. మొత్తం 1.21 కోట్ల కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకాన్ని వర్తింప చేసింది. 18 నుంచి 50 ఏళ్ల లోపు వారు సహజంగా మరణిస్తే రూ.లక్ష పరిహారం, 18 నుంచి 70 ఏళ్ల వయసు వారు ప్రమాదంలో మరణించినా, అంగవైకల్యం సంభవించినా రూ.5 లక్షల వరకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంది. 2021 జూలై నుంచి 2024 మార్చి వరకు 81,568 కుటుంబాలకు వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.876.72 కోట్ల మొత్తాన్ని పరిహారంగా అందజేసింది. గత మార్చిలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడం, అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ నెలాఖరు వరకు 10,500 క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గత నాలుగు నెలలుగా ఆయా కుటుంబాలకు చెల్లించాల్సిన దాదాపు రూ.210 కోట్లు బీమా పరిహారం బకాయిలు చెల్లించకుండా కూటమి ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది.

ఉయ్యూరులో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం

పైశాచికానందం పొందుతున్న కూటమి శ్రేణులు

ఉయ్యూరు: కూటమి ప్రభుత్వంలో దౌర్జన్యాలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. మహానేత వైఎస్సార్ పేర్లు తొలగిస్తూ, విగ్రహాలను ధ్వంసం చేస్తూ పైశాచికానందం పొందుతున్నారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. నూతన భవనాలను నిర్మించి గ్రామీణులకు వైద్య సేవలు మరింత అందుబాటులోకి తెచ్చింది. నూతన నిర్మాణం పూర్తయిన అనంతరం ఆస్పత్రికి డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వాస్పత్రిగా నామకరణం చేసి వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్ పేరు తొలగించే కుట్రకు పాల్పడింది. పేరు కనిపించకుండా ఫ్లెక్సీని అడ్డుగా ఏర్పాటుచేసి పైశాచికానందం పొందారు. తాజాగా గురువారం అర్ధరాత్రి దాటాక ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆస్పత్రి ప్రాంగణంలోని వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. సెక్యూరిటీ గార్డు అప్రమత్తతతో కేకలు వేయడంతో పాక్షికంగా ధ్వంసం చేసి బైక్‌పై పరారయ్యారు. ఘటన శుక్రవారం వెలుగుచూసింది. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం పిరికి పంద చర్య అని వైఎస్సార్‌సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి ఘటనపై స్పందిస్తూ విగ్రహ ధ్వంసం ఘటనపై ఆస్పత్రి పాలకవర్గం, ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం అందించామన్నారు.



ఆస్పత్రి పేరుపై కొత్త రంగు వేసి వైఎస్సార్ పేరు తొలగించిన దృశ్యం

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్టుమెంట్లు నిండాయి. క్యూలైన్ గోగర్భం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 52,643 మంది స్వామిని దర్శించుకున్నారు. 24,527 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

గజ వాహనంపై శ్రీవారి దేవేరి కటాక్షం



తిరుచానూరు (చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు గజ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన ఉత్తరాషాఢం సందర్భంగా శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వజ్రవైఢూర్యాలతో అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్లకు పాంచరాత్ర ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని ఊంజల్ మండపంలో అమ్మవారికి దీపకాంతుల నడుమ ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన గజ వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ



అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి శుక్రవారం కిటకిటలాడింది. సత్యదేవుని ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. దీంతో స్వామివారి వ్రత మండపాలతో పాటు నిత్య కల్యాణ మండపంలో సైతం వ్రతాలు నిర్వహించారు. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, రూ.200 టికెట్టు దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. తూర్పు రాజగోపురం ముందు రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారి వ్రతాలు 2,100 జరిగాయి.

సత్యదేవుని తెప్పోత్సవానికి చురుకుగా ఏర్పాట్లు



అన్నవరం: కార్తిక శుద్ధ ద్వాదశి సందర్భంగా పంపా జలాశయంలో ఈ నెల 13వ తేదీ రాత్రి నిర్వహించే సత్యదేవుని తెప్పోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. హంస వాహనంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవారు పంపా జలాశయంలో మూడుసార్లు విహరించనున్నారు. తెప్పోత్సవంలో ఉపయోగించే పంటుకు మరమ్మతులు పూర్తి చేసి శుక్రవారం ట్రయల్ రన్ నిర్వహించారు.

విద్యా సమాచారం

ప్రీరిపబ్లిక్ పరేడ్‌కు మహిళా వర్సిటీ విద్యార్థులు

తిరుపతి సిటీ: మహారాష్ట్ర జలగాంలోని కేబీసీ యూనివర్సిటీలో ఈ నెల 12వ తేదీ నుంచి జరిగే ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థినులు ఎంపికయ్యారు. వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ మహిళా వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థినులు ప్రత్యూష, కావ్య పరేడ్‌కు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. వర్సిటీలో విద్యా భోధనతో పాటు స్పోర్ట్స్, సేవా దృక్పథం, ఎన్ఎస్ఎస్ వంటి వాటిలో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత డీఎస్సీ శిక్షణ స్క్రీనింగ్ పరీక్ష వాయిదా

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు జిల్లాలో ఈ నెల 10వ తేదీ నిర్వహించాల్సిన ఉచిత డీఎస్సీ శిక్షణ స్క్రీనింగ్ ఎంపిక పరీక్షను వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఎంపిక పరీక్షను వాయిదా వేశారని చెప్పారు. ఈ విషయాన్ని జిల్లాలోని అభ్యర్థులు గమనించాలని, తదుపరి స్క్రీనింగ్ పరీక్ష తేదీని త్వరలో ప్రకటిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

ఏఎన్‌యూ దూరవిద్యకు ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశ పరీక్ష

తిరుపతి సిటీ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య ద్వారా అందిస్తున్న ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో చేరదలచిన అభ్యర్థులకు శనివారం తిరుపతి గేట్ డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కళాశాల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు తత్కాల్ పద్ధతిలో విద్యార్హత పత్రాలు, పరీక్ష ఫీజుతో శనివారం గేట్ కళాశాలకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 6302336171, 9000490820లో సంప్రదించాలని సూచించారు.

చిన్నారుల కోసం అతి పెద్ద లైబ్రరీ



లైబ్రరీకి వెళ్లి మనకు నచ్చిన పుస్తకాలు చదువుకోవచ్చు. కావాలంటే ఆ పుస్తకాలు ఇంటికి తీసుకురావచ్చు. అవి చదవడం పూర్తయ్యాక తిరిగి ఇచ్చి, మరో పుస్తకం తీసుకోవచ్చు. ఇదంతా మీకు తెలుసు కదా! అయితే దేశ రాజధాని ఢిల్లీలో 'బి.సి.రాయ్ చిల్డ్రన్స్ రీడింగ్ రూమ్ అండ్ లైబ్రరీ' గురించి మీరు విన్నారా? మనదేశంలో ప్రత్యేకంగా పిల్లల కోసమే ఏర్పాటు చేసిన అతి పెద్ద లైబ్రరీ ఇది.

ప్రఖ్యాత పొలిటికల్ కార్టూనిస్ట్ కె.శంకర్ పిళ్లై దీన్ని స్థాపించారు. భారతరత్న దివంగత డాక్టర్ బి.సి.రాయ్ పేరును ఈ లైబ్రరీకి పెట్టారు. 1967 నవంబర్ 12న అప్పటి మన రాష్ట్రపతి డా.జాకీర్ హుస్సేన్ దీన్ని ప్రారంభించారు. ఇందులో ప్రస్తుతం 40 వేలకు పైగా వివిధ భాషల పుస్తకాలున్నాయి. అవన్నీ చిన్నారుల్లో విజ్ఞానాన్ని, దేశభక్తిని, సామాజిక అవగాహనను పెంచుతాయి.

ఇక్కడున్న పుస్తకాలను 'గ్రూప్ ఏ', 'గ్రూప్ బీ', 'గ్రూప్ సి' అని మూడు భాగాలుగా విభజించారు. 'గ్రూప్ ఏ'లో ఎనిమిదేళ్ళ లోపు పిల్లలు చదివే పుస్తకాలు ఉంటాయి. 'గ్రూప్ బీ'లో తొమ్మిదేళ్ల నుంచి పన్నెండేళ్ళ పిల్లలు చదివే పుస్తకాలు ఉంటాయి. 'గ్రూప్ సి'లో పదమూడు నుంచి పదిహేడేళ్ల వయసున్నవారు చదివే పుస్తకాలు ఉంటాయి. బడికి వెళ్ళే పిల్లలు ఎవరైనా ఈ లైబ్రరీలో మెంబర్‌గా చేరొచ్చు. ఇందుకు రూ.50 అడ్మిషన్ ఫీజుతోపాటు ఏడాదికి రూ.150 ఫీజు ఉంటుంది. అలాగే సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.500 కట్టించుకుంటారు.

ఇక్కడికి చిన్నారుల వెంట పెద్దలు కూడా రావొచ్చు. అయితే పుస్తకాలు తీసుకునే అవకాశం మాత్రం కేవలం పిల్లలకే ఉంటుంది. ఒకసారి రెండు పుస్తకాలు మాత్రమే ఇంటికి తీసుకెళ్లాలి. వాటిని రెండు వారాలలోగా చదివి, తిరిగి ఇచ్చేయాలి. ఒకేసారి రెండు కంటే ఎక్కువ పుస్తకాలు కావాలంటే ఏడాది ఫీజు మరికొంత ఎక్కువ కట్టాల్సి ఉంటుంది. లేదంటే అక్కడే కూర్చుని మీకు నచ్చిన పుస్తకాలు ఎంతసేపైనా చదువుకోవచ్చు. ఈసారి మీరు ఢిల్లీ వెళితే తప్పకుండా ఈ లైబ్రరీకి వెళ్లండి. ఇది రోజూ ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల దాకా తెరిచి ఉంటుంది. సోమవారాలు, పండుగలు, ప్రభుత్వ సెలవు రోజుల్లో మూసి ఉంచుతారు.

● మహనీయులు
మదర్ థెరీసా

బాల్యంలోనే వికసించిన సేవా తత్పరత



రోజూ ఆ పాప సమయానికి స్కూల్‌కి వచ్చేది. కానీ ఆ రోజు ఆలస్యమైపోతున్నా ఇంకా స్కూల్‌కి రాలేదు. చాలాసేపటి తర్వాత వచ్చింది. టీచర్ ఆమెను బయటే నిలబెట్టి ఎందుకు ఆలస్యమైందని ప్రశ్నించింది. 'టీచర్! రోజూలాగే నేను సమయానికి బడికి వస్తున్నాను. దారిలో ఓ ముసలివాడు కనిపించాడు. జ్వరంతో బాధపడుతున్నాడు. అందరూ అతణ్ని చూసి వెళ్లిపోతున్నారే తప్ప ఎవరూ సాయం అందించడం లేదు. నేను అతని దగ్గరికి వెళ్లి, డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి వస్తున్నాను. అందుకే ఆలస్యమైంది' అని వివరించింది. పాపలోని సేవాగుణానికి ఆ టీచర్ చలించిపోయి తనను హత్తుకుంది. ఆ చిన్నారే ఆ తర్వాత కాలంలో అందరి చేతా 'మదర్' అనిపించుకున్న మదర్ థెరీసా. విదేశాల్లో పుట్టి, మన భారతదేశానికి వచ్చి పేదలు, అభాగ్యులు, రోగుల కోసం జీవితాంతం సేవలందించింది. కోల్‌కతాలో ఉంటూ ఆమె ఎంతోమంది నిర్భాగ్యులకు ఆశ్రయం కల్పించింది. విరాళంగా తనకొచ్చిన ప్రతి రూపాయినీ సేవల కోసమే ఖర్చుచేసింది. ఆమె సేవాగుణానికి ప్రశంసగా ఆమెకు నోబెల్ శాంతి బహుమతి లభించింది. మరెన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఆమెను వరించాయి. ఆమె జీవితం నుంచి మీరు స్ఫూర్తి పొందాలి. ఎవరైనా కష్టాల్లో ఉంటే నాకెందుకులే అని అనుకోకూడదు. వారికి మీ చేతనైన సాయం అందించాలి.

● సినిమా చూద్దామా?

ఈసారి చాలా డిఫెరెంట్‌గా...



మామూలు మూవీస్‌లో సూపర్ కారెక్టర్స్ చెయ్యాలంటే చాలా ఖర్చు, కష్టంతో కూడుకున్న పని. కాని అదే యానిమేటడ్ కారెక్టర్స్ అయితే అంత ఖర్చు, కష్టం రెండూ వుండవు. అంతేనా ఇప్పటి జెనరేషన్‌కి బాగా నచ్చుతుంది కూడా. అందుకేనేమో రియల్ కారెక్టర్స్ కన్నా యానిమేటడ్ కారెక్టర్స్‌కి డిమాండ్ – మార్కెట్ రెండూ ఎక్కువే. కాబట్టే ఒక్కో కారెక్టర్ సిరీస్ రూపేణా బోలెడన్ని పార్ట్స్‌లో వస్తున్నాయి. అదే రేంజ్ లో ఇటీవల రిలీజ్ అయిన సినిమా డిస్పికబుల్ మి 4. జియో సినిమా ఓటిటి వేదికగా తెలుగులోనూ డబ్బింగ్ వెర్షన్ లభ్యమవుతోంది. డిస్పికబుల్ సిరీస్‌లో ఇది 5వ సినిమా. క్రిస్ రేనాడ్ దర్శకత్వం వహించిన సినిమా అనుకున్నట్టుగానే సూపర్ రివ్యూస్‌తో దూసుకుపోతోంది. ఈ సిరీస్ ఫాలో అవుతున్నవాళ్ళకి దీనిలో కారెక్టర్స్‌తో పాటు కథ కూడా సులువుగా అర్థమవుతుంది. దీనిలో మెయిన్ కారెక్టర్ గ్రూ. ఇక గ్రూతో పాటు ఫిల్, రోన్ మరియు రఫ్ అనే మీనియన్స్. ఈ డిస్పికబుల్ మి 4 కథాంశానికొస్తే గ్రూ కి ఒక కొత్త ఫ్యామిలీ ఉంటుంది. ఆ ఫ్యామిలీలో ఒక చిన్న బాబు కూడా వుంటాడు. కాని ఆ బాబు వాళ్ళ అమ్మ దగ్గర బానే వుంటాడు కాని గ్రూకి మాత్రం విసుగు పుట్టిస్తుంటాడు. కాని గ్రూ కి ఆ బాబంటే ఎంతో ఇష్టం. మరో పక్క తన ఎనిమీ అయిన మాక్స్ మీ లీమాల్ జైలు నుండి తప్పించుకుని గ్రూ కోసం వెతుకుతూ వుంటాడు. ఈ విషయం తెలిసిన గ్రూ ఫ్యామిలీ సేఫ్ హౌస్ కి వెళుతుంది. ఇక అక్కడ నుండి గ్రూ మాక్స్ మీ లీమాల్ ను ఎలా ఎదుర్కుంటుందన్నదే మిగతా సినిమా. పైన చెప్పుకున్నట్టు రియల్ కారెక్టర్స్ కన్నా యానిమేటడ్ కారెక్టర్స్ కథను మరో లెవల్ కు తీసుకువెళతాయి. ముఖ్యంగా ఈ సినిమాలో మీనియన్స్ చేసే అల్లరి అంతా ఇంతా కాదు. సినిమా బ్యానర్ నేమ్ నుండే ఆ అల్లరి ప్రారంభమవుతుంది. గ్రూ చేసే సాహస విన్యాసాలు, మాక్సిమల్ క్రియేట్ చేసిన ఎక్స్‌ట్రార్డినరీ వెహికల్ సూపర్‌గా వుంటాయి. పిల్లలతో పాటు పెద్దవాళ్ళు కూడా ఈ వీకెండ్ కు మస్ట్ వాచ్‌బుల్ మూవీ డిస్పికబుల్ మి 4. జియో సినిమా వేదికగా వుంది చూసేయండి.

- ఇంటూరు హరికృష్ణ

● ఈ సామెత తెలుసుకోండి!

'చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు'



కొందరు పిల్లలు వద్దంటున్నా వినకుండా నిప్పు ముట్టుకుంటారు. చేతులు కాలిన తర్వాత, ఆ బాధ తగ్గడానికి రకరకాల మార్గాలు వెతుకుతారు. ముందే ఆలోచించి ఉంటే వారికి ఆ బాధ ఉండదు. అలాగే మనం ఏదైనా పని చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. అది చేయదగ్గ పనేనా, దానివల్ల ఎవరికైనా, ఏదైనా నష్టం ఉందా అని సరిచూసుకోవాలి. ఆ తర్వాతే ఆ పని మొదలుపెట్టాలి. అలా కాకుండా హడావిడిగా పని మొదలుపెట్టి, ఆ తర్వాత నష్టం రాగానే అయ్యో అని బాధపడకూడదు. అలాంటి సందర్భంలో ఈ సామెత వాడతారు.

● కథ

సూర్యుడు... సన్‌ఫ్లవర్



ఒకూర్లో ఒక రాజున్నాడు. ఆయనకు బంగారు బొమ్మలాంటి కూతురుంది. పెళ్లి చేయాలని మంచి సంబంధాలు తేవడం మొదలు పెట్టినాడు. కానీ ఆమె అవి నచ్చలేదంటా ఎగరగొట్టడం మొదలు పెట్టింది. దాంతో ఆయన బాగా విసిగిపోయినాడు.

ఒకరోజు కూతుర్ని పిలిచి "ఏందమ్మా... నేనే సంబంధం తెచ్చినా నచ్చడం లేదంటున్నావ్. అసలు నీకు ఎట్లాంటోడు కావాల్నో చెప్పు... '' అన్నాడు.

అప్పుడామె "నాన్నా.... నాకు ఈ లోకానికంతా శక్తి నిచ్చి వెలుగులు పంచే సూరీడంటే చానా ఇష్టం. నన్ను ఎట్లాగైనా ఆయనకిచ్చి పెండ్లి చేయవా'' అనడిగింది.



అప్పుడు వాళ్ళ నాయన "చూడమ్మా... సూర్యునితో పెండ్లంటే మాటలు గాదు. ఆయనెక్కడో ఆకాశంలో తిరుగుతా వుంటాడు. మనముండేదా భూమ్మీద. మనకూ ఆయనకూ నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. ఆ సంబంధం కుదిరే పని కాదుగానీ వేరేవాణ్ణి చేస్కో'' అన్నాడు.

కానీ... ఆమె వాళ్ళ నాయన మాట వినిపిచ్చుకోకుండా "సూర్యున్ని ఎట్లా పెండ్లి చేసుకోవాలబ్బా'' అని ఆలోచిస్తా పడమటి దిక్కున బయలుదేరి అడవులు, గుట్టలు, వాగులు దాటుకుంటా ఒక పెద్ద కొండపైకి ఎక్కింది. ఆ కొండపైన ఒక ఇల్లుంది. ఆ ఇంట్లో ఒక ముసలామె వుంది. ఆమె రాకుమారిని చూసి "ఏందమ్మా పాపం... ఒక్కదానివే అట్లా తిరుగుతా వున్నావ్. ఏం కావాల నీకు' అనడిగింది. అప్పుడా రాకుమారి కండ్ల నిండా నీళ్ళు కారిపోతా వుంటే జరిగిందంతా చెప్పింది.

అప్పుడా ముసిలామె చీరకొంగుతో ఆమె కండ్లనీళ్ళు తుడుస్తా "నువ్వేమీ బాధ పడొద్దు. నువ్వు వెతికే సూరీడు ఎవరోగాదు నా కొడుకే. ఆకాశంలో పగలంతా తిరిగి అలసిపోయి రాత్రి కాగానే ఇంటికొస్తాడు. నువ్వు నాకెంతగానో నచ్చినావు. నే చెప్తాలే. నా కొడుకుని చేసుకుందువు గానీ'' అనింది.

సూరీడు ఆకాశంలో పగలంతా తిరిగి అలసిపోయి రాత్రి ఇంటికి తిరిగి వచ్చినాడు. ఇంట్లో రాకుమారిని చూసి "ఎవరబ్బా... ఈ అమ్మాయి'' అనుకున్నాడు. అంతలో ఆ రాకుమారి సంబరంగా సూర్యుని దగ్గరికి వచ్చి "నువ్వంటే నాకెంతో ఇష్టం. నీకోసం అందర్నీ వదిలి వచ్చేసినా. నన్ను పెండ్లి చేసుకోవా'' అనడిగింది.


దానికి సూర్యుడు "చూడు పాపా... నేను మీ లెక్క మామూలు మనిషిని కాదు. ఎప్పుడూ భగభగా మండిపోతా సెగలు కక్కుతా వుంటాను. నన్ను కండ్లు తెరిచి సూటిగా చూస్తే సాలు... ఎవరి కండ్లకైనా సరే మబ్బులు కమ్ముతాయి. అట్లాంటిది నువ్వు నన్నెట్లా పెండ్లి చేసుకోగలవ్. పో'' అన్నాడు.

పాపం ఆమె ఏడ్చుకుంటా ఆకాశంలో తిరిగే సూర్యున్నే చూస్తా ఏమీ తినకుండా కొద్ది రోజులకు చచ్చిపోయింది.

ఆమె ఎక్కడైతే చచ్చిపోయిందో సరిగ్గా అక్కణ్ణే కొంత కాలానికి మొక్కొ పుట్టింది. ఆ మెక్క పెరిగి పెద్దగై ఒక పూవు పూసింది. ఆ పూవు అరచేయంత పెద్దగా చందమామ లెక్క గుండ్రంగా పసుప్పచ్చని రేకులతో చూడముచ్చటగా వుంది. ఆ రోజు నుండి ఈ రోజు వరకు ఆ పూవు ఏనాటికైనా సూర్యుడు రాకపోతాడా... నన్ను పెండ్లి చేసుకోకపోతాడా అని పొద్దున నుంచి సాయంత్రం వరకు సూర్యుడు ఎటువైపు తిరిగితే అటువైపు తిరుగుతా వుంది. ఆ పువ్వునే మనం పొద్దుతిరుగుడు పువ్వనీ, సూర్యకాంతమనీ పిలుస్తావుంటే ఆంగ్లభాషలో 'సన్ ఫ్లవర్' అంటుంటాం.



ఒంటెల జాతర



ఒంటెలు ఒంటెలు ఒంటెలు ఒంటెలు... ఎక్కడ చూడు... అక్కడ చూడు.. కుడి వైపున... ఎడమ వైపున... ఆ దిక్కున ఈ దిక్కున... నడిచి వస్తూ గుంపులు కడుతూ... గోధుమ రంగులో మెరిసే కనులతో.... ముచ్చట గొలిపే మూపురాలతో యజమానుల కనుసన్నలలో ఒంటెలు ఒంటెలు ఒంటెలు ఒంటెలు.... పిల్లలూ... ఒంటి ఎక్కాలని ఎవరికి ఉండదు. ఒంటెను చూడాలని ఎవరికి సరదా పుట్టదు. కాని వేలాది ఒంటెలు ఒకచోట చేరితే? ఎస్... ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో (కార్తిక పౌర్ణమి నుంచి) రాజస్థాన్‌లోని అజ్మీర్ పట్టణానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న పుష్కర్‌లో 'పుష్కర్ మేళా' జరుగుతుంది. అంత వరకూ ఎడారిలో ఒంటెల్ని మేపుతూ తిరిగే సంచార జాతుల వారందరూ ఈ మేళకు తమ ఒంటెల మందను తెస్తారు. ఇక వారం రోజుల పాటు పుష్కర్‌లో ఇసుక నేలంతా ఒంటెల గిట్టలతో దుమ్ము రేగుతూనే ఉంటుంది. ఈ సంవత్సరం నేటి నుంచి (నవంబర్ 9) నుంచి 15 వరకు పుష్కర్ మేళా జరుగనుంది. దేశ విదేశాల నుంచి వేల మంది ఈ మేళాను చూడటానికి వస్తారు. మేళాలో పాల్గొనడానికి ఒంటెల ఫొటోలే ఇవి.



నోరూరించే లాలీపాప్ దీని కథేంటో తెలుసా?

నోట్లో పెట్టుకొని చప్పరించగానే మెల్లగా కరిగిపోయే లాలీపాప్ అంటే అందరికీ నోరూరుతుంది. చిన్నపిల్లలు వీటిని ఇష్టంగా తింటారు. వీటి కథేంటో తెలుసా మరి?





నిజానికి ఈ లాలీపాప్స్ ఎప్పుడు ఎలా తయారయ్యాయో సరిగ్గా తెలియదు. అయితే రాతియుగాల్లో కొందరు తేనె వంటి తీపి పదార్థాలను కర్ర, పుల్లల సాయంతో తినేవారు. అలా లాలీపాప్స్ ఎన్నో వేల క్రితం నుంచే ఉన్నాయని అనుకోవచ్చు. ఆ తర్వాత 1908లో అమెరికాకు చెందిన జార్జ్ స్మిత్ అనే ఆయన తొలిసారి వీటిని తయారు చేశారు. అప్పటికి బాగా పేరుపొందిన రేసు గుర్రం 'Lollypop'ని దీనికి పేరుగా పెట్టారు. 1931 నుంచి ఈ పేరు స్థిరపడిపోయింది. అప్పటి నుంచి లాలీపాప్ అనే పేరు అందరికీ తెలిసింది. లాలీపాప్స్‌ని కొన్ని చోట్ల 'షుగర్ క్యాండీల'ని పిలుస్తారు.

లాలీపాప్స్ తయారు చేయడానికి యంత్రాలను వాడతారు. తయారీకి చక్కెర, కార్న్ సిరప్ అవసరమవుతాయి. వీటిని రకరకాల మోతాదుల్లో కలిపి లాలీపాప్స్ తయారు చేస్తారు. మొదట్లో ఈ రెండు దినుసుల్ని మాత్రమే వాడేవారు. ప్రస్తుతం రుచి కోసం రకరకాల దినుసులు కలుపుతున్నారు. రంగుల కోసం కెమికల్స్ వాడుతున్నారు. మొదట్లో కేవలం గుండ్రంగా బంతిలా ఉండే లాలీపాప్స్ మాత్రమే తయారు చేసేవారు. అనంతరం పలు రకాల సైజులు, రూపాల్లో తయారు చేయడం మొదలుపెట్టారు.

ప్రస్తుతం అనేక ప్రముఖ కంపెనీలు లాలీపాప్ తయారు చేస్తున్నాయి. అందులో ప్రధానమైనది స్పాంగ్లర్ క్యాండీ కంపెనీ. ఇది ఒక రోజుకు 30 లక్షల లాలీపాప్స్ తయారు చేస్తుంది. దీన్ని బట్టి ప్రపంచవ్యాప్తంగా లాలీపాప్స్‌కి ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.



● పాడుదాం గేయం

అంతా మనకోసం



1
మన కోసం మన కోసం
లోకమంతా మన కోసం
మన కోసం మన కోసం
అందాలన్నీ మన కోసం

2
గలగల పారే సెలయేరు
నిండుగ సాగును మన కోసం
మిలమిల మెరిసే తారకలు
నింగిన వెలుగును మన కోసం

3
రంగురంగుల పూలన్నీ
విరిసి మురిసేను మన కోసం
ఝుమ్మని సాగే తుమ్మెదలు
తంబుర మీటును మన కోసం

4
రాగాలొలికే కోయిలమ్మలు
తియ్యగ పాడును మన కోసం
చెంగున ఉరికే లేడికూనలు
పరుగులు తీయును మన కోసం

5
మన కోసం మన కోసం
లోకమంతా మన కోసం
మన కోసం మన కోసం
అందాలన్నీ మన కోసం

అమెరికా ఆంక్షలను జాగ్రత్తగా అధిగమించాలి

- ఈ దిశగా దౌత్య సంప్రదింపులు చేపట్టాలి
- సంస్థల వ్యాపార ప్రయోజనాలు కాపాడాలి
- గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ సూచన



న్యూఢిల్లీ: రష్యాకు రక్షణ సామాగ్రిని సరఫరా చేస్తున్నాయనే నెపంతో భారత్‌కు చెందిన 19 కంపెనీలపై అమెరికా విధించిన ఆంక్షలను జాగ్రత్తగా అధిగమించాల్సి ఉంటుందని స్వతంత్ర పరిశోధన సంస్థ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) సూచించింది. భారత కంపెనీలు సహా మొత్తం 400 సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు విధిస్తూ అక్టోబర్ 30న అమెరికా విదేశాంగ శాఖ, ట్రెజరీ ఆఫీస్ ఆఫ్ ఫారీన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసీ) ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఉక్రెయిన్‌పై రష్యా సైనిక కార్యకలాపాలకు సహకరిస్తున్నాయంటూ కంపెనీలపై అమెరికా ఏకపక్ష చర్యలకు దిగింది. దీంతో ఈ దిశగా భారత్ చేపట్టాల్సిన చర్యలను జీటీఆర్ఐ సూచించింది. ఆయా కంపెనీల ప్రయోజనాలను కాపాడేందుకు వీలుగా అమెరికాతో, అంతర్జాతీయ సంస్థలతో భారత్ సంప్రదింపులు చేపట్టడం ద్వారా పరిష్కారాలు గుర్తించాలని పేర్కొంది. భవిష్యత్తులో ఈ తరహా ఆంక్షలను నివారించేందుకు వీలుగా ఎగుమతులకు సంబంధించి కఠిన నియంత్రణలు, స్పష్టమైన నిబంధనల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరింది. ''యూఎస్ ఏకపక్షంగా ఆంక్షలు విధించడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం. తమ వ్యాపార ప్రయోజనాల పరిరక్షణకు వీలుగా భారత్ మాదిరి దేశాలు ఈ ఆంక్షలను జాగ్రత్తగా అధిగమించడమే వాస్తవిక కార్యాచరణ అవుతుంది. అమెరికా చర్యలు భారత వ్యాపార ప్రయోజనాలకు హానికలిగించినా లేదా అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలకు విరుద్ధంగా ఉంటే ఈ విషయాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఐ) దృష్టికి భారత్ తీసుకెళ్లాలి''అని జీటీఆర్ఐ తన తాజా నివేదికలో సూచించింది.

అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడాలి..

భారత వ్యాపార సంస్థలు సున్నితమైన ఉత్పత్తుల (పౌర, సైనిక వినియోగం) ఎగుమతుల విషయంలో స్థానిక చట్టాలనే కాకుండా అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరాన్ని అమెరికా ఆంక్షలు గుర్తు చేస్తున్నాయని జీటీఆర్ఐ పేర్కొంది. ఆంక్షలు విధించిన దేశాలు, సంస్థలకు మద్దతు విషయంలో కంపెనీలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఆంక్షలు ఎదుర్కొంటున్న భారత కంపెనీలు అటు సైనిక, ఇటు పౌర అవసరాల కోసం ఉద్దేశించినవి ఎగుమతి చేస్తున్నట్టు తెలిపింది. వీటిల్లో కొన్ని అమెరికాలో తయారైనవే కాకుండా, స్థానికంగా తయారు చేసినవీ రష్యా సైనిక అవసరాలకు ఎగుమతి చేస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. అమెరికా ఆంక్షలు ఆ దేశ తయారీ ఉత్పత్తులను ఇతర దేశాలకు తరలించే కంపెనీలకూ వర్తిస్తాయంటూ.. భారత ఎగుమతిదారులపై పరిశీలన మరింత పెరుగుతుందని అంచనా వేసింది. ఐక్యరాజ్యసమితికి వెలుపల ఏకపక్ష చర్యలకు భారత్ మద్దతు ఇవ్వరాదని.. అమెరికా ఆంక్షల విధానం కేవలం ఇరాన్, ఉత్తరకొరియా వంటి దేశాలకే పరిమితం కావాలని పేర్కొంది. భారత కంపెనీలు తమ ఉత్పత్తుల సరఫరా చైన్‌ను తప్పకుండా పరిశీలించాలని సూచించింది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

లాభాల్లోకి వేదాంతా




- క్యూ2లో రూ. 4,352 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 4,352 కోట్ల నికర లాభం ఆర్జించింది. పన్ను వ్యయాలు తగ్గడం ప్రధానంగా ప్రభావం చూపింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 1,783 కోట్ల నికర నష్టం ప్రకటించింది. పన్ను వ్యయాలు రూ. 9,092 కోట్ల నుంచి భారీగా తగ్గి రూ. 2,030 కోట్లకు పరిమితమయ్యాయి. అయితే మొత్తం ఆదాయం రూ. 39,585 కోట్ల నుంచి రూ. 38,934 కోట్లకు క్షీణించింది. ఇది 46 శాతం వృద్ధికాగా.. 34 శాతం ఇబిటా మార్జిన్లు సాధించినట్లు వెల్లడించారు. 2024 సెప్టెంబర్‌కల్లా స్థూల రుణ భారం రూ. 78,654 కోట్లుగా నమోదైంది. స్టెరిలైట్ ఐరన్ స్టీల్ కంపెనీలో 100 శాతం వాటాను అనుబంధ సంస్థ సెసా రిసోర్సెస్ కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతించినట్లు వేదాంతా వెల్లడించింది. దీంతోపాటు రూ. 5,209 కోట్ల పెట్టుబడి వ్యయాలకు సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో వేదాంతా షేరు బీఎస్ఈలో యథాతథంగా రూ. 458 వద్ద ముగిసింది.

ఓలా ఎలక్ట్రిక్‌కు తగ్గిన నష్టం



- రూ. 495 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) రంగ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు వెలువరించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర నష్టం స్వల్పంగా తగ్గి రూ. 495 కోట్లకు పరిమితమైంది. అధిక విక్రయాలు ఇందుకు సహకరించాయి. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 524 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 873 కోట్ల నుంచి రూ. 1,214 కోట్లకు ఎగసింది. వాహన విక్రయాలు 74 శాతం జంప్‌చేసి 98,619 యూనిట్లను తాకాయి. 2025 మార్చికల్లా కంపెనీ 2,000 సొంత ఔట్‌లెట్లకు నెట్‌వర్క్‌ను విస్తరించనున్నట్లు ఓలా ఎలక్ట్రిక్ పేర్కొంది. 2024 సెప్టెంబర్‌కల్లా 782 స్టోర్లను కలిగి ఉంది.

ఫలితాల నేపథ్యంలో ఓలా ఎలక్ట్రిక్ షేరు బీఎస్ఈలో 2.5% నష్టంతో రూ. 73 వద్ద ముగిసింది.

పీఎఫ్‌సీ లాభం రూ.7,215 కోట్లు

ఒక్కో షేరుకు రూ.3.50 డివిడెండ్ • గిఫ్ట్ సిటీలో కార్యకలాపాలు మొదలు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.7,215 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.6,628 కోట్లతో పోల్చి చూస్తే 9 శాతం వృద్ధి చెందింది. ఆదాయం ఇదే కాలంలో రూ.22,387 కోట్ల నుంచి రూ.25,755 కోట్లకు పెరిగింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలానికి (ఏప్రిల్-సెప్టెంబర్) కంపెనీ లాభం 14 శాతం వృద్ధితో రూ.14,397 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలానికి ఇది రూ.12,610 కోట్లుగా ఉంది. సంస్థ నికర విలువ 17 శాతం వృద్ధితో రూ.1,23,703 కోట్లకు.. రుణ పుస్తకం 13 శాతం వృద్ధితో రూ.10,39,472 కోట్లకు చేరాయి. క్రితం ఏడాది ఇదే కాలానికి ఇవి 0.98 శాతంగా ఉన్నాయి. స్థూల ఎన్‌పీఏలు 0.78 శాతం తగ్గి 2.62 శాతంగా ఉన్నాయి. ఒక్కో షేరుకు రూ.3.50 చొప్పున మధ్యంతర డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది. నవంబర్ 25 రికార్డ్ తేదీగా ప్రకటించింది.

ఇండియా సిమెంట్స్ నష్టం అప్

- క్యూ2లో ఆదాయం 1,032 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ ఇండియా సిమెంట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు వెలువరించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర నష్టం భారీగా పెరిగి రూ. 339 కోట్లను తాకింది. సిమెంట్ విక్రయ ధరలు క్షీణించడం ప్రభావం చూపింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 80 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం 18 శాతంపైగా నీరసించి రూ. 1,032 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 1,264 కోట్ల టర్నోవర్ అందుకుంది. కంపెనీలో ఆదిత్య బిర్లా గ్రూప్ సిమెంట్ దిగ్గజం అల్ట్రాటెక్ మెజారిటీ వాటాను సొంతం చేసుకోనున్న సంగతి తెలిసిందే. కాగా.. అయితే మొత్తం వ్యయాలు 4 శాతం తగ్గి రూ. 1,323 కోట్లకు పరిమితమయ్యాయి. ఈ కాలంలో అమ్మకాలు పెరిగినప్పటికీ మార్జిన్లు నీరసించడంతో రూ. 154 కోట్ల నిర్వహణ నష్టం నమోదైనట్లు కంపెనీ వెల్లడించింది.

ఇండియా సిమెంట్స్ షేరు బీఎస్ఈలో యథాతథంగా రూ. 360 వద్ద ముగిసింది.

పేజ్ ఇండస్ట్రీస్ ఆకర్షణీయం

ఆదాయం, లాభంలో బలమైన వృద్ధి



న్యూఢిల్లీ: జాకీ బ్రాండ్ పేరుపై వస్త్ర ఉత్పత్తులు విక్రయించే పేజ్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికానికి (జులై-సెప్టెంబర్) ఆకర్షణీయ ఫలితాలు ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు లాభం 30 శాతం వృద్ధితో రూ.195 కోట్లకు చేరింది. ఆదాయం 11 శాతం పెరిగి రూ.1,246 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.150 కోట్లు, ఆదాయం రూ.1,122 కోట్ల చొప్పున ఉన్నాయి. 6.7 శాతం అధికంగా 55.2 మిలియన్ పీసుల విక్రయాలు నమోదు చేసినట్టు సంస్థ తెలిపింది.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో పేజ్ ఇండస్ట్రీస్ షేరు 6 శాతానికి పైగా ఎగసి రూ.47,988 వద్ద ముగిసింది.

భారీగా క్షీణించిన ఎన్‌సీఎల్ లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.13.6 కోట్ల నుంచి రూ.2.5 కోట్లకు పడిపోయింది. పన్నుకు ముందు లాభం రూ.22.5 కోట్ల నుంచి రూ.6.8 కోట్లుగా ఉంది. టర్నోవర్ రూ.395 కోట్ల నుంచి రూ.334 కోట్లకు వచ్చి చేరింది. ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో రూ.693 కోట్ల టర్నోవర్‌పై రూ.15 కోట్ల నికర లాభం పొందింది. 2023 సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల్లో రూ.800 కోట్ల టర్నోవర్‌పై రూ.44 కోట్ల నికరలాభం సాధించింది. ఫలితాల నేపథ్యంలో ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో శుక్రవారం 1.40% క్షీణించి రూ.208.35 వద్ద స్థిరపడింది.

రెండింతలైన విమ్టా ల్యాబ్స్ లాభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కాంట్రాక్ట్ రీసెర్చ్, టెస్టింగ్ సేవల్లో ఉన్న విమ్టా ల్యాబ్స్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రెండింతలకుపైగా పెరిగి రూ.17 కోట్లు నమోదు చేసింది. ఎబిటా 57 శాతం ఎగసి రూ.30 కోట్లుగా ఉంది. ఎబిటా మార్జిన్ 704 బేసిస్ పాయింట్లు అధికమై 35.8 శాతానికి చేరింది. ప్రాఫిట్ మార్జిన్ 793 బేసిస్ పాయింట్లు దూసుకెళ్లి 19.9 శాతం నమోదైంది. టర్నోవర్ 26 శాతం వృద్ధితో రూ.85 కోట్లు సాధించింది. ఫార్మాస్యూటికల్ సేవలు ఈ పనితీరును ప్రధానంగా నడిపించాయని విమ్టా ల్యాబ్స్ ఎండీ హరిత వాసిరెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. 'ఫార్మాస్యూటికల్ సేవలు ఆశాజనక వృద్ధిని చూపుతూనే ఉన్నాయి. రాబోయే త్రైమాసికాలలో ఆహార పరీక్ష సేవలు కూడా వృద్ధికి దోహదం చేస్తాయని అంచనా వేస్తున్నాం. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ టెస్టింగ్ సామర్థ్యాలను కూడా విస్తరిస్తున్నాం. కొన్ని త్రైమాసికాల్లో కొత్త ప్లాంటును ప్రారంభించేందుకు సిద్ధం అవుతున్నాం.

పన్ను రేట్లు తగ్గించాలి..

బడ్జెట్‌పై కార్పొరేట్ల కోర్కెల చిట్టా



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కి సంబంధించి కేంద్రానికి కార్పొరేట్లు తమ వినతులను అందజేశారు. కస్టమ్స్‌కి సంబంధించి వన్-టైమ్ సెటిల్మెంట్ రూపంలో గత బాకీలను చెల్లించేసేందుకు ఆమ్నెస్టీ పథకాన్ని ప్రకటించాలని పరిశ్రమల సమాఖ్యలు ఫిక్కీ, అసోచాం కోరాయి. బాకీ పరిమాణాన్ని బట్టి పాక్షికంగా సుంకాలను తగ్గించడం లేదా వడ్డీ అలాగే పెనాల్టీని పూర్తిగా మినహాయించడం రూపంలో ఊరటనివ్వొచ్చని పేర్కొన్నాయి. దీనితో పరిశ్రమపై లిటిగేషన్ల భారం తగ్గుతుందని తెలిపాయి. మరోవైపు, వ్యక్తులు, లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్ సంస్థల ట్యాక్సేషన్ విషయంలో పన్ను రేట్లను తగ్గించాలని, ఫేస్‌లెస్ అప్పీళ్లను ఫాస్ట్ ట్రాక్ చేయాలని పీహెచ్‌డీసీసీఐ విజ్ఞప్తి చేసింది.

టాటాల బాటలో లోధా

- దాతృత్వ కార్యక్రమాల కోసం సంపదలో కొంత భాగం
- ఫిలాంత్రొపీ ఫౌండేషన్‌కు రూ. 21 వేల కోట్ల షేర్ల బదిలీ



న్యూఢిల్లీ: టాటాల బాటలోనే రియల్టీ దిగ్గజం అభిషేక్ లోధా, ఆయన కుటుంబం దాతృత్వ కార్యక్రమాల కోసం భారీ స్థాయిలో విరాళమిచ్చింది. లిస్టెడ్ సంస్థ మ్యాక్రోటెక్ డెవలపర్స్‌లో 18 శాతం వాటాకు సరిసమానమైన షేర్లను లాభాపేక్షరహిత సంస్థ లోధా ఫిలాంత్రొపీ ఫౌండేషన్‌కు (ఎల్‌పీఎఫ్) బదలాయించింది. శుక్రవారం షేరు ముగింపు ధర రూ. 1,175.75 ప్రకారం వీటి విలువ రూ. 21,000 కోట్ల పైగా ఉంటుంది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారం ప్రకారం 2013లో ప్రారంభించిన ఎల్‌పీఎఫ్ .. జాతీయ, సామాజిక ప్రయోజన కార్యక్రమాలపై పని చేస్తోంది. విరాళంగా లభించిన షేర్లపై వచ్చే రాబడిని ఎల్‌పీఎఫ్.. విద్య, మహిళా సాధికారత తదితర సామాజిక సేవా కార్యక్రమాల కోసం వెచ్చించనుంది. టాటాల బాటలోనే తమ సంపదలో గణనీయమైన భాగాన్ని సమాజ ప్రయోజన కార్యక్రమాల కోసం కేటాయించాలని కుటుంబం నిర్ణయం తీసుకున్నట్లు అభిషేక్ లోధా గతంలో వెల్లడించారు. 'వందేళ్ల క్రితం టాటా కుటుంబం గ్రూప్ సంస్థల్లోని షేర్‌హోల్డింగ్‌లో సింహభాగాన్ని టాటా ట్రస్ట్స్‌కి బదలాయించింది. దేశానికి ప్రయోజనం చేకూర్చేలా ఈ బహుమతి గణనీయంగా ప్రభావం చూపడం, టాటా ట్రస్ట్స్ చేపట్టిన అనేక మంచి పనులు నాకు ఎంతగానో ప్రేరణనిచ్చాయి. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని పేర్కొన్నారు.

బ్రిడ్జ్‌స్టోన్ రూ.720 కోట్ల పెట్టుబడి



న్యూఢిల్లీ: టైర్ల తయారీలో ఉన్న జపాన్ కంపెనీ బ్రిడ్జ్‌స్టోన్ కార్పొరేషన్ రెండు ప్లాంట్ల విస్తరణ చేపడుతోంది. ఇందుకోసం సుమారు రూ.720 కోట్లు పెట్టుబడి చేయనున్నట్టు శుక్రవారం ప్రకటించింది. పుణే, ఇండోర్ వద్ద బ్రిడ్జ్‌స్టోన్ ఇండియాకు తయారీ కేంద్రాలు ఉన్నాయి. విస్తరణ ప్రక్రియ 2025 మొదట్లో ప్రారంభం అవుతుందని కంపెనీ తెలిపింది. విస్తరణ తదనంతరం పుణే ప్లాంటు వార్షిక సామర్థ్యం 2029 నాటికి 11 లక్షల యూనిట్లకు చేరుతుంది. ప్రీమియం టైర్ల తయారీకై ఇండోర్ ప్లాంటు సౌకర్యాలను మెరుగుపర్చనుంది. కొన్ని టైర్ల విభాగాల్లో నాయకత్వ స్థానం దిశగా ఉత్పత్తులను రూపొందించేందుకు వచ్చే ఏడాది పుణే ప్లాంటులో శాటిలైట్ టెక్నాలజీ సెంటర్ స్థాపించనున్నారు. ఈ కేంద్రం భారతీయ మార్కెట్ కోసం ముడిసరుకు ప్రణాళిక నుండి ఉత్పత్తి పరిశోధన/డిజైన్, తయారీ వరకు కంపెనీ మొత్తం ఇంజనీరింగ్ విభాగాల సాంకేతిక అభివృద్ధి సామర్థ్యాన్ని బలోపేతం, వేగవంతం చేస్తుందని సంస్థ భావిస్తోంది.

ఫిక్కీ కొత్త ప్రెసిడెంట్‌గా ఇమామి ఎండీ అగర్వాల్



న్యూఢిల్లీ: 2024–25 సంవత్సరానికి గాను పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ కొత్త ప్రెసిడెంట్‌గా ఇమామి లిమిటెడ్ ఎండీ హర్షవర్ధన్ అగర్వాల్ ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం ఫిక్కీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. నవంబర్ 21న ఫిక్కీ 97వ వార్షిక సమావేశం ముగిసిన తర్వాత అగర్వాల్ బాధ్యతలు చేపడతారు. ప్రస్తుతం ఫిక్కీ ప్రెసిడెంట్‌గా మహీంద్రా అండ్ మహీంద్రా గ్రూప్ సీఈవో అనీష్ షా ఉన్నారు.

మెడ్‌టెక్ పరిశ్రమకు రూ. 500 కోట్ల స్కీమ్



న్యూఢిల్లీ: మెడికల్ డివైజ్‌ల పరిశ్రమను పటిష్టం చేసే దిశగా రూ. 500 కోట్లతో కేంద్ర ప్రభుత్వం స్కీమును ప్రకటించింది. కీలకమైన పరికరాలు ఉత్పత్తి, నైపుణ్యాల అభివృద్ధి, క్లినికల్ స్టడీస్, ఉమ్మడి మౌలిక సదుపాయాల అభివృద్ధి మొదలైన వాటికి ఇది ఉపయోగపడనుంది. పరిశ్రమ వృద్ధికి తోడ్పడటమే కాకుండా స్వయం సమృద్ధి సాధించే దిశగా భారత్ ముందడుగు వేసేందుకు కూడా ఈ పథకం ఉపయోగపడగలదని కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. మెడికల్ డివైజ్‌ల రంగం కూడా ఈ స్కీమును సద్వినియోగం చేసుకోవాలని, పరిశ్రమకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలను ఫార్మా విభాగం అందిస్తుందని వివరించారు. పథకంలోని సబ్-స్కీమ్ కింద మెడికల్ డివైజ్ క్లస్టర్లలో ఆర్‌అండ్‌డీ ల్యాబ్‌లు, డిజైన్..టెస్టింగ్ సెంటర్లు వంటి ఉమ్మడి మౌలిక సదుపాయాల ఏర్పాటుకు మద్దతు లభిస్తుంది. అలాగే, మరో సబ్-స్కీమ్ కింద కీలక పరికరాలు, ముడి వస్తువుల తయారీని ప్రోత్సహించేందుకు మార్జినల్ ఇన్వెస్ట్‌మెంట్‌పరమైన తోడ్పాటును కేంద్రం అందిస్తుంది. ఇక మూడో సబ్-స్కీము నైపుణ్యాల అభివృద్ధి, సామర్థ్యాలను పెంచుకోవడానికి కావాల్సిన మద్దతు అందుతుంది.

జాతీయ స్థాయిలో ప్రావీణ్య పరీక్ష

ఎన్ఎస్‌డీసీ, టీసీఎస్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ: నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ), టీసీఎస్ అయాన్ జాతీయ స్థాయిలో ప్రావీణ్య పరీక్షలు జరిపేందుకు ఒక ఒప్పందంపై శుక్రవారం సంతకాలు చేశాయి. ఉద్యోగార్థులు, విద్యార్థులు, నిపుణుల ఉపాధి సామర్థ్యాన్ని మెరుగుపరిచే ప్రయత్నంలో భాగంగా ప్రావీణ్య స్థాయిని అంచనా వేయడానికి, పరిశ్రమ గుర్తింపు పొందిన ధ్రువపత్రాలను అందించడానికి ఈ పరీక్షను ప్రతి నెలా నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎన్నిసార్లు అయినా పరీక్ష రాయవచ్చు. వయసు పరిమితి లేదు. పరీక్ష రుసుము రూ.799. నాలెడ్జ్, అప్లికేషన్ విభాగాల్లో సామర్థ్యాలను అంచనా వేస్తారు. ప్రస్తుతం బ్యాంకింగ్ మరియు ఆర్థిక సేవలు, డిజిటల్, తయారీ, అమ్మకాలు మరియు మార్కెటింగ్, మానవ వనరుల రంగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు తమ నైపుణ్యాన్ని కంపెనీలకు ప్రదర్శించడానికి, తద్వారా వారి కెరీర్ అవకాశాలను, అధిక జీతంతో ప్యాకేజీలను పొందే అవకాశాలను ఈ పరీక్షలు మెరుగుపరుస్తాయని ఇరు సంస్థలు భావిస్తున్నాయి. 'ఈ ఒప్పందం కేవలం అవగాహన మాత్రమే కాదు. ప్రతి భారతీయుడు వారి నైపుణ్యాలను అంచనా వేయడానికి, ధృవీకరించడానికి మెరుగైన ఉపాధి కోసం ఒక ఉద్యమానికి నాంది. తద్వారా పరిశ్రమ ప్రమాణాల అవసరాలు, అంచనాల ప్రకారం నేటి ప్రపంచంలో వారికి మరింత ఉపాధి లభించేలా చేస్తుంది. నైపుణ్య మదింపులను పరిశ్రమ అవసరాలతో సమలేఖనం చేయడం ద్వారా యువత ఉద్యోగానికి సిద్ధంగా ఉండటమే కాకుండా.. వారు ఎంచుకున్న రంగాలలో రాణించడానికి కూడా సన్నద్ధంగా ఉన్నారని మేము నిర్ధారించగలం' అని ఎన్ఎస్‌డీసీ సీఈవో వేద్ మణి తివారీ అన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

9-11-2024

విశాఖ	550–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	560–00
విజయవాడ	565–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	555–00
వరంగల్	557–00
రిటైల్ ధర	6.15

నేటి బోర్డు సమావేశాలు

ఏషియన్ పేయింట్స్, అరబిందో ఫార్మా, రిలయన్స్ కమ్యూనికేషన్స్, టీటీఎస్ ఎలక్ట్రానిక్స్, ఇండోరమ సింథటిక్స్, ఆంధ్రా పెట్రో, అతుల్ ఆటో, మవానా మగర్స్, బ్రూక్స్ ల్యాబ్స్, రాజ్ టెలివిజన్, డూమ్స్ ఇండస్ట్రీస్, డేటా ప్యాటర్న్స్

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,960.60	2.4
TITAN	3,183.00	1.99
TECHM	1,677.00	1.57
NESTLEIND	2,294.15	1.38
INFY	1,825.95	1.27

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	6,278.00	-3.5
COALINDIA	423.5	-2.72
ASIANPAINT	2,767.00	-2.67
TATASTEEL	147.3	-2.42
SBIN	841.1	-2.15

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,069
ఎన్ఎస్ఈ	1,00,043
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,72,896
ఎఫ్ఐఐ	- 3,404
డీఐఐ	+ 1,748

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.55	$ 72.36
బ్రెంట్	74.03	$ 75.63

గ్రామాల్లో రెట్టింపైన 'ఎఫ్ఎంసీజీ'

- పట్టణాల్లోనూ వినియోగం రికవరీ
- విలువ పరంగా 5.7 శాతం వృద్ధి
- సెప్టెంబర్ క్వార్టర్‌పై నీల్సన్‌ఐక్యూ నివేదిక



న్యూఢిల్లీ: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వినియోగ డిమాండ్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కోలుకున్నట్టు సమాచార విశ్లేషణా సంస్థ 'నీల్సన్‌ఐక్యూ' తెలిపింది. పరిమాణం పరంగా పట్టణ ప్రాంతాల వినియోగాన్ని గ్రామీణ ప్రాంత వినియోగం అధిగమించినట్టు వివరించింది. జూలై – సెప్టెంబర్ క్వార్టర్‌కు సంబంధించి ఎఫ్ఎంసీజీ రంగంపై నివేదికను విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూలై–సెప్టెంబర్ కాలంలో ఎఫ్ఎంసీజీ రంగం అమ్మకాల విలువ పరంగా 5.7 శాతం, పరిమాణం పరంగా 4.1 శాతం, ధరల పరంగా 1.5 శాతం వృద్ధిని చూసినట్టు పేర్కొంది. ''పట్టణ వినియోగంలో వృద్ధి 2.8 శాతంగా ఉంది. ఇదే కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ వృద్ధి 6 శాతంగా ఉంది. పట్టణాల కంటే పల్లెల్లో రెట్టింపు వృద్ధి నమోదైంది''అని నీల్సన్‌ఐక్యూ నివేదిక వెల్లడించింది. కొన్ని త్రైమాసికాల పాటు క్షీణత చూసిన చిన్న ఎఫ్ఎంసీజీ కంపెనీలు సెప్టెంబర్ క్వార్టర్‌లో తిరిగి పుంజుకున్నాయని, బడా ఎఫ్ఎంసీజీ కంపెనీలతో పోల్చితే ఆహారోత్పత్తులతో వేగవంతమైన వృద్ధిని (విలువ, పరిమాణం పరంగా) అందుకున్నట్టు వివరించింది. ఎఫ్ఎంసీజీ విక్రయాల్లో పట్టణ ప్రాంతాల వాటా 62–65 శాతంగా ఉంటే, మిగిలినది గ్రామీణ ప్రాంతాల నుంచి ఉంటుందని అంచనా. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలంతో పోల్చి చూస్తే, సెప్టెంబర్ క్వార్టర్‌లో అమ్మకాల పరిమాణంలోనూ మెరుగుదల ఉన్నట్టు నీల్సన్‌ఐక్యూ నివేదిక తెలిపింది.

హెచ్‌పీసీ విభాగంలో క్షీణత

''ఆహార వినియోగంలో వృద్ధి ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 2.1 శాతంగా ఉంటే, జూలై–సెప్టెంబర్ క్వార్టర్‌లో 3.4 శాతానికి పెరిగింది. వంట నూనెలు, ప్యాకేజ్డ్ గోధుమపిండి, దినుసులతో కూడిన స్టాపుల్స్ విభాగం ప్రధానంగా వృద్ధికి దోహదపడింది. హోమ్ అండ్ పర్సనల్ కేర్ విభాగంలో (హెచ్‌పీసీ) వినియోగ వృద్ధి 6 శాతానికి తగ్గింది. జూన్ క్వార్టర్‌లో ఇది 6.7 శాతంగా ఉంది''అని నీల్సన్‌ఐక్యూ నివేదిక వెల్లడించింది. టూత్‌పేస్ట్, చర్మ సంరక్షణ ఉత్పత్తులు, షాంపూలతో కూడిన హెచ్‌పీసీ విభాగం అమ్మకాల పరంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్థిరత్వం ఏర్పడినట్టు తెలిపింది. మొత్తం మీద ఎఫ్ఎంసీజీలో చిన్న, మధ్యస్థాయి, దిగ్గజ సంస్థల కంటే పెద్ద కంపెనీలు బలమైన పనితీరు చూపించినట్టు పేర్కొంది.



సెమీస్‌లో కిరణ్ జార్జి

ఇక్సాన్ సిటీ: కొరియా మాస్టర్స్ వరల్డ్ టూర్‌సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ప్లేయర్ కిరణ్ జార్జి సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 44వ ర్యాంకర్ కిరణ్ జార్జి 21-14, 21-16తో ప్రపంచ 34వ ర్యాంకర్, ఐదో సీడ్ టకుమా ఒబయాషి (జపాన్)పై గెలుపొందాడు. తద్వారా ఈ ఏడాది తొలిసారి ఓ అంతర్జాతీయ టోర్నీలో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. ఒబయాషిపై కిరణ్‌కిది వరుసగా మూడో విజయం కావడం విశేషం. నేడు జరిగే సెమీఫైనల్లో టాప్ సీడ్, ప్రపంచ మాజీ చాంపియన్ కున్లావుత్ వితిడ్‌సర్న్ (థాయ్‌లాండ్)తో కిరణ్ తలపడతాడు.

రుత్విక-రోహన్ జోడీ ముందంజ



సాక్షి, హైదరాబాద్: ఎస్‌ఎండీసీ తెలంగాణ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత జట్టు మాజీ సభ్యురాలు, తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గచ్చిబౌలిలోని కొటక్ పుల్లెల గోపీచంద్ అకాడమీలో ఈ టోర్నీ జరుగుతోంది. శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) ద్వయం 21-14, 14-21, 21-17తో భారత్‌కే చెందిన ధ్రువ్ రావత్-రాధిక శర్మ జోడీపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో తెలంగాణకు చెందిన కాటం తరుణ్ రెడ్డి, రుషీంద్ర తిరుపతి సెమీఫైనల్లోకి అడుగు పెట్టారు. క్వార్టర్ ఫైనల్స్‌లో రుషీంద్ర 21-9, 21-10తో సంస్కార్ సరస్వత్ (భారత్)పై, తరుణ్ రెడ్డి 22-20, 22-24, 21-15తో రవి (భారత్)పై గెలిచారు. మహిళల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి తామిరి సూర్య చరిష్మా పోరాటం క్వార్టర్ ఫైనల్లో ముగిసింది. సూర్య చరిష్మా 21-18, 16-21, 21-23తో రక్షిత శ్రీ (భారత్) చేతిలో పోరాడి ఓడిపోయింది. భారత నంబర్‌వన్ అన్‌మోల్ ఖరబ్, అనుపమా, ఇషారాణి కూడా సెమీఫైనల్లోకి ప్రవేశించారు. క్వార్టర్ ఫైనల్స్‌లో అన్‌మోల్ 16-21, 21-14, 21-19తో దేవిక (భారత్)పై, అనుపమ 21-18, 27-25తో శ్రేయా (భారత్)పై, ఇషారాణి 21-18, 17-21, 21-18తో మాన్సి (భారత్)లపై నెగ్గారు. పురుషుల డబుల్స్‌లో తెలంగాణకు చెందిన పంజాల విష్ణువర్ధన్ గౌడ్ తన భాగస్వామి ఎం.ఆర్. అర్జున్‌తో కలిసి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో విష్ణువర్ధన్ గౌడ్-అర్జున్ ద్వయం 21-11, 21-8తో గణేశ్ కుమార్-అర్జున్ (భారత్) జోడీపై గెలిచింది.

2028 ఒలింపిక్స్‌లో ఆడతా!

పీవీ సింధు స్పష్టీకరణ • ఫిట్‌గా ఉండటం ప్రధానమని వ్యాఖ్య


పీవీ సింధు

న్యూఢిల్లీ: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో పతకం అంచనాలతో బరిలోకి దిగినా... ప్రిక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. ఆ తర్వాత ఆడిన మూడు టోర్నీల్లో కూడా ఆమె విఫలమైంది. ఈ నేపథ్యంలో సింధు భవిష్యత్తుపై చర్చ నడుస్తోంది. అయితే తాను ఆటను ఇంకా ముగించలేదని సింధు స్పష్టం చేసింది. ఫిట్‌గా ఉంటే 2028లో లాస్ ఏంజెలిస్‌లో జరిగే ఒలింపిక్స్‌లోనూ పాల్గొంటానని స్పష్టం చేసింది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం గెలిచిన సింధు... 2020 టోక్యో క్రీడల్లో కాంస్యం సాధించింది. వచ్చే ఒలింపిక్స్ సమయానికి సింధుకు 33 ఏళ్లు నిండుతాయి. 'ఆ సమయానికి నేను ఫిట్‌గా, గాయాలు లేకుండా ఉంటే కచ్చితంగా లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతాను. ఇప్పుడైతే నా ఆలోచన ఇదే. కాబట్టి ప్రస్తుత నా లక్ష్యం పూర్తి స్థాయిలో ఫిట్‌గా ఉండేందుకు ప్రయత్నించడం. అప్పుడు సహజంగానే ఆడాలనే ప్రేరణ లభిస్తుంది. సరిగ్గా చెప్పాలంటే నాలో ఇంకా చాలా ఆట మిగిలి ఉంది. ఎంతో సాధించాలనే తపన ఉంది. మరిన్ని టైటిల్స్ గెలిచి పోడియం మీద నిలబడాలని భావిస్తున్నా.



నా ఆటతో భవిష్యత్ తరాలను స్ఫూర్తినివ్వాలని భావిస్తున్నా. అందుకోసం నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తా' అని సింధు పేర్కొంది. పారిస్‌లో ఓటమితో తానేమీ బాధ పడలేదని, పరాజయంతో ప్రపంచం ఆగిపోదని ఆమె అభిప్రాయ పడింది. 'నా కెరీర్‌లో రెండు ఒలింపిక్స్‌లు అద్భుతంగా సాగాయి. అయితే ప్రతీసారి అలా జరగదు. మూడోసారి పతకం గెలవలేకపోయా. నేను బాగానే ఆడానని అనుకుంటున్నా. అక్కడితో అంతా ముగిసిపోలేదు. తప్పుల నుంచి మనం పాఠాలు నేర్చుకుంటాం. కాబట్టి పారిస్ వైఫల్యంపై బాధ లేదు. అక్కడితో ప్రపంచం ఏమీ ఆగిపోదు' అని సింధు చెప్పింది. తన ఆట తీరు మెరుగుపర్చుకునే క్రమంలో మాజీ ఆటగాళ్లు లీ హ్యాన్, అనూప్ శ్రీధర్‌ల వద్ద ఆమె శిక్షణ తీసుకుంటోంది. కొన్ని సందర్భాల్లో మార్పు తప్పనిసరి అవుతుందని... అదే కారణంతో గత కోచ్‌ల వద్ద శిక్షణకు గుడ్‌బై చెప్పి కొత్త కోచ్‌లను ఎంచుకున్నట్లు సింధు వివరించింది. త్వరలో జరిగే జపాన్, చైనా ఓపెన్‌లపై దృష్టి పెట్టానని, మళ్లీ వరుస విజయాలు దక్కుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేసింది. 'ఇప్పుడు నేను శారీరకంగా, మానసికంగా మంచి స్థితిలో ఉన్నా. పూర్తి ఫిట్‌గా కూడా మారాను. స్పీడ్, డిఫెన్స్‌కు సంబంధించి కొన్ని లోపాలను సరిదిద్దుకునే పనిలో ఉన్నాను. కోచ్‌ల ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవడం ఎప్పుడూ బాగుంటుంది. వారి పర్యవేక్షణలో రాబోయే జపాన్, చైనా టోర్నీల్లో మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నా. అక్కడినుంచే మ్యాజిక్ మొదలవుతుంది. చూస్తూ ఉండండి' అని సింధు వ్యాఖ్యానించింది. విశాఖపట్నంలో తన బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణం పనులు ప్రారంభం అయ్యాయని... ప్రపంచ స్థాయి సౌకర్యాలతో రాబోయే ఏడాదిన్నర కాలంలో అది సిద్ధమవుతుందని సింధు వెల్లడించింది.



హంపికి ఐదో స్థానం

షిమ్‌కెంట్ (కజకిస్తాన్): అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నమెంట్‌లో భారత క్రీడాకారిణులు కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ సంయుక్తంగా ఐదో స్థానాన్ని దక్కించుకున్నారు. పది మంది మేటి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీ శుక్రవారం ముగిసింది. హంపి, దివ్య 4.5 పాయింట్ల చొప్పున సంపాదించారు. కాటరీనా లాగ్నో (రష్యా)తో జరిగిన గేమ్‌ను ప్రపంచ ఐదో ర్యాంకర్ హంపి 36 ఎత్తుల్లో... ఎలిజబెత్ పాట్జ్ (జర్మనీ)తో జరిగిన గేమ్‌ను దివ్య 48 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించారు. 7 పాయింట్లతో అలెగ్జాండ్రా గొర్యాక్‌చినా (రష్యా) ఈ టోర్నీలో విజేతగా నిలిచింది. టాన్ జోంగి (చైనా; 6.5 పాయింట్లు) రెండో స్థానంలో, బీబీసారా (కజకిస్తాన్; 5 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచారు.


అయాన్

పట్నా పైరేట్స్‌దే పైచేయి

జైపూర్ పింక్ పాంథర్స్‌పై 2 పాయింట్లతో విజయం

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్‌లో పట్నా పైరేట్స్ నాలుగో విజయం నమోదు చేసుకుంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన పోరులో పట్నా పైరేట్స్ 43-41 పాయింట్ల తేడాతో మాజీ విజేత జైపూర్ పింక్ పాంథర్స్‌పై నెగ్గింది. పట్నా తరఫున అయాన్ 14 పాయింట్లు, దేవాంక్ 11 పాయింట్లతో సత్తా చాటారు. జైపూర్ తరఫున అర్జున్ దేశ్వాల్ 20 పాయింట్లతో ఒంటరి పోరాటం చేశాడు. రెయిడింగ్‌లో ఇరు జట్లు సమంగానే నిలిచినా... డిఫెన్స్ విషయంలో మెరుగైన ప్రదర్శన కనబర్చిన పట్నా గెలిచింది. తాజా సీజన్‌లో 7 మ్యాచ్‌లు ఆడిన పట్నా 4 విజయాలు, 3 పరాజయాలు నమోదు చేసుకుంది. 22 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 39-26తో తమిళ్ తలైవాస్‌ను ఓడించింది. ఢిల్లీ తరఫున అశు మలిక్ 12 పాయింట్లతో చెలరేగగా... యోగేశ్ దహియా, ఆశిష్ మలిక్ చెరో 7 పాయింట్లు సాధించారు. తలైవాస్ తరఫున నరేందర్ (6 పాయింట్లు) మినహా తక్కినవాళ్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. నేటితో హైదరాబాద్‌లో పీకేఎల్ మ్యాచ్‌లు ముగియనున్నాయి. శనివారం పుణేరి పల్టన్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 8 గంటలకు), బెంగళూరు బుల్స్‌తో బెంగాల్ వారియర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.

ఆధిక్యం కోల్పోయిన హైదరాబాద్

- లొమ్రోర్, శుభమ్ సెంచరీలు
- రాజస్తాన్ 425 ఆలౌట్
- హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్ 36/0


శుభమ్


లొమ్రోర్

జైపూర్: పసలేని బౌలింగ్... ఫీల్డర్ల తడబాటు... వెరసి దేశవాళీ క్రికెట్ టోర్నీ రంజీ ట్రోఫీలో రాజస్తాన్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం చేజారింది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా జరుగుతున్న పోరులో మహిపాల్ లొమ్రోర్ (150 బంతుల్లో 111; 12 ఫోర్లు, 5 సిక్సర్లు), శుభమ్ గర్వాల్ (107 బంతుల్లో 108; 8 ఫోర్లు, 9 సిక్సర్లు) సెంచరీలు బాదడంతో రాజస్తాన్ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 117/1తో శుక్రవారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన రాజస్తాన్ చివరకు 108.2 ఓవర్లలో 425 పరుగులకు ఆలౌటైంది. ఐపీఎల్‌లో మంచి ఇన్నింగ్స్‌లతో గుర్తింపు తెచ్చుకున్న మహిపాల్ లొమ్రోర్ చక్కటి శతకం నమోదు చేసుకోగా... శుభమ్ గర్వాల్ విధ్వంసం సృష్టించాడు. హైదరాబాద్ బౌలర్ల భరతం పడుతూ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిపోయాడు. జుబైర్ అలీ (57; 7 ఫోర్లు) అర్ధశతకంతో ఆకట్టుకోగా... కెప్టెన్ దీపక్ హుడా (1), వికెట్ కీపర్ కునాల్ సింగ్ రాథోడ్ (9), దీపక్ చహర్ (5) విఫలమయ్యారు. ఆఖర్లో అరాఫత్ ఖాన్ (32; 4 ఫోర్లు, ఒక సిక్సర్) విలువైన ఇన్నింగ్స్ ఆడి రాజస్తాన్ జట్టుకు 15 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించి పెట్టాడు. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ 3... చామా మిలింద్, రోహిత్ రాయుడు చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 7 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 36 పరుగులు చేసింది. ఓపెనర్లు అభిరత్ రెడ్డి (28 బ్యాటింగ్; 4 ఫోర్లు), తన్మయ్ అగర్వాల్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. నేడు ఆటకు ఆఖరి రోజు కాగా... చేతిలో 10 వికెట్లు ఉన్న హైదరాబాద్ ఓవరాల్‌గా 21 పరుగుల ఆధిక్యంలో ఉంది. మ్యాచ్ 'డ్రా'గా ముగిస్తే తొలి ఆధిక్యం సాధించినందుకు రాజస్తాన్‌కు 3 పాయింట్లు, హైదరాబాద్‌కు ఒక పాయింట్ లభిస్తుంది.

స్కోరు వివరాలు

హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్: 410; **రాజస్తాన్ తొలి ఇన్నింగ్స్:** అభిజీత్ తోమర్ (బి) తనయ్ త్యాగరాజన్ 60; రామ్ చౌహాన్ (సి) రాహుల్ రాదేశ్ (బి) అజయ్‌దేవ్ గౌడ్ 11; మహిపాల్ లొమ్రోర్ (సి) రాహుల్ రాదేశ్ (బి) రక్షణ్ రెడ్డి 111; దీపక్ హుడా (సి) రాహుల్ రాదేశ్ (బి) చామా మిలింద్ 1; జుబైర్ అలీ (ఎల్బీ) (బి) తనయ్ త్యాగరాజన్ 57; శుభమ్ గర్వాల్ (సి) రాహుల్ సింగ్ (బి) చామా మిలింద్ 108; కునాల్ సింగ్ రాథోడ్ (ఎల్బీ) (బి) రోహిత్ రాయుడు 9; దీపక్ చహర్ (ఎల్బీ) (బి) రోహిత్ రాయుడు 5; అజయ్ సింగ్ (బి) తనయ్ త్యాగరాజన్ 13; అరాఫత్ ఖాన్ (సి) హిమతేజ (బి) అనికేత్ రెడ్డి 32; అనికేత్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 9, **మొత్తం (108.2 ఓవర్లలో ఆలౌట్) 425. వికెట్ల పతనం:** 1-27, 2-150, 3-169, 4-216, 5-285, 6-302, 7-334, 8-374, 9-405, 10-425. **బౌలింగ్:** చామా మిలింద్ 19-3-73-2, రక్షణ్ రెడ్డి 18-5-36-1, అజయ్‌దేవ్ గౌడ్ 15-1-65-1; తనయ్ త్యాగరాజన్ 25-2-104-3; రోహిత్ రాయుడు 18-5-65-2; అనికేత్ రెడ్డి 13.2-2-75-1.

హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్: తన్మయ్ అగర్వాల్ (బ్యాటింగ్) 8; అభిరత్ రెడ్డి (బ్యాటింగ్) 28; **మొత్తం (7 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 36. బౌలింగ్:** దీపక్ చహర్ 2-0-11-0, అజయ్ సింగ్ 3-0-14-0, దీపక్ హుడా 1-0-6-0, మహిపాల్ లొమ్రోర్ 1-0-5-0.

ఫైనల్లో కిన్‌వెన్ జెంగ్



రియాద్: మహిళల టెన్నిస్ సంఘం ముగింపు టోర్నమెంట్ డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో చైనా స్టార్ కిన్‌వెన్ జెంగ్ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో ప్రపంచ ఏడో ర్యాంకర్ కిన్‌వెన్ జెంగ్ 6-3, 7-5తో క్రెజికోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. తాజా విజయంతో డబ్ల్యూటీఏ ఫైనల్స్ టోర్నీలో 11 ఏళ్ల తర్వాత ఫైనల్‌కు చేరిన తొలి చైనా క్రీడాకారిణిగా జెంగ్ గుర్తింపు పొందింది. 2013లో నా లీ ఈ టోర్నీలో ఫైనల్‌కు చేరుకొని సెరెనా విలియమ్స్ (అమెరికా) చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. క్రెజికోవాతో గంటా 40 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో కిన్‌వెన్ తొమ్మిది ఏస్‌లు సంధించింది. క్రెజికోవా సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. సబలెంకా (బెలారస్), కోకో గాఫ్ (అమెరికా) మధ్య రెండో సెమీఫైనల్ మ్యాచ్ విజేతతో నేడు జరిగే ఫైనల్లో జెంగ్ తలపడుతుంది.


ఆంధ్ర లక్ష్యం 321

- ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ 146 ఆలౌట్
- ఉత్తరాఖండ్ రెండో ఇన్నింగ్స్ 128/9 డిక్లేర్డ్
- స్టీఫెన్, శశికాంత్‌లకు మూడేసి వికెట్లు


స్టీఫెన్

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీలో వరుస పరాజయాలతో సతమతమవుతున్న ఆంధ్ర జట్టు... ఉత్తరాఖండ్‌తో మ్యాచ్‌లోనూ పేలవ ప్రదర్శన కనబరుస్తోంది. ఇప్పటికే ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన ఆంధ్ర జట్టు... నాలుగో మ్యాచ్‌లోనూ పరాజయం దిశగా సాగుతోంది. ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో 321 పరుగుల లక్ష్యఛేదనలో ఆంధ్ర జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 4.1 ఓవర్లలో వికెట్ నష్టపోయి 8 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ రెడ్డి (6) అవుట్ కాగా... హేమంత్ రెడ్డి (2 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. చేతిలో 9 వికెట్లు ఉన్న ఆంధ్ర జట్టు విజయానికి 313 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 92/4తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర జట్టు 56.3 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌటైంది. హనుమ విహారి (91 బంతుల్లో; 43; 6 ఫోర్లు) ఒక్కడే ఫర్వాలేదనిపించగా.. మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఉత్తరాఖండ్ 49 ఓవర్లలో 128/9 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. స్వప్నిల్ సింగ్ (39; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్. కెప్టెన్ రవికుమార్ సమర్థ్ (1), అఖిల్ రావత్ (0), ప్రియాన్షు ఖండూరి (4), యువరాజ్ (13), ఆదిత్య తారె (10) విఫలమయ్యారు. ఆంధ్ర బౌలర్లలో చీపురుపల్లి స్టీఫెన్, కేవీ శశికాంత్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు.

కెప్టెన్‌తో వాగ్వాదం
విండీస్ పేసర్ జోసెఫ్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం



బ్రిడ్జ్‌టౌన్: వెస్టిండీస్ క్రికెట్ బోర్డు (సీడబ్ల్యూఐ) తమ పేసర్ అల్జారి జోసెఫ్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. ఫీల్డ్‌లో కెప్టెన్ షై హోప్ తన బౌలింగ్‌కు అనుగుణంగా ఫీల్డర్లను మోహరించకపోవడంపై నిరసిస్తూ అల్జారి ఉన్నపళంగా మైదానాన్ని వీడాడు. అంతకంటే ముందు ఫీల్డింగ్ విషయమై ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇది క్రమశిక్షణా రాహిత్యమని విండీస్ బోర్డు జోసెఫ్‌పై రెండు మ్యాచ్‌ల సస్పెన్షన్ విధించింది. బుధవారం రాత్రి జరిగిన ఆఖరి వన్డే సందర్భంగా జోసెఫ్ వేసిన నాలుగో ఓవర్ సమయంలో ఈ వివాదం చోటు చేసుకుంది. చాలా సేపు ఇద్దరు వాదులాడుకోవడం మైదానంలో చర్చనీయాంశమైంది. 'ఇది విండీస్ నియమావళికి విరుద్ధం. అతని ప్రవర్తనను ఏమాత్రం ఉపేక్షించబోం. అందుకే క్రమశిక్షణ చర్యలు తీసుకున్నాం' అని సీడబ్ల్యూఐ డైరెక్టర్ మైల్స్ బాస్కొంబ్ తెలిపారు. అయితే తన అనుచిత ప్రవర్తన పట్ల అల్జారీ విచారం వ్యక్తం చేశాడు. కెప్టెన్ సహా జట్టు సహచరులు, బోర్డుకు అతను క్షమాపణలు చెప్పాడు.

రఫ్ఫాడించిన రవూఫ్

- 5 వికెట్లతో మెరిసిన పాక్ పేసర్
- అదరగొట్టిన బ్యాటర్ అయూబ్
- రెండో వన్డేలో ఆస్ట్రేలియాపై 9 వికెట్లతో నెగ్గిన పాకిస్తాన్


రవూఫ్

అడిలైడ్: ఆస్ట్రేలియాపై ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన పాకిస్తాన్ రెండో వన్డేలో 9 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. శుక్రవారం జరిగిన ఈ పోరులో హారిస్ రవూఫ్ (8-0-29-5) నిప్పులు చెరిగిన బౌలింగ్, ఓపెనర్లు సయీం అయూబ్ (71 బంతుల్లో 82; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), అబ్దుల్లా షఫీక్ (69 బంతుల్లో 64 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీలు హైలైట్‌గా నిలిచాయి. టాస్ నెగ్గిన పాకిస్తాన్ ఫీల్డింగ్ ఎంచుకోగా ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 35 ఓవర్లలో 163 పరుగులకే ఆలౌటైంది. స్మిత్ (48 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్) ఒక్కడే మూడు పదుల స్కోరు దాటాడు. షాహీన్ అఫ్రిది 3 వికెట్లు తీశాడు. వికెట్ కీపర్ రిజ్వాన్ ఈ మ్యాచ్‌లో ఆరు క్యాచ్‌లు పట్టాడు. తర్వాత సులువైన లక్ష్యాన్ని పాక్ 26.3 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 169 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు అయూబ్, షఫీక్ తొలి వికెట్‌కు 20.2 ఓవర్లలో 137 పరుగులు జోడించారు. జంపా ఎట్టకేలకు అయూబ్‌ను అవుట్ చేసి భాగస్వామ్యాన్ని విడగొడితే... మిగతా లాంఛనాన్ని షఫీక్, బాబర్ ఆజమ్ (20 బంతుల్లో 15 నాటౌట్; 1 సిక్స్) పూర్తి చేశారు.



జార్ఖండ్‌లోని లోహర్‌దాగాలో శుక్రవారం ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఈ సందర్భంగా స్థానిక గిరిజన మహిళలతో కలిసి ఉత్సాహంగా ఇలా చిందేశారు



ఉత్తరప్రదేశ్‌లోని మథుర జిల్లాలో ఉన్న శ్రీకృష్ణుడి జన్మస్థలం బృందావన్‌లో శుక్రవారం శ్రీ రామకృష్ణ బలరాం రథయాత్ర నిర్వహించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో విదేశీ భక్తులు, స్థానికులతో నృత్యం చేశారు.

మణిపూర్‌ను మంటల్లోకి నెట్టేసింది

మతం పేరుతో ప్రజల్ని విభజిస్తోంది
- గిరిజనుల నుంచి జల్, జంగల్, జమీన్‌ను లాగేసుకోవాలనుకుంటోంది
- బీజేపీపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ ధ్వజం

లోహర్‌దాగా/సిందెగా(జార్ఖండ్): కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ బీజేపీపై విమర్శలను తీవ్రతరం చేశారు. కాషాయ పార్టీ మణిపూర్‌కు మంటపెట్టిందని, దేశ ప్రజలను మతం ప్రాతిపదికగా విభజించేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. దేశంలోని 90 శాతం మంది ప్రజల హక్కులు, ప్రయోజనాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. రాహుల్ శుక్రవారం జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీల్లో పాల్గొని, ప్రసంగించారు. 'బీజేపీ హిందువులు, ముస్లింలు, క్రైస్తవులను ఒకరిపై మరొకరిని ఉసిగొల్పుతోంది. ఇటీవల హరియాణాలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో జాట్లు, జాట్‌యేతరుల మధ్య చిచ్చు పెట్టింది. ఇదే బీజేపీ నైజం'అని అన్నారు. ప్రజల మధ్య విద్వేషాలకు బదులు ప్రేమను పెంచేందుకే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. 'దళితులు, గిరిజనుల కోసం గళం వినిపించినప్పుడల్లా దేశాన్ని విభజిస్తున్నానంటూ నాపై బీజేపీ విమర్శలు చేస్తోంది. కానీ, నేను దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు, బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నా. దేశం జనాభాలో 90 శాతం ఉన్న గిరిజనులు, దళితులు, ఓబీసీలకు పాలనలో భాగస్వామ్యం కోసం మాట్లాడటమే తప్పయినట్లయితే, ఇకపైనా ఇదే పనిని కొనసాగిస్తా'అని రాహుల్ అన్నారు.

రిజర్వేషన్లపై పరిమితి ఎత్తివేస్తాం

అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. జార్ఖండ్‌లో అధికారంలోకి వస్తే ఎస్టీల రిజర్వేషన్లను 26 శాతం నుంచి 28 శాతానికి, ఎస్సీల కోటాను 10 నుంచి 12 శాతానికి, ఓబీసీలకు 14 నుంచి 27 శాతానికి రిజర్వేషన్లను పెంచుతామన్నారు. కులగణనతో గిరిజనులు, దళితులు, ఓబీసీల ప్రాతినిధ్యం తగు రీతిలో పెరుగుతుందని చెప్పారు.

బీజేపీ రైతు రుణాలు మాఫీ చేసిందా?

యూపీఏ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు తీసుకున్న రూ.72 వేల కోట్ల రుణాలను మాఫీ చేసిందంటూ విమర్శలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం..దేశంలోని 25 మంది పారిశ్రామికవేత్తలు తీసుకున్న రూ.16 లక్షల కోట్ల రుణాలను రద్దు చేసిందని రాహుల్ చెప్పారు. 'జార్ఖండ్‌లోని రైతుల రుణాలను బీజేపీ ప్రభుత్వం మాఫీ చేసిందా? లేదు.. ఎందుకంటే మీరంతా గిరిజనులు, దళితులు, ఓబీసీలు కాబట్టి. పెట్టుబడిదారుల రుణాలను రద్దు చేసిన బీజేపీ ప్రభుత్వం మీరు తీసుకున్న అప్పులను మాత్రం మాఫీ చేయదు'అని ఎద్దేవా చేశారు. గిరిజన ప్రజల నుంచి నీరు, భూమి, అడవి(జల్, జంగల్, జమీన్)ని లాగేసుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది'అని ఆయన ఆరోపించారు.

ఇది సైద్ధాంతిక పోరాటం

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలను ఇండియా కూటమి, బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌ల మధ్య జరుగుతున్న సైద్ధాంతిక పోరుగా రాహుల్ అభివర్ణించారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌ల లక్ష్యం దేశ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడమే, ఇండియా కూటమి లక్ష్యం రాజ్యాంగ పరిరక్షణే అన్నారు. జలం, అడవి, భూమి తమవేనని కాషాయ పార్టీ, ఆర్‌ఎస్‌ఎస్, పెట్టుబడిదారులు భావిస్తున్నారు..అందుకే, ప్రధాని మోదీ గిరిజనులను వనవాసీలంటూ సంబోధిస్తున్నారని ఆరోపించారు.

లక్కీ కారుకు సమాధి

ఘనంగా చేయించిన గుజరాత్ వ్యాపారి

అమ్రేలి: గుజరాత్‌కు చెందిన ఓ వ్యాపారి తనకు, తన కుటుంబానికి సంపద, పేరు తెచ్చిన లక్కీ కారును ఘనంగా సమాధి చేశారు. అమ్రేలి జిల్లా లాఠీ తాలూకా పదార్‌సింగ్ గ్రామం ఇందుకు వేదికైంది. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మిక నాయకులు, సాధువులు సహా 1,500 మంది హాజరయ్యారు. ఫాంహౌస్‌లో సుమారు 15 అడుగుల లోతు గుంతలో ఉన్న వాగన్ ఆర్ కారు, సంజయ్ పొలారా, అతని కుటుంబం పూజలు చేస్తున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. అంతకుముందు, పూలు, పూల దండలతో అందంగా అలంకరించిన కారును పొలారా కుటుంబీకులు బాజాభజంత్రీలతో గ్రామంలోని తమ ఇంటి నుంచి ఊరేగింపుగా ఫాంహౌస్‌లోని తీసుకువచ్చారు. అక్కడున్న ఏటవాలు నిర్మాణం మీదుగా గుంతలోకి దింపారు. కారుపై పచ్చని వస్త్రాన్ని కప్పారు. పూజారులు మంత్రాలు చదువుతుండగా పొలారా, కుటుంబసభ్యులు కారుపై పూలు చల్లుతూ పూజలు చేశారు. చివరగా బుల్డోజర్ కారును మట్టితో సమాధి చేసేసింది.

ఒకే ఒక్క బీడీ.. తీసింది నిండు ప్రాణం!

న్యూఢిల్లీ: ఒక్క బీడీ కోసం ఇద్దరి మధ్య జరిగిన గొడవ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. దేశరాజధాని ఢిల్లీలోని షాహ్‌దరా ప్రాంతంలో ఈ దారుణం చోటుచేసుకుంది. కస్తూర్బా నగర్‌కు చెందిన సన్నీ(20) గురువారం జ్వాలానగర్‌కు చెందిన రాజేశ్ శ్మశానవాటిక సమీపంలో కలుసుకున్నారు. ఆ సమయంలో సన్నీ బీడీ ఇవ్వాలని రాజేశ్‌ను కోరాడు. ఈ విషయం ఇద్దరి మధ్యా వాగ్వాదానికి దారి తీసింది. తీవ్ర కోపోద్రిక్తుడైన రాజేశ్ పెద్ద బండరాయితో సన్నీ తలపై మోదాడు. దీంతో, సన్నీ అక్కడికక్కడే నేలకూలడంతో రాజేశ్ పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వచ్చి చూడగా సన్నీ రక్తపు మడుగులో విగతజీవిగా కనిపించాడు. సన్నీ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించిన పోలీసులు, పరారీలో ఉన్న రాజేశ్‌ను శుక్రవారం పట్టుకున్నారు. విచారణలో అతడు నేరం అంగీకరించాడని పోలీసులు తెలిపారు. కాగా, సన్నీ మైనర్‌గా ఉన్నప్పుడే హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడని, అతడిపై ఆయుధాల చట్టం కేసు కూడా ఉందని వివరించారు.

అమెరికా పోలీసుల కోతుల వేట

పోలీసులేంటి? కోతులను వెదకడమేంటని? ఆశ్చర్యపోకండి. అవి మామూలు కోతులు కాదు. పరిశోధన కేంద్రం నుంచి తప్పించుకున్నవి. సౌత్ కరోలినాలోని ఎమసీ పట్టణంలో ఓ రీసెర్చ్ ఫెసిలిటీ సెంటర్ ఆల్ఫా జెనెసిస్ ఉంది. ఇక్కడ వైద్య పరీక్షలు, పరిశోధనల కోసం కోతులను పెంచుతుంటారు. ప్రస్తుతం సంస్థలో 50 కోతులున్నాయి. అయితే బుధవారం దేశమంతా ఎన్నికల హడావిడిలో ఉండగా.. కోతులు మాత్రం తప్పించుకున్నాయి. బయటి ఎన్‌క్లోజర్ తలుపులు తెరిచి ఉండటంతో 43 కోతులు బయటికి పారిపోయాయని అధికారులు వెల్లడించారు. తప్పించుకున్నాయని, ప్రజలంతా తమ ఇళ్ల తలుపులు, కిటికీలను సురక్షితంగా మూసివేయాలని, ఎక్కడైనా కోతులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. తప్పించుకున్నవి 3.2 కిలోల బరువున్న ఆడ కోతులని పోలీసులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాటి దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయొద్దని సూచించారు. అయితే వర్షం పడుతుండటంతో గాలింపు చర్యలకు కొంత అంతరాయం ఏర్పడింది. కోతులు ఫెసిలిటీలో ఆపిల్స్ వంటి ఆహారాన్ని తిని పెరిగాయని, అడవిలో ఆకులు, అలములు తప్ప ఏమీ దొరకవు కాబట్టి అవి తిరిగి వచ్చే అవకాశం ఉందని ఆల్ఫా జెనెసిస్ సీఈఓ గ్రెగ్ వెస్టర్‌గార్డ్ చెబుతున్నారు. ఈ కేంద్రం నుంచి కోతులు తప్పించుకోవడం ఇదే మొదటిసారి కాదు. 2016లో 19 కోతులు తప్పించుకుని ఆరు గంటల తర్వాత తిరిగొచ్చాయి. రెండేళ్ల కిందట 26 కోతులు తప్పించుకున్నాయి.

\- సాక్షి, నేషనల్ డెస్క్

రాహుల్ భావితరాలు కూడా.. ఆర్టికల్ 370ని పునరుద్ధరించలేవు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా



సాంగ్లి (మహారాష్ట్ర): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఆయన వారసులు కూడా జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370 పునరుద్ధరించలేరని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. అది వారి వల్ల కాదన్నారు. సాంగ్లిలో మహాయుతి తరఫున శుక్రవారం అమిత్ షా ప్రచారంలో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రతిపత్తి పునరుద్ధరించాలని సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం బుధవారం జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయం తెలిసిందే. దీనికి కాంగ్రెస్ మద్దతు నివ్వడంతో అమిత్ షా హస్తం పార్టీని లక్ష్యంగా చేసుకున్నారు. ఆర్టికల్ 370 రద్దును విపక్ష నేతలు రాహుల్ గాంధీ, ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్‌లు వ్యతిరేకించారని షా గుర్తు చేశారు. 'ఛత్రపతి శివాజీ మహారాజ్ గడ్డపై నుంచి చెబుతున్నా.. రాహుల్ బాబా. మీరు లేదా మీ నాలుగోతరం వారసులు కూడా ఆర్టికల్ 370ని పునరుద్ధరించలేరు. కశ్మీర్ కోసం దేశంలోని ప్రతి వ్యక్తి పోరాటానికి సిద్ధంగా ఉన్నారు'అని అమిత్ షా అన్నారు. 'ఆర్టికల్ 370ని రద్దు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయం తీసుకున్నపుడు పార్లమెంటులో నేనా బిల్లును ప్రవేశపెట్టాను. రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, శరద్ పవార్, అఖిలేశ్ యాదవ్, ఎంకే స్టాలిన్‌లు దీన్ని వ్యతిరేకించారు. దీనివల్ల కశ్మీర్ లోయలో రక్తపాతం జరుగుతుందన్నారు. రక్తం ప్రవహించడం మాట అటుంచితే కనీసం రాయి విసిరే సాహసం కూడా ఎవరూ చేయలేదు'అని అమిత్ షా పేర్కొన్నారు. యూపీఏ హయాంలో తరచూ ఉగ్రదాడులు జరిగేవి. ఉరి, పుల్వామా ఘటనల తర్వాత చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్‌తో పాకిస్తాన్‌లోని తీవ్రవాదులు తుడిచిపెట్టుకుపోయారని ఆయన అన్నారు. 70 ఏళ్లుగా అయోధ్యలో రామమందిరం నిర్మాణాన్ని కాంగ్రెస్ అడ్డుకుందని ఆరోపించారు. మోదీ ప్రయత్నాల వల్ల అది సాకారమైందని అమిత్ షా అన్నారు.

సాటానిక్ వెర్సెస్‌ను తెప్పించుకోవచ్చు

నిషేధ ఉత్తర్వులు లభ్యం కావట్లేదు • ఢిల్లీ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: సల్మాన్ రష్దీ రచించిన సాటానిక్ వెర్సెస్‌ను భారతీయులు నిరభ్యంతరంగా దిగుమతి చేసుకోవచ్చని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ పుస్తకాన్ని నిషేధిస్తూ జారీ అయిన ఉత్తర్వుల ప్రతి ఏదీ అందుబాటులో లేనందువల్ల మూడు దశాబ్దాల నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. నిషేధం విధిస్తూ జారీ అయిన ఉత్తర్వులేవీ అందుబాటులో లేవని కేంద్ర ప్రభుత్వం చెప్పిన విషయాన్ని పిటిషనర్ సందీపన్ ఖాన్ కోర్టు దృష్టికి తేవడంతో ఢిల్లీ హైకోర్టు పైవిధంగా స్పందించింది. సాటానిక్ వెర్సెస్ నవలను దిగుమతి చేసుకోలేమని, అమ్మలేమని బుక్‌స్టోర్స్ చెప్పడంతో.. నిషేధ ఉత్తర్వుల కోసం సందీపన్ ప్రభుత్వ వెబ్‌సైట్లలో వెతికారు. ఎక్కడా ఈ ఉత్తర్వుల కాపీ లభించకపోవడంతో 2019లో ఢిల్లీ హైకోర్టులో కేసు వేశారు. 'సాటానిక్ వెర్సెస్‌ను భారత్‌లో నిషేధిస్తున్నట్లు జారీ అయిన ఉత్తర్వు కాపీలేవీ అందుబాటులో లేనందువల్ల.. అసలు దానిపై నిషేధమే లేదని భావించడం తప్ప మాకు మరో మార్గం కనిపించడం లేదు'అని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వును రచించిన కస్టమ్స్ అధికారి సైతం దాని కాపీని అందజేయలేనని అశక్తతను వ్యక్తం చేయడం గమనార్హం.

అమెరికా నుంచి వెళ్లిపోతా..

ఇక్కడ భవిష్యత్ కనిపించడం లేదు

ట్రంప్ గెలిచిన తరువాత ఎలన్ మస్క్ కుమార్తె వివియన్ ప్రకటన



వాషింగ్టన్: అమెరికాలో భవిష్యత్ కనిపించడం లేదని, దేశాన్ని వీడి వెళ్తానని ఎలన్ మస్క్ ట్రాన్స్‌జెండర్ కుమార్తె వివియన్ విల్సన్ ప్రకటించారు. 2022 నుంచి తండ్రికి దూరంగా ఉంటున్న వివియన్.. ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన తరువాత మెటా థ్రెడ్స్‌లో తన ఆలోచనలను పంచుకున్నారు. ''నేను కొంతకాలంగా ఈ విషయం మీద ఆలోచిస్తున్నా. నిన్నటిరోజును చూశాక నిర్ణయం తీసుకున్నాను. నేను అమెరికాలో ఉండేలా భవిష్యత్ కనిపించడం లేదు''అని రాసుకొచ్చారు. దీనిపై మస్క్ స్పందించారు. ''మైండ్ వైరస్ నా కొడుకును చంపేసింది''అని మరోసారి ట్వీట్ చేశారు.

నేను అలసిపోయాను..

మళ్లీ.. తన తండ్రి పోస్ట్ స్క్రీన్ షాట్‌ను థ్రెడ్స్‌లో షేర్ చేస్తూ.. ''మీరు ఇప్పటికీ నా బిడ్డ ఏదో ఒక వ్యాధి బారిన పడ్డారంటున్నారు. మీరు నన్ను ద్వేషించడానికి పూర్తిగా కారణం అదే. దయచేసి దాని జోలికి పోవద్దు. ప్రతి సన్నివేశంలో నేను బాధితురాలిని తప్ప మరేమి కాదు. నేను అలసిపోయాను. నాకు విసుగ్గా ఉంది''అని ఆమె జత చేశారు. ఆ తరువాత మరో పోస్ట్‌లో... ఒకరిపై అధికారం కోల్పోయాననే తన తండ్రి అలా పిచ్చిగా మాట్లాడుతున్నారని వివియన్ పేర్కొన్నారు. ''వ్యక్తిగా పరిణితి చెందని మీరు భ్రమలో ఉన్నారు, ఒకరి మీద నియంత్రణ కోల్పోయాననే కలతతో ఉన్నారు. మీరెలాంటివారో మీ చుట్టుపక్కల ప్రతి ఒక్కరికీ తెలుసు. అది నా సమస్య కాదు''అని ఆమె తెలిపారు.

ఆయన ఓడిపోవడం ఖాయం

ట్రూడో భవిష్యత్‌పై ఎలన్ మస్క్ జోస్యం



వాషింగ్టన్: 2025 అక్టోబర్ లేదా అంతకంటే ముందే జరగబోయే ఎన్నికల్లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఓటమి ఖాయమని బిలియనీర్ ఎలన్ మస్క్ జోస్యం చెప్పారు. ప్రస్తుత కెనడా ప్రధానిని పదవి నుంచి తొలగించడానికి తమకు సహాయం చేయమని ఒక నెటిజన్ ఎక్స్‌లో అభ్యర్థించగా, స్పందించిన మస్క్.. వచ్చే ఎన్నికల తరువాత ఆయనే వెళ్లిపోతారని ట్వీట్ చేశారు. 'జర్మన్ సోషలిస్టు సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయింది. ఇప్పుడు ఎన్నికలు జరుగుతాయి'అని ఓ స్వీడిష్ జర్నలిస్ట్ జర్మన్ ప్రభుత్వానికి సంబంధించిన అప్‌డేట్ షేర్ చేయడంతో సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. దీనిపై స్పందించిన మస్క్.. జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్‌ను మూర్ఖుడిగా అభివర్ణించారు. దీనికి ఎక్స్‌లో ఓ యూజర్ స్పందిస్తూ.. 'ట్రూడోను వదిలించుకోవడానికి కెనడాకు మీ సహాయం కావాలి''అని మస్క్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. ట్రూడోపై మస్క్ విమర్శలు చేయడం ఇదే తొలిసారి కాదు. కెనడాలో జస్టిన్ ట్రూడో ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేస్తోందని మస్క్ గతంలో విమర్శించారు. ఆన్లైన్ స్ట్రీమింగ్ సర్వీసుల 'రెగ్యులేటరీ కంట్రోల్స్'కోసం అధికారికంగా ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకోవడాన్ని కెనడా ప్రభుత్వం గత ఏడాది తప్పనిసరి చేసింది. దీంతో కెనడాలో భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేసేందుకు ట్రూడో ప్రయత్నిస్తున్నారని మస్క్ వ్యాఖ్యానించారు. అంతకుముందు, 2022 ఫిబ్రవరిలో ట్రూడో అత్యవసర అధికారాలను ఉపయోగించినప్పుడు.. మస్క్ అతన్ని అడాల్ఫ్ హిట్లర్‌తో పోల్చడం గమనార్హం.

సల్మాన్‌కు మళ్లీ బెదిరింపు

కర్ణాటక వాసి ఫోన్ నుంచి వచ్చినట్లు గుర్తించిన పోలీసులు

ముంబై: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు మరోసారి బెదిరింపు అందింది. రూ.5 కోట్లివ్వకుంటే సల్మాన్‌ను చంపుతామంటూ ముంబై పోలీసుల వాట్సాప్ నంబర్‌కు గురువారం మెసేజీ అందింది. 'లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్. రూ.5 కోట్లు ఇవ్వకుంటే సల్మాన్ ఖాన్‌ను చంపేస్తా'అని హిందీలో ఉంది. అంతేకాదు, త్వరలో విడుదల కానున్న సల్మాన్ నటించిన 'సికందర్'సినిమాలో 'మై సికందర్ హూ..'అనే పాటను రాసిన వ్యక్తిని కూడా నెల రోజుల్లో చంపుతా అంటూ అందులో హెచ్చరించాడు. ఆ పాటలో లారెన్స్ బిష్ణోయ్ ప్రస్తావన ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన ముంబై పోలీసులు బెదిరింపు మెసేజీ కర్ణాటకకు చెందిన విక్రమ్ దసర్ పేరుతో రిజిస్టరైన సెల్ ఫోన్ నుంచి వచ్చినట్లు గుర్తించారు. అతడిని పట్టుకునేందుకు పోలీసు బృందమొకటి కర్ణాటకకు వెళ్లింది. గత కొన్ని వారాలుగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో సల్మాన్ ఖాన్‌కు పలుమార్లు హెచ్చరికలు అందడం తెలిసిందే.

కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లాలో జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. సోపార్ ప్రాంతంలోని పానీపొరాలో ఉగ్రవాదుల కదలికలపై సమాచారం అందుకున్న బలగాలు గురువారం రాత్రి నుంచి కార్డన్‌సెర్చ్ కొనసాగిస్తున్నాయి. అధికారులు ముందుగా ఆ ప్రాంతం నుంచి ప్రజలను ఖాళీ చేయించారు. శుక్రవారం ఉదయం భద్రతాబలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ముష్కరులు మృతి చెందారు. మృతుల వివరాలు, వారు ఏ ఉగ్ర సంస్థకు చెందిన వారో తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కశ్మీర్ జోన్ పోలీసులు తెలిపారు.



శుక్రవారం 97వ బర్త్ డే జరుపుకున్న బీజేపీ దిగ్గజ నేత లాల్ కృష్ణ అద్వానీకి ఢిల్లీలోని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రధాని మోదీ

ఎంపీ తేజస్వీ సూర్యపై కేసు

రైతు ఆత్మహత్యపై తప్పుడు ఆరోపణలు చేశారని ఎఫ్ఐఆర్

బెంగళూరు: బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్యపై కేసు నమోదైంది. రైతు ఆత్మహత్యకు వక్ఫ్ భూముల సమస్యతో సంబంధం ఉందంటూ తప్పుడు సమాచారాన్ని పంచుకున్నందుకు ఎంపీతో పాటు కన్నడ న్యూస్ పోర్టల్స్ ఎడిటర్లు ఇద్దరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తన భూమిని వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకోవడంతో కర్ణాటకలోని హావేరి జిల్లాకు చెందిన రుద్రప్ప చెన్నప్ప బాలికై అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని సూర్య తన పోస్టులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, మంత్రి బిజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్‌లు రాష్ట్రంలోని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సూర్య ఆరోపించారు.

అయితే.. రుణ భారం, పంట నష్టంతో 2022 జనవరిలో రైతు ఆత్మహత్య చేసుకున్నారని హావేరి పోలీసు సూపరింటెండెంట్ స్పష్టం చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది. అసహజ మరణాల దర్యాప్తు ప్రక్రియ కింద తుది నివేదిక సమర్పించిన తర్వాత కేసును ఇప్పటికే మూసేసినట్లు పోలీసులు తెలిపారు. రైతు భూమిని వక్ఫ్ భూమిగా రికార్డుల్లో నమోదు చేయడం వల్లనే అతను ఆత్మహత్య చేసుకున్నాడనే శీర్షికతో వార్తను ప్రచురించినందుకు గాను.. కన్నడ దునియా ఈ-పేపర్, కన్నడ న్యూస్ ఈ-పేపర్ ఎడిటర్లపైనా ఎఫ్ఐఆర్ నమోదైంది. హావేరిలో రైతులు వక్ఫ్ నోటీసులకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నారని, ఇది రుద్రప్పను మానసిక క్షోభకు గురిచేసిందని ఆ వార్తా కథనం పేర్కొంది.

ముగ్గురు మావోయిస్టులు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. బిజాపూర్ జిల్లా పామేడు పోలీస్‌స్టేషన్ పరిధి రేఖపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ బలగాలు గాలింపు చేపట్టాయి. శుక్రవారం ఉదయం రేఖపల్లి-కోమటపల్లి అటవీ ప్రాంతంలో తారసపడిన మావోయిస్టులు కాల్పులకు దిగడంతో పోలీసులు సైతం కాల్పులు జరిపారు. గంట పాటు హోరాహోరీగా సాగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలి నుంచి ఒక ఎస్ఎల్ఆర్, ఒక స్నైపర్ తుపాకీ, ఒక 12 బోర్ రైఫిల్, ఒక మజిల్ లోడింగ్ రైఫిల్, గ్రెనేడ్ లాంచర్ తూటాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

సాక్షి ప్లస్
శనివారం । 9-11-2024

విధాన పరిషత్‌ను రద్దు చేసే అధికారం ఎవరికి ఉంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ




మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో భారత రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగం కాని అంశం ఏది?
   1) సమన్యాయ పాలన
   2) పార్లమెంటరీ ప్రభుత్వం
   3) లౌకికతత్వం
   4) ఆర్థిక అత్యవసర పరిస్థితి
2. భారత సమాఖ్య విధానానికి ఆధారమైన రాజ్యాంగాన్ని ఏ దేశం నుంచి తీసుకున్నారు?
   1) స్విట్జర్లాండ్ 2) అమెరికా
   3) కెనడా 4) బ్రిటన్
3. అధికరణ 141 దేని గురించి తెలుపుతుంది?
   1) సుప్రీంకోర్టులో జడ్జీల నియామకం
   2) సుప్రీంకోర్టు నిర్మాణం
   3) సుప్రీంకోర్టు ప్రకటించిన తీర్పులను దేశంలో అన్ని న్యాయస్థానాలు పాటిం చాలి
   4) సుప్రీంకోర్టు జడ్జీల జీతభత్యాలు
4. పార్లమెంటు రాష్ట్ర జాబితాపై కింద పేర్కొన్న ఏయే పరిస్థితుల్లో చట్టాలు చేయవచ్చు?
   a) రాజ్యసభ ఒక ప్రత్యేక తీర్మానం చేసినప్పుడు
   b) రాష్ట్రాలు కోరినప్పుడు
   c) జాతీయ అత్యవసర పరిస్థితి విధించినప్పుడు
   d) సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు
   1) a, c 2) a, b, c, d
   3) a, b, c 4) a, b
5. ఒక రాష్ట్రంలోని విధాన పరిషత్‌ను రద్దు చేసే అధికారం ఎవరికి ఉంది?
   1) ఆ రాష్ట్ర గవర్నర్ 2) భారత రాష్ట్రపతి
   3) భారత పార్లమెంట్ 4) ఆ రాష్ట్ర కేబినెట్
6. కింది వాటిలో రాష్ట్ర గవర్నర్ కార్యనిర్వహణాధికారం కానిది ఏది?
   1) రాష్ట్ర ఆర్థిక సంఘం ఏర్పాటు
   2) రాష్ట్ర అడ్వకేట్ జనరల్ నియామకం
   3) ఆంగ్లో ఇండియన్స్ నియామకం
   4) రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ నియామకం
7. రాష్ట్ర మానవ హక్కుల చైర్మన్‌ను తొలగించే అధికారం ఎవరికి ఉంది?
   1) ఆ రాష్ట్ర శాసనసభకు
   2) ఆ రాష్ట్ర గవర్నర్‌కు
   3) భారత రాష్ట్రపతికి
   4) భారత పార్లమెంట్‌కు
8. సమాజాభివృద్ధి పథకానికి సంబంధించి కింది వాటిలో సరికాని అంశం ఏది?
   a) వి.టి. కృష్ణమాచారి సిఫారసుల ప్రకారం దీన్ని ప్రవేశపెట్టారు
   b) 1952 అక్టోబర్ 2న ఈ పథకాన్ని ప్రారంభించారు
   c) అమెరికాకు చెందిన 'ఫోర్డ్ ఫౌండేషన్' సహకారం అందించింది
   d) స్వాతంత్ర్యానంతరం పట్టణాల అభివృద్ధి కోసం ప్రారంభమైన పథకం
   1) a, b, c 2) a, b, c, d
   3) a, b 4) d మాత్రమే
9. జిల్లా యూనిట్‌గా ప్రణాళికా అభివృద్ధి జరగాలని సూచించిన కమిటీ ఏది?
   1) దంత్‌వాలా కమిటీ
   2) హనుమంతరావు కమిటీ
   3) జి.వి.కె. రావు కమిటీ
   4) ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ
10. కింది వాటిలో భారత రాజ్యాంగం లక్షణాల్లో లేనిది ఏది?
    1) లిఖిత రాజ్యాంగం
    2) రాజ్యాంగాధిక్యత
    3) నిబద్ధ న్యాయశాఖ
    4) అధికారాల పంపిణీ
11. భారతదేశ పరిస్థితులకు సరిపోయే సమాఖ్య విధానం ఏది?
    1) బేరమాడే సమాఖ్య విధానం
    2) కేంద్రీయ సమాఖ్య విధానం
    3) సహకార సమాఖ్య విధానం
    4) సంఘర్షణ సమాఖ్య విధానం
12. కార్యనిర్వాహకశాఖకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించిన రాజ్యాంగం ఏది?
    1) అమెరికా రాజ్యాంగం
    2) బ్రిటిష్ రాజ్యాంగం
    3) భారత రాజ్యాంగం
    4) స్విట్జర్లాండ్ రాజ్యాంగం
13. కింది వాటిలో భారత రాజ్యాంగానికి సంబంధించి ఏకకేంద్ర లక్షణాలు కానివి?
    a) అధికరణ-275 ప్రకారం గ్రాంట్ల విడుదల
    b) ఆర్థిక సంఘం ఏర్పాటు
    c) అధికరణలు-200, 201
    d) రాజ్యాంగ ఆధిక్యత
    e) రెండు సభల విధానం
    1) c, d, e 2) d, e
    3) b, d, e 4) b, e
14. ఒక రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పదవీ విరమణానంతరం చేపట్టే పదవులకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
    1) యూపీఎస్సీ చైర్మన్‌గా పనిచేయవచ్చు
    2) యూపీఎస్సీ సభ్యుడిగా పనిచేయవచ్చు
    3) ప్రభుత్వ ఉద్యోగం చేయరాదు
    4) పైవన్నీ సరైనవే
15. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు సంబంధించి కింది వాటిలో సరైన అంశాలు ఏవి?
    a) కాగ్ జీతభత్యాలను పార్లమెంట్ నిర్ణయిస్తుంది
    b) ఈయన జీతభత్యాలను రాష్ట్రపతి నిర్ణయిస్తాడు
    c) కాగ్‌గా పనిచేసిన వ్యక్తి పదవీ విరమణా నంతరం ఏ ఉద్యోగం చేయరాదు
    d) రాష్ట్రపతి నియమిస్తాడు
    e) ఈ పదవిని బ్రిటిష్ రాజ్యాంగం నుంచి స్వీకరించారు
    1) a, b, c 2) a, b, c, d, e
    3) a, c, d, e 4) b, c, d, e
16. శాసనసభలు రూపొందించే సాధారణ చట్టాల కంటే సర్వోన్నతమైనవి అని వేటిని అంటారు?
    1) ప్రాథమిక విధులు 2) ఆదేశిక సూత్రాలు
    3) ప్రాథమిక హక్కులు 4) పైవన్నీ
17. అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లో కోర్టులో హాజరు పరచాలి. ఈ నిబంధన వర్తించని సందర్భాలు ఏవి?
    1) అరెస్టయిన వ్యక్తి శత్రుదేశాలకు చెందిన వారైతే
    2) ప్రివెంటివ్ డిటెన్షన్ కింద అరెస్టయితే
    3) కోర్టు ఉత్తర్వుల మేరకు అరెస్టయితే
    4) పైవన్నీ
18. అంతరంగిక భద్రత చట్టం (MISA) ఎప్పుడు రూపొందించారు?
    1) 1974 2) 1971
    3) 1980 4) 1985
19. కింది వాటిని జతపరచండి.
    జాబితా- I (చట్టం)
    a) కనీస వేతనాల చట్టం
    b) వెట్టిచాకిరి నిరోధ చట్టం
    c) వన్యమృగ సంరక్షణ చట్టం
    d) గనుల చట్టం
    జాబితా- II (సంవత్సరం)
    i) 1976 ii) 1948
    iii) 1952 iv) 1972
    1) a- ii, b-i, c- iv, d- iii
    2) a- i, b-iii, c- ii, d- iv
    3) a- iv , b-ii, c-iii, d- i
    4) a- iii, b- iv, c -ii, d- i
20. 'అల్ప సంఖ్యాక వర్గాల వారి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు వాటికి చట్టప్రకారం నష్టపరిహారం ఇవ్వాలి' అని ఏ నిబంధన వివరిస్తుంది?
    1) 30 (1) 2) 30 (2)
    3) 30 (1) ఎ 4) 30(1) బి
21. ఒక పబ్లిక్ పదవిని పొందడానికి ఒక వ్యక్తికి హక్కుగానీ, అర్హతగానీ లేదని కోర్టు భావించినప్పుడు జారీ చేసే రిట్ ఏది?
    1) మాండమస్ 2) కో వారంటో
    3) ప్రొహిబిషన్ 4) సెర్షియోరరీ
22. నిర్దేశిక నియమాలను రాజ్యాంగం ఎవరికి సమర్పించింది?
    1) పౌరులకు 2) సమాజానికి
    3) రాజ్యానికి 4) విదేశీయులకు
23. 'పేదలకు ఉచిత న్యాయం' అందించాలని ఎక్కడ పొందుపర్చారు?
    1) ప్రాథమిక విధులు
    2) ఆదేశిక సూత్రాలు
    3) ప్రాథమిక హక్కులు 4) ప్రవేశిక
24. నిరుద్యోగులను, వృద్ధులను రాజ్యం ఆదుకోవాలని ఏ అధికరణలో ప్రస్తావించారు?
    1) అధికరణ-43 2) అధికరణ-41
    3) అధికరణ-42 4) ఏదీకాదు
25. 'ఆదేశిక సూత్రాలను ప్రజలకు బాధ్యత వహించే ఏ మంత్రివర్గం విస్మరించ లేదు' అని వ్యాఖ్యానించిన వారెవరు?
    1) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
    2) కె. సంతానం 3) ఐవర్ జెన్నింగ్స్
    4) టి.టి. కృష్ణమాచారి
26. 'నష్ట పరిహారమంటే న్యాయమైన నష్ట పరిహారం' అని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెప్పింది?
    1) శంకరీప్రసాద్ వర్సెస్ కేంద్ర ప్రభుత్వం (1951)
    2) బెల్లా బెనర్జీ వర్సెస్ పశ్చిమ బెంగాల్ (1954)
    3) కామేశ్వర్ సింగ్ వర్సెస్ బిహార్ కేసు (1951)
    4) సజ్జన్ సింగ్ వర్సెస్ రాజస్థాన్ కేసు (1964)
27. మాతృభాషలోనే ప్రాథమిక విద్యను అందించాలని రాజ్యాంగంలోని ఏ అధికరణ తెలియజేస్తోంది?
    1) 351 ఏ 2) 350 ఏ
    3) 350 బి 4) 351 బి
28. కేంద్ర రాష్ట్రాల మధ్య పరిపాలనా సంబంధాలను వివరిస్తున్న అధికరణలు?
    1) 256 నుంచి 263 వరకు
    2) 256 నుంచి 264 వరకు
    3) 255 నుంచి 263 వరకు
    4) 255 నుంచి 264 వరకు
29. ఒక విషయాన్ని అక్కడితో వదలి వేయడానికి పార్లమెంటులో ప్రవేశపెట్టే ప్రతిపాదన?
    1) అనుషంగిక ప్రతిపాదన
    2) అధిక్రమణ ప్రతిపాదన
    3) సవరణ ప్రతిపాదన
    4) ముగింపు ప్రతిపాదన
30. పార్లమెంటులో విజ్ఞాపన కమిటీకి సంబంధించి సరైన అంశాలను గుర్తించండి.
    1) ఈ కమిటీలో లోక్‌సభలోని 15 మంది, రాజ్యసభలోని 10 మంది సభ్యులు ఉంటారు
    2) ఈ కమిటీని అంబుడ్స్‌మన్ లేదా నిఘా కమిటీ అంటారు
    3) కమిటీ చైర్మన్‌లను ఆయా సభాధ్యక్షులే నియమిస్తారు
    4) పైవన్నీ సరైనవే
31. న్యాయశాఖ సామర్థ్యాన్ని బట్టి ప్రజా స్వామ్యం మనుగడ ఆధారపడి ఉంటుందని పేర్కొన్న వారెవరు?
    1) లార్డ్ రిప్పన్ 2) లార్డ్ బ్రైస్
    3) గెటిల్ 4) ఏవీ డైసీ
32. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య ఎంత?
    1) ఒక ప్రధాన న్యాయమూర్తి, ఏడుగురు ఇతర న్యాయమూర్తులు
    2) ఒక ప్రధాన న్యాయమూర్తి, 8 మంది ఇతర న్యాయమూర్తులు
    3) ఒక ప్రధాన న్యాయమూర్తి, 9 మంది ఇతర న్యాయమూర్తులు
    4) ఒక ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు ఇతర న్యాయమూర్తులు
33. బ్రిటిష్ ఇండియాలో సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1773 2) 1774
    3) 1775 4) 1772
34. 'పార్లమెంటరీ కవల పిల్లలు' అని ఏ రెండు కమిటీలను పిలుస్తారు?
    1) అంచనాల కమిటీ, ప్రభుత్వ ఖాతాల సంఘం
    2) ప్రభుత్వ ఖాతాల సంఘం, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ
    3) అంచనాల కమిటీ, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ
    4) ప్రభుత్వ హామీల సంఘం, అంచనాల సంఘం
35. కొత్తగా సుప్రీంకోర్టు 'బెంచ్‌లను' ఏర్పాటు చేసే అధికారం ఎవరికి ఉంది?
    1) భారత రాష్ట్రపతి
    2) భారత పార్లమెంట్
    3) భారత సుప్రీంకోర్టు
    4) కేంద్ర కేబినెట్
36. కింది వాటిలో సాధారణ మెజారిటీతో పార్లమెంట్ సవరించే అంశాలు ఏవి?
    1) విధానమండలి ఏర్పాటు, రద్దు (అధికరణ 169)
    2) పార్లమెంటు సభ్యుల జీతాలు పెంచుకోవడం (అధికరణ 106)
    3) పౌరసత్వానికి సంబంధించిన మార్పులు (అధికరణలు 5 నుంచి 11 వరకు)
    4) పైవన్నీ
37. కింది వాటిలో పార్లమెంట్ ప్రత్యేక మెజార్టీతో పాటు సగం రాష్ట్రాలు సాధారణ మెజార్టీతో ఆమోదించే అంశాలు ఏవి?
    a) జాబితాలను మార్చడం (అధికరణ 246)
    b) రాష్ట్రపతి ఎన్నిక విధానాన్ని మార్చడం (54, 55 నిబంధనలు)
    c) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్య నిర్వాహణాధికారాలు
    d) పార్లమెంటులోని రాజ్యసభ సీట్లు మార్చడం (నాలుగో షెడ్యూల్)
    e) సుప్రీంకోర్టు, హైకోర్టు అధికారాలు మార్చడం (ఐదో భాగంలోని 4, 5 అధ్యాయాలు)
    1) a, b, c 2) a, b, c, d, e
    3) a, b, c, d 4) b, c, d, e

సమాధానాలు

1) 4	2) 3	3) 3	4) 3	5) 3
6) 3	7) 3	8) 4	9) 3	10) 3
11) 3	12) 1	13) 2	14) 4	15) 3
16) 3	17) 4	18) 2	19) 1	20) 3
21) 2	22) 3	23) 2	24) 2	25) 1
26) 2	27) 2	28) 1	29) 2	30) 4
31) 2	32) 2	33) 2	34) 1	35) 2
36) 4	37) 2			

విమర్శనాత్మక, నిర్ణయ శక్తిని పెంపొందించే పద్ధతి?



టెట్/డీఎస్సీ ప్రత్యేకం

సాంఘిక శాస్త్రం

బోధనా పద్ధతులు

మూలాధార పద్ధతి

సాంఘిక అధ్యయన విషయాలకు సంబంధించిన మూలాధారాలను, ప్రాథమిక వనరులను ప్రత్యక్షంగా చూపిస్తూ బోధించే విధా నాన్ని మూలాధార పద్ధతి అంటారు.

ఉపన్యాస ప్రదర్శన పద్ధతి	మూలాధార పద్ధతి
1. తరగతి నాలుగు గోడలమధ్య ఎక్కువగా ఉపయోగించుకోవచ్చు	1. తరగతి గది లోపల, వెలుపల కూడా ఉపయోగిస్తారు.
2. నమూనాలు ఎక్కువగా ఉపయోగిస్తారు	2. మాతృకలు ఎక్కువగా ఉపయోగించాలి
3. దాదాపుగా అన్ని పాఠ్యాంశాలు బోధించడానికి ఉపయోగించవచ్చు.	3.చరిత్ర పాఠ్యాంశాలు బోధించడానికి ఎక్కువగా ఉపయోగిస్తారు.

మూలాధారాల వర్గీకరణ

I. పురావస్తు సంబంధ ఆధారాలు

చిరస్మారకాలు

- కోటలు: ఎర్రకోట, గోల్కొండకోట, ఆగ్రా కోట, జైపూర్ ప్యాలెస్, ఫతేపూర్ సిక్రీ.
- భవనాలు/ కట్టడాలు: తాజ్‌మహల్, చార్మినార్ వేయి స్తంభాల గుడి, బృహదీశ్వరాలయం

శాసనాలు

- రాతి శాసనాలు
- ఇనుప శాసనాలు
- రాగిఫలకల మీద లేఖనాలు
  ఉదా: సాంచీ స్తూపం, సారనాథ్ స్తూపం, అమరావతి స్తూపం.
- భారతదేశంలో తొలి శిలా శాసనాలు చేయించింది: **అశోకుడు**
- భారతదేశంలో తొలి సంస్కృత శాసనం: (జునాఘడ్/గిర్నార్ శాసనం)- శకరుద్ర దామన్
- అలహాబాద్ శాసనం: **సముద్రగుప్తుడి మంత్రి హరిసేనుడు**
- నానాఘట్ శాసనం: **మొదటి శాతకర్ణి భార్య నాగానిక**
- నాసిక్ శాసనం: **గౌతమీపుత్ర శాతకర్ణి తల్లి గౌతమి బాలశ్రీ**
- హథిగుంఫా శాసనం: **కళింగరాజు ఖారవేలుడి శాసనం**
- ఉత్తర మెరూర్ శాసనం: **మొదటి పరాంతకుడి శాసనం.**
  చోళుల గ్రామ పరిపాలన గురించి తెల్పుతుంది.
- మోటుపల్లి అభయశాసనం: **గణపతిదేవుడు (కాకతీయరాజు)**
- మెహరౌలి ఇనుప స్తంభ శాసనం: **రెండో చంద్రగుప్తుడు**
- ఎర్రగుడి, గాజుల మందగిరి శాసనాలు: **ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో లభించిన అశోకుని శాసనాలు**
- మస్కిశాసనం (కర్ణాటక): **అశోకుని పేరుతో ఉన్న ఏకైక శాసనం**
- ఎరాన్ శాసనం: **బుధగుప్తుడి శాసనం. సతీ సహ గమనం గురించి తెలియజేసే తొలి శాసనం.**
- కళిమెళ్ల శాసనం: **తొలి తెలుగు గద్య శాసనం. క్రీ.శ. 575లో రేనాటి చోళరాజు ధనుంజయుడు వేయించాడు**
- అద్దంకి శాసనం: **తొలి తెలుగు పద్యశాసనం. తూర్పు చాళుక్యరాజు గుణగ విజయాదిత్యుడి కాలంలో వేయించారు.**

చారిత్రక కట్టడాలు	నిర్మాతలు
పాటలీపుత్రం	అజాతశత్రువు
సుదర్శన తటాకం (గుజరాత్)	చంద్రగుప్త మౌర్యుడు
కాశ్మీర్‌లోని శ్రీనగర్ నిర్మాత సాంచీ, బార్హుత్ స్తూపాలు, సారనాథ్ స్తంభం	అశోకుడు
నాగార్జున విశ్వవిద్యాలయం	ఆచార్య నాగార్జున
మెహరౌళి ఉక్కుస్తంభం	రెండో చంద్రగుప్తుడు
రాతి రథాలు (పంచపాండవ రథాలు)	మొదటి నరసింహవర్మ (పల్లవులు)
గోమతేశ్వర విగ్రహం (శ్రావణ బెళగోళ)	చాళుక్యరాజులు (రాచమల్లు మంత్రి చాముండరాయలు)
తంజావూర్ బృహదీశ్వరాలయం	మొదటి రాజరాజు(చోళులు)
ఎల్లోరా కైలాస గుహాలయాలు	మొదటి కృష్ణుడు (రాష్ట్రకూటులు)
గంగైకొండ చోళపురం	మొదటి రాజేంద్ర చోళుడు
హన్మకొండ వేయి స్తంభాల గుడి	రుద్రదేవుడు
పాలంపేట రామప్పగుడి	రేచర్ల రుద్రుడు (కాకతీయులు)
ఇబాదత్ ఖానా, ఫతేపూర్ సిక్రీ, బులందర్వాజా, ఆగ్రాకోట, పంచమహల్, రాణిజోధ్‌బాయ్ భవనం	అక్బర్
తాజ్‌మహల్, ఎర్రకోట, జమామసీదు, నెమలి సింహాసనం	షాజహాన్
ససరామ్‌లోని షేర్షా సమాధి, ఢిల్లీలోని పురానఖిలా	షెర్షా
గుల్బర్గా మసీదు	బహమనీ (ఫిరోజ్ షా)
చార్మినార్	మహమ్మద్ కులీకుతుబ్‌షా
బేలూరు, హళబీడు దేవాలయాలు	హోయసాలులు
శ్రీరంగం, చిదంబరం, రామేశ్వరంలోని దేవాలయాలు	పాండ్యులు

భారతదేశంలో నాణేలు:

రాజులు ఉపయోగించిన రాగి, వెండి నాణేలు

- తొలి నాణేలు: **విద్ధంక నాణేలు**
- తొలిసారి వెండి నాణేలు ప్రవేశపెట్టింది: **కుషాణులు**
- తొలిసారి బంగారు నాణేలు ప్రవేశపెట్టింది: **గుప్తులు**
- రాగి నాణేలు ప్రవేశపెట్టింది: **ఢిల్లీ సుల్తాను మహమ్మద్ బిన్ తుగ్లక్**
- వీణ వాయిస్తున్న బొమ్మలున్న నాణేలు: **సముద్రగుప్తుడు**
- ఓడబొమ్మ ఉన్న నాణేలు: **యజ్ఞశ్రీ శాతకర్ణి**
- ప్రతిముద్రిత నాణేలు: **గౌతమీపుత్ర శాతకర్ణి**

II. లిఖిత ఆధారాలు:

మత వాఙ్మయం:

1. వేదాలు 2. రామాయణం
3. భారతం 4. త్రిపీఠకాలు

లౌకిక వాఙ్మయం:

1. కాళిదాసు నాటకాలు
2. కౌటిల్యుని అర్థశాస్త్రం
3. కల్హణుని రాజతరంగిణి
4. పాణిని 'అష్టధ్యాయి'
5. బాణుడి హర్షచరిత్ర

విదేశీ రచనలు: మెగస్తనీస్ రాసిన ఇండికా

ఇతర రచనలు: రాజప్రతులు, ఉత్తరాలు, రికార్డులు, నివేదికలు, దినచర్య పుస్తకాలు, వార్తాపత్రికలు

III. మౌఖిక సంప్రదాయాలు

1. జానపద విజ్ఞానం 2. పూర్వ గాథలు
3. ఆచారాలు 4. సంప్రదాయాలు

మూలాధారాలను తిరిగి రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

ప్రాథమిక ఆధారాలు: వీటినే మౌలిక ఆధారాలు అంటారు. ఇవి ప్రత్యక్ష అనుభవాలను కల్పిస్తాయి. రాజ్యాంగ ఉత్తర్వులు, అధికార పత్రాలు, వాణిజ్య పత్రాలు, ఒడంబడికలు, అధికారిక ఆజ్ఞలు, న్యాయశాఖ నిర్ణయాలు, చిరస్మరకాలు, శాసనాలు, స్వీయ జీవిత చరిత్రలు వీటికి ఉదాహరణ.

గౌణ ఆధారాలు: వీటినే ద్వితీయ పక్ష ఆధారాలు అంటారు. ఇవి ప్రత్యక్షంగా పాల్గొనని వారి కథనాలు (పరోక్ష సాక్షుల కథనాలు). వార్తా పత్రికలు, మ్యాగజీన్‌లు, జీవిత చరిత్రలు వీటికి ఉదాహరణ.

మూలాధారాలు ఉపయోగించే విధానం:

- పాఠానికి ముందు ఉపయోగించడం
- పాఠం తర్వాత ఉపయోగించడం
- పాఠ్యాంశం మధ్యలో ఉపయోగించడం
- నియోజిత పఠనం
- స్వయం ప్రేరిత పఠనం
- సమస్యా పరిష్కార మార్గం
- మూలాధారాల దగ్గరకి విద్యార్థులను తీసుకెళ్లడం

ప్రయోజనాలు

- చరిత్ర పట్ల విద్యార్థులకు వాస్తవిక దృక్ప థాన్ని కలిగించవచ్చు.
- మూలాధారాలు విశ్వసనీయమైనవి. సాక్షి స్వభావం కలిగి ఉంటాయి.
- వెనుకబడిన విద్యార్థులకు కుతూహలం కలిగిస్తాయి.
- సాంఘిక అధ్యయన పరిశోధనలో విద్యార్థులకు అనుభవం కలిగించవచ్చు.

పరిమితులు/ లోపాలు

- విలువైన వనరులు అందుబాటులో లేవు
- భాషాపరమైన ఇబ్బంది.భారతీయ విద్యార్థులకు పరభాషలైన అరబిక్, పార్శి భాషల్లో ఉన్న సమాచారం చదవడం కష్టం.
- సమకాలీన గ్రంథకర్తల్లో విభిన్న అభిప్రాయాలు.
- కాలయాపనతో కూడుకున్నవి
- ఖర్చుతో కూడుకున్నవి.

మాదిరి ప్రశ్నలు

1. నిగమన, ఆగమన ప్రక్రియల ద్వారా బోధనను చేపట్టే పద్ధతి?
   1) ప్రయోగాత్మక పద్ధతి
   2) పర్యవేక్షితాధ్యయనం
   3) ప్రాజెక్టు పద్ధతి 4) సమస్యా పద్ధతి
2. కిందివాటిలో విద్యార్థులకు ప్రాచీన సంస్కృతిని గురించి ప్రత్యక్ష అవగాహనను కలిగించేది ఏది?
   1) ప్రాచీన సంస్కృతిపై నిపుణుల ఉప న్యాసాలు
   2) శిలాశాసనాలు 3) చారిత్రక గ్రంథాలు
   4)ప్రాచీన సంస్కృతికి సంబంధించిన చిత్రాల ఆల్బమ్
3. ఏ పద్ధతిలో విద్యార్థి క్రియాశీలత జ్ఞాన రంగానికే పరిమితమైంది?
   1) ప్రాజెక్టు పద్ధతి 2) కథన పద్ధతి
   3) ఉపన్యాస పద్ధతి 4) సమస్యా పద్ధతి

సమాధానాలు

1) 4 2) 2 3) 3

2002 డీఎస్సీలో అడిగిన ప్రశ్నలు

1. మోరిసన్ రూపొందించిన బోధనా ప్రణాళిక సోపాన క్రమం?
   1) వ్యవస్థీకరణ - సాంశీకరణ - ప్రదర్శన - పునఃపఠన - అన్వేషణ
   2) ప్రదర్శన - సాంశీకరణ - అన్వేషణ - వ్యవస్థీకరణ - పునఃపఠన
   3) అన్వేషణ - వ్యవస్థీకరణ - ప్రదర్శన - సాంశీకరణ - పునఃపఠన
   4) అన్వేషణ - ప్రదర్శన - సాంశీకరణ - వ్యవస్థీకరణ - పునఃపఠన
2. విమర్శనాత్మక, నిర్ణయ శక్తిని పెంపొందించే పద్ధతి?
   1) సమస్యా పద్ధతి
   2) మూలాధార పద్ధతి
   3) ఉపన్యాస పద్ధతి
   4) సామాజీకృత కథన పద్ధతి
3. 'సాంఘిక పరిసరాల్లో హృదయ పూర్వకంగా, ఉద్దేశ పూర్వకంగా కొనసాగే ఒక కార్యకలాపమే ప్రాజెక్ట్' అని నిర్వచించిన వారు?
   1) బైనింగ్ 2) స్టీవెన్ సన్
   3) కిల్‌పాట్రిక్ 4) బిల్లార్డ్
4. తపాలా బిళ్లలు అనే పాఠ్య బోధనకు అనువైన బోధన పద్ధతి?
   1) సమస్యా పద్ధతి
   2) పర్యవేక్షిత అధ్యయన పద్ధతి
   3) చర్చా పద్ధతి 4) ప్రాజెక్టు పద్ధతి
5. సరళత నుంచి సంక్లిష్టత, మూర్తము నుంచి అమూర్తము, నిర్దిష్టత నుంచి సాధారణత మొదలైన సూత్రాల ఉపయోగం?
   1) బోధకుడి ఎంపికకు
   2) బోధనా వ్యూహం ఎంపికకు
   3) బోధనా పరికరాల తయారీకి
   4) మూల్యాంకన విధాన రూపకల్పనకు
6. విషయాన్ని వివరంగా పరిశీలించడానికి అవలంబించే ఒక కార్యక్రమమే?
   1) చర్చ 2) సమస్య
   3) ఫలితం 4) ప్రక్రియ
7. ఏ బోధన పద్ధతికి మాడరేటర్ ఆవశ్యకత ఉంది?
   1) జట్టు బోధన 2) సమస్యా పద్ధతి
   3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
8. జీవిస్తూ నేర్చుకోవాలి అనే సూత్రంపై ఆధారపడి రూపొందించిన పద్ధతి?
   1) జట్టు బోధన 2) చర్చ
   3) సమస్యా పరిష్కారం 4) ప్రాజెక్టు
9. జాన్ డ్యూయి సమస్యా పరిష్కార పద్ధతిలో రూపొందించిన సోపానాల క్రమం?
   1) భోగట్టా సేకరించడం, అధ్యయనం - నిశ్చిత అభిప్రాయాలకు రావడం - సమస్యను నిర్వహించడం - సమస్యా విశ్లేషణ, పరికల్పన రూపకల్పన
   2) సమస్యా విశ్లేషణ, పరికల్పన రూప కల్పన - సమస్యను నిర్వచించడం - నిశ్చిత అభిప్రాయాలకు రావడం - భోగట్టా సేకరించడం, అధ్యయనం
   3) సమస్యను నిర్వచించడం - సమస్యా విశ్లేషణ, పరికల్పన రూపకల్పన - భోగట్టా సేకరించడం, అధ్యయనం - నిశ్చిత అభిప్రాయాలకు రావడం
   4) నిశ్చిత అభిప్రాయాలకు రావడం - భోగట్టా సేకరించడం, అధ్యయనం - సమస్యా విశ్లేషణ, పరికల్పన రూప కల్పన - సమస్యను నిర్వచించడం

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3; 4) 4; 5) 2;
6) 1; 7) 4; 8) 4; 9) 3.

వేములవాడ చాళుక్యుల మొదటి రాజధాని?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

చాళుక్య యుగం

1. విష్ణుకుండినుల అనంతరం తెలంగాణ బాదామీ చాళుక్యుల పాలనలోకి వచ్చిందని పరిశోధనాత్మకంగా నిరూపించింది?
   1) డాక్టర్ డి. రాజారెడ్డి 2) బి.ఎస్.శాస్త్రి
   3) డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి
   4) బిరుదురాజు రామరాజు
2. బాదామీ చాళుక్య వంశ తొలి రాజు?
   1) జయసింహవల్లభుడు
   2) రణరాగుడు
   3) మొదటి పులకేశి
   4) రెండో పులకేశి
3. బాదామీ చాళుక్య వంశంలో తొలి స్వతంత్ర పాలకుడు?
   1) జయసింహవల్లభుడు
   2) రణరాగుడు 3) మొదటి పులకేశి
   4) రెండో పులకేశి
4. రెండో పులకేశి ఎవరిని సంహరించి రాజ్యానికి వచ్చాడు?
   1) కీర్తివర్మ 2) మంగళేశుడు
   3) మొదటి పులకేశి 4) రణరాగుడు
5. రెండో పులకేశి రాజ్యానికొచ్చిన కాలం?
   1) క్రీ.శ. 606 2) క్రీ.శ. 608
   3) క్రీ.శ. 612 4) క్రీ.శ. 610
6. రెండో పులకేశి వేయించిన హైదరాబాద్ శాసన కాలం?
   1) క్రీ.శ. 606 2) క్రీ.శ. 608
   3) క్రీ.శ. 612 4) క్రీ.శ. 610
7. రెండో పులకేశి ఎవరి కొడుకు?
   1) మొదటి కీర్తివర్మ 2) మంగళేశుడు
   3) చంద్రాదిత్యుడు 4) రణరాగుడు
8. ఎవరి వారసులను తూర్పు చాళుక్యులంటారు?
   1) కుబ్జ విష్ణువర్ధనుడు 2) మంగళేశుడు
   3) రణరాగుడు 4) మొదటి పులకేశి
9. ఎవరి వారసులను బాదామీ చాళుక్యులు అంటారు?
   1) మొదటి కీర్తివర్మ 2) మంగళేశుడు
   3) మొదటి పులకేశి 4) రెండో పులకేశి
10. బాదామీ చాళుక్య చివరి చక్రవర్తి?
    1) రెండో కీర్తివర్మ 2) రణరాగుడు
    3) మొదటి విక్రమాదిత్యుడు
    4) చంద్రాదిత్యుడు
11. రెండో కీర్తివర్మను రాష్ట్రకూట రాజైన దంతిదుర్గుడు ఓడించిన సంవత్సరం?
    1) క్రీ.శ. 750 2) క్రీ.శ. 751
    3) క్రీ.శ. 753 4) క్రీ.శ. 755
12. దేవాలయ నిర్మాణ పద్ధతిలో 'దక్కన్‌శైలి' ఎవరి కాలంలో అభివృద్ధి చెందింది?
    1) విష్ణుకుండినులు
    2) బాదామీ చాళుక్యులు
    3) రాష్ట్రకూటులు
    4) వేములవాడ చాళుక్యులు
13. దక్షిణాది దేవాలయ నిర్మాణ పద్ధతి?
    1) చతురస్రం
    2) చతురస్రం - చతురస్రం
    3) శిఖరం 4) దీర్ఘచతురస్రం
14. ఉత్తరాది దేవాలయ నిర్మాణ పద్ధతి?
    1) చతురస్రం
    2) చతురస్రం - స్తూపం
    3) శిఖరం 4) దీర్ఘచతురస్రం
15. బాదామీ చాళుక్యుల దేవాలయ నిర్మాణ పద్ధతి?
    1) చతురస్రం - చతురస్రం
    2) శిఖరం
    3) చతురస్రం 4) మిశ్రమం
16. గద్వాల సంస్కృత శాసన కాలం?
    1) క్రీ.శ. 670 2) క్రీ.శ. 674
    3) క్రీ.శ. 680 4) క్రీ.శ. 684
17. రాష్ట్రకూటులు ఎవరి సామంతులు?
    1) విష్ణుకుండినులు 2) శాతవాహనులు
    3) బాదామీ చాళుక్యులు 4) ఇక్ష్వాకులు
18. రాష్ట్రకూట వంశ మూలపురుషుడు?
    1) మొదటి ఇంద్రరాజు
    2) మొదటి గోవిందవర్మ
    3) మొదటి కర్కరాజు
    4) రెండో ఇంద్రరాజు
19. స్వతంత్ర రాష్ట్రకూట రాజ్యాన్ని స్థాపించింది?
    1) మొదటి ఇంద్రరాజు
    2) మొదటి గోవిందవర్మ
    3) కర్కరాజు 4) దంతిదుర్గుడు
20. దంతిదుర్గుడి పాలనా కాలం?
    1) క్రీ.శ. 740-748 2) క్రీ.శ. 748-768
    3) క్రీ.శ. 735-758 4) క్రీ.శ. 738-758
21. 'అష్టవర్షాలు' యుద్ధం చేసిన రాష్ట్రకూట రాజు?
    1) దంతిదుర్గుడు 2) ధ్రువరాజు
    3) రెండో గోవిందుడు
    4) మొదటి కృష్ణుడు
22. మొదటి కృష్ణుడు ఏ బాదామీ చాళుక్య రాజుతో 'అష్టవర్షాలు' యుద్ధం చేశాడు?
    1) మొదటి విక్రమాదిత్య
    2) రెండో విక్రమాదిత్య
    3) రాహప్ప 4) రెండో కీర్తివర్మ
23. రాష్ట్రకూటుల రాజధాని?
    1) ఏలేశ్వరం 2) ఇంద్రపురి
    3) విజయపురి 4) మాణ్యఖేటం
24. వేంగీ చాళుక్యరాజైన విష్ణువర్ధనుడిని ఓడించిన రాష్ట్రకూట రాజు?
    1) మొదటి కృష్ణుడు 2) మూడో గోవిందుడు
    3) ధ్రువరాజు 4) రెండో గోవిందుడు
25. విష్ణువర్ధనుడి కుమార్తె 'శీలా మహాదేవి'ని వివాహమాడిన రాజు?
    1) మొదటి కృష్ణుడు
    2) రెండో గోవిందుడు
    3) మూడో గోవిందుడు 4) ధ్రువరాజు
26. వేంగీ విష్ణువర్ధనున్ని ఓడించడానికి ధ్రువరాజు ఎవరి సహాయం తీసుకున్నాడు?
    1) మొదటి నరసింహుడు
    2) మొదటి అరికేసరి
    3) రెండో నరసింహుడు
    4) రెండో అరికేసరి
27. 'కవిరాజమార్గం' అనే గ్రంథాన్ని రాసిన రాష్ట్రకూట రాజు?
    1) మూడో గోవిందుడు
    2) నాలుగో గోవిందుడు
    3) మొదటి అమోఘవర్షుడు
    4) రెండో అమోఘవర్షుడు
28. నాలుగో గోవిందుడిని ఓడించడంలో బద్దెగునికి మద్దతు పలికిన రాజు?
    1) మొదటి అరికేసరి
    2) రెండో అరికేసరి
    3) మొదటి నరసింహుడు
    4) రెండో నరసింహుడు
29. అంతర్గత తిరుగుబాట్లు, చికాకులతో నాలుగో గోవిందుడు పారిపోయిన ప్రాంతం?
    1) ఉత్తరప్రదేశ్ 2) మహారాష్ట్ర
    3) కళింగ 4) చోళమండలం
30. రాష్ట్రకూట చివరి పాలకుల్లో రాజ్యానికి పూర్వ వైభవం తీసుకొచ్చిన రాజు?
    1) మొదటి గోవిందుడు
    2) మూడో గోవిందుడు
    3) నాలుగో గోవిందుడు
    4) రెండో గోవిందుడు
31. ఎవరి పాలనా కాలంలో రాష్ట్రకూట రాజ్య పతనం ప్రారంభమైంది?
    1) మొదటి గోవిందుడు
    2) మూడో గోవిందుడు
    3) నాలుగో గోవిందుడు 4) ఖొట్టిగ
32. రాష్ట్రకూట వంశ చివరి పాలకుడు?
    1) నాలుగో ఇంద్రుడు
    2) రెండో కర్కరాజు
    3) ఖొట్టిగ 4) నిరుపమ
33. రెండో కర్కరాజును ఓడించిన కల్యాణి చాళుక్య రాజు?
    1) సత్యాశ్రయుడు
    2) రెండో జయసింహుడు
    3) రెండో తైలపుడు 4) మూడో తైలపుడు
34. కల్యాణి చాళుక్యుల రెండో రాజధాని?
    1) మాణ్యఖేటం 2) కల్యాణి
    3) కొలనుపాక 4) బోధన్
35. కల్యాణి చాళుక్యుల కాలంలో చోళుల దాడికి గురైన ప్రసిద్ధి చెందిన తెలంగాణ ప్రాంతం?
    1) కల్యాణి 2) కొలనుపాక
    3) బోధన్ 4) వేములవాడ
36. కాకతీయ గరుడభేతరాజును హన్మకొండ విషయ పాలకుడిగా నియమించిన కల్యాణి చాళుక్య రాజు?
    1) సత్యాశ్రయుడు 2) రెండో తైలపుడు
    3) కర్కరాజు 4) అయ్యన
37. కాకతీయులు, కందూరి చోడుల సాయంతో సింహాసనం ఆక్రమించిన కల్యాణి చాళుక్య రాజు?
    1) సత్యాశ్రయుడు
    2) ఆరో విక్రమాదిత్యుడు
    3) రెండో సోమేశ్వరుడు
    4) జగదేకమల్లుడు
38. కల్యాణి చాళుక్య వంశానికి చెందిన ఏ పాలకుడి ప్రశంస ఉన్న శాసనాలు తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో లభించాయి?
    1) రెండో సోమేశ్వరుడు
    2) జగదేకమల్లుడు
    3) మూడో సోమేశ్వరుడు
    4) జయసింహుడు
39. సోదరులపైనే తిరుగుబాటు చేసి రాజ్యాన్ని ఆక్రమించిన రాష్ట్రకూట రాజులు?
    1) ధ్రువుడు, నాలుగో గోవిందుడు
    2) ధ్రువుడు, రెండో కర్కరాజు
    3) రెండో కర్కరాజు, నాలుగో గోవిందుడు
    4) మూడో గోవిందుడు, నాలుగో గోవిందుడు
40. ఎవరి కాలంలో స్త్రీలు రాజ్యాధికారం చేయడం ఒక విశేషం?
    1) బాదామీ చాళుక్యులు
    2) రాష్ట్రకూటులు 3) వేంగీ చాళుక్యులు
    4) విష్ణుకుండినులు
41. రాయచూరు ప్రాంతాన్ని రాజప్రతినిధిగా పాలించిన 'చంద్రబేలబా' ఎవరి కుమార్తె?
    1) మొదటి అమోఘవర్షుడు
    2) రెండో అమోఘవర్షుడు
    3) మూడో గోవిందుడు
    4) నాలుగో గోవిందుడు
42. రాష్ట్రకూటులు అనుసరించిన మతం ఏది?
    1) శైవం 2) వైదికం
    3) బౌద్ధం 4) జైనం
43. 'రత్నమాలిక' గ్రంథాన్ని మొదటి అమోఘవర్షుడు ఏ భాషలో రాశాడు?
    1) సంస్కృతం 2) ప్రాకృతం
    3) కన్నడం 4) తెలుగు
44. తెలంగాణలో తొలి తెలుగు గద్యశాసనమైన 'కొరివి' శాసన కాలం?
    1) క్రీ.శ. 893 2) క్రీ.శ. 890
    3) క్రీ.శ. 895 4) క్రీ.శ. 898
45. రాజశేఖరుడు అనే సంస్కృత కవి ఎవరి ఆస్థానంలో ఉండేవారు?
    1) శాతవాహనులు 2) ఇక్ష్వాకులు
    3) రాష్ట్రకూటులు
    4) బాదామీ చాళుక్యులు
46. వేములవాడ చాళుక్యుల వంశ మూలపురుషుడు?
    1) మొదటి అరికేసరి
    2) సత్యాశ్రయ రణవిక్రముడు
    3) భద్రదేవుడు
    4) మొదటి నరసింహుడు
47. వేములవాడ చాళుక్యుల మొదటి రాజధాని?
    1) కొలనుపాక 2) ఇంద్రపురి
    3) వేములవాడ 4) బోధన్
48. వేములవాడ చాళుక్యుల రాజధానిని బోధన్ నుంచి వేములవాడకు మార్చిన రాజు?
    1) మొదటి అరికేసరి
    2) రెండో అరికేసరి
    3) మొదటి నరసింహుడు
    4) రెండో నరసింహుడు
49. దంతిదుర్గుని వద్ద సేనాధిపతిగా పనిచేసిన వేములవాడ చాళుక్యరాజు?
    1) వినయాదిత్య యుద్ధమల్లుడు
    2) సత్యాశ్రయ రణవిక్రముడు
    3) మొదటి అరికేసరి 4) రెండో అరికేసరి
50. 'కొల్లిపర' శాసనం వేయించిన వేములవాడ చాళుక్య రాజు?
    1) వినయాదిత్య యుద్ధమల్లుడు
    2) సత్యాశ్రయ రణవిక్రముడు
    3) మొదటి అరికేసరి
    4) రెండో అరికేసరి
51. ముగ్ధ శివాచార్యుడికి మొదటి అరికేసరి దానం చేసిన గ్రామం?
    1) వేములవాడ 2) వేంగీ
    3) బోధన్ 4) బెల్మోగ
52. మొదటి బద్దెగుడు తూర్పు చాళుక్య మొదటి భీమునిపై యుద్ధం చేసి బంధించినట్లు తెలుపుతున్న శాసనం?
    1) కొల్లిపర 2) పర్బని
    3) వేములవాడ 4) బోధన్
53. రెండో నరసింహుడు ఉత్తర భారత జైత్రయాత్ర చేసి లాట, మాళవలను జయించినట్లు తెలుపుతున్న శాసనం?
    1) కొల్లిపర 2) పర్బని
    3) వేములవాడ 4) బోధన్
54. రాష్ట్రకూట మూడో ఇంద్రుడు తన సోదరి 'జాకవ్వ'ను ఎవరికిచ్చి వివాహం చేశాడు?
    1) రెండో నరసింహుడు
    2) మొదటి నరసింహుడు
    3) మొదటి అరికేసరి 4) రెండో అరికేసరి
55. వేములవాడ చాళుక్యుల్లో అగ్రగణ్యుడు?
    1) రెండో నరసింహుడు
    2) మొదటి నరసింహుడు
    3) మొదటి అరికేసరి
    4) రెండో అరికేసరి
56. రాష్ట్రకూట మూడో ఇంద్రుడి కుమార్తె?
    1) లోకాంబిక 2) జాకవ్వ
    3) రేవక నిర్మాడిని 4) మైలాంబిక
57. వేములవాడ చాళుక్య వంశ ఏ రాజు కాలంలో వారసత్వ యుద్ధాలు మొదలయ్యాయి?
    1) రెండో అరికేసరి
    2) మొదటి అరికేసరి
    3) రెండో నరసింహుడు
    4) మొదటి నరసింహుడు
58. వేములవాడలో 'సోమదేవసూరి' కోసం 'శుభధామ జినాలయం' నిర్మించిన రాజు?
    1) రెండో అమోఘవర్షుడు
    2) మొదటి బద్దెగుడు
    3) రెండో బద్దెగుడు
    4) రెండో అరికేసరి

సమాధానాలు

1) 2	2) 1	3) 3	4) 2	5) 4
6) 3	7) 1	8) 1	9) 3	10) 1
11) 4	12) 2	13) 2	14) 3	15) 4
16) 2	17) 3	18) 1	19) 4	20) 2
21) 4	22) 3	23) 4	24) 3	25) 4
26) 2	27) 3	28) 2	29) 4	30) 2
31) 4	32) 2	33) 3	34) 2	35) 2
36) 2	37) 2	38) 2	39) 1	40) 2
41) 1	42) 4	43) 3	44) 1	45) 3
46) 2	47) 4	48) 2	49) 1	50) 3
51) 4	52) 2	53) 3	54) 1	55) 4
56) 3	57) 1	58) 3		

The best title for this passage would be...

BANK EXAMS

General English

Model Questions

Directions (Q.No.1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. The European Parliament voted overwhelmingly (1)/ for an EU-wide ban on single-use plastics (2)/ like as straws, cutlery, cotton buds (3)/ and balloon sticks. (4)/ No error (5)
2. The spread of online transactions (1)/ has brought along unscrupulous entities (2)/ to defraud people on the web. (3)/ At times such attempt result into monetary loss. (4)/ No error (5)
3. Campaigners urge governments to enact law (1)/ that protect women's dignity (2)/ and reject any religious argument for polygamy, (3)/ saying the practice shackles women. (4)/ No error (5)
4. The government has proposed several amendments (1)/ to the GST law to make it more business-friendly (2)/ and allow tax credit (3)/ that will help lower the tax burden. (4)/ No error (5)
5. Google rolled out new tools (1)/ that will give users (2)/ more control with (3)/ their search history. (4)/ No error (5)

Directions (Q.No.6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. The vivid photos of majestic animals and colourful birds from the wild-life park <u>is a graphic depiction of what is beautiful in</u> the continent of Africa.
   1) is a graphic depiction of what was beautiful in
   2) are graphic depictions of what is beautiful in
   3) is a beautiful and graphic depiction of
   4) is the beautiful and graphic depiction of
   5) No correction required
7. <u>He is anxious not only to acquire knowledge but also eager to display it.</u>
   1) He is anxious to acquire knowledge not only but also eager to display it.
   2) He is anxious not only to knowledge acquire but also eager to display it.
   3) He is anxious not only to acquire knowledge but also to eager display it.
   4) He is anxious not to only acquire knowledge but to also eager display it.
   5) No correction required
8. An Indian ship laden with merchandize <u>got drowned in the Pacific Ocean.</u>
   1) drowns in the Pacific Ocean
   2) is got drowned into the Pacific Ocean
   3) gets drowned along the Pacific Ocean
   4) drowned in the Pacific Ocean
   5) No correction required
9. The small child does whatever his father <u>was done.</u>
   1) has done 2) did
   3) does 4) had done
   5) No correction required
10. <u>You need not come unless you want to.</u>
    1) You don't need to come unless you want to
    2) You come only when you want to
    3) You come unless you don't want to
    4) You needn't come until you don't want to
    5) No correction required

Directions (Q.No.11-15): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) A trip to a local history museum or large city art museum can be an entertaining and enlightening way to spend the day.
B) Museums are, above all, storehouses of knowledge.
C) From a visitor or community perspective, the purpose can also depend on one's point of view.
D) To a museum professional, a museum might be seen as a way to educate the public about the museum's mission, such as civil rights or environmentalism.
E) The purpose of modern museums is to collect, preserve, interpret, and display items of artistic, cultural, or scientific significance for the education of the public.
F) To city leaders, a healthy museum community can be seen as a gauge of the economic health of a city, and a way to increase the sophistication of its inhabitants.

11. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
12. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) F 5) E
13. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F
14. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
15. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No.16-20): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

16. _____ the room the door hit him on the brow.
    1) while he was entering
    2) As he entered
    3) On entering
    4) On having entered
    5) Upon entering
17. Despite the critics _____ of his script in the last movie, their acclaim seems to have done little to _____her career.
    1) Perusal, added
    2) Parody, extra
    3) Commendation, further
    4) Extenuation, move
    5) guidance, advance
18. Born _____, children will follow their, natural inclination to _____ their surroundings.
    1) innocent, explore
    2) serious,survey
    3) curious, review
    4) eager, appraise
    5) aware, judge
19. With the new Safari Storme, Mahindra has more _____ in increasing the sales.
    1) oblige
    2) rock 3) lightness
    4) leverage 5) tow
20. The miser gazed _____ at the pile of gold coins in front of him.
    1) avidly
    2) admiringly
    3) thoughtfully
    4) earnestly
    5) solicitously

Directions (Q.No.21-24): Read the following passage and answer the questions given below.

One likes to think that one's attitudes, beliefs, and related behaviour form a consistent pattern. Incongruity that is detected results in a sense of imbalance or dissonance, which the person then seeks to correct. The motivating effect of the need to correct incongruity, imbalance, or dissonance has been the occasion for several theories. We may select for consideration the theory proposed by Festinger which treats cognitive dissonance and its reduction. The kind of disagreement or disharmony with, which Festinger has been chiefly concerned is that which occurs after a decision has been made, after one is committed to a course of action; under such circumstances, there is often some lack of harmony between what one does and what one believes, and there is pressure to change either one's behaviour or one's beliefs. For example, if a regular smoker reads about the relationship between smoking and lung cancer, the habitual action and the new information are dissonant. If the decision is made to continue smoking, the dissonance will be reduced by disbelieving the information about the relationship between smoking and lung cancer; if the decision is made to give up smoking, the information on the linkage between smoking and lung cancer will be accepted. The fact that this information also affected the decision is not important here. As Festinger and others have shown, the weighing of alternatives is more realistic prior to the decision; after the decision, the pressure is great to bring belief and action into balance. The theory goes on to make some non-obvious predictions; for example, in some cases, failure of expectations instead of destroying belief may strengthen it. This was illustrated by the study of a group of people who expected to be saved from a prophesied disastrous flood by the intervention of a heavenly being. The theory predicted that when the long-awaited day arrived and the prophecy failed (no flood), those who had the social support of the other believers would indeed proselyte for their beliefs with new enthusiasm; while those who had to face the crisis alone would have their faith weakened. These predicted results did indeed occur, the rationalization for the group of disappointed believers who faced failure together being that God had postponed his vengeance because of their faith. The tendency to be consistent is but one aspect of how self-perception influences motivation. Earlier illustrations of human motivation might also be reinterpreted in these terms. For example, the success motivation and the avoidance of failure are also concerned with how a person sees himself. R.W.White, for example, reinterprets many motives concerned with curiosity, and desire for knowledge and for achievement as though they are all concerned with one's sense of competence as a person who is effective in relation to the environment. In another sense, the person likes to develop his potentials to the full, to be as complete a person as he can. For such a pervasive type of motive, the expression self-actualization was coined, originally by Carl Jung, one of Freud's followers who later developed a system of his own. By self-actualization, he meant the development of full individuality, with all parts somehow in harmony. The term and closely related ones (productive orientation, creative becoming, etc.) have been used by man psychologists who criticize contemporary motivational theory as being too narrow concerned with short episodes of choice and behaviour rather than with the more profound and pervasive aspects of individual hopes and aspirations.

21. In the case that one's expectations fail, belief
    1) will be destroyed
    2) will be shaken but not destroyed
    3) will be destroyed and not strengthened
    4) will be strengthened
    5) may be destroyed or strengthened
22. With which of the following statements would Jung be most likely to agree?
    1) Parents should not allow their children to smoke
    2) Parents should force their children to learn music
    3) Parents should decide the course of their children at every step
    4) Parents should give their children complete freedom
    5) Parents should encourage their children to pursue any interests the children might have
23. The passage probably comes from
    1) the introduction to a book
    2) the first chapter of a book
    3) middle of a text book
    4) an article in a news weekly
    5) The blurb
24. The best title for this passage would be
    1) 'Self-actualization'
    2) 'Self-reference in Human Motivation'
    3) The Reduction of Cognitive Dissonance'
    4) 'Cognitive Dissonance and the Self
    5) individual hopes and aspirations

KEY

1) 3	2) 4	3) 1	4) 3	5) 3
6) 2	7) 5	8) 4	9) 3	10) 1
11) 4	12) 1	13) 3	14) 5	15) 2
16) 1	17) 3	18) 1	19) 4	20) 1
21) 4	22) 5	23) 4	24) 4	